## మొదటి సందేశము

# మరనాత

మలాకీ 3:1; యోహాను 5:25-29; 1కొరింథీ. 16:22

"ప్రభువైన యేసూ, రమ్ము" ప్రక. 22:20

**హల్లెలూయ... హల్లెలూయ... హల్లెలూయ - మా ప్రభువు వచ్చుచున్నాడు హల్లెలూయ**

**హల్లెలూయ... హల్లెలూయ... హల్లెలూయ మా ప్రభువు వచ్చియున్నాడు హల్లెలూయ**

'మరనాత' అను ఈ మాట బైబిలులో 1కొరింథి పత్రిక 16వ అధ్యాయము 22వ వచనములోని క్రింద సూచనలో లిఖితమైయున్నది. (1కొరింథి 16:22). మరియు ఇదే మాట ఇంగ్లీషు బైబిలులో కూడ ఉన్నది. మరనాత అనగా ప్రభువు వచ్చుచున్నాడు లేక ప్రభువు వచ్చియున్నాడు లేక ప్రభువైన యేసూ, రమ్ము అని అర్థము. గ్రీకు భాషలోని పదమును తర్జుమా చేయకుండా అట్లే బైబిలులో ఉంచినారు. మొదటి శతాబ్దములోని క్రైస్తవులు కలిసికొన్నపుడు ఉద్రేకముతో ప్రభువు వస్తున్నారు అని అనుకొని ఉల్లసించేవారు. గవర్నరు వచ్చేముందు గ్రామములోని ప్రజలు ఉత్సాహముతో చెప్పుకొన్నట్లు చెప్పుకొనవలెను. ఎంతమందికి ఎన్నిసార్లు సలాములు చేసినా "మరనాత" అని అనవలెను. అనగా ప్రభువు వస్తున్నాడు అని అనుట సంతోషముతో అనకపోతే అది మంచిదికాదు. ఒక విశ్వాసి మరనాత అనుటచూచి మరొక విశ్వాసి సంతోషించి మరనాత అనవలెను. ఈరీతిని "మరనాత" అనుట, ప్రతి పరిచయమున నీకుండిన యెడల ప్రభువురాక నీ మనస్సులోనుండును. 'ప్రభువు రాకడ' విశ్వాసులకే గాని అందరకుకాదు. కొన్ని వందల సంవత్సరముల క్రితమే రష్యాలో ఈస్టరు పండుగ రోజున ఒక విశ్వాసి "మరనాత" అని చెప్పగా, మరియొక విశ్వాసి అవును నిశ్చయముగా ప్రభువు లేచియున్నాడు అని తిరిగి ఎదుటివారికి చెప్పే అలవాటు కలిగియుండిరి.

"మరనాత" అను మాటలో మూడు సంగతులను తెలియజేయు రెండు మాటలు కలవు. 1) ప్రభువు వచ్చుచున్నాడు, ఇది ప్రవచనము

(2) 'ప్రభువైన యేసూ రమ్ము', ఇది ప్రార్థన, 3) ప్రభువు వచ్చియున్నారు ఇది ప్రసంగము. గనుక ఈ మాటలో ప్రవచనము, ప్రార్థన ప్రసంగము ఇమిడి యున్నవి. మరనాత అనగా మరన్ + ఆత అనగా సంస్కృతములో ఆగమము అని అర్థము. ఇంగ్లీషులోని come అనే మాటకు తర్జుమా చేయువారు "ఇప్పుడే, త్వరగా రమ్ము" అన్నట్లు తెలుగు భాషలోనికి వ్రాసిరి. మొదటి శతాబ్దములోని వారు, గురుతులు, చూడక మునుపే ప్రభువు వచ్చుచున్నాడని సంతోషించిరి. ఆ మొదటి శతాబ్దములోని వారే వస్తున్నారని సంతోషించిన యెడల గుర్తులు చూచిన మనము మరి ఎక్కువగా సంతోషించవలెను గదా! మనము ఆత్మ కుమ్మరింపునుగూర్చి ఇతరులకు బోధించవలెను. 'అన్ని గురుతులు నెరవేరినవి, ఆత్మ కుమ్మరింపు గురుతు జరుగుచున్నది గనుక అందరికి చెప్పండి, అప్పుడు అందరూ ఆత్మ కుమ్మరింపుకై కనిపెట్టుదురు, ఆత్మకుమ్మరింపు పొందుదురు. ప్రభువు రాకముందు అందరు ఆత్మను పొందవలెను. మీ చెవులు మూసికొని, 'రాకడ సంతోషము కలిగించుమని' ప్రార్థించిన 20 నిమిషములలో ప్రభువు కనబడును రాకడ ప్రభువు తప్పక కనబడును, 1) జన్మించిన ప్రభువు, 2) బోధించిన ప్రభువు, 3) సిలువ వేయబడిన ప్రభువు, 4) పునరుత్థానుడైన ప్రభువు, 5) ఆరోహణమైన ప్రభువు, 6) **రాకడ ప్రభువుగా కనబడును.** ఉదరశుద్ధి, శరీర శుద్ధి చేసికొని ప్రార్థనలో ఉండండి, ప్రభువు ప్రత్యక్షమౌను. మూఢభక్తి వద్దు, ప్రభువు కనబడునని సంతోషించండి. ఒకదినమంతా ఉప వాస ప్రార్థన చేసిన తరువాత –కనబడకపోతే చింతతో పండుకొంటే అప్పుడైనా ప్రభువు తప్పక కనబడును. ఇది దేవదాసు అయ్యగారి అనుభవము. బైబిలు గురుతులు నీకవసరములేదు. ప్రభువు ఎప్పుడో వచ్చునని తలంచుటకాదు. ఈ కాలమే ప్రభువు వచ్చేది.

"నేడే ప్రభువు వచ్చుననుకొను – వాడే ధన్యుడు = ప్రభువు – కూడ మేఘమెక్కి – వెళ్ళకుండ నుండడు (లూకా. 12:35-40)॥యేసు॥

**మరనాత డ్రిల్:** 1. నీకు తెలిసిన విశ్వాసి కనబడితే ప్రభువు వస్తున్నాడని మరనాత అను సలాము చేయవలెను. 2. అవిశ్వాసులను చూచిన మరనాత సలాముచేసి ప్రభువు రాకడ కథ చెప్పవలెను. 3. ప్రభువైన యేసూ రమ్ము! అని రెండు చేతులు జోడించి చెప్పవలెను. ఈ మూడు డ్రిల్స్ (అభ్యాసములు) 'మరనాత మాటక్రింద ఉన్నవి. 4. వెనుకకు

తిరిగి అనగా ఈ పై డ్రిల్ అయిన పిమ్మట బడి పిల్లలు తరగతి గదులలోనికి వచ్చునట్లు పై మూడు విషయములు జరిగించిన పిమ్మట గదిలోనికి రాగా అనగా సన్నిధిలోనికి రాగా ప్రభువు కనబడును. **ఇక్కడ మాట్లాడుట ప్రభువు వంతు,** ఎవడైనను ప్రభువును ప్రేమించకుంటే వాడు శాపగ్రస్తుడగును 1కొరింథి. 16:22 దీని అర్ధమేమనగా, ప్రభువు జన్మము, ఆయన చరిత్ర శ్రమ విషయములలో, పునరుత్థాన విషయములలో ప్రేమించినవాడు; ప్రభువు రాకడను ప్రేమించకపోతే వానిది సంపూర్ణ ప్రేమకాదు. గనుక వాడు శాప గ్రస్తుడని ఉన్నది. 'మరనాత' ఆది సంఘములోని విశ్వాసులు హృదయములలో నాటుకొన్నది. మొదటి శతాబ్దములోని వీరు వెళ్లిన తరువాత 'ప్రభువు రాలేదు' అను దండకములు (బోధ) ప్రభలినవి. 2వేల సంవత్సరములు వరకు ప్రభలుచూనే ఉన్నవి. ఈ మరనాత శబ్దము మొదటిగా ఎవరి దగ్గరకు వచ్చినది? మొదటి శతాబ్దములోని వారి దగ్గరకేగదా! ఈ చిన్న శతాబ్దములోని వారి దగ్గరకు వచ్చినదిగదా! వారు సందేహింపక నమ్మిరి. మనకు సందేహము కలిగినది. ఏ సందేహము? ప్రభువు ఇంకా రావడములేదు అను సందేహము. ప్రభువు ఎప్పుడు వస్తే మనకేమి? అనుకునేవారికి "మరణాత" అనగా చావు వచ్చును. అయితే నేడే ప్రభువు వచ్చునని అనుకొనేవారికి 'మరనాత' అనగా ఆరోహణము వచ్చును. మీకు 'మరణాత' కావలెనా? 'మరనాత' కావలెనా? మనకు చావు లేకుండా ఆరోహణమయ్యే మరనాత కావలెను. అట్టి దివ్యభాగ్యము త్రిత్వతండ్రి మీకు దయచేయును గాక! ఆమేన్.

మరనాత యనగా మన ప్రభువు మరల వచ్చుట = దీనిన్ తరచుగా సలామున వాడు నరులు ధన్యులు ॥యేసు॥

**22-9-1948 సం॥లో దేవదాసు అయ్యగారు చేసిన ప్రసంగము.**

# రెండవ సందేశము

# ఖగోళ గోల

**దా॥కీర్తనలు 19:1-4; మత్త. 24:29-33; హెబ్రీ. 4:1-3.**

**"ఆకాశములు దేవుని మహిమను వివరించుచున్నది. అంతరిక్షము ఆయన చేతిపనిని ప్రచురపరచుచున్నది. పగటికి పగలు బోధ చేయుచున్నది. రాత్రికి రాత్రి జ్ఞానము తెలుపుచున్నది. వాటికి భాషలేదు, మాటలులేవు. వాటి స్వరము వినబడదు. వాటి కొలనూలు భూమియందంతట వ్యాపించి యున్నది" దా॥ కీర్త. 19:1-4.**

దైవవాక్యములో ఉన్నట్లుగా దేవుడు కలుగజేసిన సృష్టిలోని ఈ గ్రహవస్తు సముదాయమునకు భాషలేదు. వీటికి మాటలేదు కాని మాటలుగల వారు, భాష ఉన్నవారు సంగతులు తెలియజేస్తున్నట్లు. అవి తెలియచేసేటట్లు దేవుడు ఈ లోకములో ఉన్న మనకొరకు వీటిని అమర్చియున్నాడు. వీటికి మాటలేదు, అయినను అవి మాటలాడినట్టే, భాషలేకపోయినను భాష ఉన్నట్టే. వీటికి స్వరము లేదు, అయినను స్వరమున్నట్టే. లోకములోని కొన్ని స్వర వాయిద్యములు ఉన్నవి. అవి ఏవనగా బూర, ఫిడేలు, సంగీతోప కరణములు. వీటికి స్వరములున్నవి. అయితే దేవుడు స్వరములు లేనివాటిని మనకొరకు ఉంచియున్నాడు. మానవులమైన మనకు స్వరమున్నది. మన స్వంతభాష అయిన తెలుగు భాషలో మాట్లాడకపోయినప్పటికిని, ప్రసంగ పూర్వకముగా చెప్పకపోయినప్పటికిని స్వరముద్వారా ఇతరులకు సంగతులు చెప్పగలము. కేకలు వేసినగాని, చప్పట్లు కొట్టినగాని వాటి స్వరముద్వారా ఇతరులకు సంగతులు తెలియపర్చగలము. అయితే నరులుకూడా స్వరము లేనివాటిని (అనగా రైలు, విమానము, బస్సు, విద్యుత్, టెలిఫోను, కంప్యూటర్ మొదలైనవి) ఏర్పర్చియున్నారు. ఆకాశములో ఉన్న సూర్య, చంద్ర, నక్షత్రములకు స్వరముగాని, మాటగాని, భాష గాని, లేకపోయినను మనకు గొప్ప సంగతులు చెప్పుచున్నవి. వాటి యొక్క కొలనూలు భూదిగంతముల వరకు వ్యాపించి యున్నది. దేవుడు ఆది కాలములో వీటిని కలుగజేసిన కాలము మొదలుకొని నేటివరకు వాటి యొక్క కాంతి, కొలనూలు భూదిగంతములవరకు వ్యాపించు చున్నది. సూర్య, చంద్ర, నక్షత్రములు భాష, మాట, స్వరము లేకుండ ఉన్నప్పటికిని, అవి దేవుని విషయములు బోధించుచున్నవి మరియు సువార్త ప్రకటించు చున్నవి.

క్రీస్తుప్రభువు తన శిష్యులతో ఒకమాట చెప్పియున్నారు. 'మీరు– భూదిగంతములవరకు నాకు సాక్షులైయున్నారు'. దాని అర్ధము 'నా విషయమైన సంగతులు భూదిగంతముల వరకు ప్రకటింపవలెను'. ఈ శిష్యులు భూమిమీదికి రాకపూర్వము, ఆదికాండములోనే ఈ అధికారమును అనగా భూదిగంతముల వరకు దేవుని విషయములు ప్రకటించుటకే దేవుడు ఖగోళమును ఏర్పాటు చేసియున్నాడు.

క్రీస్తుప్రభువు ఆనాటికాల జనుల భాష మాట్లాడగల వారిని మరియు తమ స్వరము ఇతరులకు వినిపించగలవారిని తన శిష్యులనుగా ఏర్పర్చి యున్నాడు. క్రీస్తు యేసు ప్రభువు, దేవమానవునిగా భూమిమీదికి రాకముందు, శిష్యులు పుట్టకముందు, ఆదాము హవ్వలను సృజించకముందు, దేవుడు తన విషయములు ప్రకటింపకముందే, సూర్య, చంద్ర, నక్షత్రములను, నేర్పర్చి యున్నాడు. అప్పటినుండి అవి ఆరువేల సంవత్సరములుగా అనగా అవి సృజింపబడినప్పటినుండి ఇప్పటి వరకు ప్రకటిస్తునే ఉన్నవి. క్రీస్తు శిష్యులు ప్రకటించుచున్నది రెండువేల సంవత్సరముల నుండియే. ఇందులో ఎవరు గొప్పవారు? భాష గలవారు గొప్పవారా? భాష లేని ఖగోలము గొప్పదా? భాషలేనివే గొప్పవి. ఎవరి పని మొదట ఆరంభమాయెను. జ్యోతులయొక్క పనియా? శిష్యులయొక్క పనియా? జ్యోతులయొక్క పనియే.

బైబిలులో వ్రాయబడినట్లు దేవునిపని చేసిన శిష్యులు, ప్రవక్తలు, రాజులు, న్యాయాధిపతులు, మరియు మోషే, యెహోషువ మొదలైన వారి పని మొదటిదికాదు. అబ్రాహాము, ఇస్సాకు, యాకోబుల పని మొదటిది కాదు, వారికి పూర్వమందున్న హనోకు, మెతూషెల, నోవహు పని మొదటిది కాదు. మొట్టమొదట సువార్త ప్రారంభించిన వారు సూర్య, చంద్ర నక్షత్రాదులే. సృష్టి పని మొదటనుండి సువార్త పనియే.

యేసుప్రభువు ప్రారంభించిన సువార్తపని పూర్వము నుండి ఉన్నది. ఈ పని కడవరకు కొనసాగును. పెండ్లికుమార్తె సంఘము వెళ్ళిన తరువాత, 7 సంవత్సరముల శ్రమ గతించిన తరువాత, వెయ్యేండ్ల పరిపాలన తరువాత సజీవుల తీర్పు, ఆ పిదప అంత్యతీర్పు ఉన్నది. అప్పుడు అనేకమంది సింహాసనముల ఎదుట నిలువబడుదురు. దేవుడు సువార్త ఎవరికి పంపలేదో వారక్కడ ఉండరు. దేవుడు లోకములో పుట్టిన ప్రతివారికి ఏదో ఒక

సమయములో, ఏదో ఒక రీతిని సువార్త ప్రకటించిరి, ప్రకటిస్తున్నారు. ప్రకటిస్తారు, ప్రకటింపజేస్తారు. ఎవరైన అంత్యతీర్పునందు నిలువబడి ఉన్నారు అంటే వారు ఎవరు? సువార్త అందినవారా? అందనివారా? అంది నప్పటికిని అందుకొననివారా? అందుకొన్నవారా? మానవుల అందరిలోని ఒక తరగతి వారిలో ఒక కృత్రిమ ప్రశ్న ఉన్నది. అది ఏమనగా 'దేవా! నీ సంగతులు మాకు తెలిపియుంటే మేము నమ్మియుందుమని' దేవుని మీద నేరము మోపుదురు. గాని ఆ విధముగా మాట్లాడుటకు సందులేదు. ఎందు కనగా ఆ సంగతులు ఎరిగిన సాక్షులున్నారు. అవి సూర్య చంద్ర నక్షత్రములు. వీటికి మాటలేకపోయినను, క్రియ ఉన్నది. ఎక్కడో అనేక కోట్ల మైళ్ళ దూరములో అవి ఉన్నవి. వాటికి దేవుడిచ్చిన సహజ క్రియద్వారా వెలుతురు ఇస్తున్నాయి. అవి ఏమి చెప్పుచున్నవి? మనిషి వాటిని చూడగానే ఏమనుకుంటాడు? **ఉదాహరణకు:–** ఒక గోడమీద పువ్వుల చెట్ల బొమ్మ: వేసియుంటే, బాటసారి దీనిచూచి ఏమనుకుంటాడు? అడవిలో ఉన్న పూల చెట్టువలె ఈ బొమ్మ ఉన్నది. ఈ పువ్వుల బొమ్మ ఎవరువేసి ఉంటారు? అని తన మనస్సులో అను కుంటాడు. ఎవ్వరు లేకుండ ఈ చెట్టు బొమ్మ ఇక్కడికి రాలేదు. ఎవరో ఒకరు చక్కగా గీసి పెట్టి ఉంటారు. అతడు గొప్పవాడు! అని మెచ్చుకుంటాడు. అనగా ఆ చెట్టు నిజరూపముగల చెట్టువలె చిత్రించిన వ్యక్తి కనబడకపోయినను, అతని క్రియ కనబడగా తప్పక మెచ్చుకుంటాడు. వీటికి స్వరము, భాష మాట లేదు. అయినను అవి మాట్లాడుచున్నవి." "మమ్మును కలుగజేసిన దేవుడు ఎంత కాంతి గలవాడు? ఎంత శక్తిగలవాడు? ఎంత జ్ఞానవంతుడు" అని అంటున్నవి. ఆ మాటకు భాషలేదు, స్వరములేదు. ఏలాగనగా గోడమీద వేయబడిన పువ్వుల చెట్టు బొమ్మ 'ఓ బాటసారి నన్ను చేసిన వారిని మెచ్చుకో!" అని అన్నదా! అనలేదు. అయితే ఆ బాటసారి ఆ బొమ్మను గీసిన మనిషిని చూడకపోయిననూ, బొమ్మను చూచి, గీసిన వానిని మెచ్చుకుంటాడు. అలాగు జ్యోతులు చేసిన వానిని నరుడు మెచ్చుకొనవలెను. 'ఆయననే పెద్దలు 'దేవుడు' అని అంటారు. దేవుడు చేసిన వాటిని బట్టి నరులు దేవునిని మెచ్చుకుంటున్నారు. అలాగే ఈ క్రియనుబట్టి ఎవ్వరు దేవునిని మెచ్చుకొనరో, వారే అంత్యతీర్పులోనికి వెళ్ళుదురు. మీకు సంగతి తెలిసేటట్లు మీలో నిలువ ఉండే సంగతి. మీ జ్ఞప్తిలో ఉండే సంగతి చెప్పుచున్నాను.

Bible Mission HQ Guntur

ఇందులో 1. దేవుడు స్వయముగా మాట్లాడుట ఇది మొదటి సంగతి. 2. దేవుడు దర్శనములో కనబడుట మరియు మాట్లాడుట, తన సంగతులు బయలుపర్చుట ఇది రెండవ సంగతి. 3. సృష్టిద్వారా తన ఉనికిని తన సంగ తులను తెలియచేసికొనుట. ఇది మూడవ సంగతి. మొదట సంగతిలో స్వయంగా చూచినవారు నమస్కరించినారు. అలాగే రెండవ సంగతిలో దేవుని మాట విన్నవారుకూడా అదే వరుసలో ఉన్నారు. వీరు దూతలవైపుకాదు, ఆకాశమువైపు జ్యోతులవైపు కాదు, వీరు దేవునివైపే చూస్తూ నమస్కరించు చున్నారు. మూడవ సంగతిలోని కొందరు సృష్టిని చూచి సృష్టికర్తకు నమస్కరించు చున్నారు. ఇది మూడవ సంగతి. ఈ మూడు పద్ధతులద్వారా మనుష్యులకు దేవుడు చెప్పవలసిన సంగతులు ఒక పుస్తకములో వ్రాయించినారు. జ్యోతులవైపు చూచిన వారిసంగతికూడ వ్రాయించినారు. అదేకాక క్రొత్తగా జరుగవలసిన సంగతులు, జరిగిన సంగతులు పూర్తిగా వ్రాయించినారు. అవి ఇవీ అన్ని దేవుడే వ్రాయించారు. దేవుడు వ్రాయించిన ఆ పుస్తకమునకు ఏమి పేరు పెట్టాలి? మనమే పెట్టాలి. ఆయన కనబడకపోయిననూ, మన పూర్వికులు ఆయనను దేవుడన్నారు. ఈ దేవుని విషయాలు వ్రాయబడిన పుస్తకమునకు ఒక పేరుండాలి. దానిపేరు దేవుని వాక్యము. ఆ వాక్యము పేరే బైబిలు. ఈ బైబిలులోని వాక్యములను చదివి, చూచి దేవుని ప్రత్యక్షతలను తెలుసుకోవాలి. జ్యోతులవల్ల మరియు ఈ పై మూడు పద్ధతులవల్ల మనుష్యులు దేవుని విషయాలు తెలుసు కొనవలెను. వారికి (మనుష్యులకు) తెలిసినది కొంచెమే, కాని మూడు పద్ధతులవల్ల (ప్రత్యక్షతల) మరికొంచెము తెలియగలదు. అయితే దేవుడు వ్రాయించిన పుస్తకమువల్ల అన్నిటికంటే ఎక్కువ తెలుసుకొనగలరు. ఈ మూడు. తెలిసినవారుకూడా తీర్పులో ఉంటారు. వారు తెలియదని అన వచ్చును కాని ఆకాశము సాక్ష్యమిస్తుంది (యెషయా 1:2). సృష్టిలోని వాటియొక్క పని ఆ సమయమునకు భూమిమీద ఎలాగున ఉన్నదో, అలాగే తీర్పులో కూడా అవి రాకపోయినా వాటి విషయములు వారిలో ఉన్నవి గనుక వారికి బెదురే. నేను ఒక్కసారి చెప్పాను, మరొకసారి చెప్పుచున్నాను. క్రైస్తవులైన మీకు చెప్పినట్లు మాకుకూడా చెప్పితే మేము నమ్ముదుమని ఎవరంటారో వారికి ఈ జవాబు. జవాబుగా ఈ వివరములు చూపించియున్నాను. సృష్టి కర్తయైన ప్రభువును విశ్వసించండి. ఈ కొన్నిమాటలు మీ ఆత్మకును, జ్ఞానమునకును, మనస్సాక్షి అనుకూలమగునట్లు దేవుడు మిమ్ములను దీవించునుగాక! ఆమేన్.

**18-9-55వ సం॥లో దేవదాసు అయ్యగారు చేసిన ప్రసంగము.**

## మూడవ సందేశము

# దేవుడు సౌలును నడిపించుట

*1సమూ. 9:1-27; యోహా. 15:5; రోమా. 11:7.*

**"నా జనుల మొఱ్ఱ నాయొద్దకు వచ్చెను. నేను వారిని దృష్టించి యున్నాను. కాగా ఫిలిష్తీయుల చేతిలోనుండి నా జనులను విడిపించుటకై నా జనులైన ఇశ్రాయేలీయులనిగా అభిషేకించుటకుగాను రేపు ఈవేళను నేను బెన్యామీను దేశములోనుండి ఒక మనుష్యుని నీయొద్దకు రప్పించుదును" 1 సమూ 9:16**

ప్రార్థన:– ఇశ్రాయేలీయులను దృష్టించి, వారిని విడిపించుటకు సౌలును అభిషేకించిన తండ్రి మిమ్ములను కూడ లోకమునుండి విడిపించి మేఘమునకు ఆకర్షించుకొనునుగాక. ఆమేన్.

1) రాకడ ఆసక్తితో కూడివచ్చిన పిల్లలారా! పై వచనములో ఇశ్రా యేలీయులకు నూతన కాలము ఆరంభమగుచున్నది. నూతన జీవము. ఆరంభము కానున్నది. ఇశ్రాయేలీయులు రాజును కోరుటనుబట్టి దేవుడు వారికి రాజు నిచ్చెను, ఇశ్రాయేలీయులు పన్నెండు గోత్రములలో చివరి గోత్రము బెన్యామీను గోత్రము, ఇందులో కీషుయొక్క కుటుంబములో సౌలు ఉండెను. క్రీషు గొప్ప ధనికుడు, సౌలు యౌవనవంతుడు, సౌందర్యము గలవాడు. వీరికి నౌకర్లు, గార్ధభములున్నవి. ఇది కుటుంబ చరిత్ర ఉన్న మొదటి కథ.

2) వీరికి కలిగియున్న గార్ధభములు తప్పిపోయినవి. వారి పొరపాటును బట్టి అవి తప్పిపోయినవి. పశువులు తప్పిపోయినచో యజమానులకు విచారము. గనుక కీషు సౌలును, తన సేవకుని వాటిని వెదకుటకు పంపెను. వారి గార్ధభములు బయటికి వెళ్ళినవి గనుక నౌకరు మరియు కుమారుడు వాటిని వెదకుటకు బయలు వెళ్ళిరి. ఇది రెండవ కథ.

3) ఎఫ్రాయీము మన్యము, షాలీషాదేశము, షయలీముదేశము, బెన్యామీను దేశము, సూపు దేశము వెదకిరిగాని, గార్ధభములు ఈ ప్రాంతములలో కనబడనందున వెదకుట చాలించిరి. ఇది మూడవ కథ.

4) నౌకరు ప్రదర్శకుని గూర్చి (ప్రవక్తను గూర్చి) సౌలునకు చెప్పెను. సౌలు అందుకు అంగీకరించి కానుకను గూర్చి ఆలోచించి,

తమ దగ్గరనున్న పావుతులము వెండిని ప్రదర్శకునికి ఇచ్చుటకు సిద్ధపడిరి. ఆ తరువాత వారు సూపుదేశములో ఒక ఊరిలోనున్న ప్రదర్శకుని దగ్గరకు వెళ్ళుటకు నిశ్చయించిరి. ఇది నాలుగవ కథ.

(5) అచ్చట నీళ్ళకు వచ్చిన కన్యకల వలన ఆ దినము బలి అర్పించు దినమనియు, ప్రదర్శకుడైన సమూయేలు ఉన్నత స్థలమునకు పోవుచున్నా డనియు తెలిసికొని, వారును వెళ్ళుచుండగా సమూయేలు వారికి ఎదురయ్యెను. సౌలునుగూర్చి నిన్నటిదినమే ప్రభువు ప్రవక్తకు బైలు పరచియుండెను. సాలు ప్రదర్శకుడెక్కడ? అని ఆయననే అడుగగా, తానే ప్రదర్శకుడనని, గార్ధభముల సంగతి చెప్పి, ఈ దినము ఆగుమని ప్రదర్శకుడైన సమూయేలు వారితో చెప్పెను. ఇది ఐదవకథ.

వివరము:- సౌలుపేరు చరిత్రలో మొదట వ్రాసిన వాడు సమూయేలే. సౌలు కుటుంబములో ఏమియు చెడుగులేదు. ప్రపంచములోని ప్రతి కుటుంబము యొక్క చరిత్ర బాగుండవలెను. కుటుంబములలో ఐక్యత లేకుండుటయే యుద్ధములు వచ్చుటకు కారణము. కుటుంబములు బాగున్న యెడల దేశచరిత్ర బాగుండును. గార్ధభములు వృత్తికి సంబంధించినవి. అవి భారములు మోయు పనులు చేయును. దేవుడు ఇప్పుడు సౌలును సింహాసనము దగ్గరకు నడిపించుచున్నాడు. అనగా ఇశ్రాయేలు రాజ్యభారమును మోయుటకు సిద్ధపర్చు చున్నాడు. దేవుని నడిపింపు వీరిలో ఎవరికి తెలియదు. ఒక్క ప్రదర్శకునికి మాత్రమే తెలియును. దేవుని చిత్తమును బట్టి జరుగుచున్న సౌలు నడిపింపు చాల చక్కనిది. ఈ నడిపింపు పైకి నరులకు కనబడదుగాని చివరకు తెలియును. సౌలులోనున్న మంచి గుణము ఏదనగా, తండ్రి చెప్పగా వెళ్ళినాడు గనుక విధేయుడు, సౌందర్యము గలవాడు. ఇది బైటి కథ అనగా బహిరంగములోనిది. అయితే లోని కథ అనగా అంతరంగములోని విధేయత. ఇది బైటకు కనబడుట లేదు, సౌలులో విధేయత, ఎత్తు, సొగసు ఈ మూడును ఉండెను. పిల్లలు ఇంటిలో విధేయత మొదట నేర్చుకొని ఏ పని చెప్పిన చేయవలెను. పిల్లలకు మంచి లక్షణములు నేర్పువారు తల్లిదండ్రులే.

సౌలు మరియు అతని నౌకరుకు గాడిదలు కనబడలేదు. ఎందుకనగా ముందు వీరికి సమూయేలు కనబడవలెను. ఇది దేవుని

నడిపింపు. వారు ఐదుదేశములు తిరిగిరి గాని కనబడలేదు. దీని అర్థమేమనగా మనిషియొక్క స్వంతక్రియలు నిష్ప్రయోజనము. దేవుని సహాయము లేకపోతే మనిషి ఏమి చేయలేడు. గార్ధభములను వెదకుట మిక్కిలి చిన్నపనియైనను, దేవుని సహాయము లేకపోతే మనిషి ప్రయత్నములు నిష్ఫలమని మొదటిగా సౌలు పాఠములో నేర్చుకొనుచున్నాము. తప్పిపోయిన గార్ధభములను (గొఱ్ఱెలను) వెదకుట గొప్ప పనియే, అయినను దేవుని సహాయము లేకపోయినయెడల ఆ ప్రయాసమంతయు వృధా అయిపోవును.

దేవుడు మనకు గొఱ్ఱెలమంద, గాడిదలమంద, గుఱ్ఱములమంద, ఆవులమంద, ఏ మందనిచ్చినను వాటిని పోగొట్టుకొనకూడదు. ఆత్మ సంబంధముగా ఇచ్చినవికూడ పోగొట్టు కొనకూడదు. పోగొట్టుకొన్నయెడల వాటిని తిరిగి సంపాదించుకొనుట చాల కష్టము. దొరుకవు గనుక జాగ్రత్తగా నుండవలెను. మరుపు మరియు అజాగ్రత్తల వలన మనకు దేవుడిచ్చినవి. పోగొట్టుకొందుము. సౌలునకు దేశ సంచారములో రెండు మాటలు వినబడెను. 1) తండ్రి విచారిస్తాడు అన్నమాటలు, 2) దైవజనుని గురించిన మాటలు.. సౌలు దైవజనుని గురించి మంచి మాటలు వినెను. ప్రదర్శకుడు అనగా దివ్యదృష్టితో చూచువాడు. ప్రదర్శకుడు ఉన్నాడు గనుక దేశమునకు క్షేమము. ఆయన దైవజనుడు గనుక ఆయన చెప్పునది జరుగును. ప్రదర్శకుడు మనము ఏ మార్గమున వెళ్ళిన యెడల పోగొట్టుకొనునది దొరుకునో, ఆ మార్గమును చూపించును. అట్లే ఆత్మసంబంధముగా కూడ మార్గము చూపించుట దైవజనుని పనియైయున్నది. తరువాత కన్యకలు చెప్పిన చల్లనిమాటలు గలవు. ఆయన మీ ఎదుట నున్నాడు, త్వరగా కలిసికొనుడి, ఈ దినమే వచ్చినాడు, అతడు బలిని ఆశీర్వదించితేనేగాని ప్రజలు భోజనము చేయరు. ఇది ఇశ్రాయేలీయులలో గొప్ప అలవాటు. కన్యకలను కనుగొనిన తర్వాత వారు ప్రవక్తను కనుగొను పని మాత్రమే గలదు. గనుక త్వరగా వెళ్ళుడని చెప్పిరి. కన్యకల వరుస అనగా వధువు సంఘము. వాక్యమువలన మనము శుద్ధియైన యెడల కన్యకల వరుసలోనికి వచ్చెదము. "ఆయన మీ ఎదుటేనున్నాడు. త్వరగా వెళ్ళుడి" ఇది కన్యకల స్వరమై యున్నది.

ఇప్పుడు తయారయ్యే పెండ్లికుమార్తె చెప్పవలసిన మాటలు ఏవనగా సౌలునకును అతని సేవకునికి, కన్యకలు చెప్పిన నాలుగు మాటలే నేటి కన్యకలును అనగా రాకడకు సిద్ధపడిన వారును చెప్పవలెను. అదేదనగా పరలోకములో ఏడేండ్లు విందు జరుగును. (ప్రవక్తను కనుగొన్నట్లు) ప్రభువును మీరు కనుగొనవలెను. సౌలుకు తప్పిపోయిన గాడిదలు దొరికినట్లు, ఈ లోకములో తప్పిపోయినవి అక్కడ మీరు కనుగొందురని చెప్పవలెను. పెండ్లి కుమార్తెగా సిద్ధపడు కన్యకలు ప్రభువును ఇక్కడనే కనుగొనవలెను.

భూలోకములో ఆజ్ఞాతిక్రమమువలన ఏది పోగొట్టుకొన్నామో, అవన్ని ప్రభువు పరలోకములో దాచియుంచును. అవి అక్కడ దొరుకును. క్రొత్తవి కూడ దొరుకును. ప్రవక్తను కనుగొనుటకు ఉన్నత స్థలమునకు పోవలెను. అలాగే మనమును తక్కువ స్థలమునుండి ఉన్నత స్థలమునకు వెళ్ళవలెను అనగా దైవ సన్నిధికి వెళ్లవలెను. సౌలును, అతని సేవకుడు ప్రదర్శకుని కనుగొనినట్లు మనమును ఈలోకములోనే ప్రభువును కనుగొనవలెను. స్త్రీల మాటలు బాగుగా నున్నవి. వారు కన్యకలు, నీళ్ళ తోడుకొనుటకు వచ్చిరి, సౌలు యొక్క నౌకరు, నయమాను గృహమందున్న సేవకుని వంటివాడే. వీరు యజమానులకు సలహాలిచ్చి హెచ్చరించేవారు. ప్రభువు దైవజనునితో చెప్పినమాటలు: "రేపు ఒకనిని నీయొద్దకు రప్పించెదను. ఒకప్రక్కనున్న కథ– గాడిదలు, మరియొక ప్రక్కనున్న కథ– కన్యకలు మాటలాడుట. ఇంకొక ప్రక్కనున్న కథ దేవుడు వారిని నడిపించుట. యిన్ని కోణాలు ఈ కథలో కనబడుచున్నది. ఇశ్రాయేలీయులను ఫిలిష్తీయుల చేతిలోనుండి విడిపించుటకు దేవుడు సౌలును నడిపించెను, గాని అతనిని పిలువలేదు. సమూయేలు దేవునితో కలిసి పోయెను. చిన్ననాటనుండి సమర్పణ అయిపోయినాడు గనుక దేవునితో కలిసిపోయెను. సౌలుకు సర్కీటులో (ప్రయాణములో) గార్దభములు దొరికెను, సౌలు సమూయేలునకు దొరికెను. ప్రవక్తయైన సమూయేలు సౌలునకు దొరికెను. ***ప్రభువు లోకములోనుండి పెండ్లికుమార్తె సంఘములో నుండుటకై ఎవరు దొరుకునా! అని వెదకుచున్నాడు.*** ఎందరు దొరుకుదురా! అని చూచు చున్నాడు. ప్రభువునకు దొరుకు వారిలో మనమును చేరియుందుము.

## నాల్గవ సందేశము

# దేవుని రక్షణ ప్రమాణము - విశ్వాస వరుసలు

*దా. కీర్త. 60:6; మార్కు 11:19-23; హెబ్రీ. 6:13-15.*

**"తన పరిశుద్ధతతోడని దేవుడు మాట ఇచ్చియున్నాడు" కీర్త. 60:60**

మోక్షానంద ప్రియులారా! ఈ వాక్యములో దేవుడు తన పరిశుద్ధత తోడని మాట ఇచ్చియున్నాడు. అనగా నా పరిశుద్ధతతోడు, నేను మనుష్యులను రక్షించుదునని ప్రమాణము చేసెను. మీకు అర్ధమగుటకు ఈ వాక్యమును కొద్దిగా మార్చిచెప్పితిని, ఇది భయంకరమైన ప్రమాణము. ఈ మాటయొక్క మూల అర్ధము. మానవులను రక్షించని యెడల దేవుని స్వీయ ప్రత్యక్షత, పరిశుద్ధత పోయినట్లు, మరియు ఆయనే పోయినట్లు దీని అర్ధము. కొంతమంది ప్రమాణము చేసేటప్పుడు మా అమ్మతోడు (మా అమ్మమీద ఒట్టు), మా నాయన తోడు (మా నాయనమీద ఒట్టు) అంటారు. అంటే వారి మాటకు నిదర్శనము వారు. పోయినట్లే. అట్టి ప్రమాణములు (ఒట్టులు) చేయకూడదు. దేవుడు మనిషిని రక్షించుటకు అట్టి ప్రమాణములు చేసెను గనుక ప్రతి వానిని రక్షించుటకు రక్షకుని ఏర్పాటుచేసెను. ఆ ఏర్పాటే అందరును ఒప్పుకొనవలెను. ఆ ఏర్పాటులో నిదర్శనము ఏదనగా భూలోకములోని పాపులైన మనుష్యులను రక్షించుటకు దేవుడే యేసుక్రీస్తుగా, శరీరధారిగా వచ్చెనను సంగతి. ఆయనను విశ్వసించితే రక్షణ, మోక్షమే గాని నరకములేదు. కానీ మనుష్యుడు దేవుని ఒప్పుకొనడు. గనుక దేవుని ప్రమాణము నెరవేరదు. విశ్వాసులారా! మీరు ఇక్కడకు రావడముద్వారా మీ విశ్వాసము బైలుపర్చిన విశ్వాసులారా! మీలో కొద్దిపాటి విశ్వాసము ఉన్నప్పటికిని, అదికూడా సంతుష్టిగా లేకపోయినప్పటికిని, మిమ్మును విశ్వాసులుగా సంబోధించు చున్నాను. ఉదా:- గ్లాసులో నిండుగా నీళ్లున్నా, సగము ఉన్నా ఒక చుక్క నీరు ఉన్నా, గ్లాసులో నీళ్లు ఉన్నట్టేగదా! అలాగే మీ అంతరంగములో ఏమూల కొద్దిపాటి విశ్వాసమున్నను విశ్వాసులే ఇక్కడ కూర్చున్నవారు తమ హృదయములు పరీక్షించుకుంటే కొంతలో కొంతయైన విశ్వాసము ఉండకపోదు. కాబట్టి మీరు విశ్వాసులే. మీలో పాపమున్నప్పటికిని విశ్వాసులే. మీరు తగినవారే.

ఎందుకంటే కొద్దిపాటి విశ్వాసమున్నది. అందుచేత ఇప్పుడు మీరు కలిగి యుండవలసిన విశ్వాసములు ఏవనగా:

1. శ్రద్ధగా వినుట: శ్రద్ధగా వింటే సత్యము తెలుస్తుంది. నమ్మకము కుదురుతుంది అది ఒక విశ్వాసము. 2. ఇక్కడ వినుచున్న సువార్తవల్ల నాకు మేలు కలుగక మానదు అని నమ్మడము, లేక ఏదో ఒక మేలు కలుగకమానదు. అని నమ్ముట మరియొక రకమైన విశ్వాసము. 3. ఇక్కడ విన్న సువార్తవల్ల అదివరకు మీకున్న ఆత్మీయ జీవనము తప్పకుండా వృద్ధిపొందును, అనే నమ్మకము ఉండుట మూడవ విశ్వాసము. 4. నన్ను ఇక్కడికి తీసికొని వచ్చుటలో దేవునికి నాయెడల ఏదో ఒక మంచి అభిప్రాయము ఉన్నది అని నమ్మదము నాలుగవ విశ్వాసము.

5. దా. కీర్తన. 60వ అధ్యాయములో దేవుడు చేసిన ప్రమాణము అద్భుతమైన ప్రమాణము. 'నా పరిశుద్ధత తోడు' అని ప్రమాణముచేసిన ప్రమాణము నాలోకూడ తప్పకుండా నెరవేర్చును. నాలో కొండంత బలహీనత ఉన్నప్పటికిని ఆయన వాగ్దానము, ప్రమాణము ఎప్పటికైనను నెరవేర్చుతారు. అని నమ్మడము, అయిదవ విశ్వాసము.

6. భూలోకములో ఉన్న విశ్వాసులు అందరియొక్క హృదయముల లోపల ఉన్నంత విశ్వాసము నాలో లేకపోయినప్పటికిని నా హృదయము పట్టగలిగినంత స్వల్పవిశ్వాసము ఉండకమానదు. ఉదా: గ్లాసు పట్టినంత నీరు ముంచుదుము గాని, గ్లాసు పట్టనంత నీరు ముంచలేము కదా! అలాగే నా హృదయము పట్టగలిగినంత విశ్వాసము నాలో పట్టకమానదు.

ఆశీర్వదించుట నీ శక్తి యిష్టంబు – ఆశీస్సుపొందుట నా శక్తి యిష్టము ॥యేసుప్రభువా॥

దీనినిబట్టి ప్రభువు తప్పకుండ రక్షించును అని నమ్ముట మరియొక విశ్వాసము.

7. దృష్టాంత విశ్వాసము:– దీనిలో బైబిలులోని ఒక కథ ఉన్నది. ఆ కథ ఏమంటే ప్రభువుయొద్దకు ఇద్దరు గ్రుడ్డివారు వచ్చినప్పుడు ఆయన ఒక ప్రశ్నవేసెను. మీ కండ్లను బాగుచేయుదునను నమ్మకము మీకు ఉన్నదా? అని అడిగినారు. వారు మాకు నమ్మకము ఉన్నదని

చెప్పిరి. వారు చెప్పిన ఆ జవాబులో కొంత విశ్వాసమున్నది. మీ నమ్మిక చొప్పున మీకు కలుగును గాక! అని చెప్పిన ప్రభువు మాటలో, 'చొప్పున' అనే దానిలో కొలత ఉన్నది. ఆ జవాబులో ప్రభువు చెప్పినది మీ విశ్వాసము చొప్పున మీకు కలుగునుగాక! అని అర్ధము. అనగా వారి నమ్మకము సోలదో, శేరో, కుంచమో! ఎంత ఉంటే అంత. ఎంతోకొంత నమ్మకము ఉన్నది. అందుకే ప్రభువువారు మీ నమ్మికచొప్పున మీకు కలుగునుగాక! అని చెప్పినారు. ఈ ఒక్కమాటలో దీవెన ఉన్నది, నిర్ధారణ ఉన్నది. అనగా వారి విశ్వాసముమీద ప్రభువు ముద్రవేసినారు. ఈ ముద్ర తీసివేయుటకు వీలులేదు. కాబట్టి నమ్ముకున్నంత విశ్వాసము వారికి ఉన్నది గనుక దానినిబట్టి వారికి అను గ్రహింపబడెను.

దేవుని రాజ్యమునకు ప్రవక్తలు, భక్తులు, విశ్వాసులు అవసరమే. ఎవరి పని వారే చేస్తారు. ఈ భూలోక గవర్నమెంటులోని రాజు దేశము మధ్య ఉంటే ఇతర మంత్రులు, అధికారులైనవారి డిపార్టుమెంటులు రాజుచుట్టు ఉండి పనిచేస్తారు. అలాగే పరలోకములోను ఉంటుంది. ఈ ఛాయ ఆ ఛాయయే. విశ్వాసి ప్రార్థిస్తే పరలోకపు తండ్రి తన దూతలకు ఆజ్ఞాపించును. దేవుని చేత ఆజ్ఞాపింపబడిన దూతలు ఆ విశ్వానికి సహాయముచేసి, తిరిగి దేవునికి రిపోర్టు చేస్తారు. ప్రకటన 4వ అధ్యాయములో మనలను గూర్చి దూతలు ఎల్లప్పుడు ప్రార్థిస్తారు. దేవునికి రిపోర్టు చేస్తారు అని ఉన్నది. అట్లే విశ్వాసులకు కూడ వారు సహాయకులై యుండి ఎన్నో సహాయములు చేస్తారు.

దేవదూతల పని భూమిమీది పైరుకోయుటయే. వారు భూమిమీద ఒకప్రక్క పైరు కోస్తూనే ఉంటారు, మరియొక ప్రక్క పంటపండుతూనే ఉంటుంది. దేవుడు ఒకప్రక్క ప్రతిదినము విశ్వాసులను తయారుచేస్తున్నారు. అలాగే మరియొక ప్రక్క ప్రతిదినము దుష్టులను శిక్షించుచున్నాడు. క్రీస్తు ప్రభువు పరలోకమునకు వెళ్లకముందు అనిన మాట ఒకటి ఉన్నది. 'యుగ సమాప్తి' ఆ యుగసమాప్తికి ముందు జరుగవలసిన సూచనలన్నియు ప్రభువు ఇక్కడ ముందే తెలియజేసారు. మత్తయి 24లో ఉన్న సూచనలన్నియు ఇప్పుడు భూమిమీద జరుగుచున్నవి. మత్తయి 24:4,5లో ప్రభువు తెలిపినట్లు యూదా ప్రాంతమునుండి 'నేనే క్రీస్తును" అనువారు

40మంది లేచారు. చాలామంది వారు ప్రభువే అనుకొని వారికి నమస్కరించారు. కొంతమంది వీరిని నమ్మలేదు. అంజూరపుచెట్టు చిగురించినది అనునదికూడా రాకడ గుర్తే. యూదులైనవారు అనేక దేశములలో చెదిరిపోయారు. చెదరిపోయినవారంతా ఇప్పుడు తిరిగివచ్చారు. తిరిగివచ్చిన వీరు ఈ ప్రాంతములో 60లక్షల అంజూరపు మొక్కలు నాటారు. అవి ఎప్పుడు చిగురించునో అప్పుడు రాకడ సమీపము.

మార్కు 11:12-14 ఈ వాక్యభాగములో ప్రభువు అంజూరపు చెట్టును సమీపించినారు. దానిపై ఆకులు బాగున్నవి అనగా ఆచారములు బాగున్నాయి గాని పండ్లులేవు అనగా ఆత్మీయ ఫలములు లేవు గనుక ప్రభువు అంగీ కరించలేదు. ఈ యూదులే ఆ అంజూరపు చెట్టు. వారు ఫలించలేదు. గనుక చెదిరిపోయారు. అయితే ఇప్పుడు యూదులు అన్ని దేశములలోనుండి వచ్చి, పాలస్తీనాలో గవర్నమెంటు ఏర్పాటుచేసికొనిరి. అదే చిగురుట, వారి స్వభాషలలోనికి అక్షరములు, పుస్తకములు, పాత నిబంధన అంతా మళ్లీ వ్రాయుటకు మొదలుపెట్టినారు. వీరికి యుద్ధములో దొరికిన వారిని ఆ పని చేయుటకు కూలీలుగా పెట్టుకున్నారు. వీటన్నిటిని బట్టి యుగసమాప్తి జరుగు చున్నదని రుజువగుచున్నది. ప్రభువు ప్రవచనములు నెరవేరుచున్నవి. గనుక ప్రభువు త్వరగా వస్తారు అన్నమాట నిశ్చయము. ఆ దివ్య భాగ్యము త్రిత్వ తండ్రి మనకు దయచేయునుగాక !

ప్రభువైన యేసూ త్వరగా రమ్ము! ఆమేన్.

మరనాత.

## ఐదవ సందేశము

# బైబిలు మిషను - సన్నిధి గుడారము

*యెషయా 3:8; దా. కీర్త. 106:13; మత్తయి 10:28; ఎఫెసీ. 6:10-18*

**"యెహోవా మహిమగల దృష్టికి తిరుగుబాటు చేయునంతగా" యెష 3:8**

సిద్ధబాటు కొరకైన తోడ్పాటు కొరకు వచ్చిన ప్రియులారా! ఈ వాక్య భాగము యూదా జనాంగము అనగా యెరూషలేము ప్రజలను గూర్చి వ్రాయ బడినది. వారు ఏర్పాటు జనము అనగా దేవుని ప్రజలు. అటువంటి వారు తిరుగబడిరి. రాబోవు దినములలో, నేడు ఏర్పాటు జనాంగముగానున్న సన్నిధి కూటస్థులు కూడా తిరుగబడేటట్లు శోధింపబడెదరు, కొందరు తిరగబడెదరు కూడా! "యెహెూవా మహిమగల దృష్టికి తిరుగుబాటు: చేయునంతగా వారి మాటలును, క్రియలును ఆయనకు ప్రతికూలముగా ఉన్నవి'' అని యెషయా 3:8లో వ్రాయబడియున్నది.

బైబిలు అంతటిలో రక్షణ సువార్తగల గ్రంథము యెషయా గ్రంథమే. నాలుగు సువార్తలతో తులతూగే గ్రంథము యెషయా గ్రంథము. క్రీస్తుయొక్క జన్మచరిత్ర యావత్తు ఈ యెషయా గ్రంథములోనే ముందుగా వ్రాయబడి యున్నది. ఈ వాక్యభాగ ముఖ్య ఉద్దేశము 'శోధన కలుగుతుంది జాగ్రత్త. 1. గొప్ప అంతస్థునుండి పడిపోయేటందుకు ముందు శోధన కలుగుతుంది. 2. రక్షణ పోగొట్టుకొనేటందుకు శోధన కలుగుతుంది. 3. పాపములో ప్రవేశించే టందుకు శోధన కలుగుతుంది. ఉదా:- మాములుగా వీచే గాలికి తలుపు ఊడి క్రిందిపడదు, అదిపడినా, పడకపోయినా ఎట్లు కదులుతుందో, మనకు వచ్చే శోధనకూడా అట్లే మనలను కదుల్చును. కదిలితే ఏమన్నమాట? పడేస్థితి లోనికి వచ్చినట్లు, గనుక జాగ్రత్తగా ఉండకపోతే తలుపుపడుట నిజమే.. ఇక్కడున్న వారిలో అనేకమందికి పడిపోయేటట్లుగానే, సుళువుగా పడిపోయే టట్లుగానే ఉన్నట్లు తోస్తుంది. తాడిచెట్టు పడవేయుటకు ముందు, చెట్టు మొదలు కొట్టుదురు. అప్పుడు అది పడిపోయేటట్లు ఊగిసలాడును. అదే దెబ్బమీద మరల మరల కొట్టగా పడిపోవును. అలాగే మనుష్యులు శోధన కలిగినప్పుడు పడిపోవుదురు. 1) ఈ వచనములో ఆ కాలానికి సంబంధించిన యూదుల యొక్క దుస్థితి కనబడుచున్నది. 2) అలాగే కొన్ని సంవత్సరములనుండి సాతాను

పడగొట్టుటకు పనిచేస్తున్నది. వచ్చే మీటింగునకు ఎంతమంది వస్తారో! డబ్బులేదని కొందరు రాకుండా ఉందురు. అది పడిపోవుటకు ముంగుర్తు.

ఇటలీ, జర్మనీ దేశాలు ఎందుకు పడిపోయినవి? వారి దేశములో ఉన్న మతము, ఆ మత పద్ధతులు సరిగా లేనందున పడిపోయినవి. ప్రభువా! ఏడు శిరస్సులు, పదికొమ్ముల యొక్క శక్తులతో సైతాను మా ఏడుగురిమీద పడనైయుంటే మాకేమి భయము? అతనికే భయముగాని మాకు భయములేదు. ఎందుకంటే అతడెలాగో ఓడిపోతాడుగా! మేము నిజముగా జయం పొందు దుము. యేసుప్రభువా! మాకు బదులుగా వచ్చిన బదలీవాడవైన నీవు మాకు గెలుపునిస్తావు. మీకు ఇలలోనున్న భయము కలలోనికి వచ్చినది. అని అను చున్నారు. గనుక మీకు ఎన్ని శ్రమలు వచ్చినను విచారపడకండి భయపడకండి. ఆ ఏడు శిరస్సులు, పదికొమ్ముల యొక్క బలమును యేసుప్రభువు తన గోటితో గెంటివేయును. ఆయుధములు ఆయనకు అక్కరలేదు. హర్మగెద్దోను యుద్ధములో ఆయన ముఖశ్వాసే ఆయన ఆయుధము. **ఏమైనా రానివ్వండి! విచారముగాని, భయముగాని మీలోనికి రానివ్వకండి.** ఎందుకనగా విచారము, భయము సైతానునుండే వచ్చును. మిమ్ములను అందరిని నాశనము చేయ వలెనని ఎప్పటినుండో సైతానుకు ఉన్నది. వాడికి, అయ్యగారినే నాశనము చేయాలని ఉన్నది. అయినను వాడి పన్నాగములేమియు, పరిశుద్ధాత్ముని యెదుట పారవు.

సన్నిధి కూటములలో ఇంత గొప్ప దర్శనములు ఉంటుండగా తప్పిపోవడము ఏమిటి? బుద్ధిలేని కన్యకలు తగ్గిపోవుటకు కారణమేమిటి? బైబిలు మిషనును రూపుమాపుదునని సైతాను అంటే దానికి జవాబు– "బైబిలు మిషనును నా తండ్రి ఎత్తి చూపించుము' అని అన్నారుగాన సాతాను బైబిలు మిషనును రూపుమాపలేదు. ఒకోసారి నేను చావనుగాని, చచ్చినంత జబ్బు వచ్చును. అట్టి సమయములో ఎవరు పరిచర్య చేస్తారు! తప్పుకొంటారు. అట్టి పరిచర్య ఎవరు చేస్తానంటారో వారు ఇప్పుడే పూనుకొనవలెను. అయ్యగారిమీద అభిమానము లేకుండా ఎవరు పూనుకుంటారో వారికి శ్రమ మరీ ఎక్కువగును. అయ్యగారికి ప్రతి నిత్యము అందుచున్న దేవుని సహాయము, దేవదూతల సహాయము, పరిశు ద్ధుల సహాయము సరేసరి కాని అట్టి కీలక సమయములో పరిచర్య చేయువారెవరు? తెలియదు. ఎవరుకూడ రారు. రాకడ సమీపము గనుక

కష్టాలు కూడా సమీపమే, దయ్యాలు కూడా సమీపమే. నాలుగు దినముల క్రితం అయ్యగారు గదిలో ప్రార్ధనలోనుంటే ఒక దయ్యము వరండా మీదికివచ్చి నేను ఎలాగు వెళ్ళాలో, ఎలా వెళ్ళాలో తెలియుటలేదు అంటున్నది. మరి నీవెలా వచ్చావు అంటే రావడము ఎలాగో వచ్చినాను కాని వెళ్ళడానికి దారి తెలియుటలేదు అనెను. అప్పుడు అయ్యగారు ఎలా వచ్చావో అలాగే ఫో! అన్నారు. అది పారిపోయింది. పేరుకైనా అయ్యగారు భయపడలేదు. మీ కూటములన్నిటి లోనికి దయ్యము వచ్చును భయపడకండి. **దేవుని వాక్యమునకు విశ్వాసిని కౌగలించుకొనే స్వభావమున్నది.** గనుక చిన్న వాక్యము చదివితే గంటల కొలది వర్తమానము వచ్చును. వాక్యము విశ్వాసిని కౌగలించుకొంటున్నది. గనుక మనము దేవుని వాక్యమును కౌగలించుకొనే విశ్వాసులుగా ఉండాలి. అనగా వాక్యములోని అంతరంగ అర్ధమును, పూర్ణ హృదయముతో మన వ్యక్తిగత జీవితములో స్వీకరించి, ఆ భావముతో మనలను సరిపోల్చుకొని, దిద్దుకొని, ఇముద్చుకొని ఆ విధముగా నడచుకొనవలెను. నేటికి దైవసన్నిధి 20వేల మందికి అందినది. గాన 20వేల మంది సన్నిధి కూటములు పెట్టవలసినదే. ఉదా:- -సోల్జరును (సైనికుని) తుపాకి పట్టుకొని మనుష్యులను చంపమంటే, తుపాకి గురిచూడకుండా పేల్చెనుగాని మనిషిని చంపలేదు. అలాగే సైతాను ఎదిరింపులు చేసేవారు, గురిచూడకుండా తుపాకీ పేలుస్తున్నారు. గనుక వీరినిచూచి అసలు నాయకుడు (సైతాను) అను కుంటున్నారు- మాకు బాగా కొట్టుచున్నారని అనుకుంటున్నారు. కాని మాకు తగులుటలేదు. మీరు చేయు ఎదిరింపులు, వేయు బాణములు సైతానుకు తగులుతాయన్నట్లు మీరనుకుంటున్నారు కాని మీరు దేవుని బాణములను గురిగా వేయుటలేదు. గనుక వాడికి అవి తగులుటలేదు. కావున ప్రభువుపై ఆనుకొని గురికలిగి సైతానుపై బాణములు వేయవలెను. ఈ యెషయా గ్రంథము 3వ అధ్యాయములోని గతి, ఏర్పాటు జనముయొక్క గతి, భయ పడుటకు కాదుగాని, జాగ్రత్తపడుటకు చెప్పితిని.

ఇక్కడ ఉన్నవారిలో ప్రార్ధనకు మంచి గది ఉన్నవారెవరు? దైవసన్నిధికై ప్రత్యేక గది ఏర్పరచుకొనుట ప్రాముఖ్యము. ఏమిటి ప్రభువా! వారికి ఎక్కువ డబ్బు ఇస్తున్నావు! అలాగున మాకు ఇస్తే సువార్త పని ఎక్కువ చేస్తాముగదా! అని మనము అంటే, మీకే నేను ఎక్కువ ఇస్తున్నాను అని ప్రభువు అంటున్నారు. పూర్వకాలము ప్రత్యక్షపు గుడారములో 1.

అతిపరిశుద్ధ స్థలము 2. పరిశుద్ధ స్థలము 3. ఆవరణ స్థలము అని మూడు భాగములు ఉన్నవి. (1) నేర్చుకొనుటకు వచ్చువారు ఆవరణములో ఉండవచ్చు. (2) ప్రభువు మాట వినేవారు, ప్రార్థన చేసేవారు, వాక్యము చదివేవారు, వివరించుకొనేవారు. పరిశుద్ధ స్థలములో ఉంటారు. వీరు అప్పుడప్పుడు ప్రభువు పిలిస్తే అతిపరిశుద్ధ స్థలములోనికి వెళ్ళతారు. (3) నిత్యము ప్రభువు ముఖము చూస్తూ, ఆయన మాటలు వింటూ ఆయన చెప్పనవి వ్రాసికొనువారు అతిపరిశుద్ధ స్థలము లోనివారు, ఈ మూడవ అనుభవము కొరకే సన్నిధి కూటములు వచ్చినవి. ఈ (సన్నిధి) కూటాలు స్థాపించారు గాని, అందులోని అంతస్థును అందు కొనుటకు సంబంధించిన తర్ఫీదు చాలదు. ప్రభువు ఏమి చెబుతాడో అని దానికొరకు కనిపెట్టుచున్నారు. దీనికి ముందు ప్రభువు బైబిలులో ఏమి చెప్పినాడో అని చదువకుండా ఆలాగు చేయకుండ ఉన్నదానిని అశ్రద్ధ చేస్తున్నారు అదే తప్పు. మీరు తక్కువే చదవండి. ఎక్కువే చదవండి కాని ప్రభువు మీతో మాట్లాడుచున్నట్లు భావించుకొని చదవండి. ఇప్పుడు ఎవరి సన్నిధి కూటము జయకరముగా, ముమ్మరముగా జరుగుచున్నదో చెప్పండి! అన్ని కూటములు బాగానే జరుగుచున్నాయి. 1) కొంచెము బెదురు, 2) కొంచెము అపనమ్మిక, 3) కొంచెము అశ్రద్ధ ఉన్నది. ప్రభువు ఈవేళ నాకు ఏమి చెప్పలేదు అని దేవునిమీద నేరారోపణ చేయుదురు. నాకేమి చెప్పలేదని ప్రభువుమీద ఇలాగు నేరారోపణ చేయుట హాని, మీరు కూటములలోనికి వెళ్లినప్పుడు నాయకుల మీదకాని, మెంటర్లమీదనైనను విసుగుకొనకూడదు.. పేరుకైనను కారణముగల విసుగుదలసహా కూడదు. క్రైస్తవ సంఘమునకు, చాలా ముందు కాలములో ఉన్న ఎస్తేరుకు దేవుని స్వరములేదు, వ్రాతలేదు. ఇప్పటి కాలములో స్వరము, దర్శనము, వ్రాత ఉన్నది. విశ్వాసము ఉన్నది. గాని విశ్వాసమునకు తగిన సహవాసములేదు గనుక సన్నిధిలో వృద్ధిలేదు. ప్రతి కూటములో విశ్వాస మునకు తగిన సహవాసము లేదు గనుక, వచ్చే నెలలో ప్రతి కూటమునకు ఇద్దరు వస్తే చాలు. నెలకు ఒకసారి సన్నిధి కూటములోని ఇద్దరు వచ్చి నోట్సువ్రాసికొని, వెళ్ళి చెప్పవచ్చును ఇది సుళువైన పని, వారి ఖర్చులు కూటస్థులు భరించవలెను.

(ఎ) అతి పరిశుద్ధ స్థలములో ఉండేవారికిని, (బి) పరిశుద్ధ స్థలములో ఉండేవారికిని, (సి) ఆవరణములో ఉండేవారికిని సంబంధము ఉన్నది. గనుక ఈ మూడు అంతస్థులలోనివారు కూడా సన్నిధి కూటస్థులే.

ఎలాగంటే (అప్పటి కాలములో IV, V, VI Form) 8,9,10 లను మూడు తరగతులు హైస్కూల్లోనివే. పై మూడు స్థలములు, మూడు తరగతులు ఇవన్ని వారి వారి ఆత్మీయ స్థితినిబట్టి ఉన్న అంతస్థులు. గనుక ఎవరును నిరాశపడకూడదు. పరిశుద్ధ స్థలములోని వారు అతి పరిశుద్ధ స్థలములోనికి వెళ్లుదురు. ఆవరణములోని వారు పరిశుద్ధ స్థలములోనికి వెళ్లుదురు. ఒక్కొక్క అంతస్థువారు మెల్లమెల్లగా వారి వారిపై అంతస్థులలోనికి వెళు ల్లుదరు. ముందే ఈ రూల్స్ అన్ని చెప్పితే వెనుకకు పోవుదురు. 30, 60, 100 అంతస్థులు జ్ఞాపకము తెచ్చుకొనండి. అందరూ 100 అంతస్థులలోనికి రారు, అందరు 60దంతలలోనికి రారు, కొందరు తమకున్న కష్టముల వంకే చూస్తారు. క్రొత్తవారెవరైన మీ మీ గ్రామములో సన్నిధి కూటములు పెడితే రిపోర్టు చెయ్యండి. ఎక్కడైతే పెట్టారో వారు మనతో బైబిలు మిషను కేంద్రముతో) సంబంధము కలిగియుండాలి. వారికి నోటీసు పంపవలెను. సన్నిధి కూటములు నాకు రిపోర్టుచేస్తే నాతో సంబంధము ఉండును.

ప్రభువా! ఈ నెలలో మా కూటములోనుండి ఏ ఇద్దరు వెళ్ళవలెనో వారిపేర్లు చెప్పుము. ఆమేన్! (నెలలోగాని, 2వారాలలో గాని ఒక వారములో గాని) మెల్లగా ఒక నెలలో, తరువాత 2 వారాలలో గాని, చివరకు ఒక వారములోగాని సన్నిధి పరులను ప్రభువే రప్పించును. ఏలూరు కూటములో ప్రవేశించుటకు ప్రభువు 7పేర్లు ఇవ్వలేదా? ఇచ్చినారు. 7గురు పేర్లు ఇచ్చినప్పుడు, 2 పేర్లు ఇవ్వలేరా! ఈ సన్నిధి కూటములలో ఒకరికి చెప్పిన ప్రభువు ఇంకొకరికి కూడా చెప్పునట్లు ప్రార్థించవలెను. ఈ 5 సన్నిధి కూటములు మంచి స్థితిలోనికివస్తే, ఈ సందేహములు ఏమీ ఉండవు. డబ్బుకు కష్టము ఉండదు. సైతానుకుగాని, అతని దూతలకుగాని, పాపమునకుగాని, ఇబ్బందికిగాని, శీతోష్ణస్థితికిగాని, విషపురుగుకుగాని, **మరి దేనికినిగాని భయ పడని గుణము నేర్చుకొనవలెను.** ఆరంభించితేగాని అట్టి స్థితి రాదు. ఎంత తరచుగా సన్నిధి కూటమునకు వస్తే అంత బలమున్నది.

ప్రభువు బైబిలు మిషనులోనికి వెళ్ళమని ఏరోజు చెప్పితే ఆరోజే వెళ్ళవలెను. బుధవారము చెప్పితే బుధవారమే వెళ్ళవలెను. కాని లక్ష్మివారము వెళ్ళితే అంతస్థు తగ్గును. ఉదాహరణకు: బందు సూర్యకాంతమ్మకు ప్రభువు మూడు వారముల క్రితము వెళ్ళమంటే నాలుగవవారము బైబిలు

మిషనులోనికి వచ్చినది. వస్తే మంచిదేగాని అంతస్థు తగ్గును. నేను నీకు చూపించిన దేశమునకు వెళ్లుము అని దేవుడు అబ్రాహాముతో చెప్పినపుడు ఎన్ని ప్రశ్నలు వేసినాడు? ఎన్ని అడుగులు వెనుకకు వేసినాడు? ఎన్ని రోజులు ఆలస్యము చేసాడు? ఆలస్యము చేయలేదుగాని దేవుడు చెప్పినపుడే బయలుదేరినాడు. గనుకనే అబ్రాహాము విశ్వాసజనసంఘమునకు జనకుడైనాడు. గనుక ఆలస్యముగా బైబిలు మిషను లోనికి వెళ్లవచ్చునుగాని అంతస్థు పోతుంది.

బైబిలు మిషనులోనికి రాకుండా ఈ విషయములన్నీ తెలుసుకొని, బైబిలు మిషనులో విశ్వాసము కలిగి ఉంటున్నవారి విశ్వాసమేమిటి? **వారికి ప్రభువు మాట్లాడే అంతస్థు ఉన్నదిగాని, బైబిలు మిషను అంతస్థు లేదు.** గవర్న మెంటువారు యుద్ధానికి పటాలపు సిపాయిలను తయారు చేసికొంటున్నారు. అప్పుడు కొందరు పేర్లు ఇచ్చినారుగాని వెళ్ళలేదు. కొందరు ఆర్డర్ కొరకు కనిపెట్టుచున్నారు వారు ఈ పటాలములో చేరినట్టా? చేరనట్టా? చేరినట్టే. పేర్లు ఇచ్చినపుడు పటాలములో చేరినట్టా? చేరినట్టే! చేరనట్టా? పటాలమునకు వెళ్ళినా ప్రవేశించనపుడు ప్రవేశించినట్టా? ప్రవేశించనట్టా? షరా:- యుద్ధమునకు వెళ్ళవలెనని ఉద్దేశమున్నది గనుక పేరు ఇచ్చినట్టే. యుద్ధమునకు వెళ్ళవలెనను ఆలోచనతో ప్రవేశించినపుడు ప్రవేశించినట్టే. పేరు ఇచ్చిన వారు ప్రవేశించారని చెప్పవచ్చు.

ఒక అబ్బాయి పేరు ఇచ్చి యుద్ధమునకు భయపడి వెళ్లలేదు. అతడు సోల్జరు (సైనికుడు) అయ్యాడా? ప్రభువా! బైబిలు మిషనులోనికి వెళ్ళాలని నాకు ఇష్టమున్నది. నీవు వెళ్ళు! అని నీవు నాకు చెప్పలేదు. నీవు వెళ్లు అని అంటే ఇప్పుడే వెళ్ళతాను అని ప్రార్థించవచ్చును. కాని తీరా ప్రార్థించిన తరువాత వెళ్లవలసివస్తుందని నీవు ప్రార్థించనే ప్రార్థించవు. బైబిలు మిషనులో ఉండి నేర్చుకొనుచున్నాము గనుక మేము నేర్చుకొనే అంతస్తులో ఉన్నాము. అనేవాడు రాకడ అంతస్థులో ఉండకపోవచ్చు. కొంతమంది నేర్చుకొనుట వరకు ఉందురుగాని రాకడకు సిద్ధపడరు. కావున బైబిలు మిషను వారు ఆత్మీయ సంగతులు నేర్చుకొనుచూ రాకడకు సిద్ధపడవలెను. పరీక్షలలో పాస్ అవుటకు ఒక విద్యార్థి చదువుచున్నాడు. చివరిలో అశ్రద్ధ చేసినందువల్ల సరియైన మార్కులు ఉత్తీర్ణతకై రానందున 6వ తరగతి విద్యార్థిగా ఉంటాడు. మార్కులు రాకపోయినందువలన 6వ

తరగతిలో ఉండిపోవును. గనుక పై తరగతికి వెళ్లరు. కావున ఉత్తీర్ణులవుటకు నిర్దేశించిన మార్కులు రాక పోయినందువలన పై తరగతికి పోరు. బైబిలు మిషనులో ఉండికూడా ఫెయిల్ అయిన వారుంటారు. ఒక్క బైబిలు మిషనువారు మాత్రమే ఎత్తబడుదురా? జవాబు: తక్కినవారు ఎత్తబడరా? ఎవరు సిద్ధముగా ఉంటారో వారే ఎత్త బడుదురు. బైబిలు మిషనులో సిద్ధపడినవారు కూడా ఎత్త బడుదురు. అయితే, ఎత్తబడే ఈ ఇద్దరిలో అనగా బయటి వారిలో, బైబిలు మిషను వారిలో అంతస్థు బేధమున్నది.

అబ్రాహాముయొక్క అంతస్థులోనికి నోవహుగారు వచ్చారా? రాలేదు. అబ్రాహాము గారికి తెలిసినన్ని విషయములు నోవహుగారికి తెలియదు. దావీదుయొక్క అంతస్థు రాజుగా ఉండుట, కవీశ్వరుడై ఉండుట. ఈ విషయము ఇస్సాకునకు బైలుపరచినాడా? లేదు! 500 సం॥ల క్రితము ఎవరైనా ట్రైన్ ఎక్కినారా? లేదు. నోవహుయొక్క ఓడలో మెతూషెలా ప్రవేశించినాడా? లేదు. అప్పటికి ఓడలేదుగాన ప్రవేశించలేదు. ఒకవేళ ఓడవస్తే ప్రవేశించవద్దా? “లూథరు మిషను” ఉన్నపుడు “బైబిలు మిషను” లేదు. ఇప్పుడు “బైబిలు మిషను” అనే ఓడ వచ్చినది గాన అందరూ “బైబిలు మిషను”లోనికి రావచ్చును.

**ప్రార్థన:–** ప్రభువా! ఈ ఉదయము నీ లక్షణములు విన్నట్లు, నిజమే అని తెలిసికొని, అట్టి లక్షణములున్న నీవు మాకు బైలుపడినావు అందుకు నీకు వందనములు అని చెప్పే మంచిమనస్సు దయచేయుము. దయగల ప్రభువా! నీవు మంచివాడవు. నీవు చేయునదంతా ఆనందముగా ఉన్నదని అనుకొనే అభిప్రాయము. చెడకుండా ఉండేశక్తి దయచేయుము. నీకున్నశకిత్తో, నీవు స్వయముగా పనిచేయుచున్నావనియు; మేము స్వతంత్రముగా చేయుచున్న పని, నీవు చేయనిచ్చిన పని, నీ కార్యము నీ శక్తి గనుక నీవు చేయనిచ్చిన పనిని జ్ఞాపకముంచుకొని బలపడేటట్లు కృప చేయుము. మరియొక పని ఏదనగా నేను పాపములో ప్రవేశించినప్పుడు నీవు అడ్డుపెట్టకుండా ఊరు కున్నావు. ఊరుకున్న పని పరిశుద్ధమైనదే. అలాగు ఊరుకొనుట ద్వారా నీవు మా స్వతంత్రతను శుద్ధీకరించుచున్నావు. దేవుడు ఎందుకు ఊరుకున్నారు. అని మేము అనకుండగ కృప దయచేయుము. నీ సెలవులేనిదే ఏదియు జరుగదని తెలిసికొనే కృప దయచేయుమని వేడుకొంటున్నాము. ఆమేన్.

## ఆరవ సందేశము

# దావీదు సంచిలోని రాళ్ళు

**1 సమూ. 17:40-45; మార్కు 16:15-18; హెబ్రీ 11:32-34.**

**"దావీదు - తన కఱ్ఱ చేత పట్టుకొని యేటి లోయలో నుండి అయిదు నున్నని రాళ్లను ఏరుకొని తనయొద్దనున్న చిక్కములో నుంచుకొని వడిసెల చేత పట్టుకొని ఆ ఫిలిష్తీయుని చేరువకు పోయెను 1సమూ 17:40.**

**1. తనకఱ్ఱ:-** కఱ్ఱ ధర్మశాస్త్రమునకు గుర్తు. అనగా దావీదు దివా రాత్రము సన్నిధియందు ఆశ కలిగియున్నాడు. పట్టువిడువకుండ, పట్టుపట్టి సన్నిధిలోని శక్తిపొందినాడు.

**2. యేటిలోయ:-** లోయనుండి అనగా దేవుని సన్నిధిలో ఉండి, తన అంతరంగమును దేవుని అంతరంగములోనికి తీసుకువెళ్ళి బయటకు తీసినరాళ్ళు ఐదు. అవేవనగా:-

**1. కొట్టబడిన రాయి నిర్గమ. 17:6:-** హోరేబు కొండ దగ్గర ఇశ్రాయేలీయులు రెఫీదీములో దిగిరి, త్రాగడానికి నీళ్ళులేనందున ఇశ్రాయేలీయులు సణిగిరి, అప్పుడు మోషే లోయలోనికి వెళ్ళి ఎక్కడ నీరు ఉన్నది అని తన అంతరంగముతో చూడగా అనగా మొఱ్ఱపెట్టగా, దేవుడు (నిర్గమ. 17:4) మోషేతో 'నీ కఱ్ఱ చేతపట్టుకొని వెళ్ళుమనెను. ఎందుకనగా, కఱ్ఱలేకపోతే దేవుడు కనబడడు. దేవుడు కనబడకపోతే రాయి అనే బండ కనబడదు. బండ కనబడకపోతే ఇశ్రాయేలీయులు దాహము అనే శత్రువును జయించలేరు. దేవుని మాటనుబట్టి మోషే బండను కొట్టగా, నీరు దాహముతీర్చి జయమిచ్చెను. గనుక దావీదు ఈ రాయి కలిగియుండెను.

**2. జయమిచ్చిన రాయి నిర్గమ. 17:12:-** అమాలేకీయులు వచ్చి రెఫరీములో ఇశ్రాయేలీయులతో యుద్ధముచేయగా, మోషే యెహోషువతో రేపు నేను దేవుని కఱ్ఱ చేతపట్టుకొని కొండ శిఖరము మీద నిల్చియుందును. అని చెప్పెను. యుద్ధము జరుగుచుండగా మోషే చెయ్యి పైకెత్తినప్పుడు ఇశ్రా యేలీయులకు శత్రువులపైన జయము కలిగినది. చెయ్యి దించివేస్తే అమా లేకీయులకు జయము వచ్చినది. మోషే చేతులు

బరువెక్కగా వారు. ఒకరాయి తీసికొని వచ్చి మోషే కూర్చుందుటకు వేసిరి. అహరోను, హూరులు ఒకడు ఈ ప్రక్కను, ఒకడు మరియొక ప్రక్కను మోషే చేతులు పైకెత్తి పట్టుకొనిరి. ఆ విధముగా యుద్ధమందు శత్రువులను యెహోషువ గెలిచెను. ఈ రాయి శత్రువులపై జయము నిచ్చినరాయి. ఇది దావీదు కలిగియుండెను.

**3. దీవించే రాయి నిర్గమ 20:25:-** మోషే గాఢాంధ కారములోనికి ప్రవేశించిన తరువాత దేవుడు మోషేతో ఈలాగు చెప్పెను. "నా నామమును జ్ఞాపకార్థముగా నుంచు ప్రతి స్థలములోను నేను నీయొద్దకు వచ్చి నిన్ను ఆశీర్వదించుదును. నాకు రాళ్ళతో బలిపీఠము కట్టవలెను. దానికి నీ పనిముట్టు తగిలిన యెడల అది అపవిత్రమగును గనుక చెక్కని రాళ్ళతో కట్టవలెను. గాని ఇనుప పనిముట్టు తగులకూడదు (నిర్గ. 20:24-25) అందుకే కాబోలు సౌలు ఇచ్చిన ఇనుప కవచము అనగా రాజు వేసికొనేవి దావీదు వద్దు అన్నాడు. 1 సమూ. 17:38-39. ఈ కట్టబడిన రాయి దీవించేరాయి అయినది. దావీదు దేవునిచేత దీవించబడి, కర్రపట్టుకొని వెళ్ళినాడు. ఈ రాయియొక్క అనుభవమును దావీదు కలిగియుండెను.

**4. రక్షణ ఇచ్చిన రాయి 1కొరింథీ. 10:4-5:-** పాత నిబంధనలో కొట్టబడినది రాయి లేక బండ, అయితే, ఇప్పుడు కొట్టబడిన బండ క్రీస్తే. ఈ క్రీస్తు మన రక్షణకై కొట్టబడి, చీల్చబడి, సాతాను పై జయముపొంది. మనకు జయము ఇచ్చెను, ఈ రాయి అనుభవము దావీదు కల్గియుండి ఇశ్రాయేలీయులను రక్షించుటకు ఈ రాయి కావలెనని కోరుకొనెను. 1 సమూ. 17:26-37. ఈ అనుభవము దావీదు కలిగియుండెను.

**5. అనుభవము అనేరాయి నిర్గమ. 11:20:-** యెహోవా మాట్లాడిన రాయి. ఇది బైబిలు మిషను రాయి, కొండ శిఖరము పైకి వస్తేనేగాని దేవుడు' మాట్లాడడు. ఎందరు ఎన్ని రాళ్ళు కలిగియున్నప్పటికి సీనాయి పర్వతము అనే రాయి పైకి వస్తేనేగాని దేవుడు దిగివచ్చి మాట్లాడడు. **అలాగే బైబిలు మిషనులోనికి వస్తేనేగాని అనగా దేవుడు మాట్లాడే అనుభవము కల్గితేనే గాని ఈనాటి మన శత్రువును జయించలేము.** అందుచేతనే దావీదు

ఈ అనుభవమనే రాయికూడ తీసికొని శత్రువుపై యుద్ధానికి వెళ్ళినాడు. శత్రువు ఎదురుగా దావీదు నిలుచున్నప్పటికి, శత్రువైన గొల్యాతు కలిగియున్న యుద్ధ సామానులు దావీదు కలిగిలేడు. గాని ఏమి కలిగియున్నాడు? కర్ర, సంచి పట్టుకొన్నాడు. ఏ సంచి? రాళ్ళుఉండే సంచి. అనగా హృదయమనే సంచి, ఈ సంచిలో 5 రాళ్ళు మాత్రమే ఉన్నవి. క్రీస్తుప్రభువు సాతానును జయించడానికి 5 గాయములు మాత్రమే. కలిగియున్నారు. ప్రభువునకు కలిగిన గాయములలో 5వది ప్రక్క గాయము అనగా హృదయగాయము. గాయపడ్డ హృదయములు కలిగియున్నవారు తమ హృదయము సరిచేసికొనకపోతే, శత్రువుని జయించ లేరు. శత్రువు హృదయములోనే ఉండును. ఇదే అంతటికి మెయిన్, అలాగు దావీదు తన హృదయమనే సంచిలో నున్నది రాళ్ళు అనగా దేవునితో మాట్లాడే అనుభవములు కలిగి ఉన్నాడు గనుక శత్రువును జయించినాడు.

ఈ చివరిరాయి **"బైబిలు మిషను అనే రాయి"**. ఈ రాయితో దావీదు శత్రువుని చంపి జయించెను. అలాగే దేవదాసు అయ్యగారిలో ఎన్నో అనుభవ ములున్నవి. ఎన్ని ఉన్నప్పటికిని దేవుడు మోషేను కొండమీదకు పిలచి మోషేతో మాట్లాడినట్లు, దేవుడు అయ్యగారితో దైవసన్నిధి స్థాపించుమని చెప్పి, ఈ చివరి కాలములో పనిచేయుచున్న శత్రువకు సైతానును జయించుటకు సన్నిధి అనే కర్రనిచ్చి సైతాను నెదిరించు సూత్రములను రాళ్ళను లేక బాణములను ఇచ్చి, ఎన్నో అనుభవములను అయ్యగారి హృదయమునకు అందించి, సైతానును ఓడించగలిగే శక్తిని ప్రభువు అనుగ్రహించినారు. ఈ శక్తులతో సైతానును ఓడించుటకై వానిని ఒక పుస్తక రూపములోనికి (సైతాను నెదిరించు సూత్రములు) తీసికొని రావడానికి ప్రభువు శక్తినిచ్చినాడు. గనుక ఈనాటి వారమైన మనకు శత్రువకు సైతాను లోకువైనాడు. అందరి అనుభవములు అనగా ఎవరి అనుభవములు, వారిలోనే ఉన్నవి. గాని దేవదాసు అయ్యగారి యొక్క సన్నిధి అనుభవము ఇప్పుడు మరియు ఎల్లప్పుడును అనగా క్రీస్తు ప్రభువుతో కలుసుకొనేవరకు స్థిరముగా బలముగా, జయముగా ఉంటుంది. ఈ రాయిమీదకు వస్తే, ఈ రాయి పట్టుకొంటే, ఈ రాయిని శత్రువుపై ఉపయోగిస్తేనే మనము జయము పొంది, మహిమ రాయియైన యేసుక్రీస్తు ప్రభువు రాకడ మేఘమెక్కగలము.

**ప్రార్థన:–** ఓ యేసుక్రీస్తుప్రభువా! దావీదు లోయలోనికి వెళ్ళినాడు. ఈనాడు అందరు లోయలోనికి వెళ్ళుచున్నారు. గాని దావీదు కర్రపట్టుకొని, సంచిపట్టుకొని వెళ్ళినరీతిగా అనేకులు వెళ్ళుటలేదు. గనుక జయము రావటములేదు. ఓ క్రీస్తు ప్రభువా! నీ మహా కృపనుబట్టి మాకు "కర్ర" అనే "సన్నిధి." "సంచి అనే "సుబుద్ధి" హృదయమును అనుగ్రహించి, నీ మర్మములు గ్రహించగల జ్ఞానము దయచేయుము. నీకు నా స్తోత్రములు, దావీదు వద్ద 5 రాళ్ళు ఉన్నప్పటికిని, సంచిలో చివరివేసిన రాయి శత్రువును జయించుటకు కావలసి వచ్చినది. అలాగే **లోకములో ఇన్ని మిషనులుండగా చిట్టచివర వచ్చిన ఈ బైబిలు మిషను అనే రాయి రేపు మేఘమెక్కుటకు అడ్డముగా ఉన్న శత్రువును గెలుచుటకు అవసరమైయున్నది అని అందరును ఈ ప్రసంగముద్వారా గ్రహించగలిగే జ్ఞానము దయచేయుమని** మహిమ మేఘములో రానైయున్న యేసు క్రీస్తును బట్టి వేడుకొనుచున్నాము ఆమేన్.

## ఏడవ సందేశము

# దీర్ఘదర్శి ఎలీషా

**2రాజు. 13:18-19; మార్కు 9:23; 1కొరింథీ. 11:23-30.**

**"బాణములను పట్టుకొమ్మనగా అతడు పట్టుకొనెను. అంతట అతడు ఇశ్రాయేలు రాజుతో నేలను కొట్టుమనినప్పుడు అతడు ముమ్మారు కొట్టి మానెను" 2రాజులు 13:18-19.**

ప్రవక్తయైన ఎలీషా ఇశ్రాయేలీయుల రాజును బాణములను నేలకు కొట్టుమని చెప్పగా, రాజు ముమ్మారు మాత్రము బాణములను నేలకు కొట్టి ఊరుకొనెను. ఈ మూడు బాణముల క్రింద ఒక కథ ఉన్నది. అదేదనగా విశ్వాసమును చెడగొట్టు కథ దాగియున్నది. అది విశ్వాసమును చెడగొట్టును, రక్షణకూడా పోగొట్టును. ఎలీషా చెప్పిన దేమనగా బాణములను తీసికొని నేలను కొట్టుమనెను. రాజును బాణములతో నేలను కొట్టుమనుటలో అర్థము లేదుగాని; పులిని గాని, శత్రువులను గాని కొట్టుమనిన రాజునకు గౌరవము గాను, అర్థముతో కూడినదిగా నుండును. రాజు నేలను బాణములతో కొట్టునా? నేల నెందుకు కొట్టవలెనని మనమందుము. అయితే రాజు ఆలాగున అనలేదు. మానవునిలో కూడ విశ్వాసమును చెడగొట్టునది దాగుకొనియున్నది. విశ్వాసమును చెడగొట్టుట ద్వారా రక్షణ కూడా పోగొట్టును, అవిశ్వాసికి దేవుడు అక్కరలేదు. రక్షణ అక్కరలేదు, విశ్వాసము వద్దు. ఈ స్థితికి మనుష్యుడు వచ్చుచున్నాడు. ఒక అమ్మాయి దంపుడు కర్రను తీసికొని ఇసుకను దంచుచుండెను. ఇది నిజముగా ధాన్యమును దంచుటయా? ఆ అమ్మాయి ఆట కొరకు ఆలాగు చేయును. అలాగే రాజును బాణములతో నేలను కొట్టు మనునది ఆటగాను, వృధాగాను కనబడును. ఒక కుర్రవాడు కర్రతో కుండలో దంచును. కుండ పగిలిపోవును. ఈ విధముగానే బాణములతో నేలను కొట్టుట వృధాగా పైకి కనబడును. అయినను ఆలాగు చేయుట విశ్వాసమునకు గుర్తైయున్నది, గాన రక్షణకు కూడ ముంగుర్తైయున్నది. నమ్మకపోతే నేలను కొట్టడు; కొట్టకపోతే రక్షణలేదు. ఈ మూడు బాణములు విశ్వాసమునకు ముంగుర్తైయున్నవి.

ప్రవక్తయైన ఎలీషా బాణములను నేలను కొట్టుమని అనినప్పుడు ఇశ్రాయేలీయుల రాజు అనేక పర్యాయములు కొట్టవలసినది గాని 3

సార్లు మాత్రమే కొట్టెను. విశ్వాసము యొక్క లక్షణము 1) నమ్ముట, 2) తీసికొనుట. దేవుడిచ్చిన రక్షణ నమ్ముట విశ్వాసమైయున్నది. రక్షణ తీసికొనుట కూడ విశ్వాసము వలననే. అయితే విశ్వాసమునకు ఆటంకమేమున్నది? దేవుని వాక్యమును అంగీకరించుట అనేకులకు ఆటంకము. రాజునకు ప్రవక్త మాట ఆటంకము కాదా? నేలను ఎందుకు కొట్టుట? దేవాలయములో పాదిరిగారు రొట్టె, ద్రాక్షారసము తీసికొని, ఇది ప్రభువుయొక్క శరీరము దీనిని తిని, ఆయన రక్తము త్రాగుము అని చెప్పిన, కొందరు "అయితే దీని వలన జీవము వచ్చునా?" అని ప్రశ్నింతురు. బహిరంగమునకు వట్టిదిగా పైకి కనబడును. మూఢభక్తిగా కూడ అనిపించును. గాని దేనిలోని మర్మము విశ్వాసముద్వారా గ్రహించగలము.

క్రీస్తుప్రభువు గ్రుడ్డివానితో 'నీవు వెళ్ళి సిలోయమను కోనేటిలో కండ్లు కడుగుకొనుమని' చెప్పుట ఆటగా కనబడును. గంభీరముగా కనబడదు. విశ్వాసముతో ఆ గ్రుడ్డివాడు పని చేసిన మీదట ఆ మాటలలోనున్న రహస్యము, విలువ తెలిసికొనెను యోహాను. 9:7, అంజూరపు పండ్లు ముద్దగా చేసి పుండు మీద కట్టుము. పుండు పోవునని చెప్పుట కూడ తేలికగా కనబడును. యెషయా 38:21. నయమాను వృత్తాంతములో, ఎలీషా ప్రవక్త నయమానుతో- "యొర్దాను నదిలో ఏడు మార్లు మునుగుము, కుష్ఠురోగము పోవును" అని చెప్పెను 2రాజులు 5:10. దేవుని మాటలు అవిశ్వాసులకు ఆటగా నుండును గనుక వారు ఫలితమును పొందలేరు. మూడు బాణములు నేలకు కొట్టవలెనా! అనునది అవిశ్వాసులకు ఆటంకముగా కనబడును. విశ్వాసులు ఆ మాటల చొప్పున చేయని యెడల రక్షణ పోవును.

కొందరు కొన్ని షరతుల ద్వారా రక్షణ పొందుదురు. మరికొన్ని షరతుల ద్వారా పెండ్లి కుమార్తె సంఘములోనికి తయారగుదురు. అనేకులు పెండ్లి కుమార్తె సంఘములోనికి రాకపోవుటకు కారణము దేవునిమాట వారికి ఆటంకముగా నుండును. రక్షణలోనికి అనేకులు రాకపోవుటకు కూడ వాక్యమే వారికి ఆటంకము. రాజైన 'యెహోయాషు' బాణములను 3 మార్లు నేలపై కొట్టిన తర్వాత ఎలీషా 5 లేదా 6 పర్యాయములు ఎందుకు కొట్టలేదు అని రాజుతో అనెను. 6 పర్యాయములు సంపూర్ణము. 3 పర్యాయములు అసంపూర్ణము. 3 పర్యాయములు రక్షణ గుర్తు. 6 పర్యాయమలు సంపూర్ణతకు అనగా పెండ్లికుమార్తె వరుసకు గుర్తు.

పెండ్లికుమార్తె సంపూర్ణతలోనికి రావలెను. విశ్వాసి రక్షణ పొందుటకు మాత్రమేగాక వధువు సంఘమునకు తయారు కావలెను.

బైబిలు మిషను బోధలు ఇతరులకు ఆటంకముగా నున్నవి. 1) దర్శనవరము: దర్శనములు, ఇతరులకు ఆటగా నున్నవి. అవి బైబిలులో ఉన్నవా? అని ప్రశ్నించుకొని ఉన్నయెడల నిజమే అని నిర్ధారించుకొనవలెను. వాక్యములోనున్నది తప్పు అర్ధము చేసికొన్న యెడల పెండ్లి కుమార్తె వరుసకు కావలసిన విశ్వాసము పోవును. 2) భాషావరము: భాషను గురించి చాల వివరముగా 1కొరింధి. 12వ అధ్యాయములో వ్రాయబడియున్నది. పరిశుద్ధాత్మ ఇచ్చు వరములలో భాష ఒకటి. 3) భాషకు అర్ధము చెప్పువరమును పరిశుద్ధాత్మ ఇచ్చును. వీటిని విశ్వాస సంఘము నమ్మకపోయిన, నమ్మని వారిది సంపూర్ణ విశ్వాసము కాదు. ఇట్టివారు పెండ్లికుమార్తె వరుసలో చేరరు. వీటిని ఆటంకపరచకూడదని వాక్యములో నున్నది గదా! అయినను ఇతర విశ్వాసులు నమ్మరు. ఎందుకనగా వారు ఏర్పాటులో లేరు. ప్రపంచ జనాభాలో నుండి దేవుడు యూదులను నెందుకు బయటకు తీసెను. ఇతర రాష్ట్రముల వారు దేవుని దగ్గరకురారు; వచ్చినా ఏర్పాటులో నుండలేరు. ఆలాగుననే క్రైస్తవులలో రక్షింపబడిన వారున్నారు. వారు పెండ్లికి ముందు కొందరు, పెండ్లికి తర్వాత కొందరు రక్షింపబడుదురు. 7 ఏండ్ల శ్రమలలో కొందరు మోక్షమునకు వెళ్ళుదురు గాని పెండ్లి కుమార్తె వరుసలో చేరరు. శరీరము, ఆత్మ, రెండు కలపిన మనిషి అగును. ప్రభువు ఇది వరకు ఆత్మలను రక్షించుటకు వచ్చెను. అయితే శరీరము ఆత్మను లాగివేయుచున్నది. ఇవియొకదాని కొకటి వ్యతిరేకముగా ఉన్నవి (గలతీ. 5:17) అయితే క్రీస్తు ప్రభువు రెండవసారి శరీరమునుకూడ మహిమలోనికి మార్చుటకు మధ్యాకాశములోనికి మేఘముపై ఆయన వచ్చును. గనుక ఇప్పుడు మీరు మీ విశ్వాసమును పరీక్షించుకొనుడి. మీది మూడు బాణముల విశ్వాసమా! లేక ఆరు బాణముల విశ్వాసమా! మీది రక్షితుల గుంపా! లేక పెండ్లికుమార్తె గుంపా!

పెండ్లికుమార్తె గుంపుతో సిద్ధపడి వెళ్ళు కృప ప్రభువు మనకు అనుగ్రహించునుగాక! ఆమేన్.

**ఏడు తరగతులున్నవి నీది - ఏదో తెలిసి కొనుము యిపుడే = కీడు మాని మంచి చేసిన - క్రింది తరగతి దొరుకునేమో ॥ఏకాంత॥**

## ఎనిమిదవ సందేశము

# నోవహు ఓడ - క్రైస్తవ సంఘము

**(ఆదికాండము 6,7,8 అధ్యాయములు)**

***ఆది. 6:18; మత్త. 24:37-39, లూకా. 17:27; 1 పేతురు. 5:8***

**"నీవును నీతోకూడ నీ కుమారులును నీ భార్యయు, నీ కోడండ్రును, ఆ ఓడలో ప్రవేశింపవలెను." ఆది. 6:18.**

దేవుడు పాపముతో నిండియున్న లోకమంతటిని నాశనము చేయవలెనని యోచించి నీతిమంతుడైన నోవహుతో, ఒక ఓడ తయారు చేసికొమ్మని చెప్పెను. అట్లు తయారు చేసికొన్న మీదట నోవహును అతని కుటుంబము అనగా ఎనమండుగురు కుటుంబ సభ్యులును సమస్త జీవులలో మగదియు ఆడుదియును ఓడలో ప్రవేశించిన మీదట, దేవుడు ఆ ఓడ తలుపు బిగించెను. తర్వాత 40 దివారాత్రులు గొప్ప వర్షము కురిసెను. భూమిపైనున్న సమస్తమును నశించెను. ఓడలో నున్నవారును, అందున్న సమస్త జీవులు మాత్రము బ్రతికెను. 40 దినముల జల ప్రళయము గతించి నేల ఆరిన తర్వాత వారు ఓడవిడిచి బయటకు వచ్చి దేవునికి అర్పణ అర్పించిరి.

ఇక్కడ రెండు బొమ్మలు మనస్సులో జ్ఞాపకముంచుకొనవలెను. ఓడ మరియు సంఘము, ఓడలో జరిగినవన్నియు సంఘములో ఏదో ఒకరీతిగా జరుగును. నావలో ప్రవేశించిన వారు, లోనికి వెళ్ళిన తర్వాత ఆకాశము నుండి వర్షము, భూమిలోనుండి ఊటలు వచ్చెను. రెంటికి మధ్యనున్న ఓడలోని వారు బ్రతికి ఉన్నారు. భూమి, ఆకాశము రెంటికిని సృష్టి అని పేరు. సృష్టి పాపులను నాశనము చేయుటకు పూనుకొనెను. ఇతరులైన వారు ఓడలోనికి రానందున నాశనమైరి. పాపులైనను వారు ఓడలో ప్రవేశించినయెడల బ్రతికి యుండెడివారు. ఆకాశమునకును, భూమికిని మనిషిమీద కోపము. ఎందు కనగా మనిషి దేవుని మాట వినకపోయినందులకు, (ఆది, 7:11) ఆకాశపు తూములు తెరవబడి, మహాగాధ జలముల ఊటలు విప్పబడి, నీరు పైకి ఉబికినపుడు పిల్లలు. చనిపోయిరి. ఇంకా పైకి లేవగా పెద్దలును, ఇంకా నీరు పైకి లేవగా

అందరు చనిపోయిరి. క్రమముగా వర్షము నీరు హెచ్చిన కొలది ప్రజలు చనిపోయిరి. రెండు పనులు జరుగుచున్నవి. నీరు పైకిలేచుట, జనులు చనిపోవుట. పోపులైనవారు చనిపోకుండ ఓడకట్టబడెను గాని, వారు ఓడలోనికి రాలేదు.

మరియొక కథ ఏమనగా నీరు హెచ్చిన కొలది ఓడ పైకి పోవు చుండెను. ఓడలోని వారును పైకి పోవుచుండిరి. ఓడలోనికి రాని మనుష్యులు కర్రవలన, కత్తివలన కాదు గాని నీళ్ళ వలన చనిపోయిరి. పాపులను చంపినది ఆ నీరే. నీతిమంతులను బ్రతికించినది ఆ నీరే. ఆ నీటివలన ఓడలోని 8మంది బ్రతికిరి, ఓడ కూడ సురక్షితము.

దీనికి సాదృశ్యముగా నేటి లోకములో ఒక ప్రక్క క్రైస్తవ సంఘ మున్నది. ఈ సంఘమను నావ మనుష్యులను రక్షించుటకు ఏర్పాటాయెను. మనుష్యులు చావకుండుటకును, నరకమునకు పోకుండుటకును, సంఘము ఏర్పాటాయెను. దేవుని విరోధులు అనగా తిట్టుకొనువారు, కొట్టుకొనువారు, దోచుకొనువారును, అబద్ధము లాడువారు మోక్షమునకు వెళ్ళక నరకమునకు పోవుదురు. ఓడలోనికి వెళ్ళిన వారు చావు లేకుండ నుండి యున్నట్లు, పాపులు సంఘములోనికి వచ్చిన రక్షింపబడుదురు. చెడ్డవారైనను ఓడ ఎక్కిన యెడల బ్రతికియుందురు. అలాగే చెడ్డవారైనను సంఘములోనికి వచ్చిన యెడల వాక్యము నేర్చుకొని పాపము మానివేతురు, గనుక రక్షింపబడుదురు. ఆ కాలములోని ప్రజలు నీటిలో మునగక ముందు, పాపములో మునిగి యున్నారు. పాపములో మునిగిరి గనుక నీళ్ళలో నాశనమైరి. క్రైస్తవ సంఘములోనికి వచ్చిన వారు వాక్యము విని మారిపోవుదురు. పాపాత్ములైనను సంఘములోనికి వెళ్ళువారిని దేవుడు అపుచేయడు. అప్పుడు ఓడలోని వారు 8మంది. ఇప్పుడు క్రైస్తవ సంఘములోని వారు 400కోట్లు, అందరు రక్షింపబడరు గాని పాపములు మానివేసిన వారు మాత్రము రక్షింపబడుదురు. సంఘములో ప్రతిదినము పాపములు మానివేయుమని బోధింతురు. కావున సంఘము లోనివారు పాపములు మాని పరిశుద్ధముగా జీవించవలెను.

నోవహు ఓడ, భూమిని, చెట్లను, గుట్టలను శవములను అన్ని అడ్డులను దాటుకొనిపోయెను. అలాగే క్రైస్తవ సంఘములోనికి వచ్చినవారు

అన్నిటిని దాటి మోక్షములోనికి పోవుదురు. మరియు ఓడలోనున్న వారిని దుర్మార్గులు గాని, శవములు గాని ఏమియు చేయలేదు. ఓడ బలముగా కట్టబడెను గనుక ఊటలనుగాని, చెట్లనుగాని గుట్టలనుగాని లెక్కచేయలేదు. అలాగే క్రైస్తవ సంఘములో నున్న వారిని ఎవరు ఏమియు చేయలేరు. క్రైస్తవ సంఘము అన్ని కీడుల నుండి మనుష్యులను తప్పించుటకు ఏర్పాటాయెను. క్రైస్తవ సంఘమునకు ఎన్ని ఆటంకములు కలిగినను, ఈ రెండు వేల శతాబ్దముల నుండి ముందుకు సాగిపోవుచునేయున్నది. ఆ కాలములోనివారు చేసిన ఒక గొప్ప పాపమేమనగా నావలోనికి ప్రవేశింపకపోవుటయే; వారు పాపములు మానక పోయినను, ఓడలోనికి పోయిన యెడల బ్రతికి యుండెడివారు. ఓడపైకి లేచెను. నీరు పైకిలేచెను. పాపులు మాత్రము క్రిందికి పోయిరి. ఓడ పైకి వెళ్ళిన తర్వాత దేవుడు గాలి విసరునట్లు చేసెను, గనుక నీరు ఎండిపోయెను. నీటితోపాటు ఓడ క్రిందికి దిగెను, ఓడలోని మనుష్యులు దిగిరి. 40 దినముల జలప్రళయములో పాపములోనున్న జనులందరు చనిపోయిరి గనుక భూమి మీది పాపమంతయు నశించెను. నేల శుభ్రముగా నుండెను. అప్పుడు భూమి క్రొత్త భూమివలె నుండెను. పాత భూమి మారిపోయెను. సంఘము ప్రభువు యొక్క రాకడలో పైకి వెళ్ళిన తర్వాత ఓడ క్రిందికి దిగినట్లు, సంఘముకూడ మరల భూమిమిదికి వచ్చును. క్రీస్తు ప్రభువు మిగుల త్వరగానేవచ్చి, క్రైస్తవ సంఘమనే ఈ ఓడను మోక్షమునకు తీసికొనివెళ్ళి, మరల భూమి మీదికి వచ్చునప్పటికి భూమి శుభ్రముగా నుండును.

ఆ జల ప్రళయములో ఓడపైకి లేచిన తర్వాత భూమిమీద మనుష్యులకు శ్రమ కలిగెను. ఆలాగే ప్రభువుయొక్క రాకడలో సంఘము పైకెత్తబడగానే, భూమిమీద 7 ఏండ్ల మహా శ్రమలు కలుగును. ఈ ఏడేండ్ల శ్రమ గడిచిన తర్వాత క్రీస్తుప్రభువు పెండ్లికుమార్తె సంఘముతో వచ్చి, భూమిమీద వెయ్యేండ్లు పరిపాలన చేయును. అప్పుడు 12 మంది శిష్యులు 12 సింహాసనములపై కూర్చుండి రాజ్య పరిపాలన చేతురు. రాకడలో ఎత్తబడిన సంఘము లోనివారు అన్నిచోట్ల సువార్త పని చేయుదురు. అప్పుడు కోటానుకోట్లు జనులు క్రైస్తవ మతములోనికి చేరుదురు. క్రైస్తవ సంఘము రాకపూర్వము 2,400 సం॥లు ముందే జరిగిన ఈ ఓడ కథ క్రైస్తవ సంఘ కాలములోకూడ జరుగును. జలప్రళయములో సృష్టి

అను భయంకర సింహము పాప నరులమీద కోపగించి, ఉరుములనే గర్జన చేయుచు, వర్షమువలె మీద పడుచు రెండు దౌడలమధ్యను ఆ కాలమునాటి పాపపు ప్రజలను నమలకుండ మ్రింగివేసెను. పైదౌడ ఆకాశము, క్రింది దౌడ భూమిగా మనము సరిపోల్చుకొనవచ్చును.

అలాగే నేటి క్రైస్తవ సంఘకాలమున దేవుని మాటను సువార్త విశ్వసించి స్థిరులైనవారు; విశ్వసించని అస్థిరులైనవారు, మొత్తముగా వారినైన వీరినైనా ఎవరిని మ్రింగుదునా అని అపవాదియైన సాతాను (1 పేతురు 5:8,9) గర్జించు సింహమువలె ఎదురుచూచుచున్నాడు. గనుక క్రీస్తు యేసు రాకడకు సిద్ధపడని వారిని అనగా పాపపు బ్రతుకు విడువని వారికి, నోవహు కాలపు జలప్రళయ తీర్పు శిక్ష విధింపువంటిదైన, ఏడేండ్ల మహాశ్రమలు కలుగును. అట్టి మహాశ్రమల కాలమునకు మనము ఉండకుండా, ఈ భూమిపై ఉన్నప్పుడే క్రైస్తవ సంఘమనే ఓడలో చేరి, పెండ్లి కుమార్తెగా సిద్ధపడి ఆయన మేఘముపై వచ్చినప్పుడు, ఆయన చెంతకు చేరుదుముగాక! ఆమేన్.

## తొమ్మిదవ సందేశము

# నోవహు ఓడ - క్రైస్తవ మతము

***ఆది. 6:13-14; యోహా. 25; హెబ్రీ. 11:6-7***

**"చితిసారకపు మానుతో నీకొరకు ఓడను చేసికొనుము. అరలుపెట్టి ఆ ఓడను చేసి లోపటను వెలుపటను దానికి కీలు పూయవలెను." ఆది. 6:13-14.**

**నోవహు చేసిన బోధ:-** ప్రళయము వచ్చును. ఓడలోనికి రండి, పాపములు మానివేయండి. ఇంకా పాపము చేసిన వరద వచ్చి మ్రింగివేయును. దేవుడు గోఫెరు కర్రతో (తెలుగులో "చితిసారకపు మ్రాను") ఓడ కట్టుమని చెప్పెను. ఆర్మేనియా దేశములో ఆ కర్రగలదు. అది గట్టిది, విరిగిపోదు. పుచ్చిపోదు, పురుగుపట్టదు. దానిమీద కీలుకూడ పూసెను. 'దేవుడు చెప్పినట్లు చేసిన ఆయన', అది నోవహుయొక్క బిరుదు. రైతు చెప్పినట్లు పాలేర్లు చేయవలెను. తండ్రులు చెప్పినట్లు పిల్లలు చేయవలెను. అది మంచి బుద్ధి, ఘనమైన బుద్ధి. వీటన్నిటికన్న దేవుడు చెప్పినట్లు చేయుట ఎక్కువ, గనుక మనందరికి ఆ బిరుదు రావలెను. అప్పుడు మేలు కలుగును. చెప్పినట్లు చేయు పిల్లలను చూచినప్పుడు ముద్దు వచ్చును. అట్లే దేవుడు చెప్పినట్లు చేసిన దైవ ప్రేమ కలుగును. దేవుడు ఇంకొక పని చేసెను. పక్షులకు, జంతువులకు, ప్రాకు పురుగులకు మీరు ఫలాని ఓడలోనికి వెళ్ళవలెనని చెప్పెను. వాటి మనసులో దేవుడు ఆలోచన కలిగించగా అవి ఓడలోనికి వచ్చెను. పక్షులు, జంతువులు, పురుగులు కలసి జీవరాసులు అనబడును. ఈ జీవరాసులు దేవుడు చెప్పినట్లు చేసెను. ఓడలోనికి వెళ్ళిన వారు ఎనిమిది మంది. ఒక్కమాటలో 1) నోవహు, 2) అతని కుటుంబము, 3) జీవరాసులు. ఈ మూడు గుంపులు దేవుడు చెప్పినట్లు చేసెను. నోవహు దేవుడు చెప్పినట్లు ఓడ కట్టెను. నోవహు కుటుంబము అంతా ఓడలోనికి వెళ్ళెను. జీవరాసులు కూడ ఓడలోనికి వెళ్ళెను. ఈ మూడు గుంపులను 'దైవ మతస్థులు' అని చెప్పవచ్చును. దేవుడు చెప్పినట్లు చేసిరి గనుక వీరు దైవమతము గలవారు.

ఈ కథ దేవుని గ్రంథమగు బైబిలులో గలదు. దేవుడు చెప్పిన మాటలు అందులో గలవు. ఈ కథ బైబిలులోనిదే. దీనిలో ఇంకొక కథ కలదు. యేసుప్రభువు ఒక ఇంటికి పెండ్లికి వెళ్ళెను. అక్కడ ఆయన తల్లియైన మరియ నీళ్ళు మోయువారితో ఒక మాట చెప్పెను. 'యేసుక్రీస్తు

మీకు ఏమి చెప్పునో అది చేయండి' అని చెప్పెను (యోహాను 2:5). బైబిలు మిషను ఇదే "మూలవాక్యము కలిగియున్నది. ఆ నీరు మోయువారు ప్రభువు చెప్పినట్లు చేయగా పెండ్లి విందులోని అక్కర తీరెను. అలాగే నోవహు దేవుడు చెప్పినట్లు చేయగా వారికి రక్షణ కలిగెను. ఓడలోనికి వెళ్ళిన వారు రెండు గుంపులు 1) మనుష్యులు, 2) జీవరాసులు. మనుష్యులందరు దేవుడు చెప్పినట్లుగా చేయ లేదు. జీవరాసులన్నియు రాలేదు. దేవుడు ఏ జీవరాసులకు చెప్పెనో అవే వచ్చెను. రక్షించుటకు అక్కడ ఓడ గలదు. ఇప్పుడు ఇక్కడ సంఘము ఉన్నది. అక్కడ ఓడ సిద్ధముగా నున్నది గనుక ప్రవేశించినవారు వారు రక్షింపబడిరి. అలాగే ఇప్పుడు సంఘము సిద్ధముగా నున్నది. అప్పుడు ఎనమండుగురే గలరు. గాని ఇప్పుడు కోటానుకోట్లు ఉన్నారు గనుక ఇదే గొప్పది. దేవుడు వాటి మనసులో ఆజ్ఞ పుట్టించగా, జీవరాసులు ఓడలోనికి వచ్చెను. ఉదా:- ఇంకా కొంచెము సేపటికి భూకంపము వచ్చుననగా పక్షులకు తెలియును. అప్పుడు పక్షులు ఇండ్ల దగ్గరకు, మనుష్యులున్న చోటికి వెళ్ళును. జంతువులు, పశువులు కట్టుగర్రల నుండి లాగుకొనును. అప్పుడు కూడా అలాగే జరిగియుండ వచ్చును. జీవరాసులు దేవునిమాట వినెనుగాని, మనుష్యులు వినలేదు. కోటానుకోట్ల జనులు రాలేదు. ఈ పాఠములో జంతువులు దేవుని మాట వినెను గనుక మనుష్యులకన్న జంతువులే గొప్పవి.

ఆ ఓడ అందరికి కట్టబడెను గాని ఒక్క నోవహు కుటుంబమే అందు ప్రవేశించెను. నేటికాలమున క్రైస్తవ మతము కూడ అందరికొరకు ఏర్పాటు చేయబడెను. జీవరాసులన్నియు ఓడలోనికి వచ్చినట్లు అన్ని కులముల వారు క్రైస్తవ మతములోనికి వచ్చు చున్నారు. ముందుకు సంఘమను ఓడ వచ్చునని దేవునికి తెలియును. గనుక దేవుడు నావకథ జరుగనిచ్చెను. ఈ రెంటికిని అనగా ఓడకు, క్రైస్తవ సంఘ మునకు ఒకటే పిలుపు "రండి" అని రెండూ చెప్పుచున్నవి. క్రైస్తవమతము అన్ని కాలములకు, అన్ని దేశములకు, అందరికొరకు ఏర్పాటు చేయబడిన మతము. నోవహు ఓడ కట్టించి, తన కుటుంబమును రక్షించుకొనెను. నశించు వారు రెండు గుంపులవారు. అక్కడ ఓడలోనికి రానివారు, ఇక్కడ సంఘములోనికి రానివారు. క్రైస్తవ మతము సార్వత్రిక మతము. అందరిని చేర్చుకొను మతము. అయితే మతములోనికి వచ్చిన తర్వాత అన్ని విషయములు నేర్చుకొందురు.

బడిపెట్టి నేర్పించని యెడల పిల్లలందరు పై తరగతిలోనికి వెళ్ళరు. వారు పాసు కాకపోతే పంతులుగారు ఏమిచేస్తారు. ఓడలోనికి రాకపోతే నోవహు ఏమిచేస్తాడు? ఆలాగే సంఘములోనికి రానివారిని మనమేమి చేస్తాము! ఆ కాలములో జరిగినట్లు ఈ కాలములో కూడ జరుగును. నోవహు కాలములో లోకము ఎలాగున్నదో లోకాంతమందుకూడ ఆలాగే యుండునని యేసుప్రభువు చెప్పెను. మత్తయి. 24:38; లూకా 17:26. అప్పుడు నోవహు చెప్పిన బోధ వినలేదు. ఇప్పుడుకూడ ప్రజలు బోధ వినరు. ప్రభువు రాకడ సమయములోకూడ నోవహు కాలములో జరిగినట్లు పరిస్థితులు ఉండును. జలప్రళయము వచ్చునని చెప్పిన తర్వాత కొందరు పొలమునకు వెళ్ళిరి, కొందరు మేడలు కట్టుచుండిరి. కొందరు పెండ్లిండ్లు చేయుచుండిరి. కొందరు తినుచుండిరి. నోవహు చెప్పినను వారు ఓడలోనికి రాలేదు. తెలివిగల వారైన తన కుటుంబీకులే వచ్చిరి. మిగతావారు నిర్లక్ష్యము చేసిరి. వారు వారి పనులమీద నుండగా, తుఫాను తన పనిమీద నుండి వారందరిని నాశనము చేసెను. ప్రభువు వచ్చు ఈ కాలములోకూడ పాపము చేయవద్దు అని బోధించినను ప్రజలు మానరు. చివరకు నాశనములోనికి పోవుదురు. నోవహు కాలములో జరిగినవన్నియు ఇప్పుడు జరుగుచున్నవి. గనుక యేసుప్రభువు వచ్చువేళ కూడ అయినది. అందుకే పాపాలు ఎక్కువ, జబ్బులు ఎక్కువ, కంగారు ఎక్కువ. అన్ని దుష్టస్థితిగతులు ఎక్కువాయెను. నోవహు కాలములో అతిక్రమము విస్తరించెను, గనుక వరద వచ్చెను.

ఈ కాలములో ఇవన్ని జరుగుచున్నవి గనుక క్రీస్తుప్రభువు వచ్చువేళ అయినది. ఆయన వచ్చి తన్ను నమ్మినవారిని తీసికొనిపోవును. ముందు పాపము వచ్చెను. దానినిబట్టి శిక్ష వచ్చెను. ఇప్పుడు ప్రతిచోట పాపమున్నది. గనుక నాశనము సమీపముగా నున్నది. రాకడ కూడ సమీపముగా నున్నది. 1634 సం॥లో భూకంపము వచ్చునని శాస్త్రజ్ఞులు తెలియజేయగా అందరు వారిని వేళాకోళము చేసిరి, ఇది గ్రహించి వినిన కొందరు తప్పించుకొన్నారు. వేళాకోళము, హేళనచేసి అక్కడ ఉన్నవారు చనిపోయిరి. గవర్నమెంటువారు ఆ చోటును త్రవ్విచూడగా 18 దినములు తర్వాత బ్రతికిన ఒక మనిషి కనబడెను. అతని రెండు ప్రక్కల మంటి గడ్డలు వంటివి ఉండెను. పైనగడ్డ క్రిందిగడ్డ మధ్య ఆ మనిషి ఉండెను గనుక బ్రతికి ఉన్నాడు. త్వరలోనే ఇట్టి నాశనము రానైయున్నది. గనుక త్వరగా రానున్న యేసు అను కీర్తన పాడుచు, పాపము విడిచిన నాశనము తప్పించుకొందుము. రాకడకు సిద్ధపడు కృప ప్రభువు మనకు అనుగ్రహించును గాక! ఆమేన్.

## పదియవ సందేశము

# రాకడ దిద్దుబాటు పండుగ

***దా. కీర్తనలు 50:16,22; యోహాను. 13:21,35, 1తిమోతి. 4:11,16***

**అర్ధరాత్రివేళ– ఇదిగో, పెండ్లికుమారుడు, అతనిని ఎదుర్కొన రండి అను కనబడెను. అప్పుడు ఆ కన్యకలందరు లేచి తమ దివిటీలను చక్కపరచిరి గాని" మత్త. 25:6,7.**

***కీర్తన: షారోను మైదానముతో సమమైన మైదానంబు = ఏరాజ్యమందు లేదు ఎంది చూడగా ॥షారోను॥***

ప్రియ విశ్వాసులారా! ఇది రాకడ కాలము గనుక రాకడ విశ్వాసులైన మీకు రాకడ ఆనందము గలదు. ఆ రాకడ ఆనందమే రాకడ పండుగ. నా ప్రభువు త్వరలో వచ్చును. నేను చావనే చావను. ఆకాశము వీధులలోనికి నా ప్రియుడు నేడే వచ్చును. నన్ను ఎత్తుకొనిపోవును. నేను ఆయన కలిసి మెలసి విందులో ఉందుము. నేను అందులోనుందును. ఆయన విందులోను ఉందును. ఆయనతో సదాకాలము ఉందును. రాజునై ఏలుచుందును అని నీవెంత మురుచుకొనుచున్నావో అదియే హృదయానందము. దానిని కన్నులారా చూతుము. ఆ కళలే పాటలతో, ప్రార్ధనలతో, ప్రసంగములతో, సంఘములతో కన్నులారా చూచుచుంటిమి. గనుక అది కన్నులపండుగ. ఇన్ని పండుగలతో కూడినదే రాకడ పండుగ. ఎత్తబడిన తరువాత ఏడేండ్ల శ్రమలలో ఎవరైన లేతురా? గనుక ఇది మన రాకడ పండుగ. ఈ పండుగ కన్నుల పండుగకాకుండ (అనగా నామకార్ధముగాకాక సంఘములతో ఏదైన భంగము కలిగించునది కలదేమో అని దానిని చక్కపర్చుకొనవలెను. రాకడ కేక వినగానే కన్యకలందరు రాకడ ఆనందముతో తమ్మును తాము చక్కపరచుకొనిరి; దీనిపేరే దిద్దుబాటు. వారు అది ఆనందముతో చేసిరి. గనుక అదే దిద్దుబాటు పండుగ. ఒకప్పుడు మన పెద్దలు దిద్దునప్పుడు మనకెంతో బాధ కలిగినది. ఏడ్పులతోనే ఇష్టము లేకపోయినా కష్టమైన తప్పనిసరిగా దిద్దుకొంటిమి. అది దిద్దుబాటుగాని, దిద్దుబాటు పండుగకాదు. ఇప్పుడు తప్పు ఉంటే చెప్పండి. సంతోషముతో దిద్దుకుంటాను అని అంటున్నావు. దిద్దుకొనే ఆనందము నీకు గలదు. గనుకనే ఇది దిద్దుబాటు పండుగ. పెద్దలు గద్దింపులు తైలాభిషేకము (ఆశీర్వాదము) లనుకొన్నావు. బుద్ధి చెప్పేవాడు గ్రుద్దితేమిరా (గద్దిస్తే ఏమిలే) అనుకున్నావు. అప్పుడే నీ మూర్ఖత వదిలి ఇంకా జ్ఞాన వివేకాదులను సంపాదించుకొన్నావు.

ఈ రాకడ కేకలు విని కన్యకలవలె ఉషారుగా లేచి చక్కపర్చుకోదలచుకొన్నావు. గనుక ఇది నీకు రాకడ దిద్దుబాటు పండుగేగదా! నాతాను ఉపదేశమును అంగీకరించి మారుమనస్సు పొందిన దావీదువలె, పందులమధ్య పరుండిన కుమారునికి బుద్ధి వచ్చినట్లే, నీవును తండ్రియొద్దకురాగా తప్పిపోయిన ఆ కుమారునికి ఎంత దిద్దుబాటు విందు జరిగినదో అట్లే ఈ దిద్దుబాటు పండుగ నీకెంతో ఆనందము.

క్రైస్తవ సంఘమునకు అక్టోబరు 31వ తేదీన దిద్దుబాటు పండుగ జరిగినది. ఆ రోజున మహా సంస్కరణకర్త లూథరు నిలువబడి సంఘ దిద్దుబాటు జరిగించినాడు. మనకు కూడ అక్టోబరు 31వ తేదీన సంస్కరణ జరిగినది (1946సం॥ము) అప్పటి నుండి ఏడు సంవత్సరములు రాజమండ్రిలో జరిగించితిమి, నేటికి మిషను వృద్ధి అయినది గనుక ప్రతివారు తమ స్వంత సంఘ ములలో ఈ రాక కాలంలో దిద్దుకొనుటకు రాకడ విశ్వాసులమైన మనకిది రాకడ దిద్దుబాటు పండుగ.

దేవుడు, దిద్దుకొనుటకు సౌలుకు 38 సం॥లు ఇచ్చినను దిద్దుకొనక నశించి సింహాసనము, రాజ్యము, మేడలు పరులకు అప్పగించెను. దేవుడు అడిగినను ఆదాము చెడుగును తీసికొనలేదు. పాపమును దాచుకొనెను. గనుక ఆదాము దేవుని సన్నిధినుండి తీసివేయబడెను. కయీనుకూడ చెడుగును తీసివేసికొనలేదు. గనుక తాను దేవుని సన్నిధినుండి తీసివేయబడెను. యెహోషువ అడిగినను ఆకాను ఒప్పుకొనలేదు గనుక సమాజములోనుండి తీసివేయబడెను. ఎలీషా అడిగినను గెహాజీ దాచుకొన్నాడు ఒప్పుకొనలేదు. గనుక శిక్ష తెచ్చు కొనెను. యేసుప్రభువు స్వయముగా గద్దించినను యూదా మనస్సు మార్చు కొనలేదు. గనుక సింహాసనాధికారము పోగొట్టుకొనెను. సంఘకాలములో పరిశుద్ధాత్మ పూర్ణుడైన పేతురు గద్దింపును లెక్కచేయని అననీయ సప్పీరాలు నశించిరి.

ఈ రాకడ దిద్దుబాటు పండుగ తరుణములో సంఘములన్నియు దిద్దుకొని కన్యలవలె చక్కపర్చుకొని, పెండ్లికుమారునితోపాటు మనమును పెండ్లి విందులోనివి కలిగియుందుము గాక! ప్రభువు తన ఆశీర్వాదము రాకడ ఆనందము మీకు అనుగ్రహించును గాక! ఆమేన్.

నానా వర్ణాల పువ్వుల్ నరదృష్టి నాకర్షించును – మానవ శుద్ధి ప్రభుని మది నాకర్షించున్ ॥షారోను॥

---

**28-10-1953 సం॥లో దేవదాసు అయ్యగారు చేసిన ప్రసంగము.**

## పదకొండవ సందేశము

# మోక్షబోధ కలిగిన ఓడ

***ఆది. 6:13-22; యోహా. 14:6; రోమా. 2:5-9***

**"విశ్వాసమునుబట్టి నోవహు అదివరకు చూడని సంగతులను గూర్చి దేవునిచేత హెచ్చరింపబడి భయభక్తులు గలవాడై తన ఇంటివారి రక్షణ కొరకు ఒక ఓడను సిద్ధముచేసెను." హెబ్రీ. 11:7**

ప్రియులారా! దేవునివాక్య బోధ వినునప్పుడు మనోనిదానము కలిగి యుండవలెను. క్రీస్తు ప్రభువును నమ్మువారు తూలిపోరు. తోమాకు అనుమానము అను గాలితుఫాను, లోతు భార్యకు సంసారమను గాలితుఫాను కలిగెను. కాని నోవహు కాలములోనిది నిజమైన గాలితుఫాను. నోవహును దేవుడు ఏర్పరచుకొని రెండు సంగతులు చెప్పెను. (1) జల ప్రళయము వచ్చును. అందరు చనిపోవుదురు, జీవరాసులన్నియు చనిపోవును. (2) ఎవ్వరును మునిగి చనిపోవనక్కరలేదు. ప్రళయము రాకముందు, 'ఓడలోనికి రండి' అని దేవుడు చెప్పెను. నోవహు ఈ వార్త ప్రజలందరికి వినిపించెను.

నోవహు ఓడ కట్టించుచున్నాడు, బోధ చేయుచున్నాడు. ఆయన చేసిన బోధ – 'గాలివాన వచ్చును, నావలోనికి వచ్చిన బ్రతుకుదురు'. అప్పటికాల ప్రజలు ఈ మాటలు విన్నారుగాని నమ్మలేదు. ముసలివాడు ఏదో చెప్పుచున్నాడుగాని వానిమాటలు నమ్మరాదు. వచ్చినా అంత పెద్ద వర్షము వచ్చునా? రాదు. ఒకవేళ అంత పెద్ద వర్షము వచ్చిన చెట్లు ఎక్కవచ్చును అని వారు నోవహు బోధకు లోబడలేదు. వారు ఆయనయొద్దకు రాలేదు. అయిననూ, ఆయనే వారిదగ్గరకు పోయెను. వారియొక్క చెవులలో నోవహు వర్తమానము పడెనుగాని, వారి హృదయములలో పడలేదు. ఇప్పుడును సంఘములోనికి రమ్మంటే అట్టిమాటలే అనుచున్నారు. రమ్మని చెప్పినప్పుడు రానంటే ఏమి చేయవలెను. వారు రాకపోతే నోవహు, నిలబడవలెనా? వర్షము వచ్చువరకు. ఆలాగున్నయెడల నోవహుకూడ మునిగిపోవును. 120 సం॥లు నోవహు చెప్పెను, గాని వారు వినలేదు. వినకపోగా నీవు బ్రతుకుదువా! మేము నశించిపోతామా! అని ఎదిరించిరి. దేవుడు నోవహుతో ఇంకా 7

దినములకు జలప్రళయము వచ్చునని చెప్పెను. గనుక ఏడవదినమున ఓడలోనికి పోవుటకు నోవహు సిద్ధపడుచుండెను. తర్వాత ఎవ్వరును ఓడలోనికి పోవుటకు వీలులేదు. ఆ కాల ప్రజలు 120 సం॥లు వినకపోయిననూ 7 రోజులలోనైన వింటే బ్రతికియుందురు. ప్రజలందరు చూచుచుండగా అన్నియు ఓడలోనికి పోవుచున్నవి. పక్షులు, జంతువులు, జీవరాసులు మగది, ఆడది. జతలుజతలుగా ఓడలో ప్రవేశించుట వారందరు చూచిరి. అన్ని ఓడలో ప్రవేశించెనుగాని మనుష్యులే మిగిలిరి. అప్పుడు వచ్చిననూ ఆయన రానిచ్చును, గాని వారు నవ్వి హేళనచేసిరి. జలప్రళయము ఏమిరాదు, ఆయనకు పిచ్చిపట్టినదనిరి. దేవుడు 120 సం॥లు కనిపెట్టెను, 7 దినములుకూడ కనిపెట్టెను గాని వారిలో ఎవరును రాలేదు. పశువులు, పక్షులు, జీవరాసులు, నోవహు కుటుంబము ఎనమండుగురు ఓడలో ప్రవేశించిరి. మిగతా వారికి శిక్షరావలెను, జలప్రళయము రావలెను. గనుక దేవుడు ఓడ తలుపు బిగించెను. తలుపు వేసిన తర్వాత ఎవరైన వచ్చినను లాభములేదు. దేవుడు ప్రవేశించి తలుపు బిగించెను. ఓడలోపల జీవరాసులు, నోవహు కుటుంబము, సామానులు, ఆహారము మరియు ప్రభువుకూడ వారితో నుండెను. ప్రభువే తలుపు వేసెను. వారికి భయమున్నదా? ప్రభువు వారితో లోపల ఉన్నాడు గనుక భయములేదు. తలుపువేసిన వెంటనే గాలివాన వచ్చెను.

ఆది. 19:10లో దూతలు లోతును లోపలికిలాగి తలుపు బిగించగానే బయటనున్న వారి కన్నులు గ్రుడ్డివాయెను. తలుపు వేయబడగా శ్రమ తప్పదు. తరువాత గాలివాన వచ్చినది. కొందరు ఇండ్లపైకి, తర్వాత చెట్లమీదికి, తర్వాత కొండలమీదికి వెళ్ళిరి. నీరుకూడ పొంగి, వీటన్నిటిని ముంచివేసెను. ఇంకెక్కడికి వెళ్ళగలరు, ఈదుకొని వెళ్ళినారు. కడకు అందరు చనిపోయిరి. జలప్రళయము వచ్చువరకు వారు ఎందులో మునిగియున్నారు? పాపములో మునిగియున్నారు. గనుక 'ఈ వేళ మునిగిపోయినను పరవాలేదు' అనే అజ్ఞానములో వారు మునిగిపోయిరి. అవిధేయత, అపనమ్మిక, హేళనచేయుట వీటన్నిటిలో వారు మునిగిపోయిరి. వారు మునుగుటకు ఒప్పుకొన్నారుగాని బ్రతుకుటకు ఒప్పు కొనలేదు. అటువంటివారు మన కాలములోనున్నారా? ఉన్నారు. ఈనాడు ప్రజలకుకూడ రండి అని బోధకులు చెప్పుచున్నారు. కాని ఎందరు వస్తున్నారు.

"ప్రయాసపడి భారము మోసికొనుచున్న సమస్త జనులారా నా యొద్దకు రండి" (మత్త. 11:28) అని ప్రభువు పిలుచుచున్నాడు. నోవహు ఓడలోనికి అందరిని రమ్మని పిలుచుచున్నట్లు ప్రభువు పిలుచుచున్నాడు, బోధకులుకూడ పిలుచుచున్నారు. 1. ఆలయము లోనికి రండి. 2. బైబిలులోనికి రండి. 3. మతములోనికి రండి. 4. మోక్షములోనికి రండి. ఆలయములోనికి వచ్చిన బైబిలులోనికి రాగలరు. బైబిలులోనికి వచ్చిన మతములోనికి రాగలరు. మతములోనికి వచ్చిన మోక్షము లోనికి రాగలరు. క్రైస్తవ ఆలయములో దేవుని మాటలు చెప్పుదురు. పాపము మాని క్రీస్తులోనికి రండి అని చెప్పుదురు. క్రైస్తవ మతమే మోక్షమునకు నడిపించు ఓడ. క్రైస్తవ ఆలయమునకు వచ్చిన యెడల బోధలోనికి వత్తురు. బోధనచ్చితే మతములోనికి వస్తారు. మతములోనికి వచ్చిన మోక్షములోనికి వెళ్తారు. మతములోనికి వచ్చిన తర్వాత మోక్షము చేరకముందు ఇంకొకటి గలదు. ఇహలోక జీవితములో అనేక కష్టములు వచ్చును. ఈ కష్టములన్నియు సహించిన తర్వాత మోక్షము. ఓడలోనికి వచ్చిన ఎనమండుగురిలో హాము మంచివాడు కాడు. అతను వచ్చినందుకు దేవుడేమియు అనలేదు. అలాగే చెడ్డవారు మతములోనికి వచ్చిన యెడల దేవుడు వారినేమియు అనడు.

మోక్షమునకు వెళ్ళువారు రెండు భాగములు: (1) నూతన యెరూషలేమునకు వెళ్ళువారు, అక్కడ ప్రభువుయొక్క సింహాసనము ఉ ండును. మతములోనికి వచ్చిన తర్వాత మేఘము వచ్చును. ఎక్కువ భక్తిగలవారు ఈ మహిమ మేఘమెక్కి నూతన యెరూషలేము వెళ్తారు. (2) ఆ తర్వాత మిగిలిన క్రైస్తవులు రక్షితుల మోక్షములోనికి వెళ్ళుదురు. ఆ కాలములో ఓడలోనికి పశువులు వెళ్ళెనుగాని మనుష్యులు వెళ్ళలేదు. ఎంత విచారము! జీవరాసు లన్నిటికన్న తెలివిగల "మనిషి" ఓడలోనికి రాలేదు. ఓడలోనికి వస్తారా? వెలుపల ఉండిపోతారా? ఇది నోవహు బోధ. అలాగే క్రైస్తవ బోధకులుకూడ– క్రైస్తవ సంఘములోనికి వస్తారా? బయట ఉంటారా? అని అడుగుచున్నారు. సంఘములోనికి వచ్చిన యెడల రక్షణ, సంఘమునకు వెలుపలనున్న యెడల శిక్ష వచ్చును. క్రైస్తవ సంఘములోనికి వచ్చునట్టి కృప ప్రభువు మీకు దయచేయును గాక! ఆమేన్.

## పన్నెండవ సందేశము

# నోవహునావ-పెండ్లికుమార్తె ఎత్తబడుట

**ఆది. 19:10; మత్త. 25:10-11; 1యోహాను 1:1-3**

**"అప్పుడు యెహోవా ఓడలో అతని (నోవహును) మూసివేసెను" (ఆది. 7:16)**

దేవుని మాట చొప్పున ఆయన తీర్పు దినమున జలప్రళయము భూమిమీదకి వచ్చినప్పుడు నోవహు ఓడప్రక్కన నీరు, అడుగుననీరు, పైన నీరుగలదు. ఈ లోకములో క్రైస్తవుని బ్రతుకుకూడ అలాగే యుండును. చుట్టును ఆపదలతో నిండియుండును. (1) కొన్ని ఆపదలు మనిషి తెలివి తక్కువవలన, అజ్ఞానము వలన వచ్చును. వీటిని ఓడ అడుగున నున్న నీటితో పోల్చవచ్చును. (2) మరి కొన్ని ఆపదలు ఇతరుల వలన వచ్చును. వీటిని ఓడ ప్రక్కనున్న నీటితో చెప్పవచ్చును. (3) మరికొన్ని కష్టములు పైనుండి దేవుని అనుమతి వలన కలుగును. వీటిని పైనుండి పడు జలధారకు సరిపోల్చ వచ్చును. మనకు బుద్ధి చెప్పుటకు, మనలను సరిజేయుటకు దేవుడు వీటిని రానిచ్చును.

దేవుడు నోవహును ఓడలోనికి "రమ్ము" (come) అని పిలిచి తలుపులు మూసివేసెను. అనగా దేవుడు ఆ ఓడలోనున్నాడు. అందులో ఉండి నోవహును పిలిచెను. విశ్వాసి జీవితములో కూడ బహిరంగ శరీరమునకే ప్రభువు శ్రమలు పంపించును. అంతరంగములో ప్రభువు ఉండును. గనుక విశ్వాసి భయపడడు. ప్రభువు ఆపదలను విశ్వాసి లోపలికి ప్రవేశింపనియ్యడు. గనుక విశ్వాసి భయపడనక్కరలేదు. దేవుడు మనకు అన్ని సదుపాయములిచ్చి, తుదకు రక్షణకూడ ఇచ్చినను మనుష్యునికి ఇంకను సందేహమే. మనిషి వృద్ధిలోనికి రాకపోవడమునకు కారణము భయము. ఎన్ని కష్టములున్నను ప్రభువు మన చెంతనున్నాడు' అను దృష్టి మానవుడు కలిగియుండవలెను. ఆయన లేకుండ విశ్వాసిని ఎప్పుడు ఒంటరిగా కష్టములలో నుంచడు. ఓడ లోనికి నీరు రాకపోవడమునకు కారణము ఓడకు కీలుపూసి యున్నారు. గనుక ఓడలోపల నున్న వారికి

కీడు రాలేదు. మరియు ప్రభువు వారితో నున్నారు. ఒకవేళ శరీరమునుబట్టి భయము కలుగవచ్చును గాని హానిమాత్రము ఉండదు. సొదొమలో దూతలు లోతును లోపలికి లాగి తలుపు వేసిరి. ఎందుకనగా బయట శత్రువులున్నారు. అలాగే విశ్వాసికి కష్టముండునుగాని హానిమాత్రము రాదు. మరియు పరలోకమే ఈ నావ అనికూడ చెప్పవచ్చును. భూమిమీదనున్న అవిశ్వాసులు నావకు ప్రక్కనున్న నీటితో సరిపోల్చవచ్చును. వీరు సంఘమునకు శత్రువులు, అయితే పెండ్లికుమార్తె 7సం॥ల శ్రమలు రాకముందే, ఆ శ్రమలను చూడకుండనే వెళ్ళిపోవును. ఆలాగు ప్రభువు పెండ్లికుమార్తె సంఘమును తీసికొనిపోవును. ఉదా: ఒక గ్రామములో ఇంకను రెండు లేక మూడు దినములకు కలహము వచ్చునని తెలిసి ఆడపిల్ల తండ్రి తన బిడ్డ కలహములలో పడకుండ తీసికొనిపోయెను. అలాగే 7 ఏండ్లు శ్రమలలో పడకుండ ప్రభువు సంఘమును తీసికొని వెళ్ళును. ఓడ అరారాతు కొండపైకి వెళ్ళి క్రిందికి దిగినరీతిగా, పెండ్లికుమార్తె ఎత్తబడి, నూతన యెరూషలేములో ఏడేండ్లు విందులోనుండి తర్వాత క్రీస్తు ప్రభువు యొక్క వెయ్యేండ్ల పాలనలో బోధ చేయుటకు భూమిమీదికి వచ్చును.

నోవహు 120 సం॥లు ఓడను కట్టుటలోను, దేవునిగూర్చి ఇతరులకు చెప్పుటలోను ఉండెను. దేవుడు 120 సం॥లు ఎందుకిచ్చెననగా, ప్రజలు మారుమనస్సు పొందుటకు మాత్రమేకాక నోవహు బాగుగా సిద్ధపడుటకును, గొప్ప విశ్వాసిగా తయారగుటకును ఇచ్చెను. ఆలాగుననే ఇతరుల మారుమనస్సు నిమిత్తమే కాక పెండ్లికుమార్తె బాగుగా సిద్ధపడు నిమిత్తము కూడ ప్రభువు తన రెండవ రాకడ ఆలస్యము చేయుచున్నాడు 2 పేతురు 3:9. నోవహు విశ్వాసియైనను మరింత బలపడుటకు గడువిచ్చెను. అలాగే పెండ్లికుమార్తె సంఘ విషయముకూడ జరుగుచున్నది.

నోవహు నీతిపరుడు, నిందారహితుడు, దేవునితో నడచినవాడు. (ఆది. 6:9). ఒక మనిషినిగూర్చి మనమేమి అడుగుదుము. అతను ఎవరు? ఏమి పనిచేయుచున్నాడు? అతడెటువంటివాడు? అని అడుగుదుము. దేవుడు లోకమంతయు పారజూచెను. ఒక్కడయినను మంచివాడు కనబడలేదు. ఒక్క నోవహు మాత్రము నీతిపరుడైయుండెను. దేవుడు ఏదైన గొప్పపని

చేయించుటకు ఒక మంచివానిని ఏర్పరచుకొనును, గాని ఒక్కొక్కప్పుడు చెడ్డవారినికూడ ఆయన ఏర్పరచుకొనును. ఎందుకనగా ఆ గొప్పపని అతనిమీద పెట్టినప్పుడే అతడు మార్పు చెంది మంచివానిగా మారునని.

నోవహు నీతిపరుడు, ఎక్కడ? తన ఎదుట తాను నీతిపరుడు. తన మనస్సాక్షి ఎదుట నీతిపరుడు. ఉదా:- ఒక దొరగారి దగ్గరనున్న బంట్రోతు బల్లమీదనున్న రూ.200లు దొంగిలించెను. ఆ బంట్రోతునకు రాత్రంతయు నిద్రపట్టలేదు. అతనిలో ఇద్దరు మాట్లాడుచుండిరి. ఒకరు 'ఆ సొమ్ము ఇచ్చి వేయుము' అని, ఇంకొకడు 'వద్దు' అని, అతడు మరుసటి ఉదయమున ఆ సొమ్ము దొరగారికి ఇచ్చివేసెను. అప్పుడు అతని లోపల కలహముకూడా ఆగిపోయెను. మనసులో నెమ్మది కలిగెను. **ఏ విశ్వాసియొక్క మనస్సాక్షి తన్ను గద్దించుటకు సందులేదో అట్టివారే ఎత్తబడే గుంపులో నుందురు.** అనగా తన మనస్సాక్షికూడ తన్ను గద్దింపకుండు స్థితి ఎవరికున్నదో వారే పెండ్లికుమార్తె సంఘములోని వారైయుందురు. రెండవరాకడలోని వారు తమ స్వంత మనస్సాక్షి కూడ గద్దించలేనంత పవిత్రమైన స్థితిలో నుందురు. నోవహు తన మనస్సాక్షి యెదుట నీతిమంతుడు, మనుష్యుల యెదుట నీతిమంతుడు, దేవునియెదుట నీతిమంతుడు. దేవుడు నోవహుతో 'ఈ తరములో నీవే నీతిమంతుడవని' చెప్పెను. ఇట్టిస్థితి చదువరులు కలిగియుండు దీవెన ప్రభువు అనుగ్రహించును గాక! ఆమేన్.

## పదమూడవ సందేశము

# ప్రత్యేకమైన ఏర్పాటు జనము

*దా. కీర్త. 71:14; లూకా. 2:28-32; 1పేతు. 2:9-10.*

**"నేను ఎల్లప్పుడు నిరీక్షింతును నేను మరి యెక్కువగా నిన్ను కీర్తింతును కీర్తన. 71:14.**

రక్షణాపేక్ష ప్రియులారా! 'మరి యెక్కువ' అనేమాట సామాన్యముగా చెప్పే 'ఎక్కువ' అనేమాటకంటె అధికమై యున్నది. భక్తులలో సామాన్యమైన స్తుతిచేసేవారు కలరు. భక్తులలో సామాన్యమైన స్తుతికి మించిన స్తుతిచేసేవారు కలరు. వీరే ప్రత్యేక జనాంగము. 'నా గొప్పతనమును వృద్ధి చేయుము' అని దావీదు ప్రార్థించెను. గొప్పతనమనునది సామాన్యమైన స్థితి. ఈ కవి అది అనుభవించి తృప్తిపడి, ఇంకా ఎక్కువ గొప్పతనమును కోరుచున్నాడు. ఈయన సామాన్య జనులతో కూర్చుండి గొప్పతనము సంపాదించెను. అది చాలక వృద్ధి కోరుకొనుచున్నాడు. గనుక ఇతడు ప్రత్యేకమైన ఏర్పాటులో ఉన్న వ్యక్తి ఏర్పాటులో ఉన్నవారుకాక, ప్రత్యేకమైన ఏర్పాటులో ఉండగోరేవారు ఎక్కువగా స్తుతింతురు, గొప్ప తనముయొక్క వృద్ధిని కోరుకొందురు.

క్రీస్తుప్రభువు రాకముందు ఆయన వస్తాడని పాతనిబంధనలో వ్రాయబడియున్నది. అప్పటికి భూలోక భక్తులు ఉన్నారు. ఆయా ఉద్యోగములకు ఏర్పర్చబడినవారు ఉన్నారు. ప్రజలను తాత్కాలిక విపత్తులనుండి తప్పించిన రక్షకులున్నారు. హతసాక్షియైన హేబెలు ఉండగా, ఆరోహణమైన హానోకు ఉండగా, జలప్రళయమునుండి రక్షించిన నోవహు ఉండగా, ఏర్పాటు జనము వచ్చేటందుకు షేము ఉండగా, విశ్వాసులకు జనకుడైన అబ్రాహాము ఉండగా, దహనబలికి ఒప్పుకున్న ఇస్సాకు ఉండగా, అన్ని ప్రక్కలనుండి అరిసెలు అందుకొన్న పిల్లవానివలె, అన్ని ప్రక్కలనుండి ఆశీర్వాదములు అందుకున్న యాకోబు ఉండగా, యూదుల మతము ఉద్భవించుటకు కారకుడైన యూదా ఉండగా, యూదులయొక్క మత సిద్ధాంతములు వ్రాసిన మోషే ఉండగా, భూలోకములోని దైవరాజ్యము ఏలుటకు యెహోషువ, న్యాయాధిపతులు, రాజులు ఉండగా ఉజ్జీవ కూటములు ఆరంభించిన సమూయేలు ఉండగా,

రాబోయే సంగతులు చెప్పుచు, దేవునియొక్క సన్నిధిలో ఆ వాక్కులు వినే ప్రవక్తలు ఉండగా క్రీస్తు ఎందుకు? క్రీస్తు అవసరమేమున్నది? అని కొంద రందురు.

అయితే, వారందరు రక్షకులేగాని సంపూర్ణ రక్షకులుకారు. ఓబద్యా గ్రంథము చివరి వచనము "మరియు ఏశావుయొక్క కొండకు తీర్పుతీర్చుటకై సీయోనుకొండమీద రక్షకులు పుట్టుదురు అని ఉన్నది. అప్పుడు రాజ్యము యెహోవా అగును". ఓబద్యా 21వ వచనము. దీనినిబట్టి చూడగా, గర్వించి జ్యేష్టత్వమును తృణీకరించి, తమ్మునియొక్క దీవెనను అపహరింపగోరిన ఏశావుయొక్క సంతానము శేయీరు దేశములో బహుగా విస్తరించెను. విస్తరింపు అనగా కొండ ఎక్కుట, వారు కొండ ఎక్కిరి గనుక వారు ఎక్కిన కొండ దిగరు అనగా గర్వించెదరు. మేమే గొప్ప వారము, మా తమ్ముని సంతానముకంటె మేమే గొప్పవారమని; మా తండ్రి, తమ్ముని యొక్క గొప్పతనములకంటె మేమే గొప్పవాళ్లమని అతిశయించిరి. కాని యేసుక్రీస్తు ఎప్పుడును అతిశయించలేదు. ఏశావుయొక్క సంతానమువారు ఎప్పుడును ఇశ్రాయేలీయులయొక్క నాశనమును కోరుకొన్నారు. పాలస్తీనాలో సీయోనుకొండ ఉన్నది. అది యాకోబుయొక్క ఆశ్రయస్థానము. అక్కడనుండి న్యాయకర్తలైనవారు, రక్షకులైన వారు లేవవలెను. వారు ఏశావునకు తీర్పు విధిస్తారు. వారిలో ఎవరైనా మార్పు చెందినవారుంటే వారు న్యాయకర్తలు, రక్షకులగుదురు. ఈ పాఠము ఓబద్యా గ్రంథములో మాత్రమేకాదు తక్కిన గ్రంథములలోకూడా మర్మముగా ఉన్నది.

ఓబద్యా 21వ వచనములో ఉన్నట్లు ఆకాలమునకు వారు తగిన రక్షకులే గాని క్రీస్తువలె సంపూర్ణ రక్షకులుకారు. క్రీస్తుకు ముంగుర్తైన రక్షకులు. ఆ రక్షకులు ప్రత్యేకమైన రక్షకులు. అలాగే యూదులు దేవుని ఏర్పాటు ప్రకారము ప్రత్యేకమైన జనాంగము. క్రీస్తు ప్రభువు ఆ వరుసనుబట్టి ప్రత్యేకమైన రక్షకుడు. లోకములోని ఆయా జనాంగములు, ఆయా మతములు తమ స్వంత రక్షకులను ఏర్పర్చుకున్నారు కాని క్రీస్తు ప్రభువును అన్ని జనాంగముల కొరకు ప్రత్యేకమైన రక్షకునిగా దేవుడు ఏర్పరచిరి. అలాగే క్రీస్తు నామమును ధరించిన క్రైస్తవ సంఘము లోకములో ఉన్న అన్ని మత సంఘములలో ప్రత్యేక సంఘము. ఇప్పుడు ఈ సంఘములో రాకడకొరకు కనిపెట్టుచున్న సంఘము ప్రత్యేక సంఘము. ఆ ప్రత్యేక

రాకడ సంఘమందు స్థిరపర్చబడుటకు, సిద్ధపడుటకు; పూర్వకాలమందు ఉన్న యెషయా మొదలగు ప్రవక్తలు దైవ సన్నిధిలో ఉండి, దేవునియొద్దనుండి జవాబులు ఎట్లు పొందినారో, అట్లే జవాబులు పొందుటకు ఈ కడవరి కాలములో భూలోకమందంతట సన్నిధి కూటములు ఏర్పాటు చేయబడవలెను. **ఇది సన్నిధి కూటములు ఆరంభ కాలము గనుక మన కూటములు ఎన్నో కోట్ల పత్రికలు ముద్రించి, పంచివేస్తే, ఆ పత్రికలు వెళ్లే ప్రతి స్థలములో సన్నిధి కూటములు ఏర్పడగలవు.** సన్నిధి కూటములు, ప్రత్యేక కూటములు గనుక ఏడుగురు ప్రత్యేక కూటస్థులతో అనగా సన్నిధి అభ్యాసమున్నవారితో ఏర్పాటు చేయవలెనని గ్రహించు కొన వలెను. వాటిని విరివిగా ఏర్పాటు చేసికొనవలెను.

హేబెలు మొదలు యూదుల వరకు ఏర్పాటు జనమైయున్నారు. ఈ ఏర్పాటు జనములోనుండి క్రీస్తుప్రభువు ప్రత్యేక రక్షకుడు అనగా ఆరోహణమైన ఏర్పాటు రక్షకుడు. ఆయననుండి సంఘము, ఆ సంఘమునుండి ప్రత్యేక సంఘము, ఆ ప్రత్యేక సంఘమునుండి రాకడసంఘము ఏర్పడెను. ఈ రాకడ సంఘము తయారగుటకు సన్నిధి కూటములు అవసరము. రక్షణ యావత్తు సన్నిధి కూటములమీద ఆధారపడియున్నది. **మనము లోకమునుండి, లోక ఆకర్షణ, లోక పద్ధతులనుండి ప్రత్యేకింపబడితేనేగాని రాకడకు వెళ్లలేము.** ప్రత్యేకింపబడుటకు సన్నిధి కూటములు ప్రత్యేకింపబడవలెను.

**ప్రార్థన:-** తండ్రీ! ప్రతి జనాంగములోనుండి నీ ప్రత్యేక జనాంగమైన సంఘములోనికి ఈ ప్రత్యేక జనాంగము లాగుకొని వస్తున్నది. ఇట్టి ప్రత్యేకశక్తి సంఘమునకు ఇచ్చినందుకు వందనములు. ఈ క్రొత్త వర్తమానము కొరకు వందనములు. మేమందరము ప్రత్యేకించుకొన్న వ్యక్తులమై ఉండునట్లు శక్తి దయచేయుము. ఈ వర్తమానము మా మీటింగులకు అందించుమని వేడుకొంటున్నాము. ఆమేన్.

## పదునాలుగవ సందేశము

# ఆటంకముల మేఘములు

***యెహెజ్కేలు 37:14; యోహాను 14:2; 2 కొరింథీ. 5:1***

**'మీకు స్థలము సిద్ధపరచ వెళ్ళుచున్నాను.' యోహా. 14:2**

**ప్రార్థన:-** యేసుప్రభువా! ఇదిగో వెళ్లుచున్నాను అని అన్నావు.. అయినప్పటికిని సదా మీ దగ్గరే ఉన్నాను అనికూడ చెప్పావు. వెళ్లడం ఒకేసారి, ఉండడము ఒకేసారి అని అనుటద్వారా నీవు దేవుడవని గ్రహించుచు నీకు వందనములు చేస్తున్నాము. ఇదిగో త్వరగా వచ్చి మిమ్ము ను తీసికొని వెళ్తాను. అని అన్నావు. కాబట్టి నీకు వందనములు. సంఘము నీ రాకడ కొరకు ముఖ్యముగా ఈ దినములలో తలంచుచు ఎదురు చూచుచున్నది. మమ్మును సిద్ధపర్చుము. నేటి వర్తమానము మాకు అనుగ్రహించుము ఆమేన్.

మనము ఎన్ని పండుగలను గురించి మీటింగులు చేసికొన్ననూ, ఎన్ని అంశములమీద ప్రత్యేక కూటములు పెట్టుకొన్ననూ, చివరకు ప్రభువు రాకడను గురించి మాట్లాడుకొనకపోతే ఫుల్‌స్టాప్ పెట్టనట్లే. ఉదయమున నిన్న చెప్పిన అంశములు ముగించలేదు. అయినప్పటికిని రాకడను గురించి రవ్వంత ఇప్పుడు వచ్చినటువంటి వర్తమానము చెప్పుదును. అది క్రొత్తది కాదు, నేను చెప్పడం క్రొత్తదిగాని సంగతి క్రొత్తది కాదు అది మీకు తెలిసినదే. అదే ఆటంకముల జాబిత: 1. ప్రార్థనకాదు గాని అది ప్రార్థనే. యేసుప్రభువా! ఇదిగో త్వరగా వస్తున్నానని చెప్పావు. ఏది? తర్వగా ఏది? 20వందల ఏండ్లు అయింది. 20 వందల 24 ఏండ్లు అయినది. అయిననూ రాకడ ఇంకా రాలేదు. 'అది త్వరగా ఎందుకయింది? అని నా గుండె కొట్టుకుంటున్నది. రాకడకు ఇది మొదటి ఆటంకము. 2. ఆ పైన ఆకాశములో, ఈ క్రింద భూమిమీద గురుతులు జరుగునని; సూచనలు, రాకడ జాడలు జరుగుతాయని చెప్పావు, అవి జరుగుతున్నాయి. గాని నీ రాకడ ఇంకా రాలేదు. మరి అయితే త్వరగా అంటే ఏమన్నమాట? నా గుండెలో చాలా అదురున్నది. గాని ఆశకూడ ఉన్నది నీవు త్వరగా రావాలని! 3. ఈ ప్రక్కను చూస్తే రాకడకు నేను సిద్ధముకాకుండా అన్నీ అడ్డాలే. ఆ

అద్దాలలో కొన్ని ఉదయానే చెప్పాను. ఆయా అంశములన్ని ఎప్పుడు ప్రార్ధన చేయాలి. అవన్నీ ఎప్పుడు నెరవేరుతాయి? సంఘములు ప్రార్ధన చేయకపోతే సంఘము సిద్ధపడేదేలాగు లోకమును సిద్ధపర్చేడమేలాగు? ఆ అంశములన్ని మనము ప్రార్ధన చేయకపోతే, మన ప్రార్ధనకు పుల్‌స్టాప్ లేదన్నమాట. అనగా ముగింపుకాలేదు. ఉదయము చెప్పిన ఆటంకములుకాక నాలోనే, లోపలకొన్ని ఆటంకములున్నవి. నాలో అనగా వరండామీద ఉన్న నాలోనే పూర్తిగా కాదు. నేనున్న సంఘములోను ఆటంకములున్నవి. 4. ఆటంకములంటే ప్రశ్నలు. ప్రభువు చెప్పినాడుగాని ఆయన ఎప్పుడో వస్తాడు. ఈ లోపల వట్టి వట్టి రాకడ ప్రార్ధనలన్ని ఎందుకు చేయాలని సంఘమంటున్నది. ఈ సంఘములో కొందరు, ఆ సంఘములో కొందరు అనేది వినగా వినగా నాకు కూడ ఆలాగే అనిపిస్తుంది. ఇదొక గొప్ప ఆటంకము. 5వ ఆటంకము ఏదంటే వెనుకకు చూడాలని. రెండువేల సం॥ములలోను అనేకమంది భక్తులు రాకడ కొరకు ఎదురుచూచి చనిపోయారు. వారివలె నేనుకూడ రాకడనిమిత్తము కనిపెట్టి, చచ్చిపోతానేమో అనే అనుమానము, భక్తులకు రాకడ భక్తులకు కలుగుచున్నది. అది గొప్ప ఆటంకము. ఈ 5 ఆటంకములుంటే రాకడకు సిద్ధపడుట ఏలాగు? ఒక ఆటంకమునకంటే ఒక ఆటంకము మరియొక ఆటంకము మించిపోయినవి. వెలుపలి ఆటంకాలే, లోపలి ఆటంకాలుకూడ ఉన్నాయి. వెలుపటి వాటికంటే, లోపటివే ఎక్కువబాధ. "వెలుపట బహు యుద్ధములు లోపటను" ఇప్పుడు చెప్పిన చిన్నపాఠము 'ఆటంకాల పాఠము'.

1. త్వరగా వస్తానన్నావు. రాలేదు
2. గురుతులు వస్తాయన్నావు. అవి వచ్చినవిగాని నీవు రాలేదు.
3. లోకములో నలువైపులా ఆటంకాలే. అయినా నీవు రాలేదు.
4. సంఘము నీవు ఎప్పుడు వస్తావు గాని ఇప్పుడు కాదంటున్నది. అయినా నీవు రాలేదు.
5. భక్తులలోని ఆటంకములు. అయినా నీవు రాలేదు.

"త్వరగా" అనేదాని అర్థము ఇంత ఆలస్యమా! గనుక ఇదంతా వట్టిదే అంటున్నారు. గనుక రాకడను గురించి చెప్పేటప్పుడు టక్కున కుదిరేటట్టు చెప్పవలెను. మళ్లీమళ్లీ ప్రశ్నలు లేకుండేటట్లు చెప్పవలెను. త్వరగా అనేది ఒక్కటే చూచుకుంటే ఏలాగు? "గురుతులు" ఒక్కటే చూస్తే ఏలాగు "లోకము" ఒక్కటే చూస్తే ఏలాగు? "సంఘము" ఒక్కటే చూస్తే ఏలాగు? వెనుకటి మృతులైన భక్తుల చరిత్ర ఒకటే చూచుకుంటే ఏలాగు? ఈ 5ను 5 మేఘములు. ఇవి నీతి సూర్యుడు అనే క్రీస్తు ప్రభువును చూడకుండా చేస్తూ ఉన్న, మన మనో నేత్రములను కప్పివేస్తున్న మేఘములు. మన ఎదుట ఉన్న ఒక వస్తువును చూడవలెనంటే ఎదుట ఉన్న తెర ఒత్తిగించుకొని చూడవలెను. అట్లే ఈ 5 తెరలు దట్టమైన మేఘములవంటివి. ఈ 5 తెరలు ఒత్తిగించుకొనిచూస్తే ప్రభువు కనబడిన యెడల మహాధైర్యానందములు కలుగును.

"త్వరగా రానున్న యేసూ" రాకడ ధ్యానముయొక్క అనుభవములు కొన్ని చెప్పుదును.

1. ముఖ్యమైన గుర్తులు అనగా 1900ల నుండి జరిగినవి కొందరు భక్తులు వ్రాసిరి. వారు గతించిరి. ఆ తరువాత 10 సం॥లలో ఏయే గుర్తులు జరిగిన మరికొందరు వ్రాసిరి. వారును చనిపోయిరి. ఈ 107సం॥లలో జరిగిన గుర్తులు వ్రాసిన వారును గతించిరి. ఇలాగు జరుగుచు వచ్చినది. ఇంగ్లీషులో Herald of His Coming అనే పత్రికలో ఈ గురుతులన్నీ వ్రాస్తారు. ఆ పత్రికాధిపతుల చేతులు ఎన్ని ఉంటాయి. ప్రతి దేశములోను రాకడను గురించి, ఆత్మ బాప్తిస్మమును గురించి ఎక్కువగా మాట్లాడుచున్నారు. ప్రాపసీ అనే చిన్న పుస్తకములో వారు జరగబోయే ఇతర సంగతులు, క్రీస్తు సంగతులు వ్రాస్తూ ఉందురు. లోకములో ఉన్న ఈ పత్రికలన్ని తెప్పించి ఆ పత్రికలోనున్న ముఖ్య సంగతులు గుర్తు పెట్టుకొని ఇస్తే, వారు వ్రాస్తారు. ఇటువంటి పత్రికలన్ని అమెరికాలో ప్రకటింపబడుచున్నవని తెలిసి మద్రాసులో ఒక కుటుంబమువారు ఈలాగు వ్రాయుటకు ఒక పత్రిక ఆరంభించిరి. తర్వాతి భవిష్యత్తులో ఈ వ్రాతలు వ్రాసేవారుండరు. రాకడను గురించి, గుర్తులను గురించి మనము చెప్పేవన్ని చిన్న చిన్న నీటి బొట్టులవంటివి (అనగా చిన్న / కొద్ది అంశములే).

ఎవరైతే కనిపెట్టుదురో వారికి రాకడ గురుతులు, రాకడ సంగతులు పూర్తిగా తెలియబడును. యేసుప్రభువునుగూర్చికూడ మనము పూర్తిగా చెప్పక పోతున్నాము. ఆ చెప్పేవికూడ నీటి బొట్టులవంటివే.

అయితే, రాకడ విశ్వాసికి అన్నీ పాటలే. ఏదిబడితే అదే పాడుదురు.

ఓ రాజా! నీ తలపే నాకు ఎంతో హాయి.
ఓ వరుడా! నీ తలపే నాకు ఎంతో హాయి
ఓ వధువా! నీ తలపే నాకు ఎంతో హాయి

**ప్రార్థన:-** త్రియేక దేవుడవైన తండ్రీ! సర్వశక్తిగల తండ్రీ! ఎన్ని కోట్లమంది ఎన్నికోట్ల మనవులు, చేసినప్పటికిని నీవు సుళువుగా నెరవేర్చగలవు. గనుక నీకు స్తోత్రములు. ఈ వరండామీద ఎన్నెన్నో కోట్లమందిలేరు. ఎన్నోకోట్ల మనవులు, ప్రార్థనలు లేవు. కొద్దిమంది కొన్ని ప్రార్థనలున్నవి. ఇవే నెర వేర్చలేవా? నెరవేర్చుతావని నమ్మితే నెరవేర్చగలవు. కొంతమందియొక్క హృదయములలో వారిని విడిచిపెట్టని పాపములు కలవు. ప్రార్థిస్తున్నారు. వాటిని వదిలించగలవు. నీకు స్తోత్రములు, ఆత్మస్థితి ఈలాగుండగా కొందరికి శరీరములో అనారోగ్యముకలదు. అది వారిని వదలిపెట్టకుండా ఉన్నది. నీవు వదిలించగలవు. నీకు స్తోత్రములు. వీరిలో కొంతమందికి కొన్ని విషయ ములలో కొదువలున్నవి. అవి వారిని వదలకుండా ఉన్నవి. కాని నీవు వదిలించగలవు. గనుక నీకు స్తోత్రములు. ఇక్కడున్న వారిలో కొంతమంది సంతానము లేదనే విచారమున్నది. అది వారిని వదలకుండా ఉన్నది. నీవు వదలించగలవు స్తోత్రములు, కొందరికి కొన్ని విషయములలో దురాత్మ పీడించు చున్నది. అది వదలకుండా ఉన్నది. నీవు వదలించగలవు స్తోత్రములు. కొందరిలో రకరకములైన చిక్కులు ఉన్నవి. అవి వారిని వదలిపెట్టడములేదు. నీవు వదిలించగలవు. కాబట్టి నీకు స్తోత్రములు. కొందరిలో తమ స్వజనుల యొక్క కష్టముల నివారణ కొరకైన ప్రార్థనలు ఉన్నవి, నెరవేరనివి ఉన్నవి. అవి వారిని పీడించుచున్నవి. వారిని వదలడములేదు. నీవు వదలించ గలవు స్తోత్రములు. కొందరిలో రక్షణ

గురించియు, రాకడను గురించియు అప్పుడప్పుడు సందేహములు వచ్చి: ముందుకుసాగి వెళ్లుచున్నవారిని వెనుకకు లాగుచున్నవి. ఆ లాగడమును వారు తప్పించుకొనలేక పోవుచున్నారు. నీవు తప్పించగలవు. గనుక స్తోత్రములు. ఇప్పుడుదహరించినవి కాక ఇతర కష్టములుకూడ కలవారు కలరు. తృప్తిలేనివారు, సమాధానము లేనివారు, శాంతి లేనివారు, నెమ్మది లేనివారు, ఏమిచేయవలెనో తోచనివారు, ఎంత చెప్పిన నచ్చనివారు వీరిని గురించికూడ ప్రార్థిస్తున్నాము. వారిలో ఉన్నవి విదల్చివేసి శాంతి కలుగజేయ గలవు. స్తోత్రములు. ఎవరైతే స్వస్థానమునకు ప్రయాణమై వెళ్లవలసి ఉన్నారో, వారికి నిదూతయొక్క సహాయము అనుగ్రహించి సురక్షితముగా తీసికొని వెళ్లుదువని నమ్ముచున్నాము. నీకు స్తోత్రములు. మరల మేము ఎప్పుడు కూడుకొనవలెనో, అప్పటి స్థలమునకు కూడుకొనేటట్లు కృప దయ చేయగలవు అనేక స్తోత్రములు. చిన్న పిల్లలను, స్త్రీలను, మగవారిని, పెద్ద వారిని, అందరిని దీవించుమని ఇక్కడ నేర్చుకొన్న విషయములు. ఇతరులకు చెప్పి సంతోషింపజేయుమని వేడుకొనుచున్నాము. ఈ రెండు దినములకూడికవల్ల నీకు మహిమ కలుగునట్లు త్వరగా వచ్చుచున్న ప్రభువు ద్వారా మా ప్రార్థనలు ఆలకించుమని వేడుకొనుచున్నాము. ఆమేన్.

---

**1955వ సం॥లో దేవదాసు అయ్యగారు చేసిన ప్రసంగము.**

## పదిహేనవ సందేశము

# నోవహు నావ - క్రీస్తు రక్షణ ఓడ

*దా కీర్త. 103:14-18; యోహా. 2:25; అపో॥ కార్య. 27:20-24*

**"దేవుడు నోవహును అతనితోకూడ ఓడలోనున్న సమస్త జంతువులను, సమస్త పశువులను జ్ఞాపకము చేసికొనెను. దేవుడు భూమిమీద వాయువు విసరునట్లు చేయుటవలన నీళ్లు తగ్గిపోయెను." (ఆది. 81).**

నోవహు కాలములోని జలప్రళయము అనంతరము దేవుడు నోవహును జ్ఞాపకము చేసికొనెను. నోవహు 150 దినములు అనగా 5 నెలలు ఓడలో మూయబడి యుండుట ఒక విధముగా భయంకరమైనది. అయినప్పటికిని సంతోషమే. ఉదా: గాలితుఫాను వచ్చిన సమయమందు మనము ఇంటిలో తలుపువేసికొని ఉంటాము. ఇల్లు చాలా బలమైనది. ఇంటి వెలుపల భయంకరమైన గాలి, శబ్దము మొదలగునవన్నియు నుండును. లోపలనున్నవారు అనుకొనునది ఒకటి. అదేమనగా నేను బలమైన ఇంటిలో నున్నాను. నాకేమి పర్వాలేదు అని అనుకొనును. గాలి తుఫాను ఒక దినము. రెండవ దినము, మూడవ దినము ఇంకా ఎక్కువ దినములున్నయెడల ఇంటిలో కూడ భయము కలుగును. విసుగుపుట్టును. ఎందుకనగా ఎక్కువ కాలము తుఫాను ఉండుటను బట్టికాదు గాలి వీచుచున్నదనికాదు దెబ్బ తగులు ననికాదు, ఇంటిలో సరుకులు లేవని కాదు. అన్ని ఉన్నను విచ్చలవిడిగా తిరుగుటకు వీలులేదు గనుక విసుగుదల పుట్టును. అలాగే నోవహు ఓడలో అన్ని ఉన్నవిగాని విచ్చలవిడిగా తిరుగుటకు వీలులేదు. ఎంత సౌఖ్యమున్నను ఒక విధముగా భయముండును. మేమెప్పుడు బయటికి వెళ్ళుదుమా! ఎప్పుడు మైదానము మీద సంచరింతుమా! ఎప్పుడు సూర్యుని చూచెదమా! ఎటుచూచిన నీళ్ళేయని తలంపులు వచ్చును. మనలను ఒక అడవిలో విడిచి పెట్టిన ఎట్టి తలంపులు వచ్చునో గ్రహింపగలము. వారికి మరియొక తలంపు పుట్టవలసినది కాని పుట్టలేదు. ఓడకు రంధ్రముబడిన దానిలోనికి నీరు వచ్చునని, దేవుడు నోవహును లోపలికి రమ్మని తలుపుమూసెను. 'లోపలికి రమ్మన్న దేవుడు బయటికి రమ్మనుట మరచిపోయినాడా?' అని నోవహు

భార్య బిడ్డలు అనుకొన వలసినది, కాని వారట్లు అనుకొనలేదు. దేవుడు అయిదు నెలలు అయిన తర్వాత వారిని జ్ఞాపకము తెచ్చుకొనెను. ఇన్నాళు ్ళ వారిని మరచిపోయినాడని కాదు, జ్ఞాపకము తెచ్చుకొనుచునే యుండును. అనగా ఇన్నాళ్ళు వారు ఓడలో నున్నారు. ఈ దినము వారిని బయటికి తెచ్చెదనని చెప్పినట్లున్నది. ఉదా:- ఒక తల్లి బిడ్డను ఇంటిలోపెట్టి తలుపు మూయును. అయితే ఆ బిడ్డ మాత్రము మా అమ్మ కొంత సేపటికి తలుపు తీయునుగదా అని అనుకొనును. కాని తల్లి ఎంతసేపటికి తలుపు తీయదు. ఇంక పిల్లకెవ్వున ఏడ్చుటకు సిద్ధముగానుండు సమయములో తల్లి తలుపు తీసినది. అలాగుననే నోవహు స్థితి కూడా యున్నది. పై ఉదాహరణలో బిడ్డకు గాని, నోవహునకు శిక్ష కాదు. ఇంకా దేవుడు తలుపు తీయకుండ నున్నట్లయిన వారు దేవుని దూషింతురు, విసుగుకొందురు. వారు దూషింపకపోయిననూ, విసుగు కొనక పోయిననూ ఏదో ఒక ఆయాసము కలుగును. ఇది జరుగుటకు ముందే ఆయన తలుపు తీసెను. దీనినిబట్టి మనము నేర్చుకొనవలసినది ఏమనగా, దేవుడు మనలను ఎప్పుడు మరచిపోడు. ఇక మనము దేవునిని దూషింతుము అను సమయములో ఆయన మనలను విడిపించును. ఇది విశ్వాసుల స్థితి.

నోవహు ఓడలో నుండి కాకిని బయటికి పంపించినప్పుడు, నేను కాకిని విడిచిపెట్టిన రీతిగా దేవుడు నన్ను ఓడలో నుండి విడిచిపెట్టునని' తలంచవలెను. దేవుడు నోవహును జ్ఞాపకము చేసికొనెను. అనగా నోవహు యేసుప్రభువునకు ముంగుర్తు గనుక దేవుడు తన కుమారుడైన యేసుక్రీస్తుకు ముంగుర్తుగా యున్న వారిని జ్ఞాపకము చేసికొనక తప్పదు. నోవహు ఓడలో ఉండి కొండ ఎక్కెను. ఆలాగుననే యేసుప్రభువు చివరకు గొల్గొతా కొండ ఎక్కెను. సముద్రములో ఓడ మునిగిపోవునప్పుడు, ఓడలోని వారు ఆ సంగతి కాగితముల మీద వ్రాసి సీసాలో పెట్టి సముద్రములో విడిచెదరు. కెరటములు వాటిని ఒడ్డునకు చేర్చును, సముద్రము దేనిని తనలో నుంచుకొనదు. అలాగే కష్టములు వచ్చినప్పుడు అవి మనలను దేవుని దగ్గరకు నడిపించునుగాని అధోగతికి నడిపించవు. విశ్వాసుల విషయములో ఆలాగు జరుగును. కాని అవిశ్వాసుల విషయములో అధోగతే. దేవుడు నోవహును జ్ఞాపకము చేసికొనెను.

యేసుప్రభువు పోలిక నోవహులో నుండెను. ఎవరైన తమ బిడ్డల పోలికగల ఇతరులను చూచిన వారి యందు ఇష్టము కలిగి ప్రేమింతురు. తమ బిడ్డలు చనిపోయినయెడల, వారి పోలికగల వారిని ఇండ్లకు పిలిచి సత్కరించుదురు. అలాగుననే మనలో క్రీస్తుప్రభువు పోలిక ఏదైనా ఉన్నయెడల, అనగా 'ఆయనవలె శ్రమలు సహించుట, తండ్రి చిత్తము నెరవేర్చుట' మొదలగు గుణములున్న యెడల దేవుడు తప్పక మనలను జ్ఞాపకముంచుకొనును. క్రీస్తు ప్రభువు శ్రమలను సహించెను, నీచత్వము అనుభవించెను. తండ్రియొక్క చిత్తము తప్పక నెరవేర్తునని ప్రతిజ్ఞచేసెను. మనకు ఇట్టి లక్షణములుగలవో లేదో, చూచుకొనవలెను. నోవహు ఓడ కట్టించెను. ఓడ చివరకు కొండ ఎక్కెను. అలాగే క్రీస్తు ప్రభువు సంఘమనే ఓడను కట్టుననియు, అది లోకమనే సముద్రమును దాటి రెండవ రాకడప్పుడు పరలోకమను కొండకు వచ్చుననియు దేవునికి ముందుగానే తెలియును. ఇది నోవహునకును క్రీస్తునకును గల మరియొక పోలిక. తుఫాను అయిన తర్వాత ఎండను చూడగానే మనుష్యులకు సంతోషము కలుగును. సూర్యుడు తన కిరణములు భూమిమీదికి రానిచ్చినట్లు దేవుడు తన మహిమ కిరణములను విశ్వాసుల మీదికి కష్టముల తర్వాత రానిచ్చును. నిజ విశ్వాసులే రక్షణ ఓడ కథ ఎరిగినవారై, క్రీస్తుప్రభువు నందలి విశ్వాసముతో ఆయన రాకకు సిద్ధపడుదురు గాక! ఆమేన్.

## పదహారవ సందేశము

# దేవుని ధనస్సు - రాకడ నిబంధన

***ఆది. 9:17; మార్కు. 13:29; 1కొరింథీ. 15:23***

**"మేఘములో నా ధనస్సును ఉంచితిని, అది నాకును భూమికిని మధ్య నిబంధనకు గురుతుగా నుండును" (ఆది 9:13).**

నోవహు మరియు కుటుంబము ఓడలోనుండి బయటికి వచ్చిన తరువాత దేవుడు వారి దగ్గరకు వచ్చి వారితో ఈలాగు చెప్పెను. "మేఘములో నా ధనుస్సును ఉంచితిని. అది నాకును భూమికిని మధ్య నిబంధనకు గురుతుగా నుండును". దీనిలోని సంగతులు:- 1) మేఘము, 2) ధనుస్సు, 3) నిబంధన, 4) గుర్తు. ఈ మాటలకు అర్ధములు గలవు. మరి రెండు మాటలున్నవి అవి (1) నాకును (2) భూమికిని.

**1) మేఘము:-** మేఘము చేయు మొదటి పని సూర్యుని కనబడకుండ చేయును. మరియు పొలములోనున్న వారు మేఘమును చూచి వర్షము వచ్చునని భయపడి ఇంటికి పోవుదురు. అలాగే జబ్బు వచ్చినప్పుడు, 'రాకరాక జబ్బు వచ్చినది, వదులుట లేదు. తుదకు నన్నేమిచేయునో' అను మేఘము కమ్ముకొనును. మనిషి అధైర్యపడును. వ్యాధి, శోధన, కష్టము, ఇబ్బంది మొదలగునవి వచ్చినప్పుడు ఇట్టి మేఘము కమ్మును, వ్యాధిలోనున్నవారు రాత్రి సమయములో భయపడి ఎప్పుడు తెల్లవారునా, ఎప్పుడు సూర్యుని చూతుమా అని అనుకొందురు. తెల్లవారగానే ధైర్యము కలుగును. ఒక కష్టము వచ్చినప్పుడు ఒక రకమైన మేఘము మనలను ఆవరించును. కష్టము వలన కలిగిన ఆంధోళన మేఘమువలె ఆవరించును. ఇట్టి కష్టములు కలిగినప్పుడు లెక్కచేయనియెడల మేఘము మనుష్యుని ఆవరించదు. జబ్బు, నింద, పాప శోధన వీటన్నిటివలన అధైర్యము కలిగిన యెడల అది దట్టమైన మేఘము వంటిది. వాటివలన కలిగిన ఆందోళనయే నల్లని మేఘము.

**(ఎ) వర్షము:-** జబ్బు, కష్టము ఎక్కువైన యెడల చివరకు ఏడ్పు వచ్చును. కంట నీరు వచ్చును. ఇదియే ఒకరకమైన వర్షము. ఇట్టి వర్షము కురిపించుట దేవునికి ఇష్టము. ఎందుకనిన ఇట్టి పరిస్థితి వచ్చినప్పుడే మనిషి దేవుని తట్టు తిరుగును. **భయమనే నల్లని మేఘము, పశ్చాత్తాపమను కన్నీళ్ల వర్షము కురిపించును.** ఈ రెండు అయిన తర్వాత మనిషి బాగుపడును. బాగుగా ఏడ్వనిచ్చి తర్వాత దేవుడు ఆదరించును.

**(బి) సూర్యుడు:-** మబ్బుపోయిన తర్వాత సూర్యకాంతి (ఎండ) వచ్చును. కష్టము, బాధపోయిన తర్వాత క్రీస్తుప్రభువు యొక్క ముఖబింబమును చూడగలము. మబ్బులో సూర్యుని చూడలేము. అలాగే కష్టములలో ప్రభువును చూడలేము. ఆ కష్టములు తీరిన తర్వాత చూడగలము. నీతిసూర్యుడైన ప్రభువుయొక్క కాంతి, కష్టముల తర్వాత చూడగలము. మరియు దేవుడు తన ముఖమును తన కుమారునిలో చూపించెను. తుఫాను అయిన తర్వాత ఎండను చూడగానే మనుష్యులకు సంతోషము కలుగును. తుఫాను తర్వాత సూర్యకిరణములు భూమిమీద పడునట్లు, దేవుడు తన మహిమ కిరణములను భూమిమీదికి రానిచ్చును.

**2. ధనస్సు:-** మేఘము, వర్షము, సూర్యుడు- ఇవన్నీ అయిన తర్వాత ధనస్సు కనబడును. ధనస్సు అనగా వాగ్ధానము, నిబంధన. అయితే నిబంధనకు ఇద్దరుండవలెను. పెండ్లిలో ఇరుపక్షములవారు మాట్లాడుకొన్న తర్వాత గుర్తుగా ఏదో ఒక వస్తువు పెండ్లికూతురునకు ఇచ్చెదరు. అలాగే దేవుడు యూదుల ద్వారా లోకమునకు ఒక గురుతు ఇచ్చెను. ధనస్సు ద్వారా లోకమునకు నిబంధన ఇచ్చినట్లు, యూదుల వంశములోనుండి లోకమునకు రక్షకుని పంపెను. ధనస్సు చూడగానే దేవుడు దయగలవాడు అని జ్ఞాపకము వచ్చినట్లు, ప్రభువును తలంచగానే 'దేవుడు దయగలవాడు, తన కుమారుని ద్వారా నా పాపములు క్షమించి, నన్ను రక్షించెనని' జ్ఞాపకమురావలెను. ఇది కృపా నిబంధనకు గుర్తు.

**3. నిబంధన:-** యూదులు పాపము చేసినప్పుడు తండ్రివలె దేవుడు వారిని శిక్షించెనుగాని నిబంధన కొట్టివేయలేదు. దేవుడు ఇశ్రాయేలీయులను శిక్షించి వారిలోనుండి రక్షకుని రప్పించెను. ఆలాగుననే దేవుడు విశ్వాసులను శిక్షించునుగాని రక్షణ మాత్రము తీసివేయడు. మనిషి తనంతట తాను రక్షణ తీసివేసికొనవచ్చును గాని దేవుడు తీసివేయడు. మనిషి పాపముచేసి దేవుడు నన్ను రక్షించడని అవిశ్వాసపడి, తన రక్షణ తానే పోగొట్టుకొనును. దేవుని రక్షణ నిబంధనను మానవుడు తనంతట తానే కొట్టివేసికొనును. **మనుష్యునికి రక్షణ పోవుట పాపము వలన కాదుగాని, తన అవిశ్వాసము వలననే.** దేవుని నమ్ముటవలన నిబంధనలోనికి రావడము జరుగును, నమ్మకపోవడము వలన నిబంధనకు దూరమగుట జరుగును. అట్లు దూరమైనను మరల విశ్వాసము కలిగించుకొని నిబంధనలోనికి రావచ్చును.

Bible Mission HQ Guntur

**4. గురుతు:–** ధనస్సునకు 'దేవుని ధనస్సు' అని గొప్ప బిరుదుగలదు. దీనిపని గురుతుగా నుండుట. ఇది దేవుని నిబంధనకు గుర్తుగా నున్నది. నోవహు కాలము మొదలుకొని, మనకాలము వరకు లోకమంతటిని ముంచి వేయు వర్షము రాలేదు గనుక తండ్రి చెప్పిన మాట నెరవేరినది. అక్కడక్కడ వర్షము వచ్చి కొన్ని గ్రామములు పోవుట, మనుష్యులు జీవరాసులు నశించుట నిజమేగాని మనుష్యులందరు, జీవరాసులన్నియు నశించే భూలోక వరద రాలేదు. బైబిలు నిజమైన గ్రంథమని తెలిసికొనుటకు ఇది ఆధారము. ఆది, 6:7లో నరులను, జంతువులను, పురుగులను తుడిచివేతునని యున్నది. అది నోవహు కాలములో జరిగెను. ఇకను జరుగదు. ఇది బైబిలు నిజమైన గ్రంథమని ఋజువు పరచుచున్నది. ఈ నిబంధన 'నిత్యనిబంధన' అని వ్రాయ బడియున్నది. ధనస్సు దేవునికి, లోకమునకును మధ్య ఉన్న నిబంధన గుర్తు. ఇది మేఘములలో కనబడును. ఇది వర్షము తరువాత కనబడునని మన అనుభవములో నున్నది. దీనినిచూచి దేవుడు తన నిబంధనను జ్ఞాపకము చేసికొనును. 'దేవుని ధనుస్సు' అనగా ఇది దేవుని నిత్యనిబంధన జ్ఞాపకము చేయునది. అనగా 'దేవుడు భూమిని నాశనము చేయడు అనే నిబంధన జ్ఞాపకము చేయును గనుక దేవుడు మనిషిని కూడ జ్ఞాపకము చేసికొనవలసినదే. మనమేమి జ్ఞాపకము చేసికొనవలెననగా, లోకమునకు నీటివలన నాశనము రాదు. ధనస్సు యొక్క స్వరము ఏదనగా, నీటివలన భూమికి నాశనమురాదు. నరులు ఈ సత్యము నమ్మిన యెడల నీటివలనగాని, మరి దేనివలనగాని నాశనము రాదు, నాశనము రాదనుటయే మొదటి సువార్త.

యాకోబు అతని అన్నయైన ఏశావును విడచి దూరముగా పారి పోయినాడు. 20 సంవత్సరములకు తిరిగివచ్చుచూ, అన్నకు 7 మార్లు నమ స్కరించెను (ఆది. 33:3), అన్నయొక్క ప్రేమను తనపై కలిగించు కొనుటకు యాకోబు ఆలాగు చేసెను. చివరకు ఇద్దరు ఎదురైనారు. కౌగలించు కొనుచున్నారు. అలాగే మనమును దేవుని ప్రేమను సంపాదించు కొనుటకు దినమునకు అనేకమార్లు దేవునికి నమస్కారము చేయు చుండవలెను. క్షమాపణ 7 మార్లుకాదు 77 మార్లు అని ప్రభువు పేతురుతో చెప్పెను. అలాగే నోవహు కాలములో 7 రంగుల ధనస్సుతో దేవుడు నిబంధన చేసెను. అది దేవుని దయ. ప్రభువు పత్మసు లంకలో యోహానుకు 7 సంఘములను గురించి చెప్పెను. ఒక్కొక్క సంఘములో ఒక్కొక్క రకమునకు సంబంధించిన భక్తులు ఉందురు. ఎఫెసు మొదటి సంఘము,

చివరిది లవొదికయ సంఘము. ఈ సంఘము చివర ప్రభువు సింహాసనము ఉండును. వేలకొలది భక్తులు ఈ సంఘములలో నుందురు. భక్తి యొక్క అంతస్థులలో తేడాలుండును. ఓడలోనికి అందరు ఏలాగు రాలేదో, అలాగే అందరు సంఘములోనికిరారు. ఒకవేళ వచ్చిననూ, వారందరిలోను అనేకులు అవిశ్వాసులుందురు. అందువలననే క్రైస్తవులలో చాలమంది భక్తుల వరుసలో చేరుట లేదు. గనుక ముందు శక్తి పొందవలెను. అనగా ముందు ఆత్మను పొందిన తర్వాత శక్తి వచ్చును. భక్తులలో కూడ 7 రకములు ఉందురు. ఉదా: బడివేళకు అన్ని ఇండ్లలోనుండి పిల్లలు రోడ్డుమీదకు వచ్చుదురుగాని, బడిలో ఎవరి తరగతిలో వారు సర్దుకుంటారు. అలాగే భక్తులుకూడ 7 తరగతులలోనికి వెళ్ళుదురు. ఈ 7 తరగతుల వారు ప్రభువు సింహాసనము దగ్గర ఉందురు.

పరలోకమునకు వెళ్ళిన తర్వాత ఈ ఏడింటిలో నీవు ఏ తరగతిలో నున్నది నీకెవ్వరును చెప్పరు. ఎవరు ఏ తరగతికి వెళ్ళవలెనో, ఎవరంతట వారికే తెలిసిపోవును. అనగా వారి వారి అంతరంగ స్థితిని బట్టి ఎవరంతట వారికే తెలిసిపోవును. భూలోక జీవితములో ఎన్నిమెట్లు ఎక్కుదురో పర లోకములోకూడ ఆ తరగతిలోనే ఉందురు. ఒక్కొక్క తరగతిలోను కాంతికూడ వేరువేరుగా నుండును. మెట్లు ఎక్కుకొలది కాంతి ఎక్కువగానుండును. ఒకరు ఎక్కినమెట్టు మరియొకరు ఎక్కవలెనంటే శక్తి చాలదు గనుక ఎక్కలేరు. ప్రతివాడు తన వరుసలో బ్రతికింపబడును (1కొరింథి. 15:23). పరలోకములో 7వ మెట్టు నూతన యెరూషలేము. భూలోక సంఘములో భక్తిలో ఏ మెట్టులో నుందువో, పరలోకములో అదే మెట్టులో నుందువు. దేవుడు నోవహుతో నిబంధన చేసెను. యోహానుతో నిబంధనచేసి, 7 సంఘముల స్థితిని చూపించెను. తరగతులు 7, అంతస్థులు 7, ధనస్సు ఒక్కటేగాని రంగులు 7. వారము ఒకటేగాని దినములు 7, యాకోబు ఒక్కడేగాని నమస్కారములు 7. ధనస్సు తెలియని వారుండరు. అలాగే ప్రభువుని ఎరుగనివారు కూడ ఉండరు. రంగులు చూడగా సూర్యుడును, దేవుడును, జ్ఞాపకమునకు వచ్చును. ఆకాశములో సూర్యుడును, మోక్షములో నీతిసూర్యుడైన యేసుప్రభువును ఉన్నారు. ఆ ఓడలో లేనివారు ఓడ బైట నీటిలో మునిగి నశించిరి. అలాగే ఈ లోకములో ఉన్న ప్రతివారు 7 సంఘములలో ఏదో ఒకదానిలో చేరవలెను. లవొదికయ సంఘ అంతస్థు అన్ని సంఘ అంతస్థులకంటే ఎక్కువ గనుక చదువరులు అట్టి అంతస్థుకు సిద్ధపడుదురు గాక ఆమేన్.

## పదిహేడవ సందేశము

# సమాజముగా కూడుకొనుట

*నిర్గ. 35:1-3; మత్త. 4:23; హెబ్రీ. 10:24-25.*

'కొందరు మానుకొనుచున్నట్టుగా సమాజముగా కూడుట మానక, ఒకనినొకడు హెచ్చరించుచు, ఆ దినము సమీపించుట మీరు చూచినకొలది మరి ఎక్కువగా ఆలాగు చేయుచు, ప్రేమ చూపుటకును, సత్కార్యములు చేయుటకును ఒకనినొకడు పురికొల్పవలెనని ఆలోచింతము' హెబ్రీ. 10:24-25.

**ప్రార్థన:-** వాక్య దానకర్తవైన ఓ తండ్రీ! వాక్యముద్వారా వర్తమానము అందించుము. నీవాక్య సారాంశము హృదయ నేత్రములకు కనబడునట్లు నీయాత్మతో మమ్మును నింపుము. మా జ్ఞానమును నీ యాత్మతో వెలిగించుము. అప్పుడు అద్భుత విషయములు గ్రహించగలము. నీ ఆత్మతో మా మనస్సాక్షిని శుద్ధీకరించుము. అప్పుడు నీ వాక్యప్రకారము నడుచుటకు మాకు ఇష్టము పుట్టి కూడియున్న ఒక్కొక్కరికిని వర్తమాన మందించుము. నీ వాక్యము మాకు విడచెప్పుము. మర్మమైన విషయములు బయలు పరచుము. ఈ మా ప్రార్థన నీ కుమారునిద్వారా అంగీకరించుము. ఆమేన్.

అపోస్తలుడైన పౌలుగారు పై వాక్యమును ఒకటవ శతాబ్దములో వ్రాసిరి. ఇప్పుడు మనము 21వ శతాబ్దములో నున్నాము. ఇన్ని శతాబ్ది ములలోను సంఘమున్నది. ఆ మొదటి శతాబ్దములోనున్న ఆది సంఘములో బలహీనులు గలరు. వారు సమాజముగా కూడుట మానివేసిరి. ఇప్పుడు కూడ ఈ 21వ శతాబ్దములోకూడ సమాజముగా కూడుట కొందరు మానివేయు చున్నారు. అక్కడనున్న లోపము ఇక్కడకూడ నున్నది. సంఘము అన్ని శతాబ్దములలోను మీటింగులు ఏర్పాటుచేయుట, క్రొత్త పద్ధతుల ప్రకారము సేవచేయుట గలదు. 1. ఆదివారము అందరు గుడికి రావలెను. 2. వారములో ఏదో యొక దినమందు అందరూ కూడుకొనవలెను. 3. పండుగలలో కూడుకొనవలెను. 4. సువార్త ప్రచార సమయములలో కూడుకొనవలెను. ఇదికాక ఇంకా ప్రత్యేక సమయములు గలవు. సమాజముగా కూడుకొనుట వీలుప్రకారము చేయవలెనుగాని సిద్ధాంత ప్రకారముకాదు. గ్రామములో వ్యాధులున్న కూడుకొనవలెను. అలాగే యుద్ధములు జరుగునప్పుడుకూడ కూడుకొని ప్రార్థింపవలెను.

సంఘము లేదని పౌలు వ్రాయలేదుగాని, కొందరు కూడుకొనుట మానుకొనుచున్నారని వ్రాసెను. ఇద్దరు ముగ్గురు కూడుకొన వచ్చునని ప్రభువు చెప్పెను. ఆ కూడుకొనని వారి కోసము సంఘము ఆగలేదు గాని, కొందరు ఆగిపోయినందుకు పౌలునకు ఆయాసముగా నుండెను. వారు మానినట్లు మీరు మానవద్దని సలహాలిచ్చుచున్నాడు. (1) 'మానివేయవద్దు. (2) కూడుకొనండి' అని రెండు గొప్ప సలహాలు ఇచ్చుచున్నాడు. కూడుకొనుటలో, ఉద్దేశములు భేదము కావచ్చునుగాని కూడుకొనుట మాత్రము ఒకటే. కొందరు ఎందుకు మానుకొనుచున్నారు? కారణముల జోలి మనకక్కరలేదుగాని కూడుకొనుట మన గురియై యుండవలెను. 1. కూడుకొన వలెను. 2. ఎక్కువగా కూడుకొనవలెను. ఎంత ఎక్కువగా కూడుకొనిన అంతమేలు. రానైయున్న ప్రభువు రాకడ సమీపించుకొలది మరి ఎక్కువగా కూడుకొనండి' అని హెచ్చరించెను. ఒక్క అరగంటయైన కూడుకొనిన చాలును. అది ప్రభువుతో నున్న సంఘము అగును. మనము రాకడ సమీపించుకొలది. సామాన్యముగా కూడుకొనుటకంటె ఇంకా ఎక్కువగా కూడుకొనవలెను.

1వ శతాబ్దము వారికి రాకడ తలంపు ఉన్నది. 21వ శతాబ్దములో నున్న మనకు రాకడ తలంపు గలదు. గురుతులు జరుగుకొలది, 1. సామాన్య కూటములు ఎక్కువగా చేయవలెను. 2. వృద్ధి కూటములుకూడ చేయవలెను. వృద్ధి కూటములలో రాకడ సంగతులు జ్ఞాపకము చేసికొనవలెను. వాక్యములో లేకపోయినను, తరచుగా కూడుకొనవలెనని పౌలు ఉద్దేశమును, వాక్య ఉద్దేశమునైయున్నది. పౌలు కాలములోనే రాకడ తలంచుకొనవలెనంటే, మనము రాకడకు ఇంకా దగ్గరనున్నాము గనుక మనమెక్కువగా కూడుకొని కూటములు చేయవలెను. అనేక పర్యాయములు మనకు నిరుత్సాహము కలుగును. అయినను. 'మన గురి రెండవ రాకడ గనుక ఎక్కువగా కూడు కొనవలెను.

ఒకరినొకరు హెచ్చరించుకొనవలెనని వాక్యములో గలదు. పట్టణములలో గంట కొట్టిన కూటములకు వస్తారు గనుక అదే ప్రేరేపణ. గ్రామములలో పిల్లలు ఇంటింటికి వెళ్ళి గుడికి రమ్మని చెప్పుదురు. తర్వాత సంఘపెద్దలు ఇంటింటికి వెళ్ళి వారిని రమ్మని ప్రేరేపించెదరు. ఈలాగు ప్రేరేపించుట ఆరంభమునుండి గలదు. కొన్నిచోట్ల శనివారము రాత్రి ఇంటింటికి గంట మ్రోగించే అలవాటుగలదు. కొన్నిచోట్ల వీధుల గుండ

కొందరు కలిసి కీర్తనలు పాడుకొనుచు వెళ్ళుదురు. ఈ రీతిగా కూటములకు వచ్చుటకు ప్రేరేపణలు ఆదినుండి గలవు. నలుగురితో కలిసి కీర్తనలు పాడుట, ప్రార్థనలు చేయుటవలన మనసునకు శాంతి కలుగును. విచారము తగ్గునని కూటములు చేసికొందురు. 1. తరచుగా కూటములు పెట్టుట. 2. అనేకులను ప్రేరేపించుట మానకూడదు. పౌలు కాలములో ప్రేరేపించు పనిగలదు. కూటములు మాను కొనువారు మనకు మాదిరికాదు. తరచుగా కూడుకొనువారు మనకు మాదిరి. తరచుగా కూడుకొనుటకును, ప్రేరేపించుటకును దేవునికృప మీకు తోడై యుండును గాక! మరియు వాక్యములో 1. ప్రేమ చూపుటకు 2. సత్కార్యములు చేయుటకును అని గలదు. ఇక్కడ రెండు రకముల మీటింగులున్నవి. (1) మానుకొనే మీటింగు, (2) కూడుకొనే మీటింగు. అలాగే, రెండు రకముల ప్రేరేపణలున్నవి. (1) రండి అనే ప్రేరేపణ, (2) ప్రేమ వృద్ధిచేసికొనండి అనే ప్రేరేపణ. మంచి కార్యములు వృద్ధి చేసికొనండి అనే ప్రేరేపణకు వచ్చినాము గనుక ఒకరినొకరము ప్రేమించుకొనవలెను. వారు వీరిని, వీరు వారిని ప్రేమింపవలెను. ఒకరి చెడుగు చెప్పుకొనుట, అల్లరిచేయుట కాదుగాని, రాకడను గూర్చి తెలిసికొనుటకు, ఆ రాకడ ప్రేరేపణ కలుగుటకు కూటములకు రావలెను.

**కూటములవలన ఉపకారములు:-** ప్రేమ వృద్ధియగును. సంభాషణ వల్ల సంతోషము వృద్ధియగును. మంచికార్యములు చేయుటయందు కూడ ఆ వృద్ధి కనబడును. ప్రేమ స్వభావము ఏమిటో తెలియవలెను. ప్రేమలో ఉన్న వృద్ధి కలిగించుకొనవలెను. ప్రేమ పనులు వృద్ధికావలెను. ఇవి బోధకుని బోధలో నుండును గనుక మీటింగులకు హాజరు కావలెను. ప్రేమవృద్ధి, మంచిపనులు వృద్ధి, రాకడ తలంపుల వృద్ధి; వీటికి కారణము తరుచుగా కూడుకొనుట. వాక్యము చివర **'ఆలోచింతము'** అని ఉన్నది. ఇది ముఖ్యమైనది. అందరు కూడుటవల్ల పద్ధతులు ఆలోచించగలము. ప్రేమ తగ్గినది, వృద్ధి యగుటకు ఏమిచేయవలెను? అని ప్రేమ వృద్ధియగు పద్ధతులు ఆలోచించుటకు కూడుకొనుట అవసరము. క్రొత్త బోధలు, క్రొత్త అనుభవములు కూడుకొనుట వలన కలుగును. గనుక వాక్యము వినువారమైన మనము సాధ్యమైనంతవరకు **ప్రతిదినము** కూడుకొని, దేవుని వాక్యమును పఠించి, ధ్యానించి ఆయన రాకడకు సిద్ధపడుదుముగాక! ఆమేన్.

## పదునెనిమిదవ సందేశము

# సమాజముగా కూడుకొనుట-2

## (క్రైస్తవ కుటుంబము)

*ఆది. 19:14; యోహా. 20:24-29; అపో॥ కార్య. 10:1-48.*

**“యేసు వచ్చినప్పుడు పండ్రెండుమందిలో ఒకడైన దిదుమ అనబడిన తోమా వారితో లేకపోయెను.” యోహాను 20:24-29.**

ప్రభువు శిష్యులు కూడుకొనిన కుటమునకు తోమా రాలేదని శిష్యులు మీటింగు కట్టివేయలేదు. ఎవరు రాకపోయినను మనము కూటములు జరుపుకొనవలెను. వారు తోమా కొరకు కనిపెట్టినయెడల 8 దినములు ఆలస్యమగును. రానివారి నిమిత్తము కూటము ఆపుజేయకూడదు. కొద్దిమంది ఉన్నను కూటము జరుపవలెను. ఆదివారము సాయంత్రము ప్రభువును చూచిన శిష్యులు, తోమాతో ప్రభువు మాకు కనబడెనని చెప్పినప్పుడు తోమా నమ్మనన్నాడు. కూటమునకు రానని చెప్పినాడు, రాలేదు. అటువంటి తోమాను వారు తీసికొని వచ్చినారు. **మనమును ప్రతి ఆదివారము ఎవరినో ఒకరిని సంఘమునకు (సంఘకూటమునకు) తీసికొని రావలెను.**

పూర్వకాలములో సొదొమ గొమొఱ్ఱాల పట్టణములలో పాపము ఎక్కువాయెను. ఆ పట్టణమును కాల్చి, నాశనము చేయుటకు దేవదూతలు వచ్చిరి. ఆ పట్టణపు పాపము అంచులమట్టుకు నిండియుండెను గనుక పాపులమీదికి కీడురానైయున్నది. అక్కడ ‘లోతు’ అను దైవభక్తుడున్నాడు. దేవుని ఉద్దేశము ఆయనను తప్పించవలెను. దేవుని ఉద్దేశమును దైవభక్తుడు ఎంతకాలము బోధించినను ఆ పట్టణపువారికి ఎక్కలేదు. దేవుని నిర్ణయము చొప్పున ఈ దూతలు ఆ పట్టణమును నాశనము చేయుటకు వచ్చిరి. దైవ జనుడైన లోతు వారిని తన ఇంటికి రమ్మని పిలిచెను గాని వారు మేమురాము నడివీధిలో రాత్రి గడుపుతామని చెప్పిరి. ఆ పట్టణపువారు దుర్మార్గులు గనుక వారిని చంపివేస్తారని లోతువారిని తన యింటిలోనికి రమ్మని చెప్పెను. ముందువారు ‘రాము’ అని చెప్పిరిగాని బలవంతము చేయగా వెళ్ళిరి. ఊరి వారందరు లోతు ఇల్లు ముట్టడిచేసి, వారిరువురిని బయటికి పంపుమని కేకలువేసిరి. అప్పుడు లోతువారికి బోధచేసెను.

గాని వారు అతనిమాటలు వినలేదు. దూతలు లోతును లోపలికిలాగి తలుపువేసిరి. ఆ ఊరి వారందరు తలుపు బ్రద్దలు చేయబోవుచుండగా వారికన్నులు గ్రుడ్డి వాయెను. దూతలు లోతు కుటుంబమును పారిపొమ్మని చెప్పెను. వారి బంధువులనుకూడ తీసికొని పొమ్మని చెప్పెను. లోతు అల్లుళ్ళు ఆ మాటలన్ని వెర్రి మాటలని త్రోసివేసిరి. ఈ అల్లుళ్ళు మామ వద్దకు వచ్చి 'మేము రాము' అనివారితో చెప్పిరి. దూతలు లోతును, అతని భార్యను, ఇద్దరు కుమార్తెలను నలుగురిని పొలిమేర దాటించిరి. వీరు వెళ్ళిన స్థలము రక్షణస్థలము. అక్కడ హానిరాదు. అగ్ని గంధకము అక్కడ కురువదు. సొదొమ నాశన స్థలము. అయితే రక్షణ స్థలమునకు అల్లుళ్ళు రామని చెప్పిరి. వారు వచ్చేవరకు లోతు ఉండక పోయినాడా? వారెందుకు ఆగలేదు? అట్లు ఆగడమువలన వీరుకూడ కాలిపోవుదురు. నాశనస్థలమునుండి రక్షణ స్థలము చేరునప్పటికి, అగ్ని గంధకమువచ్చి అన్నిటిని కాల్చివేసెను.

వాక్యము వినుటకు సంఘమునకు లేదా కూటములకు రమ్మని అనేకులను మనము పిలువవలెను. లోతు బోధించినను అల్లుళ్ళు వినలేదు. అలాగే విననివారు, లోబడనివారు అనేకులు ఉంటారు. అయినను చెప్పుట మనవంతు. అయితే మనము చెప్పినప్పుడు అల్లుళ్ళలాంటి వారు రారుగాని, తోమాలాంటివారు వస్తారు. తోమా ముందు రానన్నాడుగాని తర్వాత వచ్చెను. అలాగే కొందరు ముందు 'రాము' అని చెప్పిన తర్వాత వస్తారు. మనము చెప్పితే రక్షణ స్థలమునకు వచ్చేవారున్నారు. రానివారుకూడ ఉన్నారు. మనపని మనము చేయుచుండవలెను. వారు రక్షణ స్థలమునకు వచ్చిన మనకు సంతోషము, రాకపోతే విచారము. మన ప్రాణమున్నంత కాలము రమ్మని చెప్పుచుండవలెను. ఎవరు రాకపోయినను మన ప్రార్థనలు, కీర్తనలు, కూటములు మానరాదు. వీరు నలుగురు రక్షణ స్థలమునకు ప్రయాణమై పోవుచున్నారు. దూతలు పరలోకమునకు వెళ్ళిరి. వీరందరు పోవుచుండగా రక్షణ స్థలమునకు చేరకముందే, లోతుభార్య వెనుకకు తిరిగిచూచెను. అయ్యో! నా ఇళ్ళు, సామాను, అల్లుళ్ళు ఏమైపోయిరో! అది వాటిపైన ఆశ ఉండి వెనుకకు తిరిగి చూచెను. ఇక్కడ ఎవరైనా వెనుకచూపు గలవారున్నారా? జాగ్రత్త! వెనుకకు వెళ్ళేవారికి లోతుభార్య పాఠము చెప్పుచున్నది.

1. రక్షణ స్థలమునకు వెళ్ళేవారికి లోతు, ఆయన ఇద్దరు కుమార్తెలు పాఠము నేర్పుచున్నారు. 2. అసలు రానివారికి అల్లుళ్ళు పాఠము నేర్పుచున్నారు. 3. వెనుకతిరిగి చూచేవారికి లోతుభార్య పాఠము నేర్పుచున్నది. ప్రభువు దగ్గరకు వచ్చిన వారు తిరిగి వెనుకకు పోరాదు. అగ్ని పట్టణముమీదికి రాగానే శబ్దమాయెను. లోతు భార్య వెనుకకు తిరిగి చూచి నాశనమాయెను. చివరి వరకు వెళ్ళినవారే రక్షింపబడుదురు. సంఘము రక్షణ స్థలము. ఎన్ని కష్టములు వచ్చినను అక్కడికే పోవలెను. **ఎవరు పిలువకుండానే వెనుకకుచూచి ఆమె నాశన మాయెను.** ఆమె పట్టణముతట్టు ఆకర్షింపబడెను. ఆమె దూతలమాట విని సగము దూరము వచ్చెను. గనుక ఆమె భక్తురాలేగాని అగ్ని కురిసేటప్పటికి ఆమె సొదొమ పట్టణస్థులలో చేరెను. భక్తురాలు వెనుక చూపు వలన నాశనమాయెను. గనుక వెనుకచూపు హాని! ఆ పట్టణము మీద దేవుని మహాకృప ఉన్నది' అని ఏలాగు తెలియుననగా, దూతలు నాశనము చేయుటకు వచ్చినామని చెప్పినప్పుడు ప్రభువా! రక్షించు అని వారందరు ప్రార్థన చేసినట్లయిన, సొదొమ రక్షణ స్థలము అయిపోవును. గాని అట్లు ప్రార్థన చేయక కొట్టవచ్చిరి. గ్రుడ్డివారైనప్పుడైయినా రక్షించుమని అనవలసినది, గాని వారు ఆలాగు అనలేదు. అయితే ఇక్కడ ఇంటిలో లోతు కుటుంబము సర్దినదే సర్దుచుండిరి. కనుక దూతలు వారిని చేతులు పట్టుకొని లాగుకొనివచ్చిరి. వారి నలుగురివి 8 చేతులు, వీరిద్దరివి (దూతలు 4 చేతులు. కాని వారు పట్టుకొనిరి. నశించు వారిమీద కూడ దేవుని దయ ఉండునని లోతు భార్యనుబట్టి తెలిసికొనుచున్నాము. లోకముపుట్టి 6వేల సం॥ములు అయినది. యేసుప్రభువు త్వరగా వచ్చి సిద్ధపడినవారిని పరలోకమునకు తీసికొనివెళ్ళును. ప్రభువు ఇంకా రాలేదేమిటి? అనగా అక్కడక్కడ దైవభక్తులు కొన్ని కష్టములలో నున్నారు. వారు రక్షణ చోటికి రావలెనని ఉన్నారు గాని వారికి ఇంకా కొన్ని అడ్డులున్నవి. ఏలాగంటే దేవుని ఉగ్రత సొదొమపై రాకపూర్వము ఇంకా లోతు రక్షణ స్థలమునకు వెళ్ళలేదు. గనుక గంధకము కురువలేదు. కాని రాకడ (వధువు) సంఘము వెళ్ళిన తర్వాత భూమిమిదికి ఏడేండ్ల శ్రమలు వచ్చును. చదువరులు ఇట్టి శ్రమను తప్పించుకొందురు గాక! ఆమేన్.

## పంతొమ్మిదవ సందేశము

# రాకడ తలంపు - సందేహ సంహారము

*దా. కీర్తనలు. 139:17; మత్తయి. 21:21; ఫిలిప్పీ. 4:4-7.*

"ఎవని మనస్సు నీమీద ఆనుకొనునో వానిని నీవు పూర్ణశాంతి గలవానిగా కాపాడుదువు" యెషయా 26.3.

**కీర్తన: యేసూ! నీతలపె నాకు ఎంతో హాయి - ప్రభు యేసు నిను తలంపగానే హృదయ మానందముతో నిండున్ - నీ సముఖమున ముఖము జూచుచు - వాసము చేసి నపుడెట్లుండునో ॥యేసూ॥**

పాత నిబంధనలో క్రీస్తుప్రభువు వస్తున్నాడు అనే బొబ్బలు (కేకలు) వినబడినవి. అలాగుననే క్రొత్త నిబంధనలోకూడ వినబడినవి. అలాగే సంఘ చరిత్రలోనూ వినబడినవి. వాటిని మూడు మాటలలో వివరించుదును.

### 1. మూడు బొబ్బలు, 2. మూడు దెబ్బలు, 3. మూడు దిబ్బలు.

పాత నిబంధనలో క్రీస్తు ప్రభువు వస్తారని ఎన్ని బొబ్బలు అనగా ఎన్ని కేకలు వేసినా, ప్రజలు జాగ్రత్తగా లేరు. పాత నిబంధనలోని ప్రజలు జాగ్రత్తగాలేరు గనుక దెబ్బలు. అలాగే క్రొత్త నిబంధనలోను దెబ్బలున్నవి. దెబ్బలు లేకపోతే అసలు మాట వినరు. దెబ్బలు అనగా దిగులు, తెగుళ్లు, శత్రుబాధలు. సంఘ చరిత్రలోకూడ అనగా మనకాలములోకూడ దెబ్బలున్నవి. అంటే శిక్షలు. పాత నిబంధనలో బొబ్బలున్నా, దెబ్బలున్నా, కొంతమంది దిబ్బెక్కినారు. అంటే పరలోకానికి వెళ్లినారు. ఈ బొబ్బలు, దెబ్బలువలన కొంతమంది అవిశ్వాసులైనారు. మరికొంతమంది పైకివెళ్లిరి. భూలోకములో ఉన్నప్పటికిని మన అంతస్థు పై అంతస్థుగానే ఉండవలెను. రేపు రాకడలో భూలోకమునుండి వాయుమండలములోనికి వెళ్ళతారు. రాకడప్పుడు వాయుమండలములోని దురాత్మలను మిఖాయేలు దూత వెళ్ళగొట్టివేస్తారు. ఎందుకనగా పెండ్లికుమార్తె వస్తుంది గనుక ఇక్కడ అడ్డముండకూడదని వెళ్ళగొట్టివేస్తారు. అదొక దిబ్బ.

ఆ దిబ్బను దాటి మనము మోక్షమునకు వెళ్లెదము. మనము భూమిమీదనుండి కొంత ఉన్నత స్థితికి వస్తాము. అప్పుడు సైతానును కసాబిసా (ఇష్టము వచ్చినట్లు) త్రొక్కుతాము గనుక దానిని దాటి వెళ్ళతాము.

ఇశ్రాయేలీయులు ఎఱ్ఱ సముద్రము దాటి గట్టు ఎక్కినట్లు మనమును భూలోకమును దాటి గట్టు ఎక్కుదము. ఆ గట్టు ఎక్కడమే దిబ్బ ఎక్కడము. ఇక్కడ పాపజీవితమును దాటి ఆత్మీయ జీవితము అనే అంతస్థుకు ఎక్కి రాకడప్పుడు వాయు మండలములోని దిబ్బను దాటుదము. సీయోను కొండకు వెళ్ళిపోదుము. అంటే ప్రస్తుతమున్న యెరూషలేములోని సీయోనుకొండకాదు. పరలోకములోని సీయోనుకొండ మహిమ కొండ. మేము (యం. దేవదాసు అయ్యగారు చదువుకొనే రోజుల్లో) లూథరు గిరికి వెళ్ళినప్పుడు, విలేజ్ పోస్ట్‌మాన్ మా ఉత్తరములమీద సీయోను అనేకొండ అని వ్రాసేవాడు. అతనికి తెలియదు అది లూథర్ కొండ అని. ఇప్పుడు మీరందరు ఈ రెండును దాటి నూతన యెరూషలేము వెళ్ళాలి. (1) భూలోకము, (2) వాయుమండల లోకము. అవునా? కాదా? అవును. ఇది భూలోకము. అది వాయుమండలలోకము, భూలోకముమీద దయ్యాలున్నవి. ఆ వాయుమండలములో ఇంకా ఎక్కువ ఉన్నాయి దానిని దాటుట ఏలాగంటే మిఖాయేలు దూత సాతానును ఒక తన్ను తన్నాడు గనుక దానిని సులువుగా జయించగలము. భూలోకమును జయించుట కష్టము గనుక ఇదే ఎక్కువ గడ్డైనది. రాకడకు సిద్ధపడటానికి ఒక సూత్రము చెప్పాను. అది మీరందరు వ్రాసికొన్నారు. గుంటూరువారు వ్రాసికొన్నారు. అదేమంటే ప్రతి నిమిషము **యేసుప్రభువును తలంచుకొనుటయే.** అట్టి తలంపుతో ఉంటే ఎన్ని కష్టాలున్ననూ, హాయిగా ఉండటము అనునది వచ్చును.

ఎప్పుడెంత వీలైతే అంత, క్రీస్తు ప్రభువు తలంపు ప్రతి నిమిషము కలిగియుండవలెను. ప్రభువుయొక్క శరీర, రక్తములను ఎప్పుడుబడితే అప్పుడే ప్రభువు వలన పుచ్చుకొనవలయును. అనగా అంతరంగ సంస్కారము. ఇంకా అట్టి అనుభవ అంతస్థు లేనివారు అట్టి అంతస్థులోనికి వచ్చుటకు ప్రయ త్నించవలెను. అలాగే ఎప్పుడుబడితే అప్పుడే రాకడ తలంపు కలిగి యుండ వలెను. **1. ప్రభువు తలంపు, 2. రాకడ తలంపు, 3. ప్రభువుద్వారా ప్రభు భోజనము పుచ్చుకొనుట అను ఈ సూత్రములు పాటించునప్పుడు రాకడకు సిద్ధపడగలము.** మీకు ఎన్నిచెప్పిననూ సందేహము రాకమానదు. అనగా రాకడను గూర్చిన సందేహము యున్నది. ఇసుక రేణువంత సందేహముంటే రాకడకు ఎత్తబడుట సున్నయే. 'సందేహము' అనునది ఒకసారి వచ్చి మీవల్ల జయింపబడి వెళ్ళిపోతాది,

గాని మరల తిరిగి వస్తాది. గనుక మరలా రాకుండానే దానిని గట్టిగా తోలివేయవలెను. ఈ శ్రమలన్నియు ఎందుకు? రక్షింపబడి, మరణమై మోక్షమునకు వెళ్ళితే బాగుగా యుండును. ఇంక చిక్కులేదు గదా! అని అనుకుంటే రాకడకు సిద్ధపడలేము. మీరు అలాగు ఓపిక గలిగి యుండకపోతే రాకడకు చెడిపోతారు, రక్షణకు కూడ చెడిపోతారు. ఉదాహరణకు:- కొంతమంది 10వ తరగతి పాస్ అగుట కొరకు చదువుదురు. పరీక్షజయము కొరకు కోరి ముందు సిద్ధపడక అప్పటికప్పుడు చదువుదురు. అది చాలా కష్టము. కష్టము కాదా మరి! పరీక్ష ఫలితాలు వచ్చిన తరువాత పరీక్ష పాస్ కానియెడల విచార పడుదురు. 'పరీక్ష ముందు పాస్ అవుదును అన్నారు' ఇలా జరిగిందేమిటి? అని అనగా సందేహపడి, విశ్వాసము నుండి చెడిపోతారు. అలాగే రాకడకు సిద్ధపడుట కూడా యుండును. సందేహము లేకుండగా ఉంటే రాకడకు వెళ్ళవచ్చును. మనిషిని చెడగొట్టేది పాపము కాదు దయ్యము కాదుగాని "సందేహము". మనలను చెడగొట్టుటకు ఇది ముఖ్యమైయున్నది. హవ్వ ఆ సందేహములోనే పడిపోయినది. సర్పము సందేహము పుట్టించే ప్రశ్నవేసినది. ఆ ప్రశ్న ఏమిటి? ఇది నిజమా? ఈ ప్రశ్నవేయగానే 'ఇది నిజముకాదు కాబోలు' అనే సందేహము పుట్టినది. అందుచేత నిషేధింపబడిన పండు హవ్వమ్మ తినెను. దైవభక్తులు ఇంకే పాపములోను పడరుగాని ఈ సందేహమను పాపములోనే సులువుగా పడుదురు. అయినను రాకడ విశ్వాసులు లేచి వచ్చెదరు గాని సందేహములో పడిపోవుటను బట్టి బలహీనులు అవుతారు.

ఒక బలవంతుడు గబగబ పరుగెత్తి బోర్ల పడిపోయినాడు. గనుక 1. పడ్డాడు, 2. పండుకొన్నాడు, 3. పులకరింపు జ్వరము వచ్చినది. 4. పనిమానివేసినాడు. అలాగే పరమ భక్తునికి ఒక సందేహము వస్తే దాని విసుగు ఎంత దూరమైన వచ్చును, గనుక సందేహము రానియ్యకూడదు. పౌలుకు మనవలె సందేహము వచ్చినపుడు, ఆ సందేహములు తీర్చివేసికొనే పనిమీద యున్నాడు. అందుకే దేవుడు అతనికి గొప్ప ప్రత్యక్షతలు ఇచ్చినాడు. ఒకప్పుడు సాతాను, లూథరు దగ్గరకు వచ్చి- 'లూథరూ! నీలో ఫలాన, ఫలాని పాపములు యున్నవి గదా' అని పెద్ద కాగితము తీసికొని వచ్చెను. అప్పుడు లూథరుగారు ఏమన్నారంటే సాతానుతో 'ఇంకా ఏమైనాయుంటే జ్ఞాపకము తెచ్చుకొని అవికూడ వ్రాసికొనుము' అని అన్నాడు. అప్పుడు సైతాను ఏమి చెప్పలేక పోయినాడు. వెంటనే లూథరు ఒకమాట అన్నాడు.

'నా పాపములు అన్నియు యేసుప్రభువు కొట్టివేసినారు. ఇంకా నా పాపములు ఎక్కడయున్నవి' అని అన్నాడు. సాతాను దానికి ఏమి జవాబు చెప్పలేక పోయినాడు. అప్పుడు లూథరు తనముందు ఉన్న బాటిలు సిరాతో గోడమీద సిలువ గుర్తు పడునట్లుగా దానిని కొట్టెను. కొట్టిన ఆ సిరా డాగు నేటివరకు యున్నది. ఈ సిరా డాగు (మరకను) చూచుటకు ఈ 400 ఏండ్ల నుండి తీర్ధయాత్రవలె ప్రజలు అన్ని ప్రాంతములనుండి వస్తున్నారు. కానివారు ఒక తప్పు చేస్తున్నారు. ఆ ఒక తప్పు ఏమిటంటే ఆ సిరా మరక ఉన్న గోడపై పెచ్చులు మన దగ్గర యుంటే, మనకు ఏదో ఒక మేలు యుంటుందని వారు తీసికొని వెళ్ళుచున్నారు. అక్కడి భక్తులు తీసికొని పోవుచుండగా, వారు మరల ఆ సిరా మరకను ఆ గోడకు పూయుచున్నారు. లూథరు యొక్క బలహీనత "కోపము". తన మనస్సుకు సరిపడనిది. ఏదైనా ఉంటే, లూథరు తన ఎదుటివాడు ఎంతటివాడు ఆయన కోపపడుటయే ఆయన అలవాటు. పోపుమీద కోపము పడగా ఆ కోపము కోపపడుట దేవునికి పనికి వచ్చినది. కోపపడిన లూథరును హింసించుటకు వర్మ్స్ అను పట్టణమునకు పిలిపించిరి. ఆయన స్నేహితులు అందరును బ్రతిమాలినను, ఆ పట్టణమునకు లూథరు వెళ్ళుట మానలేదు. "వర్మ్స్ పట్టణములోని ఇండ్లమీద ఉన్న పెంకులన్ని దయ్యములు నాకు అడ్డువచ్చిననూ అనగా పెంకులన్నీ, దయ్యములుగా మారిననూ వెళ్ళకమానను" అని జవాబిచ్చెను. 'ఒకవేళ నన్ను చంపివేస్తే దేవునియొక్క ఈ పనిని దేవుడే కొనసాగించుకొనును' అని చెప్పెను. లూథరుకు కోపమున్నప్పటికిని ధైర్యమును, ప్రాణత్యాగమును యున్నది. కాబట్టి ప్రాణత్యాగము ఉంటే ఏమియు ఆటంకముండదు.

పేతురు నీళ్ళమీద చక్కగా నడచి... నడిచి కొంతసేపటికి మునిగి పోవుచున్నాడు (మత్త. 15:29,30). అప్పుడు పేతురు ప్రభువా! అన్నాడు. అప్పుడు నీవు ఎందుకు సందేహపడితివి అని ప్రభువు పేతురును లేవనెత్తినాడు. సందేహము మనకుకూడా వస్తే ప్రభువు లేవదీయును. మనకు దేవుని విషయములపై సైతాను సందేహము పుట్టించును. దాని పని సందేహములు కలిగించడమే. మనయొద్ద సైతాను ఎప్పుడూ పొంచియుండును.

'ప్రక్కనే యున్నాడు పగవాడు – మన చక్కికి జేరెను శనిగాడు' ?మెళుకువగా? 1. నేను మరలా వస్తాను, 2. మిమ్ములను తీసికొని

వెళ్ళుతాను. 3. నేనుండు స్థలములోనికి తీసికొని వెళ్ళుతాను అని ప్రభువు అన్నా, ప్రజలు ఈ మూడు నమ్మక, సైతాను చెప్పినదే ఎందుకు నమ్మవలెను? ఆదాము, హవ్వలను పండు తినవద్దని దేవుడు చెప్పిననూ, వారు దేవుని మాట వినక, సాతాను మాట వినుటను బట్టి కీడు వచ్చింది. ఎవరికైన అపనమ్మకము ఉంటే, వారు పడకుండా ఉండలేరు. ఎవరైనా పడిననుగాని పేతురువలె లేవవలెను. సైతాను యున్నాడు. గనుక సందేహము పుట్టిస్తాడు. కాని మనిషి దేవునిమాటమీదనే యుంటే, సాతాను మనిషిని విడిచి వెళ్ళిపోవును. పేతురు నడచినాడు సందేహము యున్నదా? లేదు. సందేహమేయుంటే ఎందుకు నడుస్తున్నాడు! ప్రభువు దగ్గరకు వచ్చిన తరువాత సందేహము పుట్టింది. అది వరకు దూరముగా యున్నప్పుడు తన దృష్టి ప్రభువుమీదయుంచి మనోనిదానము గలిగియున్నాడు. చూపు ప్రభువు వైపు యున్నది. అందుచేత మునగలేదు. దగ్గరకు వచ్చిన పిమ్మట చూపులో లోపము (సందేహము) వచ్చినది అనగా ఇరుప్రక్కల కెరటములుచూచి, సందేహముపుట్టినది. వెంటనే మునగసాగెను. బైబిలులో ఒక ఆయన ఉన్నారు. ఆయన ఏలియా. ఆయనకు మనోనిదానము ఎక్కువ. ఆయనకు అంతా దేవునిపై దృష్టియే. అందుచేత ఆయన ఎన్నడును పడలేదు.

ప్రవక్తయైన ఏలియా అటు ఇటు చూడకుండ ప్రభువు మాటమీద అనుకొని, మనోనిదానము కలిగియున్నందున ఆకలిలేదు, దప్పికలేదు, అలసటలేదుగాన హెూరేబు కొండమీదకు జర్రున వెళ్ళిపోయెను. అక్కడ ఏలియాకు 40రోజులు మనోనిదానము చెడలేదు. ఎంత ఆశ్చర్యకరమైన వ్యక్తి! అలాగే రాకడమీద మన దృష్టియుంటే పడము. ఏలియా తూలిపోలేదు, వెళ్ళిపోయినాడు. మనము ఏలియావలె అంత కష్టపడనక్కరలేదుగాని మనదృష్టి అంతా ప్రభుని రాకడ తలంపు మీదనేయుంటే, సుళువుగా రాకడ మేఘ మెక్కగలము.

1. అవిశ్వాసముతో కూడిన సందేహము పనికిరాదు. 2. తెలిసికొన వలయుననే సందేహము పరవాలేదు. ఖైదులో యున్న స్నానికుడైన యోహాను ఈ ప్రశ్న పంపినాడు. 'రాబోవువాడవు నీవేనా? ఇంకొక వ్యక్తి కొరకైనా కనిపెట్టవలయునా?' ఆ ప్రశ్న తనలో పెట్టుకొనియుంటే, క్రమముగా అవిశ్వాస ములోనికి పోవునుగాన సందేహము తీర్చుకొనుటకు ప్రభువు దగ్గరకు శిష్యులను పంపెను. ప్రభువు వారికి జవాబు ఇచ్చెను. మొదటి రాకడ వార్తావాహిని అయిన యోహానును హేరోదు పుణ్యము గట్టుకొని

రెండవ రాకడ వార్తావాహిగా యుండునట్లు చంపివేసెను. హేరోదులో ఆ తలంపులేదు. గాని ప్రభువు జరుగనిచ్చుటలో యున్నది. రాకడ విషయములో ప్రభువు ఏమి పని చేయు చున్నాడో, సన్నిధి కూటములో ఎప్పుడైనా మీరు అడిగి తెలుసుకొంటే, పెద్దలిస్టు ప్రభువు మీకు తెలుపుతారు.

"చేయదేమియు ప్రభువు సభకు - చెప్పనిదె యనుచున్నది = ఆయత్తమౌ నాటికి తేది - అందు ననుచు నున్నది - మాయలేదను చున్నది హోయి హోయి యను చున్నది" ॥వధువు॥ యోహాను అక్కడ అనగా పరలోకములో ఊరకనే కూర్చుని యుండలేదు. అక్కడ ఇద్దరు యోహాను లున్నారు. స్థానికుడైన యోహాను సువార్తికుడైన యోహాను. **రాకడ నిమిత్తము వారు మహిమలో ఏమేమి చేయుచున్నారో తెలిసికొనుటకై ఒకనాడు వారిని పిలవండి.** మీ ఊరిలో సన్నిధి కూటము పెట్టుకొంటే, ఇంకా ఎక్కువ పరలోక మర్మాలు వింటారు. రోజుకు ఒక గంట చొప్పున ఉండుమని నేను (యం. దేవదాసు అయ్యగారు) చెప్పుచున్నాను గాని ఎల్లవేళల సన్నిధిలో ఉన్నయెడల ప్రభువు అన్ని సంగతులు మీకు చెప్పును. గుడి దగ్గరనుండి ఇంత దూరము రాలేకపోయినను, రావడము చేతగాకపోయినను సాయంకాలము 7 నుండి 10 గంటల వరకు సన్నిధి కూటమును ఇంటిదగ్గర పెట్టుకొనండి. నేను చెప్పినదానికంటే అనేకరెట్లు ప్రభువు మీకు చెప్పును.

రాకడ ట్రైన్ ఎక్స్ ప్రెస్ వేఘముగా వచ్చుచున్నది. ఇంతపాఠము చెప్పిన తరువాత సందేహము యున్నదా! ఒక మనిషియున్నాడు. బాగా సిద్ధపడి రాకడ కొరకు నడుచుకొంటాడుగాని చనిపోయినాడు. అట్టివాని గతి ఏమిటి? సిద్ధపడి చనిపోయినప్పటికిని, రాకడ వలన ఫలితము అనుభవిస్తాడా?' అనుమాట ప్రభువు నడుగగా, ప్రభువు అన్నారు 'పరవాలేదులే! రాకడప్పుడు మేఘములో వచ్చేవారికి ఇచ్చు ఫలితము ఇస్తాను'. ఈ మాట నా మాటగా ప్రభువు చెప్పమన్నారు. కాబట్టి తయారయ్యియుండండి. అయితే రాత్రి 7 గంటల నుండి 10 గంటలవరకు సన్నిధిలో ఉంటే సందేహముండదు. రాకడ వరకు ఆలాగున ప్రతి నిమిషమును ఆయన తలంపు కలిగియుండుటకు ఆయన సన్నిధిలో మన సమస్త సందేహములు తీర్చుకొని, తయారై, రాకడకు సిద్ధపడియుండే భాగ్యము ప్రభువు మీకు అనుగ్రహించును గాక. ఆమేన్.

---

**19-5-1959వ సం॥లో దేవదాసు అయ్యగారు చేసిన ప్రసంగము.**

# ఇరువది సందేశము

# రెప్పపాటు - సిద్ధపాటు

*దా. కీర్తనలు 18:9; మత్తయి 24:27; 1కొరింథీ. 15:51-52*

**"ఒక రెప్పపాటున, కడబూర మ్రోగగానే మనమందరము మార్పు పొందుదుము". 1కొరింథీ. 15:52.**

*నీ కిష్టులైనట్టి లోకవాసులకు= రాక మానదు శాంతి రంజిల్లు వరకు దేవ ॥దేవ॥*

ప్రియులారా! దేవప్రియులారా! మీరు పాడుకొన్న కీర్తనలో నున్న ("దేవ ప్రియులగుడి-క్రిస్మస్ దేవ ప్రియులగుడి దేవునికిష్టులౌవారలకు ఈ వసుధను లభియించును శాంతి...") దేవుని ప్రియులారా! దేవునికిష్టమైన వారికి సమాధానము కలుగునుగాక అని ఎవరినిగూర్చి వ్రాయబడినదో ఆ ప్రియులారా! డిసెంబరు నెలలో లూథరు మిషనులోను, చర్చిమిషనులోను, రోమన్ కథోలిక్ మిషనులోను మూడు సంగతులనుగూర్చి ఉపన్యాసములు జరుగును. మొదటి ఉపన్యాసము ప్రభువు బేత్లహేమునకు వచ్చుట. రెండవ ఉపన్యాసము మనము ప్రార్థన చేయునప్పుడెల్ల ప్రభువు మనయొద్దకు రావడము. బేత్లహేమునకు అనగా భూమిమీదికి వచ్చుట. ఇప్పుడు అనగా ప్రార్థించినపుడు మనయొద్దకు రావడము. మూడవ ప్రసంగము ఏమనగా, మేఘాసీనుడై మనలను తీసికొని వెళ్లుటకు మనయొద్దకు రావడము. ఈ మూడు రాకడలను గురించి ఈనెలలో ప్రసంగములు జరుగుచుండును. కాబట్టి నేను ఈవేళ 3వ రాకడ అనగా ప్రభువు మేఘాసీనుడై వచ్చుటయు, మనకొరకు తిరిగి వచ్చుట అనువిషయమై కొంతచెప్పెదను.

ప్రభువు బేత్లహేములోనికి వచ్చుట మొదటి రాకడ. మేఘాసీనుడై వచ్చుటయు, సంఘమును తీసికొనివెళ్లుటకు వచ్చుటయు, రెండవ రాకడ. న్యాయము చొప్పున ఆయన పెండ్లికుమారుడుగా వచ్చుట అనునది 3వ రాకడ కావలెను. కానీ అది బైబిలులో ఎక్కడనులేదు. బేత్లహేమునకు వచ్చిన రాక భూమిమీదనున్న వారందరికొరకు వచ్చిన రాకడ. అందుకే దూతల యొక్క పాటలో భూమిమీద సమాధానము అని వ్రాయబడి ఉన్నది. అయితే సంఘములోనికి వచ్చిన రాకడ ఏదనగా, మనము ప్రార్థించేటప్పుడు ఒక్కొక్కరి యొద్దకు వచ్చే రాకడ, మేఘములోనికి వచ్చే రాకడ, తన సంఘముకొరకు మాత్రమే ఒక రాకడ భూలోకమందలి వారికొరకు వచ్చే రాకడ మరియొక రాకడ. ప్రభువు పెండ్లికుమారునిగా

మేఘముమీద మధ్యాకాశమునకు వచ్చే రాకడ ఒక ప్రత్యేక కార్యక్రమము. దానికొరకు ప్రత్యేకముగా సిద్ధపడవలెను. ఆ ఎగిరి వెళ్ళే గుంపులో అనేక వరుసలలో ఉన్న భక్తులుందురు గనుక ఆ రాక కొరకు సిద్ధపడవల్సిన బాధ్యత ప్రతి నరునిమీద ఉన్నది. ఆ భక్తుల వరుసలు ఈలాగున ఉన్నవి. (1) ప్రభువు భూమిమీద జన్మించినపుడు ఆయన బోధవిని మార్పుచెంది సిద్ధపడిన వరుస. (2) ఆయన సంఘము ద్వారా విని మార్పు చెందిన భక్తుల వరుస. (3) ఈ కడవరి కాలములో పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొంది రాకడకు సిద్ధపడిన భక్తుల వరుస. ఈ వరుసలోనే అనగా నీటి బాప్తిస్మము పొంది ఆత్మ బాప్తిస్మము పొందిన వారిలోనుండియే గాక మరికొంతమందిని కూడ ప్రభువు ఏర్పాటు చేసికొనియున్నారు. అనగా నీటి బాప్తిస్మము పొందని వారిలో నుండియు కొంతమందిని ఆయన తన రాకడకు ఆకర్షించుకొనును. ఇదొక వరుస. అది ఆయన వాక్కు ఈ గుంపుల వారి నందరినీ ఆయన రెప్పపాటులో ఆకర్షించుకొనును.

ఈ రెప్పపాటు అనే గుర్తు లోకమునకు ఎప్పటినుండో యున్నది. ఎప్పటి నుండి యున్నదనగా 2000 సం॥ల యున్నది. ఈ రెప్పపాటు అనేగుర్తు రెండు వేల సంవత్సరములనుండి ఈలాగేయున్నది. తక్కిన గుర్తులు జరుగుట, జరిగిపోవుట జరుగుచున్నవి. తక్కిన గురుతులు లోకములోనున్నవి. ఈ రెప్పపాటు గురుతు మన శరీరములో యున్నది. మనము ఎన్నోసార్లు రెప్ప వేయుచున్నాము. రెప్పవేసిన ప్రతిసారి రాకడ విషయము గురించి తలంచు కొనవలయును. అట్లుచేయుట అసాధ్యమే. కాని రోజులో ఒకసారైనా రాకడ విషయములు తలంచుకొనవలయును. రెప్పపాటు అంటే ఏమిటో తెలిసి కొనడానికి శాస్త్రజ్ఞులు కనిపెట్టారు. 1గంటకు 60 నిమిషములు. 1నిమిష మునకు 60 సెకండ్లు, 1 సెకండును 11 భాగములు చేయగా 1/11వ భాగము 'రెప్పపాటు' అని గుర్తించిరి. రోజు కంటె గం॥లు తక్కువ. గం॥ల కంటె నిమిషమును ఎంతో తక్కువ. నిమిషమే ఎంతో తక్కువ అనుకొంటే అందులో సెకెండు మరీ తక్కువ. ఆ సెకెండు మరింత తక్కువనుకొంటే ఆ సెకండులో 1/11వ భాగము రెప్పపాటు. ఇంత దీర్ఘకాలములో సిద్ధపడలేని మనము 1/11వ భాగము కాలములో సిద్ధపడగలమా? సిద్ధపడలేము. రాకడకు సిద్ధపడకపోతే, అసలు పుట్టగతులేయుండవు. అందుచేతనే దేవుడు రోజులో ఒకసారైనా రాకడ విషయములు తలంచుకొంటూ యుండమన్నారు. 'నేనిక సిద్ధంబుగా లేనని తెలిసినది నిరుకు = గానన్ పరిశుద్ధాత్మయే నన్ను కడకు సిద్ధము చేసికొనును' ॥త్వరగా రానున్న॥ 'క్రీస్తుప్రభువు నన్ను సిద్ధపర్చును. నాయంతటనేను

సిద్ధపడలేను. నా వల్ల కానేరదు. ఓ ప్రభువా! తండ్రీ! నీవే నన్ను సిద్ధపర్చుము. నేనింతవరకు సిద్ధముగాయున్నాను. తరువాత విషయము నీవే చూచుకొని నన్ను రాకడకు సిద్ధపరుచుము' అని ప్రార్థింపవలెను. సిద్ధపడుట అనగా మొదట మన పాపములను ఒప్పుకొనవలెను. ఇక ఎన్నటికి చేయనని పూర్తిగా ఒప్పుకోవలయును. మరలా ఆ తప్పును చేయకూడదు.

పడిపోవుట మానవనైజముగాన తప్పిదములో పడిపోయినపుడు మరల వెంటనే ఒప్పుకోవలయును. ఎవరైనసరే సిద్ధపడవలెనంటే, క్రీస్తు ప్రభువుతో వెళ్ళవలెనంటే, మన పాపములు దేవుని ఎదుట ఒప్పు కొనవలెను, ఒప్పుకొనిన పాపములనుండి తప్పుకోవలయును. (1) మనము ఒప్పుకొనుట, (2) తప్పుకొనుట, (3) చెప్పుకొనుట, ఈ మూడు పద్ధతుల ప్రకారము ఎవరు చేయగలరో వారు సిద్ధపడగలరు. వారు ఇంక ఏమి చేయవలెనంటే, దేవుడు చేసిన మేళ్లన్నిటికి స్తుతి చేయవలెను. కృతజ్ఞతాస్తుతి చేయవలెను. అట్లుచేసిన తరువాత ప్రభువు రాకడకు సిద్ధపడియున్నాను అనుకోవలయును. 'నేనెంతవరకు సిద్ధపడి ఉండాలో!' అని అంతవరకు సిద్ధపడి ఉండండి. రాకడకు అనగా 1/11వ భాగమునకు సిద్ధముచేయుమని ప్రార్థన చేయవలెను. '**మనము సిద్ధపడనిదే, నన్ను సిద్ధపర్చుము అని అడుగుటకు నోరురాదు.** ఒకవేళ నోరు వచ్చినను మనస్సు రాదు. ఒకవేళ మనస్సు వచ్చిననుగాని అది హృదయ పూర్వకముగా కాదు. కారణము ఏమనగా మొదట సిద్ధపడి ఉండకపోవుటయే. సిద్ధపడేవారైతే ఈ ప్రార్థన స్వయముగా ఉంటుంది. మరియొక సంగతి చెప్పుదును. బాగా వినండి, బాగా గుర్తు పెట్టుకొనండి. ఆ కాలములో ఏమి జరుగుననగా సిద్ధపడియుండే వారు మంచి పనిమీద నున్నను, ఆపదలోనున్నను, గాఢనిద్రలో ఉన్నను, కష్టములోనున్ననూ, హానిస్థితిలో ఉన్నను, శ్రమలోనున్నను వెళ్ళిపోవుదురు. ఈ శ్రమలు కేవలము శరీరమునకే. శరీరము మాత్రమే శ్రమలలోయుంటుంది గాని ఆత్మ జీవము తగ్గదు. అందుచేత ఆత్మకును, శరీరమునకును సంబంధములేదు. గనుక చింతలేదు. ఒకరు మంచిపనిమీద ఉన్నపుడు బండికి వెళ్లవలెనంటే, ఆ పని ఎంత అర్జెంటు అయినను సరే, మరియొకరికి అప్పగించి ట్రైనుకు వెళ్ళిపోతారు. 'ట్రైనుకు వెళ్ళవలసినవారు కష్టములోనున్నను, ఆ సమయమునకు వెళ్ళవలెను కాబట్టి వెళ్తారు. అప్పటికి ఇంకా బండి రాకపోతే స్టేషనులోనే కునికిపాట్లు పడతారు. టిక్కెట్టు ముందే కొనుకుంటారు గనుక నిద్రలోనున్న సమయములో బండికి గంటకొట్టగా, తుళ్లిపడిలేచి వెంటనే బండి ఎక్కుతారు. ఇవి లోకసంబంధ

సంగతులు. **రాకడ సమయమున మీకుకూడ అట్లే జరుగుతుంది. గనుక మనము ముందే సిద్ధపడవలెను.** తరువాత ఆయన సిద్ధపరుస్తారు. ఆ తరువాత ప్రభువు వచ్చి తీసికొని వెళ్లును. గనుక క్రిస్మస్ పండుగ మొదటి రాకడ, డిసెంబరు నెలలో మనమందరమును తలస్తున్నాము. మన ఎదుట గోడ ఉంటే అవతల ఏముందో! అని గోడెక్కి చూస్తాము. అలాగే మన ఎదుట క్రిస్మస్ పండుగ ఉన్నది. క్రిస్మస్ పండుగ అనేదానికి ఎదుట రాకడయున్నది. గనుక క్రిస్మస్ పండుగలోనే మనకు రాకడ పండుగలు ఉన్నవి. క్రిస్మస్ పండుగరోజున క్రీస్తు ప్రభువు తొట్లోయున్నట్లుగాను, రాకడ తలంచుకొంటే, మహిమ వస్త్రములు ధరించుకొని మధ్యాకాశములో మేఘముమీద నిలుచునట్లుగాను మన గుర్తుకు వచ్చును. అయితే ఆ గడియవరకు ఎదురుచూడాలి. అప్పుడు సిద్ధపడగలము. ఆ గడియవరకు అనగా ఆ రెప్పపాటుకాలము వచ్చువరకు చెడ్డపనులు మాన వలయును, మంచిపనులు చేయవలయును. ఈ పండుగలనే ఆ గురితో మనము చేయాలి. ఈ ప్రకారంగా మనముంటే రాకడకు సిద్ధపడగలము. ఇప్పుడు నేను ఈ గురుతులను గురించి, భక్తుల మరణములను గురించి, పరిశు ద్ధ రాకడను గురించి చెప్పాను. క్రిస్మసన్ను గురించి చెప్పాను. రాకడను గురించి చదువుదురు గనుక తెలిసికొనగలరు, చదువుతారు. క్రైస్తవ ప్రసంగములలోను, పత్రికలలోను రాకడను గురించి క్రిస్మస్ పండుగ అనగా రాకడపండుగకు ముంగుర్తుగానున్న పండుగ. గనుక ఇంటికి వెళు ళ్లటకు త్వరపడుచున్న ఓ సంఘస్తులారా! ప్రభువు రాకడకు త్వరపడండి. గనుక ఏ పండుగ గొప్పది. రెండవ రాకడ పండుగే. ప్రభువు జన్మించి 2000 సం॥లు జరిగినది. జరిగిన ప్రభువు జన్మము. తలంచుకొని క్రిస్మస్ ఆచరిస్తున్నాము. అలాగైతే రాబోయే రాకడ పండుగను తలంచుకొని ఇంకా ఎక్కువ చేయాలి. ప్రభువు రాకడలో వస్తున్నారంటే కొంతమందికి భయము, సిద్ధపడలేదు గనుక భయము. సిద్ధపడని వారికి వారు సిద్ధపడు నిమిత్తమైన ప్రసంగాలు బోధకులు చేస్తున్నారు. ఇప్పుడు అన్ని దేశములలోను భక్తులు ఎక్కువగా బోధలద్వారాను, పత్రికలద్వారాను విరివిగా రాకడ ప్రసంగములు చేస్తున్నారు. ఈ కొద్దిమాటలు ప్రభువు మీ హృదయములో ముద్రించి, స్మరించి, తన రాకడకు సిద్ధపర్చునుగాక! ఆమేన్.

***యేసుక్రీస్తు ప్రభువు భువికి నెప్పుడు వచ్చినన్ గాని = ఈ సమయమునందె యంచు - నెప్పుడు నమ్ముచున్న యెడల నెగిరి వెళ్ళగలవుగా ॥శ్రీయేసు॥***

---

1. 11-12-1955వ సం॥లో దేవదాసు అయ్యగారు చేసిన ప్రసంగము.

## ఇరువది ఒకటవ సందేశము

# సిద్ధపడుట- ఆయనయొద్ద ఉండుట

*యెష, 10:3-4; లూకా. 1:5-17; 1థెస్స. 4:17*

**"ఆలకించుడి, అడవిలో ఒకడు ప్రకటించుచున్నాడు ఎట్లనగా- అరణ్యములో యెహోవాకు మార్గము సిద్ధపరచుడి" యెష 40:3.**

యేసుక్రీస్తు వారి చరిత్ర పరీక్షించినపుడు మనకు తెలిసిన అంశము లేవనగా, ఆయన జన్మము, బోధ, రోగులను బాగుచేసిన చరిత్ర, పాపుల రక్షణకొరకై సిలువమీద చనిపోయి లేచిన చరిత్ర, ఆయన పరమునకు వెళ్లిన చరిత్ర. అయితే ఆయన మరల రానైయున్న కథ జరుగలేదు. ఆయన జన్మ కథకు ముందు "ప్రభువు వస్తారని" ఒక కథకుడు చెప్పిన కథ నెరవేరెను. ఆయన ఇప్పుడు రెండవసారి వస్తారు. ఈ రెండు కథలకు మధ్య మనమున్నాము.

ప్రభువు భూలోకములో పుట్టకముందు యోహాను వచ్చి, యేసుక్రీస్తు వారు వచ్చినారని చెప్పెను. యోహాను గారు ప్రభువుకంటే 6 నెలలకు ముందు పుట్టెను. 30 సం॥ల వయసు ఉన్నప్పుడు ఇద్దరు పనిలో ప్రవేశించిరి. యోహాను ప్రవక్తలు చెప్పిన ఆయన వచ్చెనని చెప్పెను. గనుక మొదట యోహాను చరిత్ర తెలిసికొనవలెను. యోహాను నీతిసూర్యుడైన యేసుప్రభువు రాకకు ముందు వచ్చిన వేగువ చుక్కవంటివాడు. యోహాను రాకతో ఆయన వచ్చినాడని తెలిసిపోయెను. యోహానుకి, చుక్కకి ఉన్న సంబంధము మనకును రాకడకు ఉన్నది. రాకడ బోధకుల పని ఏదనగా, ఆయన రాకకుముందు 'ఆయన 'వస్తాడు, సిద్ధపడండి' అని చేసే బోధయే. ఇది ఒక వేకువచుక్క ప్రభువు వస్తున్నాడనే దానికి ఇదే గుర్తు. ఇంకా అనేక గుర్తులున్నవి. అన్ని వేకువ చుక్కలే. యోహాను పుట్టకముందు, గుడిలో ఒక పూజారిగలడు. ఆయనపని గుడిని తుడుచుట, శుభ్రము చేయుట, దీపములు వెలిగించుట, యోహానుకు, ప్రభువుకు మధ్య ఒక ముసలి పూజారి వారు ఉన్నారు. వారికి సంతానములేదు. వారు భక్తిపరులుగా చనిపోవుటకు సిద్ధముగానేయుండిరి. పూజారులు గుడి లోనికి పోవలెను. ఆ కాలమునకు 24 గురు పూజారులున్నారు. ఒకొక్కరు ఒక్కొక్కవారము చేయవలెను. ఆయన వారములో ఆయనే లోపలికి

పోవలెను. తక్కినవారు బయట ప్రార్థించవలెను. మరల భయటకు వచ్చేవరకు వీరు ప్రార్థించవలెను. లోపలి గర్భాలయములో ఈ పూజారి ధూపము వేయుచు ప్రార్థించుచుండెను. పూజారి ప్రార్థనచేసి ముగించితేనేగాని వెలుపలికి రారు. భక్తులు రెండు రకములు 1) ఆజ్ఞ ప్రకారము నడుచు భక్తులు 2) ఆచార ప్రకారము నడచేభక్తులు. ఈ రెంటిలోను భక్తులైయుండవలెను. 'ఆత్మ శుద్ధిలేని ఆచారమదియేల' గనుక ఆజ్ఞలు, ఆచారములు రెండునూ ఉండవలెను. లోకములో భార్యభర్తలిద్దరును భక్తులుగా యుండవలెను. ఒక్కొక్కరిలో పై రెండు రకముల భక్తి నుండవలెను. యాజకుడిట్లు ప్రార్థించుచుండగా దేవదూత వచ్చెను. ఆయన హడలిపోయెను. ప్రార్థనలో హడలిపోవచ్చునా? మనమెంత ప్రార్థన చేసిననూ దేవదూతలవంటి వారముకాము గనుక హడలి పోవుదుము. అయితే ఈ పూజారి దంపతులు మనుషుల ఎదుట భక్తులు, దేవుని ఎదుట భక్తులు.

వారు 1. ఆజ్ఞలు, ఆచారములు గలవారు.

2. భార్య, భర్తలు ఏకీభవించువారు.

3. దేవుని ఎదుట, మనుష్యుల ఎదుట భక్తి కలిగినవారు.

దూత వచ్చి భయపడవద్దు నీకు కుమారుడు కలుగునని చల్లని కబురు చెప్పెను. 1) భయపడకుము, 2) నీ ప్రార్థన వినబడెను, 3) నీకు కుమారుడు. కలుగును. 4) అతడు గొప్పవాడగునని చెప్పెను. తాను చేసిన ప్రార్థన వినబడెను. పూజారిగారు సంతానముగూర్చియే ప్రార్థన చేసియుండ వచ్చును. అలాగు జన్మించిన దేవుడు తల్లిదండ్రుల వరమతనికి కలదు. అనగా భక్తి వరము కలదు. కుమారునికి దేవుని ఎదుట గొప్పవాడైయుండు వరము కలదు. గనుక పిల్లలు తల్లిదండ్రులకన్న ఎక్కువ భక్తులైయుండవలెను. 5) లోకమునకు రావలసిన రక్షకుని గురించి చెప్పును అనెను. 6) మద్యము త్రాగడు, బైరాగైయుండుననెను. ఆయన పని 17వ వచనములోనున్నది. ఆయత్తపడిన వారిని ఆయత్త పరచుట అనే పని. ఉదా:- ప్రభువు బోధ తెలిసిన వారొక గుంపుగా ఉన్నారు. ఒక బడిలో తరగతి ఉన్నది. అందులో 30 మంది విద్యార్థులున్నారు. 20 మంది బాగుగా చదివిన వారు పరీక్షలకు ఇంకా వారమున్నదనగా పాఠములన్నియు

తిరగవేస్తారు. అశ్రద్ధగలవారు 10 మంది గలరు. వారిని విడిచిపెట్టి శ్రద్ధగలవారికే వారికే మరలా చెప్పవలెను. ఎందుకనగా వారము మాత్రమే ఉన్నది. ఎవరైతే ప్రభువు కొరకు కనిపెట్టిరో, వారికి బోధించుము అని దూత యోహానుతో చెప్పెను. ప్రభువు కొరకు సిద్ధ పడియున్న వారిని మరల సిద్ధపరచుటకై ఆయన వచ్చెను. ఆ కాల భక్తులు ప్రభువు వస్తారని విని నమ్మి ఎదురు చూచుచున్నారు. వారిని సిద్ధపరచక పోతే, ఆయన వచ్చిన తరువాత నమ్మరు. సిద్ధముగా నున్నవారిని ఇంకా సిద్ధపరచుటకై ఆయన వచ్చెను. ప్రభువు రెండవసారి వస్తారని మీరు విన్నారా? విని సిద్ధపడుచున్న మిమ్మును సిద్ధపరచుటకై, ఈ బోధలు బయలుదేరెను. వారిని ఇంకా సిద్ధపరచకపోతే, వారుకూడ వెళ్ళరు. సిద్ధపడనివారికి కూడ చెప్పవలెను. అందరికి చెప్పుచు సిద్ధపడుచుండవలెను. ఈ రాకడ బోధకులు ఎక్కువ మంది కావలెను. రాకడ బోధకు సిద్ధపడుటకు "రండి" అంటే మాకు తీరుబడి లేదందురు. సిద్ధపడియున్నవారికి బోధించేటందుకు. అనేకమంది బోధకులు కావలెను. జకర్యా, ఆయన భార్య ముసలి వారయ్యే వరకు ప్రార్థించే వారు. అలాగే మనము ప్రార్థించవలెను. వారు ప్రార్థించిరి గనుక కుమారుడు పుట్టెను. అలాగే మీరు ప్రార్థించితే బోధకులనేకులు వత్తురు. ఈ కాలమందు బాగా సిద్ధపడువారు ఎవరంటే ఎవరు బాగా ప్రార్థించుదురో ఎవరు ప్రార్ధన ధూపము బాగా వేస్తారో, ముసలి తనము వచ్చిననూ, ప్రార్థిస్తారో వారే సిద్ధపడుతారు.

వారే రాకడను నమ్ముచున్నారు. వారు విన్నారు. ప్రార్థించు చున్నారు. కనిపెట్టుచున్నారు, సిద్ధపడినారు. ఇంకా బాగా వినేటందుకు ఇంకా గొప్ప బోధకులను పంపించుము. యోహానులాంటి భక్తులను, వరపుత్రులను పంపుము. యోహాను, ఏలియాయొక్క ఆత్మయు, శక్తియుగలవాడు. ఏలియా గుణము ఏదనగా, మనిషినిచూచి ఆయన ఎటువంటివాడో చెప్పుట. యోహానుకూడా అటువంటివాడే. ఇప్పుడు ముఖ్యముగా రాకడ బోధ చేయవలెను. 'వినుట, నమ్ముట, ప్రార్థించుట, కనిపెట్టుట; వీటితో మనము కొంతవరకు సిద్ధపడినాము. అయితే ఆయన యొద్ద ఉన్నయెడల పరిపూర్ణముగా సిద్ధపడుదుము.

లూకా 8:38; మార్కు 5:18లో పన్ను నీయొద్ద ఉండనిము అని ప్రభువు వలన స్వస్థత నొందిన యొక గదరేనీయుడు ప్రార్థన చేసెను.

అతడు కోరుకొన్న నివాసము, ప్రభువు సన్నిధానము. అతడు చేసిన ప్రార్థన. 'నీయొద్ద 'ఉండనిమ్ము' అనునది. నీవు ఆయన సన్నిధిని కోరుకొనుట లేదా? ఉండనిమ్మని ప్రార్థించుటలేదా? ఈ కోరికయందును, ఈ ప్రార్థన యందును నిలకడగా నుండుము. గోరీలలోనుండినవాడు, దయ్యములతో నుండినవాడు, దిగంబరియై యుండినవాడు, మార్గస్థుల మీద పడవలెనని ఉగ్రుడై వెళ్లుచుండినవాడు, నేడు యేసునొద్ద నుండగోరుచున్నాడు. ఎంత గొప్పమార్పు. ఎంత గొప్ప కోరిక! ఎంత గొప్ప ప్రార్థన! అతని దుస్థితి జీవితమంతయు పూర్తిగా మారి పోయెను. ఇదివరకు అతనికుండిన దుస్థితి అంశములన్నియు అతడు విడిచి పెట్టెను, నూతన పురుషుడాయెను. ఇతరులకు హానిచేయగోరి వెంటబడిన ఇతడు ఇప్పుడు యేసుప్రభువు వెంటబడినాడు. హానిచేయుటకు కాదుగాని ఆయనను ఆశ్రయించుటకే, యేసుప్రభువు తనకు చేసిన మహోపకార కార్య ములనుబట్టి అతనిలో కృతజ్ఞత ఉద్భవించెను. అతనిలోనుండి, కృతజ్ఞతగల హృదయములో నుండి, 'నన్ను నీయొద్ద నుండనిమ్ము' అను ప్రార్థన వెడలి వచ్చెను. ప్రభువువలన రక్షింపబడిన వారందరు ఈ ప్రార్థన చేయగలరు. ఎల్లప్పుడు ప్రభువు వద్దనే ఉండగోరుదురు. విమోచన కలిగి ఉండుటకు ఇట్టి కోరికగల ప్రార్థన, మంచి గురిగానుండును. బాగుపడిన వారు ప్రభువు దగ్గర నుండగోరుదురు. బాగుపడని వారికి ఇట్టి కోరిక యుండదు. అదివరలో యేసుప్రభువు ఒక స్థలమందుండెను. ఇతడు మరొక స్థలమందుండెను. ఇప్పుడు ఇద్దరు ఒక స్థలమందే ఉండవలెనని అతడు కోరెను.

రక్షితులు ఈ జీవాంత పర్యంతము యేసునొద్దనే ఉండగోరుదురు. అప్పుడు జీవాంతమందు పరలోకములో నిత్యము ఆయన దగ్గర నుండగల భాగ్యము లభించును. ఇక్కడ ప్రభువు దగ్గర నుండని యెడల పరలోకములో ఎట్లుండ గలము? ఆ రోగి ప్రభువు నొద్ద శరీరరీతిగ నుండగోరెను. ప్రభువు కోరినది అది మాత్రమే కాదు. ఆత్మ రీతిగ రక్షితాత్మ తనయొద్ద నుండవలెనని ప్రభువు కోరును. అవతార కాలమందు అనేకులు ప్రభువు నొద్దనుండిరి. వారందరు ఆత్మరీతిగా ఆయన యొద్ద నుండిరా? లేదు. శరీర రీతిగానే ఉండిరి. భూలోక మందు శరీర రీతిగాను, ఆత్మరీతిగాను, ప్రభువుయొద్ద నుండిన సువార్తికుడైన యోహాను ఇప్పుడు పరలోకమందు ఆయనయొద్ద నున్నాడు. మనకాలమందు మనము ప్రభువునొద్ద శరీరరీతిగా

నుండుటలేదు గాని ఆత్మరీతిగా నున్నాము. శరీర రీతిగా ఆయనను ఎరిగియుండి, ఆత్మరీతిగా ఆయనను ఎరుగనివారు ధన్యులు కాగలరా? కాలేరు. శరీరరీతిగా నెరుగక పోయినను ఆత్మరీతిగా నెరిగియున్న యెడల అట్టివారు ధన్యులే. చదువరీ! "నన్ను నీయొద్దనుండనిమ్ము" అను ఈ చిన్న గొప్ప ప్రార్థన ప్రతి దినము చేసికొనగలవా? ప్రభువు మేఘాసీనుడై వచ్చుచున్నాడని విశ్వాసులెదురు చూచుచున్నారు. ఇక్కడ ఆయనతో నుండగోరి ప్రార్థించుచున్న నీవు, ఆయనతో రేపు మేఘములో కూడ నుందువు కదా? నూతన యెరూషలేములో నుందువు గదా? రెండవ రాకడ సమీపముగానున్న ఈకాలమునకు ఇది తగిన ప్రార్థనే అని నీకు తోచునా? అట్లైనా ఈ ప్రార్థన చేయుట మానవద్దు.

**విజ్ఞప్తి ప్రార్థన:-** తండ్రీ! "నీయొద్ద నుండనిమ్ము". నా పూర్వ దుస్థితిలోనికి నేను మరల వెళ్ళకుండునట్లు నీయొద్దనుండనిమ్ము! నీవలన ఉపకారము పొందిన నేను నిత్యము స్వస్థచిత్తుడనైయుండు నిమిత్తము నీయొద్ద నుండనిమ్ము. దయ్యములనుండి నీవలన విమోచన పొందిన నేను, మరల దయ్యముల వశము కాకుండునట్లు నీయొద్దనుండనిమ్ము. పైలోకమున నీయొద్ద నుండునట్లు, ఈ లోకమున నీయొద్దనుండ నిమ్ము. ఎవరిని నీయొద్దనుండ నిమ్మని నేను కోరుచున్నాను? నన్ను! నన్ను! నన్ను! నాకు హానిచేసికొను చుండిన నన్ను; దిగంబరినైయుండిన నన్ను; నిన్ను ఎరిగియుండని నన్ను నీయొద్దనుండనిమ్ము. ఉండనిమ్ము; నన్ను వెళ్లిపోనియ్యవద్దు. నీ యొద్ద ఉండనిమ్ము! నీ యొద్ద ఉండుటకే నాకు సెలవిమ్ము. ఆమేన్.

యేసే మన నివాస స్థలమైయున్నాడు కీర్తన. 90:1 ప్రభువా తరతర ములనుండి మాకు నివాస స్థలమునీవే. ఆలాగున పరలోక నిత్యవాసియగు ప్రభువు యొద్ద ఎల్లప్పుడు ఉండగోరే అంతస్థు ప్రభువు మనకు అనుగ్రహించును గాక! ఆమేన్.

---

**1. 12-9-1948వ సం॥లో దేవదాసు అయ్యగారు చేసిన ప్రసంగము.**

## ఇరువది రెండవ సందేశము

# రాకడ నిరీక్షణ - అప్పీయ సంతపేట

*యెషయా 35:9; లూకా. 22:32; 1పేతురు 5:10-11*

**యెహోవా విమోచించినవారు పాటలుపాడుచు తిరిగి సీయోనునకు వచ్చెదరు" యెషయా 35:9**

యోహాను 14:3వ వచనములో ఒక గాలి పదమున్నది (గాలికి సంబంధించిన పదము) 1) ప్రభువు పరలోకమునకు వెళ్లుటయు, మనకు స్థలము సిద్ధపర్చుటయు, 2) తదుపరి మరి ఇక్కడకు వచ్చి, 3) మనలను అక్కడకు తీసికొని వెళ్లి, అక్కడ మనలను ఉంచుటయు అని అందులో యున్నది. ఆ ప్రత్యేక ఏర్పాటు ఈ వాక్యములో ఉన్నది.

1) యేసుప్రభువుయొక్క ఆరోహణము.

2) సంఘమును సిద్ధపరచుట

3) సంఘారోహణము.

4) సంఘ నివాసము. యోహాను సువార్తలోనే ఈ గాలి పదమున్నది. దీనిలో ఒక విషయమున్నది.

ప్రభువు పరలోకమునకు వెళ్తూ, 'నేను వెళ్ళు చున్నాననెను. అందులో ఒక మాట చెప్పెను: దానిలో నేను 'మరలా వస్తాననేది' యున్నది. గనుకనే ఆదికాల సంఘస్థులు కనిపెట్టిరి. ముఖ్యముగా థెస్సలోనికైయలోని విశ్వాసులు కనిపెట్టిరి. ప్రస్తుత ప్రయాణీకులు వెళ్ళి వస్తామంటారు'గాని వెళ్తామని చెప్పరు. ఒకవేళ చెప్పవలెనంటే 'వెళ్ళివస్తాము' అంటారు. దానిలో వెళ్ళి, మరలా వస్తాము అనే అర్థమున్నది. అనగా ఎక్కడనుండి ఎక్కడవరకు వెళ్ళివచ్చుట? అప్పీయ సంతపేట వరకు వెళ్ళి వస్తామని ఆది సంఘములో చెప్పబడియున్నది. వెళ్లిరావడమనే మాటలో నిరీక్షణ యున్నది. వెళ్లలేనివారు నిరీక్షించితే మాత్రము వెళ్లగలరా? వెళ్లలేరు. బంధకాలతో నిరీక్షించే నిరీక్షణ, వ్యర్థమైన నిరీక్షణ. గనుక బంధకాలను విడగొట్టుకొని నిరీక్షించవలయును. ఈ పర్ణశాలలోనున్న వారిలో నిజమైన నిరీక్షణ, బంధకాలు లేని నిరీక్షణ

యుండవలయును. అప్పియ సంతపేటకు ఎప్పుడు వెళ్లనిదే, ఏలాగు నిరీక్షింతురు? సంతలోనివి ఎప్పుడైన కొన్నారా?

**నిరీక్షణలోనివి ఎన్ని భాగములు?** 1) ప్రభువు వెళ్లుట, 2) స్థలము సిద్ధపర్చుట, 3) మరల తిరిగివచ్చుట, 4) మనలను తీసికొని వెళ్లుట. మీరు జెట్టీలను ఎప్పుడైన చూచినారా? జెట్టీలు నడుమునకు దట్టీ కట్టుకొందురు. పరుగెత్తమంటే పరుగెత్తుటకు, ముందె దట్టీ కట్టుకొని నిలబడి ఉంటారు. అదే నిరీక్షణ అంటేను.

అనుమానము తీర్చే కథ చెప్పుదును. మీకెప్పుడైనా అప్పియ సంతపేట ఉన్నదనే నమ్మకము తోచినదా? ప్రభువు చెప్పిన మాటలలో ఎట్టి అర్థమున్నదో ఆత్మవల్ల బోధపడుచున్నది. ప్రభువు వస్తారు అదిఒక కథ. ప్రభువు రాకముందు చనిపోయిన భక్తులు వెయిటింగు రూములో (వేచియుండు గదిలో) కని పెట్టుదురు. పరదైసులో వారున్నూ, సజీవులున్నూ, ఈ రెండు తెగలు వారు రాకడలో వెళ్తారు. యేసుప్రభువు ఎక్కడ ఉంటారో అక్కడకు మనము వెళ్తాము. ప్రభువు రాకముందు మరణం వస్తే, దానిద్వారా జీవములోనికి తీసికొనివెళ్తారు. వారు, అక్కడ ఉండిన సజీవులు, మనము ఇక్కడ ఉండిన సజీవులము, వారి ఆయుష్కాలము అయిపోయింది. ఆయన ఇంకను రాలేదు. ఆయన కాలమే రాలేదు. అంత మాత్రమున ఎదురుచూచే వారు శక్తిహీనులు కారు. ప్రభువు వచ్చే వరకు వెయ్యిసార్లు మరణం వచ్చిననూ చావకుండ మరణమా పొమ్ము! అని ఉగ్గపెట్టుకొనవలెను. అట్టివారు సజీవులుగా ఉంటారు. భూలోకమనే, శరీరమనే సంతపేటలనుండి మనము బైటికి వస్తే, పైకి వెళ్లగలము. అప్పుడే నిరీక్షణ వస్తుంది. సజీవులయొక్క గుంపులోనికి వెళ్లవలెనని ఏర్పాటైనవారు మరణములోనికిరారు. రాకడకు మరణంద్వారా వెళ్లుట ఒకదారి, మరియొకదారి ప్రభువు వచ్చేలోగ ఉగ్గపెట్టుకొని సిద్ధపడుతు ఉండుట. ఆ ఏర్పాటువారు ఈ దారిలోనివారే. ఇందులో ఉండుటకు ప్రయత్నము చేయండి యోహా. 14:3. ఆదికాల క్రైస్తవులు వ్యర్థముగా కనిపెట్టినారనే నిందను ఈ కాలపువారు వారిపై మోపుచున్నారు. వారు చెప్పుట మాత్రమే కాదు, ప్రభువును ఆలాగు చెప్పిరి గాని రాలేదు. గాని థెస్సలోనికైయవారు సిద్ధపడి ఎదురుచూచిరి.

1) నమ్మినందున

2) నిరీక్షించినందున

3) సిద్ధపడుటవల్ల రాకడలో వెళ్లగలము ఈ మూడు లక్షణములు కలిగినవారే సజీవుల గుంపులోనివారు.

(1) ఆదికాలపు వారు సిద్ధపడిరి. (2) మనమును సిద్ధపడుచున్నాము. సిద్ధపడినవారు, సిద్ధపడేవారు ఒకే తరగతి. వారు వీరు సజీవుల వరుసకు సిద్ధపడినవారు. గనుక ఎత్తబడిరి.

అప్పియ సంతపేట ఏ దేశములో నున్నది. ఇటలీలో ఉన్నది. ఇచ్చట నుండి బైలుదేరినవారున్నారు. అక్కడ సిద్ధపడిన వారు, ఇక్కడ సిద్ధపడినవారు పెండ్లికుమార్తె వరుసయే. ప్రభువు రాకముందు చనిపోతే మృతుల గుంపులోను, వచ్చేవరకు ఉంటే సిద్ధపడే గుంపులోను ఉండగలము. సిద్ధపడలేనివారు అప్పియ సంతపేటలో ఉండిపోయేవారే. రాకడను గూర్చి 10,20,30 సం॥లకు ముందే బోధించుట ఆరంభించినానుగాన, పూర్వ క్రైస్తవులవలె మీరున్ను ఎదురు చూస్తున్నారు అని నా దగ్గర చదివి, నేర్చుకొనిన వారు నన్ను నిందించు చున్నారుగాన (రాజమండ్రిలో అయ్యగారివద్ద విద్యనభ్యసించిన విద్యార్థులు రాకడ వర్తమానములు విని, విని అయ్యగార్ని నిందించారు) **మీరు సిద్ధపడండి. ప్రార్థించినా, బోధించినా, వాక్యము చదివినా, స్తుతించినా, ప్రయోజనములేదు. ముందు సిద్ధపడండి. అవన్ని చేసినా హృదయములో సిద్ధపడకపోతే, ప్రభువు వచ్చిన యెడల పెండ్లి కుమార్తె వరుసలో చేరనే చేరరు.** పెండ్లికుమార్తెయొక్క భాగము, ఆ రాకడ సంఘములో సిద్ధపడవలెను. అప్పుడు ఆదికాల సంఘముయొక్క గుంపులో చేరి వెళ్లుదము. ఆలాగున వెళ్ళుట మీకు ఇష్టమా? సజీవుల గుంపులో చేరి వెళ్లుదము! దేవుని చిత్తమని చెప్పి, దయ్యాలకు లోబడక యుండవలయును.

మత్తయి 8వ అధ్యాయములో ప్రభువు పర్వతము దిగివస్తుండగా ఒక కుష్టరోగి ప్రభువా నీకిష్టమైతే నన్ను శుద్ధునిగా చేయగలవు' అనెను. సిద్ధపడిన సజీవులగుంపులోగాని నీవు ఉండిన యెడల ఇంకొకరిని సిద్ధపర్చుము. నీవు శుద్ధుడవు కమ్ము! అని బైబిలులో నున్నది. గనుక ఈ

పర్ణశాలలో ఉన్న వారందరు ముందు శుద్ధులై సిద్ధపడితే, ఆయన మిమ్ములను సిద్ధపర్చును. ఇది కొండపై ప్రభువు ప్రసంగించి క్రిందికి వస్తుండగా, మధ్యలో జరిగిన కథ. ముందు సిద్ధపడుట అది మన పని. సిద్ధపరచుట ఆయన పని. తర్వాత, సిద్ధపడిన వారినే దేవుడు లేక భక్తులు సిద్ధపర్చుట అనేది లూకా వ్రాసినాడు. సిద్ధపడినవారినే సిద్ధపరచడము అనే సంగతి ఉన్నదని ప్రత్తిపాడులో చెప్పితిని (లూకా. 1:17) ఈ వాక్యములో "జకర్యా ఎలీసబెత్తుల" కుమారుడున్నాడు. ఆ వాక్యములో ఆయత్తపడిన వారిని సిద్ధపరచుట ఆయనపని. యేసుప్రభువు జన్మకాలములో, ప్రభువు వస్తారని నమ్మి, సిద్ధపడియున్న వారిని సిద్ధపరచుటకు యోహాను సిద్ధపడివచ్చెను. ప్రభువు ఈ 1949వ సం॥లోకూడా సిద్ధపడని వారిని, (స్థానికుడైన యోహానువలె) సిద్ధపడినవారిని రెండవ రాకడకు సిద్ధపర్చుటకు బోధకులను, భక్తులను అనుగ్రహించి సిద్ధపరచుచున్నాడు. ఏది గొప్పపని?

1. సిద్ధముగా నున్నవారిని సిద్ధపరచుటాట గొప్ప సంగతియా?

2. ఎరగనివారిని సిద్ధపరచుట గొప్ప సంగతియా? మిమ్ములను అప్పుడప్పుడు సందిగ్ధములో దింపుట నా పని. ఊరికే ప్రసంగము చేసియున్నాను అనుకొండి; అప్పుడు రాకడ వస్తుందనే వారికి అర్థము తెలియదు. ఆ ప్రసంగములో "యేసుప్రభువును నమ్మండి" అని చెప్పితే వారికి ఏమి ప్రయోజనము! ఒకానొక సభలో ఒక ప్రసంగీకుడు బోధిస్తూ ఉండగా ఆ సమయములో చక్కగా ఉన్న ఒక స్త్రీ నిందించి, ఏమిటిది? ఈ ప్రవచనము వలన ఏమిలాభము ఉన్నది? అని వెళ్ళిపోయింది. 'రాకడ వస్తాదని' అన్ని మిషనులవారు చెప్పుచున్నారు. గాని ఏమి లాభము? దాని అర్థము పూర్తిగా చెప్పవలయును. అప్పుడు వినువారు సంతోషించి, రాకడ అర్థము గ్రహించి, రాకడకు సిద్ధపడుదురు. లూకా. 1:17వ, యోహాను పని ఏదనగా ఆయన రాకముందే, ఆయనకు ముందుగా వెళు ్లట. ఆ అధికారము యోహానుకు ఒక్కనికే ఉన్నది. అలాగే బైబిలు మిషనులోని ప్రతి సువార్తికుడు సిద్ధపడినవాడై, క్రీస్తుప్రభువు రాకముందు యోహానువలె బోధించవలెను. పాత నిబంధన, క్రొత్త నిబంధనలోని వాక్యములు, సువార్త, ఉత్తరములలోని వాక్యములు బాగుగా నేర్చుకొనవలయును. **సిద్ధపడకుండ బోధిస్తే వినేవారికి లాభములేదు.** యూదా

సిద్ధపడకుండనే బోధించినాడు, పంచిపెట్టినాడు గాని ప్రభువు దగ్గరకు వెళ్లలేక పోయెను. అలాగే సిద్ధపడక బోధించిన వారిగతి యుండును. మనము సిద్ధముగా లేకపోతే, స్వరమునాదు, అనగా ప్రభువా! రమ్ము అని చెప్పలేము.

సామెత: "అదునుకు బాగా దొరికినది పదును". అప్పియ సంతపేట ఎవరి కాలములోనిది. క్రొత్త నిబంధనలోనిది.

1. కుష్టిరోగి గూర్చిన కథ, 2. యోహాను కథ, 3. యూదా కథ, 4. కోరుకొండ కథ, 5. అప్పియ సంతపేట కథ, 6. 12 గంపల కథ, 7. గాలి పఠము కథ.

ఇంకొక కథ విడిచిపెట్టినాను. ప్రభువు వచ్చినప్పుడు ఎవరులేస్తారు? యేసుప్రభువు వచ్చినప్పుడు చివరివాడు అనగా రాకడ నిరీక్షణతో మరణించిన వారు లేస్తారు.

అప్పియ సంతపేట ఇటలీ దేశములోనిది. ఈ దేశములో పౌలు ప్రవేశించినప్పుడు, విశ్వాసులు తెలుసుకొని ఆయనను తిన్నగా వారున్న స్థలమునకు తీసికొని వెళ్ళుటకు, పౌలును తీసికొని రాకముందు మేము వెళ్లి పౌలును స్థానకూటమునకు తీసికొని వస్తామని చెప్పి వారు వెళ్లిరి. వారు అప్పియ సంతపేటలో ఉండిపోవుటకు వెళ్లలేదుగాని పౌలును తీసికొని రావడానికి వెళ్లిరి. ఇదియే అప్పియ సంతపేట కథ అపో॥ కార్య॥ 28:14-15. ప్రభువు- నేను వెళ్లి స్థలము సిద్ధము చేసి మిమ్ములను తీసికొని వెళ్లెదను' అని చెప్పిరి. ప్రభువు వస్తారని చెప్పినా, విశ్వాసులు నమ్ముటలేదు. ఎందుకనగా 30 సం॥ల నుండి చెప్పిననూ నెరవేరలేదు గాన నమ్ముటలేదు. అయితే తారీఖు చెప్పలేదు. గాన వచ్చేవరకు నమ్మవలెను.

ప్రభువు రావలసిన సమయము ఎందుకు చెప్పలేదనగా, ఎందుకు సమయము తెలిసిన యెడల అప్పటివరకు సోమరితనముగా యుండి, ఆ సమయములో రాకడకు పరుగులిడుదురని చెప్పలేదు. అపోస్తలులు సిద్ధపడినను, వారికి ఎందుకు రాకడ తేది చెప్పలేదనగా, అందరికి చెప్పివేస్తారనియు, ఇంకా గుర్తులు నెరవేరలేదు గనుక వారికి చెప్పలేదు. ఇప్పటికి 2000 సం॥లైనది. 1థెస్స. 4:1; 1థెస్స. 4:13-17. ఈ

వాక్యమునుబట్టి 2000 సం?ల క్రిందట పౌలు చెప్పినది నెరవేరకపోతే, 30 సం॥ల క్రిందట నేను చెప్పినది నెరవేరలేదని ఆక్షేపణ ఎందుకు? అప్పటివారు నిరీక్షించినప్పుడు, మనము నిరీక్షించుటలో తప్పులేదు కదా! ఆలాగు నిరీక్షించక అవిశ్వాస పడుటయే సిద్ధపడలేకపోవడము. సిద్ధపడిన వారిని అనారోగ్యమేమియు చేయ లేదు. సిద్ధపడితే వెళ్లగలము. "నేడే ప్రభువు వచ్చుననుకొనువాడే ధన్యుడు" అనువచన భావము నమ్మి, సిద్ధపడితే మేఘములో వెళ్లకుండ యుండలేము. సూదంటురాయి చూచినారా? ఆ రాతిని పట్టుకొని బల్లమీద ఉన్న పిన్నుకు పైన గాలిలో పెడితే ఎగిరి అంటుకొనును. **ఆలాగే ప్రభువు రాకముందు సూదంటు రాయివలె, ప్రభువును అంటుకొని యుండువారే ఎత్తబడుదురు.**

ఒక భక్తురాలి కథ:– ఆమె ఎంతో విశ్వాసి. శ్రమలద్వారా సిద్ధపడి మృతిపొందెను. ప్రభువు వచ్చినప్పుడు ఆమె రాకడలో రాదా? అలాగే **మనము తారీఖులు ఏర్పాటు చేయకూడదు. సిద్ధపడుతూ ఎదురుచూచి ఆయనను ఎదుర్కొనవలెను.** "వినుట విశ్వసించుట, ఆజ్ఞకు విధేయులైమనుట" అనునది. ప్రాముఖ్యము, "నమ్మువారికి చావేయుండదు నవరూపము కలుగు."

పౌలు యెరూషలేము దేవాలయములో మారుమనస్సు పొంది 14. సం॥లు అయినది. ప్రార్థన చేయుచు పరదైసు పోయినాడు. అంతగొప్ప ప్రార్థన చేసియున్నాడు. పౌలును, యేసుప్రభువును ఇద్దరే ఆ దేవాలయములో యున్నారు. పరిశుద్ధాత్మ తండ్రి, పౌలు ఆత్మను తీసికొని వెళ్లిరి. శరీరమును తీసికొనివెళ్లితే మరణం వస్తుందిగాన శరీరము విడిచిపెట్టి పరలోకములోనివన్ని చూపించెను. ఎందుకంటే పౌలు సూదంటురాయివలె సిద్ధముగా యున్నాడు. గనుక వెళ్ళుచున్నాడు. అట్లే ప్రభువు పౌలుతో ఈ సంగతులన్ని వివరించి, వ్రాయుమనెను. శరీరమును విడిచిపెట్టి, ఆత్మను తీసికొని వెళ్లినాడు. గాన సగము నెరవేరెను. అంతా ఎప్పుడు నెరవేరును? రాకడలో ఎవరు ఇంకను సిద్ధపడుతున్నారో వారిని ప్రభువు తీసికొని వెళు ్లను. అప్పుడు అంతయూ నెరవేరుతుంది. ఒక ఉదా:– అందరు ఆడపిల్లలుగల ఒక కుటుంబముండెను. ఆ తండ్రికి చాలా విచారము. ఆయన భక్తులచేత ప్రార్థనలు చేయించినను, ఆడపిల్లలే జన్మించినారు. అందుకు ఎప్పుడు

విచారమే. అలాగే ప్రభువు రాక ముందు నిద్రలో కలలో కొడుకు పుట్టినట్టు కలకంటాడు. గాని పుట్టలేదు. తరువాత పుడతాడు అప్పుడు ఎంత సంతోషము! అలాగు కొడుకు పుట్టితే నాకు వద్దని తండ్రి అంటాడా? అలాగే రాక రాక క్రీస్తు రాకలో వస్తే వద్దంటారా? కుమార్తెలకు వివాహము చేస్తే ప్రార్థించారు. ఆమెకుకూడ ఆడపిల్లే. ఫలానివారి మనుమడు అనిపించుటకు నాకు యోగ్యతలేదు అని బాధపడినాడు. అలాగే ప్రభువు రాకడ సువార్త విని లోకులు నవ్వినారు. అయితే రాకడయుండునా? గాన నీ పొరబాట్లను సవరించుకొని దిద్దుకొని సిద్ధపడుము. అప్పుడు ఎత్తబడుదువు. సిద్ధపడలేకపోతే బైబిలులోనికి, రక్షణలోనికి రాకడకు వెళ్లలేదు. **ఆత్మీయజీవములో కొంటెతనము ఉంటే రాకడలో వెళ్లలేరు.** పరలోకములోని ప్రభువునుచూచి సిద్ధపడిన వారిని ఆయన తీసికొని వెళ్లుదురు. ఈ లోకములో ఉన్నప్పుడు, అనుకొన్న పని నెరవేర్చునట్లు, రాకడకును తమ పొరబాటులు తెలిసికొని సిద్ధపడినవారు ఎత్తబడుదురు.

ప్రార్థన:- ప్రియప్రభువా! నేనుండు స్థలములో మీరును ఉండులాగున మిమ్మును తీసుకొని వెళ్లుటకు మరలా వస్తానని చెప్పినదేవా! నీవు ఉన్న ఆ పరమండలమునకు, మేఘములపై రెప్పపాటులో ఎగిరి వెళ్లగలిగిన స్థితిని, శుద్ధిని, నిరీక్షణను, సిద్ధపాటు చేసికొనుటకు నీవే నీ ఆత్మ సహాయము మాకు అందరకు అందించుమని మహిమ మేఘముపై త్వరలో పెండ్లికుమారుడుగా రానైయున్న యేసు నామమున అడిగి వేడుకొనుచున్నాము తండ్రీ! ఆమేన్.

---

**15-1-1949వ సం॥లో దేవదాసు అయ్యగారు చేసిన ప్రసంగము.**

## ఇరువదిమూడవ సందేశము

# రాకడలో ఎత్తబడేవారు ఎవరు?

***యిర్మి, 6:16; యోహాను 14:6; ఎఫెసీ. 2:18-22.***

**'మేలు కలుగు మార్గమేది అని యడిగి అందులో నడుచుకొనుడి. అప్పుడు మీకు నెమ్మది కలుగును.' యిర్మి 6:16**

**'నేడే ప్రభువువచ్చు ననుకొను - వాడే ధన్యుడు - ప్రభువు కూడ మేఘమెక్కి - వెళ్ళకుండ నుండడు (లూకా. 12:35-40) ॥యేసుప్రభువు॥**

**'భూలోక మంతటికి సువార్త- పోవుట కిందియా ప్రధానము - పై లోకంబు నుండి వచ్చిన - బైబిలు మిషనును ఎత్తిచూపుము ॥మనో॥**

**'నమ్మరాదని యువవాది నచ్చజెప్పు చున్నను - నమ్ముచుండుము దేవుని - వాత్ర వాక్యము సత్యమంచు -నెమ్మది నీ కప్పుడె కల్గు ॥శ్రీయేసు॥**

1. రాకడ గురించి కొద్దో, గొప్పో ఇప్పుడన్ని మిషనులవారు చెప్పుచున్నారు. గాని నేడో రేపో అని బైబిలుమిషను వారు చెప్పుచున్నట్లుగా తక్కిన మిషనులవారు చెప్పుటలేదు. 'ఎప్పుడు వస్తాడో మనకు తెలియదు ఆయన వచ్చినప్పుడే మనలను తీసికొని వెళ్తారు' అని వారు అంటున్నారు.

అయితే బైబిలు మిషను వారిలోనుండి అన్ని మతములలోని వారినుండి ఎవరు బైబిలుమిషను అనుభవమైయున్న "నేడో రేపో వస్తారన్న" మాట విశ్వసిస్తారో వారే ఎత్తబడుదురు. గాని రాకడకు ముందు భక్తులైనవారు అనగా మారుమనస్సు పొంది, రక్షింపబడి, వధువు సంఘములో చేరినవారు మరణము పొందిన యెడల మోక్షములోనికి వెళ్లుదురు. అనగా వీరు రాకడవరకు ఉండరు. ఎందుకంటే వారికి రాకడబోధలు పూర్తిగా తెలియలేదు. గనుక ప్రభువు మరణమును రానిచ్చి మృతుల గుంపులోనికి వీరిని చేర్చుదురు.

పదవక్లాసులో ఉన్నవారు బి.ఎ. (B.A.) క్లాసుకు రాకపోతే బి.ఎ. ఏలాగు పాస్ కాగలరు? ఎవరైన బైబిలు మిషనులోనికి రాకపోతే, ఆ బోధలు వినకపోతే, రాకడ గురించి ప్రభువు స్వయముగా సన్నిధి కూటములలో చెప్పినది తెలియకపోతే ఏలాగు రాకడకు సిద్ధపడగలరు.

ఎక్కడున్నను సరే బైబిలు మిషను సిద్ధాంతములు నమ్మి, స్వంత మిషను, స్వంతమతము విడిచిపెట్టితే వారు బైబిలు మిషనే వారు గుంటూరు

రానక్కరలేదు. అందులో (బైబిలు మిషనులో) ఉన్నావన్ని అంగీకరించి చదువు కుంటారు. ప్రభువా! నేను బైబిలు మిషనులో చేరవలెనా? అని మీ క్లాసులో ప్రభువును అడగండి. ఆయన ఎలాగు చెప్పితే అలాగు చేయండి. మేమందరము మిషనులో చేరినవారమే మేమెందుకు ప్రభువును అడుగవలెను? అని మీరు నన్ను అడుగవచ్చును.

జవాబు:– మీరు బైబిలుమిషనులో చేరితే మాత్రము! యూదావలె చేరి తప్పిపోవచ్చును. అననీయ, సప్పీరాలు ఆదిసంఘములో చేరి తప్పిపోలేదా? గనుక బైబిలు మిషనులోనికి వచ్చి తప్పిపోయిన యెడల వారు ఎత్తబడరు. తప్పిపోయినప్పుడేలాగు ఎత్తబడుదురు? బైబిలులోని వ్రాతవచనములు కొన్ని అర్ధము కానప్పుడు, అవి వ్రాయించిన ప్రభువు వచ్చి చెప్పితే నమ్మకూడదా? అట్లు నమ్మనియెడల, వ్రాతకూడా నమ్మనట్టే.

ప్రశ్న: రక్షణ ఉండునుగాని ఎత్తబడుట ఉండదు. వారెవరు? ఈ ప్రశ్న అడిగిన వారికి ఏమి జవాబు చెప్పవలెను. ఎంత భక్తులైననూ, రాకడకు సిద్ధపడకపోతే ఎత్తబడరు అనియు, వారు సిద్ధపడకపోయినా నేను మాత్రము త్వరగా వస్తాను అనియు, సిద్ధపడినవారిని మాత్రమే తీసికొని వెళ్లుదుననియు ప్రభువు చెప్పుచున్నారు.

అంతరంగ క్రైస్తవులు బాప్తిస్మము పొందుటకు శక్తిలేని వారైనప్పటికిని రక్షణ పొందుదురు. మరియు బైబిలు మిషనులోనికి చేరుటకు ఆసక్తి ఉన్న ప్పటికిని శక్తి లేకపోవును. అట్టివారు ఎత్తబడుదురు. ఎందుకంటే బైబిలు మిషను వారి హృదయములో ఉన్నది. అది ప్రభువుకు తెలుసునుగాని మను ష్యులకు తెలియదు. 1) అంతరంగ క్రైస్తవులు, 2) అంతరంగ బైబిలు మిషనువారు, వీరి అంతస్థు ప్రభువుకు తెలిసి, వీరిని చేర్చుకొనునుగాని లోకస్తులు– 'వీరు బాప్తిస్మము పొందలేదు. వీరు బైబిలు మిషనులోనికి రాలేదు' గనుక ఎట్లు రక్షింపబడుదురు, ఎట్లు ఎత్తబడుదురు? అని అందురు. అంతరంగ క్రైస్తవులు రక్షింపబడి మోక్షమునకు వెళ్ళుదురు, అంతరంగ బైబిలు మిషను వారు రక్షింపబడి మధ్యాకాశమునకు ఎత్తబడుతారు, అట్టివారు స్వస్థిశాలలో ఉన్నారు. మా పేర్లు ఎంతమందికి తెలుసునో అని, అట్టివారు కొందరందురు. 1) ఎత్తబడుదురనే దానిని గూర్చియు, 2) బైబిలు మిషనులోనికి రావడము గూర్చియు ఈ రెండు ఒకటే అనేది మీకు నిశ్చయము, తెలియవలెను. ఇందులో గనుక ఇసుమంతైనా సందేహమున్నా వరండాలో ఉన్నవారెవ్వరు ఎత్తబడరు.

21రోజులు క్లాసుకు వచ్చినా లాభమేలేదు. రెండు ఒకటే. బైబిలు మిషనులోనికి వచ్చిన మీరు ఈ అనుభవములో స్థిరంగా ఉన్నారంటే తప్పక ఎత్తబడ్డారన్నమాటే. బైబిలు మిషనులోనికి వచ్చి స్థిరముగా ఉండలేదంటే, ఎంత బైబిలు మిషను వారైనను ఎత్తబడరు.

1వ పని:– అనుదినము మీరు రాకడ ప్రార్ధన చేయండి. ప్రభువా! నన్ను రాకడకు సిద్ధపర్చుము! ఆమేన్. అదే చాలు. అయ్యగారి పనేమనగా ప్రజలను తీసుకొని వచ్చి రాకడకు సిద్ధపర్చుటే, మీ పని, మీ క్లాస్ అదే.

2వ పని– సిద్ధపడినవారిని తీసికొనివచ్చి, సిద్ధపర్చుట లూకా. 1వ అధ్యాయములో ఉన్నది. ఒకటవ అధ్యాయమంతా చదివి వెదకండి.

ప్రశ్న:– సిద్ధపడినవారిని సిద్ధపర్చుట" అనగా యేమి? జవాబు: సిద్ధపడినవారి ప్రశ్నలకు, సందేహములకు సరియైన జవాబులు వినిపించుటయే వారిని సిద్ధపరచుట. మీరు ప్రశ్నలడుగగా అయ్యగారు వాటికి జవాబులు చెప్పి వ్రాయించి సిద్ధపర్చుచున్నారు (లూకా. 1:17). అయ్యగారి కులవృత్తి. కులహక్కు, జన్మ హక్కు సువార్త ప్రకటించుటే అదే మీకు చెప్పుచున్నారు. మీరు రాకడకు సిద్ధపడకపోతే ఇంకొక నెల ఇక్కడే. ఉండగలరా?

ప్రశ్న:– రాకడకు సిద్ధపడుట ఎట్లు?

జవాబు: – ప్రతిదిన కార్యక్రమము చక్కగా జరిగించుట వలననే అనగా

ఎ) ప్రార్ధనమెట్లు ప్రకారముగా ప్రతిదినము ప్రార్థించుటవల్ల.

బి) సైతానును ఎదిరింపవలసిన ఎదిరింపులు ఎదిరించుటవల్ల.

సి) బైబిలులో రాకడను గురించి ఎక్కడెక్కడ ఉన్నవో వాటన్నిటిని చదువుట వల్ల అనగా రోజుకు ఎన్ని చదివితే అన్ని.

ఉదా:– ప్రతి సువార్తలో చివరనున్న అధ్యాయములలో రాకడను గూర్చి ఉన్నది. అలాగే థెస్సలోనీకయులకు వ్రాసిన రెండు పత్రికలలో రాకడను గూర్చి ఉన్నది. అలాగే ప్రకటన గ్రంథము అంతా చదువవలెను.

డి) రాకడకు ముందు ప్రతివారు ఆదికాండమునుండి ప్రకటన వరకు రాకడ పేరుమీద ఒకసారి బైబిలంతయూ చదువవలెను. ఓ రాకడా! నేనింకా బైబిలు పూర్తిగా చదువలేదు గనుక ఆగుమని చెప్పి చదువవలెను. గనుక రాకడకు ముందు సిద్ధపడే పని చాలపని యున్నది.

ఇ) నేను రాకడ గురించి ఎన్ని పత్రికలు వ్రాసినానో అవన్ని చదివి తీరవలెను. (బెజవాడ భూషణంగారి వద్ద ఉన్నవి).

ఎఫ్) రాకడ అంత త్వరగా రాదు' అను తలంపు రోజునకు 10. పర్యాయములైన రాకమానదు. గనుక ఈ తలంపును ఎదిరించండి. ఓ సాతానా అది నీ తలంపు అని ఎదిరించండి. దానిని కాళ్లక్రింద వేసి తొక్కవలెను.

జి) "నేను రాకడకు సిద్ధమౌదును అనిగాని, సిద్ధముగా ఉన్నాను. అనిగాని ప్రభువు చెప్పలేదు. కాబట్టి నేను వెళ్లునది నిశ్చయము కాదు" అను తలంపు పుట్టకమానదు. ఇది గడ్డు పిశాచి. దానిని శరీరమంతటితో త్రొక్కవలెను. వాడు మీ అందరిమీద పడతాడు గనుక జాగ్రత్తగా నుండండి. నోట్సులు, నోటులు ఉన్నవారందరిమీద వచ్చిపడతాడు. అయ్యగారి వ్రాతలు, బోధలు కలిగిన పుస్తకములు; నోట్సులు= నోటులు = రూపాయి నోటులు).

హెచ్) నేను చెప్పిన రాకడ పాఠములు మీరు ఇతరులకు చెప్పుట వలన రాకడకు సిద్ధపడగలరు.

ఐ) ప్రభువా! నేను నీ రాకడకు సిద్ధముగా ఉన్నాను' అని ప్రభువుతో చెప్పుటవల్ల రాకడకు సిద్ధపడగలరు.

జె) 1) 'ఓ సాతానా, 2) ఓ లోకమా, 3) ఓ శరీరమా! మీ ముగ్గురు మాకు శత్రువులు మీ దగ్గరనుంచి సెలవు తీసికొంటున్నాను. సలామ్" అన్నట్టు ఉంటె సిద్ధపడగలరు.

పై ఆత్మీయ విషయములన్ని గ్రహించినవారమై, ఆయన సన్నిధిలో మనలను సరిచేసికొనుచు, ఆయనపై ఆనుకొనినవారమై, త్వరగానే వచ్చుచున్న ఆయన రాకడకు సిద్ధపడియుందుముగాక! ఆమేన్.

**మొదటి రాకడ వచ్చు నన్న పథము సిద్ధించెను అనియు సిద్ధించును - యేసు త్వరగ వచ్చును - ఎత్తబడును సంఘము ॥శ్రీయేసు॥**

---

**18-5-1959వ సం॥లో దేవదాసు అయ్యగారు చేసిన ప్రసంగము.**

## ఇరువది నాలుగవ సందేశము

# రాకడ ప్రత్యక్షత - వేగు చూచుట

*దా. కీర్తనలు 106:13; మత్త. 24:13; హెబ్రీ. 3:6-11.*

**"ఆయన ఆలోచనకొరకు కనిపెట్టుకొనకపోయిరి" (దా.కీర్త. 106:13).**

ప్రియులారా! పాశ్చాత్య దేశములో బట్లర్ అనే దొరగారు యేసు ప్రభువు దేవుడని బోధించే, చాలా పుస్తకములు వ్రాసెను. తర్వాత ఆయనకు జబ్బుచేసెను. అప్పుడా జబ్బులో– "నేను ఇంత కష్టపడి వ్రాసినాను. ఇది ఎంతమట్టుకు నిజమో! అది నిజమైతే బాగుండును. అయినా 99 పాళ్లు జరుగదు. నేను వ్రాసినది పొరపాటే" అనెను. చివరకు "యేసుప్రభువు దేవుడు కాడు, అసలు దేవుడున్నాడనునది, మోక్షమనునది, నరకమనునది నిజమా? అనే సందేహమునకు వచ్చెను. అలాగే ఆదికాండములో సైతాను ఆదాము అవ్వలకు వేసిన ప్రశ్న ఇదియే. 'ఇది నిజమా?' దీనినుండి అనేక ప్రశ్నలు వచ్చెను.

పరమార్ధ జ్ఞానియైన యోహాను పత్మసులంకలో పరవశుడైనప్పుడు వృద్ధుడైయున్నాడు. ఆయన మనస్సు– "నేను ఎఫెస్సులో నున్నప్పుడు వాక్యమును ప్రకటించితిని. సువార్త గ్రంథమును వ్రాసితిని. నాతోటివారందరు వెళ్లిపోయిరి. ఇక నేను జీవించను, నా పని అయిపోయినది" అని పరలోకమునకు సిద్ధపడుతూ, లంకలో శ్రమపడుతూ, 'త్వరగా నన్ను తీసుకొని వెళ్లవలసినది' అని ప్రభువును ప్రార్థించెను. తన మనస్సుకు, తలంపుకు, జ్ఞానమునకు ఏమియు పనిలేదు. రోమా చక్రవర్తి, నన్ను ఎప్పటికి బయటికి తీస్తాడో! అని అనుకొనెను. అంతలో పరవశుడైనాడు. ప్రభువు ప్రత్యక్షము కావలయునంటే స్వప్నము, దర్శనముద్వారా ప్రత్యక్షత కాగలరు. ఈ క్రింది పద్ధతులు, సాధనముల ద్వారాకూడ ప్రభువు ప్రత్యక్షము కాగలరు. 1. వాక్యము చదువుటను బట్టి, 2. జ్ఞానమునుబట్టి, 3. మనస్సాక్షినిబట్టి, 4. స్వప్నమునుబట్టి, 5. దర్శనమును బట్టి, 6. వ్రాతను బట్టి, 7. పరవశుడై యుండుటనుబట్టి; ఆత్మతండ్రి వచ్చి యోహాను శరీరాత్మలను వశపరచుకొనగా, ప్రభువు ప్రత్యక్షమాయెను. **శరీరము దీనమనస్సులోనికి వస్తేనేగాని ప్రత్యక్షతరాదు.** యోహాను తన శరీరమును కట్టిపెట్టెను గనుక ప్రభువు ప్రత్యక్షత కలిగెను. యోహాను తన శరీరానికి,

క్రియలకు, జ్ఞానానికి పనిలేదనుకున్నాడుగాని ఆత్మ అన్నీ స్థలములకు వెళ్లును. శరీరము అక్కడనేయున్నది.

ప్రభువు– 1) చేతితో యోహానును ముట్టకొనెను. 2) భయపడకు మనెను. 30సం॥లు ప్రభువుతో నున్నను ప్రభువు మహిమతో వచ్చినందున భయపడెను. ప్రభువు చెప్పిన విషయములు: 1. సజీవుడను, ఎప్పుడు జీవించు వాడను. 2. మృతుడనై లేచియున్నవాడను; 3. జీవించుచున్నవాడను. సృష్టి కాలము నందు దేవుడు వాక్యమైయుండెను. ఆదికాలము అల్ప: ఓమెగ = వెయ్యేండ్లు పరిపాలన, తీర్పు అయిన తర్వాత అంతము.

ప్రభువు రాకడ, ఆ తర్వాత ఏడు సంవత్సరములు శ్రమలు ఇవన్నియు ఒక విధమైన అంతములు. వెయ్యేండ్ల పరిపాలన మనిషి జీవితముయొక్క మెట్లు అనగా ఉన్నత స్థితికి మార్గము. ఆ తర్వాత వచ్చు తీర్పు ఒక అంతము. అల్ఫా అనగా మనుష్యులు ఎల్లప్పుడు జీవించుట. ఓమెగా అనగా మన బ్రతుకుకు అంతము. ఎప్పుడు ఆరంభించినా, ఎప్పుడు జీవితమునకు ముగింపో అది అల్ఫా, ఓమెగయున్నది. ఈ మాటలు బైబిలునందు రెండు పర్యాయ ములున్నవి. గనుక రెండు అర్ధములున్నవి. ఇంతకుముందు జీవించుట అనగా ఎప్పుడును జీవించుట అని అర్ధము. ఉన్నవాడను, జీవించువాడను, అనగా సమాధిలోనుండి లేచినప్పటినుండి జీవించుచు ఉన్నవాడను అని అర్ధము. సముద్ర స్నానము చేయుచున్నప్పుడు మునుగుట, తేలుట ఉండును. అలాగే ఇప్పుడుండేవారు. అనుదినము సమాధిలోకి వెళ్లుట, మరలా జీవించుట ఉండును. అనగా మునుగుట, తేలుట; మృతులలోనుండి లేచి జీవించుటయు జరుగుచున్నవి. 'అల్ఫా' అనునది గ్రీకులో మొదటిమాట ఓమేగ అనునది చివరిమాట. సువార్తలన్నియు గ్రీకు భాషలో వ్రాయబడియున్నవి గనుక శిష్యులకు గ్రీకు భాషలో వాక్యము బోధించుట వచ్చును అని తెలియుచున్నది.

**సాదృశ్యము:–** మనలను పాలించినది ఇంగ్లీషు ప్రభుత్వమైనందున ఇంగ్లీషులో అర్జీ వ్రాస్తాము. ఆ కాలమందు గ్రీకు ప్రపంచ భాష కావున అందరికి వచ్చేయుండును. గనుక శిష్యులందరు సువార్తలను అందరూ చదువుటకుగాను ప్రపంచభాషయైన గ్రీకులో వ్రాసిరి, ఒక అబ్బాయిని అ,ఆ, లు మొదలు య, ర, ల, వ,ల వరకు వ్రాయండి అంటే, అన్ని

వ్రాయాలా అని మొదట నుండి చివరకు వ్రాస్తాడు, అలాగే గ్రీకుభాషలో మొదటి అక్షరము 'అలా', చివరి అక్షరము 'ఓమెగ' అయియున్నది. సిలువపై ప్రభువు ఉన్నప్పుడు రోమా ప్రభుత్వము ఆయన (యేసు) యూదులకు రక్షకుడని మూడు భాషలలో వ్రాయించెను.

ఆ మూడు భాషలు ఏవనగా:- 1) గ్రీకు, 2) హెబ్రీ, 3) రోమా ఈ మూడు భాషలలో యేసు యూదులకు రాజని వ్రాయబడెను. మూడు భాషలలో వ్రాయించుట ఎందుకనగా ప్రపంచమంతటికి క్రీస్తు రక్షకుడని తెలుపుటకు వ్రాయించెను.

మనకు పాఠము:- జబ్బుపడిన వారు స్వస్థత పొందుటకు సోమ వారము 'అల్ఫ' అనేప్రభువున్నాడు. జబ్బుపోయింది గనుక ఓమెగ అనే ప్రభువున్నారు. జబ్బుపోయిన దినమున ఓమెగ అను ప్రభువు ఉన్నారు. ఇవి అన్నియు ప్రభువు చెప్పినందున జబ్బును గూర్చిన భయము పోయింది. మొదట తెలియక భయపడిరి. 'భయపడవద్దు'ను మాటకు ఇవన్నియు సహాయ కారులే. ప్రకటనలో యోహాను ప్రభువును చూడగా భయపడెను. భయము చివరి వరకు ఉంటే ప్రకటన వ్రాయలేదు. భయము తీర్చుటకొరకు ప్రభువు ఇవన్నియు చెప్పెను.

ఉదా:- పిచ్చికుక్క తరిమినందున పిల్లవాడు భయముతో ఉన్నప్పుడు పుస్తకము చదువుమంటే చదువలేదు, చదువడు. భయము తీరిన తరువాత చదువుమంటే చదువును. 1) మరణముయొక్క తాళము 2) మృతుల లోకము యొక్క తాళము నా చేతిలో ఉన్నవి. 3) నీవు నాయొక్క చేతిలో ఉన్నావు.. గనుక నీవు (ఎ) విన్నవాటిని, (బి) ఉన్నవాటిని, (సి) వీటివెంట కలుగబోవు వాటిని వ్రాయుమనెను. ఉన్నవాటిని అనగా ఆ ఏడు సంఘములున్నవి. పద్మసు లంకయున్నది; వాటిని ఎత్తుకొని యోహానుకు పరలోకములోని సంఘములను చూపిస్తూ వ్రాయుమనెను. ఇకముందు కలుగబోవు వాటినికూడ చూచి యోహాను వ్రాయవలెను. అయితే అన్నిటికి కుశల ప్రశ్నలు వేయుటకు వీలున్నదని, యోహాను ప్రశ్నలు వేయకుండా చేయుటకు ప్రభువు ఆత్మ వశుడగునట్లు చేసెను. ప్రకటనలో వ్రాయబడినవన్ని పరలోకమునకు సంబంధించినవి. ఆదికాండము మొదలు ఏడు సంఘములవరకు భూలోక చరిత్ర సంగతులు. ప్రకటన గ్రంథములోని 4వ అధ్యాయము నుండి పరలోక సంగతులు

వ్రాసెను. యోహాను ఎఫెసులో నున్నప్పుడు ఆ సంఘములో బోధచేస్తు ఉన్నప్పుడు ఆత్మ నడిపించెను. ఆత్మ సహాయముతో యున్నాడు. గాని ఆత్మవశుడుకాలేదు. పత్మసులో అత్మవశుడై యున్నాడు గనుక ఇక శరీరముయొక్క ఆటలు సాగవు.

ఉదా:– నాకు బజారు వెళ్లవలెననియున్నను, ఆత్మ వద్దంటే నేను వెళ్లగలనా? వెళ్లలేను. అట్లే అన్నియు ఆత్మ చెప్పినట్లే చేయవలయును, నడువ వలయును. 1) బైబిలు చదువుటలో, 2) ఆత్మను పొందుటలో, 3) ఉపవాస ములుండుటలో, 4) పరలోకములోని వన్నియు; అంతస్థులే. 5) పరలోకములో డిగ్రీలు పొందుటకు, అంతస్థు పొందుటకు ప్రతీవారు ప్రయత్నము చేయుదురు. 7 స్థంభములు = 7 సంఘములు. 7 సంఘములు = 7 దీపస్థంభములు, **3 కాలములలోను సంఘములు 7 మాత్రమే ఉండును.** మిషనులు ఎన్నైనా ఉండునుగాని సంఘము మాత్రము ఏడే. ఉదా:– ఇచ్చుట అచ్చు ఆఫీసులో గదులుంటాయి. మొదటి గదిలో అ, ఆ, లు. 2వ గదిలో య, ర, ల, వ, ఉంటాయి. అక్షరాలు అక్కడక్కడ ఉన్నప్పుడు అవసరమునుబట్టి వాటిని పొందిక చేసినట్లు, అన్నికాలములలో ఉన్న ప్రజలను ప్రభువు ఏడు సంఘములలోనే నిలువబెట్టుచుండెను. మనము ఇక్కడయున్నాము. ప్రభువు మనలను తయారు చేయును. ఏ సంఘమునకు తయారైతే ఆ సంఘములోనికి చేర్చును. లవొదికయ సంఘములో ఉన్నవారికి అన్ని కష్టములు ఉండును. ఎవరు జయించుదురో, వారు ఆయన సింహాసనముమీద కూర్చుందురు. పెండ్లికుమార్తె సంఘము ఏడు తరగతులు. 7 అంతస్థులుగా పరలోకము వెళ్లగా ఆయన సింహాసనము ఎదుటే యుండును. యోహాను పద్మసు ద్వీపములో ఉండుట వలన శరీరముతో నడచుట, చూచుట, అన్నీ కష్టముగానే 'యుండును. కాని ప్రభువు ఇంతగొప్ప గ్రంథమును వ్రాయించెను. ప్రభువు రాకడను గురించి ప్రకటన. 1:7లో యున్నది.

**3 రాకడలు:–**

1) బెత్లహేములో (అవతారరాక),
2) రేప్చర్ = రెండవరాకడప్పుడు,
3) హర్మగెద్దోలోను యుద్ధమునకు వచ్చేరాక.

(1) మొదటిరాక:– సంఘమును సంపాదించుటకు,

(2) రెండవరాక:– సంఘమును తీసికొని వెళ్లుటకు,

(3) మూడవ రాక:– దుష్టత్వముయొక్క కథను కనుగొనుటకు. మీరు ఇంతకాలము వరకును నా సంఘమును, నా సృష్టిని పాడుచేసిరి. ఇప్పుడు మీ కథను కనుగొంటాను అని ప్రభువు హర్మెగెద్దోట్టోను యుద్ధమపుడు భూమిమీదకు వచ్చును. ఈ విషయములు యోహానుకు విపులముగా ప్రభువు తెలిపెను.

(1) మొదటి రాకడలో సంఘమును భూమిపై విడిచివెళ్లెను.

(2) రెండవరాకడలో పెండ్లి కుమార్తెను తీసికొని వెళ్ళుటకు వచ్చును.

(3) మూడవ రాకడలో పెండ్లికుమార్తెతో తిరిగి వచ్చును. వరుడు వధువు ఇరువురు కలసి వస్తారు. అనగా క్రీస్తుప్రభువు సంఘము కలిసి, పరిశుద్ధుల పక్షముగా యుద్ధము చేయుటకు వస్తారు.

**మరియొక వరుస:**

1వ రాకడ:– ఆదికాండము మొదలుకొని ప్రకటన వరకు ప్రభువు వచ్చుట ఒక రాకడ.

2వ రాకడ ఎక్కడ ఇద్దరు ముగ్గురు ఉందురో, అక్కడికి వచ్చుట.

3వ రాకడ ఇప్పుడు ప్రార్థించితే, యోహానుకు కనబడ్డట్టు కనబడుట; ఇది దర్శనమిచ్చుటకు వచ్చే రాకడ.

4వ రాకడ: ఏడు సంవత్సరములలో తయారైన సంఘమును తీసికొని పోవుటకు అనగా పరిగె యేరుకొనుటకు వచ్చే రాకడ, అసలైన వారు పోగా, మిగిలినవారిని తీసికొనిపోవుటకు వచ్చే రాకడ.

5వ రాకడ వెయ్యేండ్ల పరిపాలన చేయుటకు వచ్చుట.

అంత్య తీర్పు: దూతలుండును. తండ్రి, పరిశుద్ధాత్మలుండరు. తీర్పు ఎక్కడ జరుగునో ఎవరికిని తెలియదు. ఆ దినముయొక్క మహిమ ఎవరు సహించలేరు. ఆయన ప్రభావమువల్ల వారిని నిలువబెట్టి, తీర్పు తీర్చి పంపి వేయును (మోక్ష, నరకములకు) అన్నీ ఆయన ప్రభావముల

వల్లనే జరుగును. ఆది. 6:8 తీర్పుదినమున పరిశుద్ధాత్మ తండ్రి విచారము ఈలాగు చెప్పబడినది. (అయ్యగారికి ప్రభువు దర్శనములో, పరిశుద్ధాత్మ పావురము అంత్య తీర్పు సమయమందు పడుబాధ ఇట్లు వివరించిరి) ఒక వేటగాని బాణము పక్షియొక్క గుండెకు తగులగా, ఆ పక్షి క్రిందికి పడిపోయి, నోరు తెరచి రక్తము కార్చును. (నోరు తెరుస్తూ, మీద పడుతున్నట్లు, రెక్కలు కొట్టుకొనుచున్నట్లు విలవిల లాడుచున్నట్లు చూపిరి) ప్రభువు రాకడకు కనిపెట్టే వారందరు ఒక గుంపు, కనిపెట్టనిది ఒక గుంపు.

కనిపెట్టువారిలో 3 గుంపులు ఉన్నవి. అవి ఏవనగా– 1గుంపువారు 'ఎదురు చూస్తున్నారు. 2వ గుంపువారు 'వేగం' చూస్తున్నారు. 3వ గుంపువారు సిద్ధపడుచున్నారు.

(1) ఆకాశములో సూర్య, చంద్ర, నక్షత్రములలో కనబడే గుర్తులు.

(2) మనుష్యులలో దేవుని మాట వినకపోవుట.

(3) భూమిలోను సృష్టి అంతటిలోను మార్పు.

(4) సముద్రములో ఓడలు మునుగుట మొదలగునవి. ఇవన్నియు చూచి రాకడ అదిగో అందురు. 3వ గుంపువారు ప్రయాణమునకుపోవు వారివలె సిద్ధపడుదురు. అదునుకు పదునుగా నుందురు. ప్రభువుకృప ఎప్పుడు వచ్చినా సిద్ధపడేయుందురు. ఈ మూడు గుంపులను కలిపితే, వారే అన్నియు చేసేవారు. ఒకరోజున ఎదురుచూస్తారు. ఇంకొక రోజున ఎదురు చూస్తారు. ఇంకొక రోజున సరందమౌదురు (సంతోషింతురు). వీరంతా కలసి ఒక తరగతి. వారి పనులు 3 కాని గుంపు ఒకటేయే. ఈ మూడు పనులలో ఏదియు మానరాదు.

ఉదా: ప్రయాణమై వెళ్ళునప్పుడు, రైలు బండికి సమయమై పోయి నప్పుడు చదువుట కంఠతగా వచ్చిన "దీనమనస్సుగలవారు ధన్యులు; పరలోక రాజ్యము వారిది" అను చిన్న వాక్యము లేక మనకు కంఠత వచ్చిరేదో వాక్యము జ్ఞాపకము తెచ్చుకొని, బండికి పరుగెత్తవలెను. మరియు బైబిలు విప్పి ఏది వస్తే, అదే ఒక వాక్యము చదివి పరుగెత్తవలెను. ఓ తండ్రీ! పూర్వ కాలమందు మనుష్యులను జ్ఞాపకము ఉంచుకొన్నావు గనుక వందనాలు. బైబిలులో వారిపేర్లు వ్రాసినట్టు మా పేర్లు పరలోక బైబిలులో వ్రాయుము అని ప్రార్థన చేసికొంటూ పరుగెత్తవలెను. ప్రభువా! నేడు

మేము నేర్చుకొనిన దంతయు మా స్వంత ప్రార్ధనగా చేసుకునే శక్తి దయచేయుము. ఆమేన్. ఇట్లు మనస్సున వాక్యము, ప్రార్ధన, స్తుతులు చేయుచు రాకకై సిద్ధపడవలెను.

రక్షణ సార్వత్రికము: దేవుడు అందరి దేవుడు. బైబిలు అందరి బైబిలే, మోక్షము అందరి మోక్షము. అలాగే రాకడ అందరికొరకు. అందరి కొరకైన ఈ రాకడను అందరు అంగీకరించుటలేదు. బైబిలు అందరు అంగీక రించుటలేదు. మోక్షము అందరికొరకు ఉద్దేశించినప్పటికిని ఎవరును- అంగీ కరించుటలేదు.

పై నాలుగును అనగా దేవుడు, బైబిలు, మోక్షము, రాకడ అనునవి; మనిషి కొరకే దేవుడు ఉద్దేశించెను. గాని మనిషి వాటిని అంగీకరించుటలేదు. గనుక లోపము కనబడుచున్నది. ఉపదేశించుట ఆయనవంతు. అంగీకరించుట మనవంతు. అలాగున ఆయన మన కొరకు ఏర్పాటు చేసిన ప్రతి ఈవిని, భాగ్యమును, మరి ముఖ్యముగా రాకడ అంతస్తును, అందులోని సర్వ సౌభాగ్యములను స్వతంత్రించుకొను ధన్యతను ప్రాణప్రియుడు నేడు మీకెల్లరకును దయచేయును గాక. ఆమేన్.

ప్రార్ధన:- ఈ దినము చెప్పబడిన వర్తమానములో నీ వాక్కును మాకు వినిపించిన తండ్రీ! నీకు స్తోత్రములు. ఆదియు అంతమునై యున్న ప్రభువా! నీరాకడ ఘడియ ఎప్పుడో మాకు తెలియదు. తెలియనందున నీ రాకడ ఆలస్యమైనదని మేము ఇహలోకముతో రాజీపడక, ఆ నీ రాక ఘడియకు, తప్పిపోకుండా, మెళకువగలిగి అంతము వరకు సహించిన వారమై ఓపికతో నీకొరకు ఎదురుచూచు దీవెన మాకు అనుగ్రహించుమని త్వరగా వచ్చుచున్న యేసు నామమున అడుగుచున్నాము. ఆమేన్.

---

**22-10-1948వ సం॥లో దేవదాసు అయ్యగారు చేసిన ప్రసంగము.**

## ఇరువది ఐదవ సందేశము

# పెండ్లికుమార్తె పావురము

*పరమ 2:14; మత్తయి. 25:1-13; 1తిమోతి. 4:3.*

**కీర్తన: ప్రభు యేసు రూపే సంఘ వధువు ధరియించెనామె విభవ మేమంచు నేను వివరింపగలను. ॥షారోను॥**

**"స్వీయ రక్తమున ప్రభువు చిన్న కన్నియను శుద్ధి జేయ పావురము వంటి - దాయె స్థిరముగను" ॥షారోను॥**

**పరమగీతము 2:14వ వచనములో ఈ క్రింది భాగములున్నవి.**

1. బండ సందులలో ఎగురు పావురము,
2. పేటు బీటులను ఆశ్రయించు పావురము,
3. నీ ముఖము మనోహరము,
4. నీ స్వరము మధురము,
5. నీ ముఖము కనబడనిమ్ము,
6. నీ స్వరము వినబడనిమ్ము.

ఈమె ఎవరు? పెండ్లికుమార్తె సంఘము. రోమా 3:23వచనములో అందరును పాపముచేసి దేవుడు అనుగ్రహించు మహిమను పొందలేక పోవు చున్నారని వ్రాయబడినది. గనుక లోకమంతటినుండి మహిమను సంపాదన చేసికొను గుంపును తెలిసికొనవలెను. ఆ దేవుని మహిమను సంపాదించు కొనకుండా సాతాను సర్వలోకమును ఏలాగు మోసపుచ్చుచున్నదో. గమనించ వలెను.

**(1) లోకము:-** సాతాను లోకస్థులను రెండు ముఖ్య విషయములలో మోసపుచ్చుచున్నది. 1) ఏలాగైనా ఏ రూపములోనైనను, దేవుని ఆరాధించ వచ్చు. ఏ నామమైనా ఒకటే. ఏ నామమున పూజించినా, ఆ నామమునకే చెల్లునని వారికి నచ్చచెప్పి, 33 కోట్ల దేవతలను మొలిపించెను.

2. దేవుడు సర్వవ్యాపి గదా! అంతటాయున్నాడు. చెట్టులో, పుట్టలో, గుట్టలో, ఈలాగు అన్నిటిలో యున్నాడని వీరిని రెచ్చగొట్టి,

సృష్టికర్తను విడిచిపెట్టి సృష్టిని పూజించునట్లు వారికి నచ్చజెప్పెను. (రోమా. 1:20-23).

**2. నామక క్రైస్తవులు:-** సాతాను లోకమునకు నచ్చచెప్పిన రెండు విషయములు, వీరికి నచ్చలేదు. ఇన్ని దేవుండ్లు ఉండలేదనియు, దేవుడు అన్నిటిలో లేడనియు గ్రహించి, యేసు నామమే రక్షణ నామమని “నేనే మార్గమును, నేనే సత్యమును, నేనే జీవమును అని చెప్పిన యేసునే మేము నమ్ముదుము’ అని లోకములోనుండి ఒక గుంపు బైటికి వచ్చినది. వీరే నామక క్రైస్తవులు, సైతాను వీరినిచూచి వీరియొద్దకు వచ్చి, వీరిని ఏవిధముగా మోస పుచ్చుదుమా! అని ఆలోచించి వీరిని ఈ విధముగా మోసపుచ్చెను.

అదేలాగనగా ఓ క్రైస్తవులారా! మీరు నమ్ముకున్న దేవుడు ఒకటే. ఆయనే క్రీస్తు. ఇన్ని దేవుండ్లుంటే ఏ దేవుని పూజించితే తక్కిన దేవుండ్లకు కోపము. మీ నమ్మకము మంచిదేగాని ఒక పని మాత్రము మీరు చేయండి. మీ కన్నవారి ఇంటి సరుకు మాత్రము, పాత ఇంటి సరుకు మాత్రము విడిచి పెట్టకండి. కన్నవారు అనగా లోకము, లోకపు సరుకు విడిచిపెట్టవద్దని మోసగించెను. ఈ సరుకును గూర్చి దైవగ్రంథములో ఈలాగున్నది. ‘మరియు వారు తమ మనస్సులో దేవునికి చోటియ్యనొల్లక పోయిరి గనుక చేయరాని కార్యములు చేయుటకు దేవుడు భ్రష్ట మనస్సుకు వారినప్పగించెను. అట్టివారు సమస్తమైన దుర్నీతిచేతను, దుష్టత్వముచేతను, లోభముచేతను, ఈర్ష్యచేతను నిండుకొని; మత్సరము, నరహత్య, కలహము, కపటము, వైరమనువాటితో నిండినవారై; కొండెగాండ్రును, అపవాదకులును, దేవద్వేషులును, హింసకులును, అహం కారులును, బింకము లాడువారును, చెడ్డవాటిని కల్పించువారును, తలిదండ్రుల కవిధేయులును, అవివేకులును, మాట తప్పువాడును, అనురాగ రహితులును, నిర్దయులునైరి. ఇట్టి కార్యములను అభ్యసించువారు మరణమునకు తగినవారు అను దేవుని న్యాయవిధిని వారు బాగుగ ఎరిగి యుండియు, వాటిని చేయుచున్నారు. ఇది మాత్రమే గాక వాటిని అభ్యసించు వారితో సంతోషముగా సమ్మతించుచున్నారు” (రోమా. 1:28-32).

**3. రక్షితుల గుంపు:-** ఈ గుంపులోనివారు సాతానుడు, లోకమును మోసగించిన తంతులకు, నామక క్రైస్తవులకు నచ్చచెప్పిన తంతులకు

లోబడక, మేము పరిశుద్ధులముగా జీవించెదమని వీరనుకుందురు. రాకడకు సిద్ధ పడవలెనని తలంతురు. వీరు నామక క్రైస్తవులనుండి బైటకు వచ్చిరి. సాతాను వీరిని చూచినాడు, వీరిని ఏవిధముగా మోసపుచ్చవలెనని ఆలోచించి, రక్షితులారా! మీరు పరిశుద్ధముగా ఏ పాపము చేయకుండా రాకడకు సిద్ధపడుట మంచిదేగాని అస్తమానము ప్రార్థనేనా?, బైబిలు చదువుటేనా? కూటములకు వెళ్లటమేనా? తరువాత వెళ్లకూడదా? తరువాత చదువకూడదా? అను తంతు వీరికి కల్పించెను. ఈ తంతు వీరికి పాపమువలె కనబడుటలేదు. ఎందుకనగా సబబుగా, సర్దాగా వీరికి సాతాను నచ్చచెప్పినది. ఈ "తరువాత" అను తంతుకు లోబడితే, 'తరువాత'లోని "తరు" తీసివేస్తే, ఇక మిగిలినది "వాత" అనునదే! (1తిమో. 4:3) గనుక ఈ గుంపులోనివారు అటువంటి వాత వేయ బడిన మనస్సాక్షిగలవారగుదురు. ఇకముందుకు సాగలేరు. ఆశీర్వాదము పొందలేదు. ఏశావు ఆ తరువాత ఆశీర్వాదము పొందగోరి కన్నీళ్ళు విడుచుచు దాని కోసరము శ్రద్ధతో వెదకినను, మారుమనస్సుపొంద నవకాశము దొరకక విసర్జింపబడెనని మీరెరుగుదురు (హెబ్రీ. 12:17).

**4. కన్యకలు:–** వీరు పై మూడు గుంపుల తంతులకు లోబడక రక్షితులలోనుండి బైటికి వచ్చిరి. సాతాను వీరినిచూచి, వీరిని ఏవిధముగా మోసపుచ్చవలెనని ఆలోచించి, దేవుని సెలవు ప్రకారము వీరికి అలవిగాని శ్రమలు రానిచ్చును (రోమా. 8:35–37) ఇట్టి శ్రమలలో అనేకులు శ్రమలు సహించలేక, జయించలేక, వాక్యానుభవములేక ముందుకు సాగి రాలేరు. ఈ కన్యకల గుంపులోనివారిని ఈలాగు శ్రమలచేత శోధించి, సాతాను వీరిని ముందుకు వెళ్ళనీయక ఆపివేయును.

**5. సిద్ధపడిన గుంపు:–** వీరు ఇప్పటి శ్రమలు, మేము పొందబోయే మహిమ ఎదుట ఏ మాత్రమని ఎన్ని శ్రమలు ఎదురైనను, అన్నిటిని ఓపికతో జయింతురు (రోమా. 8:15–18, 2తిమోతి. 2:12; 3:12). ఇట్టి అనుభవము. కలవారు బుద్ధిగల కన్యకలు (మత్త 25:10) ఇదియే 5 గురు బుద్ధిగల కన్యకలున్న 5వ గుంపు. ఈ గుంపునే పెండ్లి సంఘమని ప్రభువు మెచ్చుకొను చున్నాడు. పరమ. 2–14లో రెండు భాగములున్నవి. 1) బండసందులు, 2) పేటు బీటులు.

బండ: పాతనిబంధనకాలములో ఏర్పాటు జనమైన ఇశ్రాయేలీయులు అరణ్య ప్రయాణము చేయుకాలములో, నీటి కొరకు దేవునికి మొరపెట్టగా, వారి మొర దేవుడాలకించి, మోషేను పంపి వారికి నీరు సమృద్ధిగా అందించెను. ఇశ్రాయేలీయులు ఆ నీటి ప్రవాహములో స్నానము చేసిరి, దప్పి తీర్చుకొనిరి, బట్టలు ఉతుకుకొనిరి (కీర్తన. 105:41, 28:15-16; 1కొరింథీ. 10:4). ఆ బండ క్రీస్తే, పెండ్లి కుమార్తె సంఘముకూడ యేసుప్రభువు గాయములలో జలకమాడి, స్నానముచేసి, శుద్ధియై రక్షింపబడిరి. వీరిని "మీరు నా సన్నిధికి రండి" అని ప్రభువు పిలుచుచున్నాడు. పేటుబీటలను ఆశ్రయించుట అనగా ఆయన గాయములను ఆశ్రయించుట అనగా దైవసన్నిధిలో ఉండుట. ఇట్టివారు రాకడకు సిద్ధపడగలరు (యెష. 4:6).

1. ఆదాము హవ్వలు పాపముచేసి చెట్టుచాటున దాగిరి. ఇది కొంతసేపే. ఇది మనోశాంతి.

2. అపో. కార్య 5వ అధ్యాయములో రోగులను మంచములతో తీసుకు వచ్చినప్పుడు, అపోస్తలుల నీడపడి వారు స్వస్థతను పొందిరి. ఇది శరీర శాంతి.

3. ఆత్మశాంతి: ఇదిగలవారు సంపూర్ణులు. దా॥కీర్త. 91:1 వచనము. మహోన్నతుని చాటున నివసించువాడే సర్వశక్తునినీడను విశ్రమించు వాడు. ఇది దైవ సన్నిధి. ఈ సన్నిధికి వచ్చిన పెండ్లి కుమార్తె సంఘముయొక్క ముఖము, స్వరము, మంచివనియు; ఆమె స్వరము వినబడనిమ్మనియు; ఆమె ముఖము కనబడనిమ్ము అనియు పెండ్లికుమారుడు కోరుకొనుచున్నాడు.

పై 5 గుంపుల స్వరములు గుర్తించినయెడల

(1) లోకుల స్వరము:- 'హరేరామ హరేకృష్ణ..... ఈ స్వరము ప్రభువుకు అక్కరలేదు.

(2) క్రైస్తవులు- నామక క్రైస్తవులు:- దేవా! పాపినైన నన్ను కరుణించుము' ఈ స్వరము ప్రభువుకు అక్కరలేదు.

(3) రక్షితుల స్వరము:- 'ప్రభువా! రాకడకు నన్ను సిద్ధపర్చుము". ఈ స్వరము ఆయనకు అవసరములేదు.

(4) కన్యకల స్వరము:– శ్రమలపై జయమిచ్చి నన్ను సిద్ధపర్చుము' ఈ స్వరము యేసుప్రభువుకు అవసరములేదు.

(5) సిద్ధపడిన గుంపు:– ప్రభువైన యేసూ! రమ్ము'... ఈ స్వరమే పెండ్లికుమారునికి కావలెను. పెండ్లికుమార్తె స్వరములో 3 స్వరములున్నాయి. ఈ మూడు స్వరములు ఒకే స్వరములో ఉన్నవి. ఆ స్వరమే... 'మరనాత' 1కొరింథి 16:22.

**పెండ్లికుమార్తె సంఘము లేక సిద్ధపడిన గుంపు:**

1) వీరి ముఖ్యమైన బోధ రాకడ బోధ.

2) వీరి రమ్యమైన స్తుతి – శ్రమలో స్తుతించుట.

3) వీరి ప్రార్థన – ప్రభువైన యేసూ! రమ్ము.

ఈ మూడు స్వరములు కలవారే ఈ కాలాంతమందు పెండ్లికుమార్తె సంఘముగా సిద్ధపడుదురు. వీరు దేవకుమారులు. యేసుప్రభువు వీరి బోధే, వీరి స్తుతే, వీరి ప్రార్థనే కావలెనని కోరుచున్నారు. తక్కినవారి స్వరములు ఆయనకు అవసరము లేదని కనబడుచున్నది. రాకడ కాలములో ఉన్నాము, లోకములో ఉన్నాము. ఇది సిద్ధపడు కాలము, ఎత్తబడు కాలము. కనుక రాకడ బోధ చేయువారెవరో ఈ గ్రంథములో, ఈ వచనములో వారి వివరము కనబడుచున్నది. గనుక రానైయున్న పరలోక వరునితో త్వరలో పరమందు జరగనైయున్న పెండ్లివిందుకు సిద్ధమైయున్న పెండ్లికుమార్తెవలె సిద్ధపడు భాగ్యము; ఆ పరమవిందుకు సిద్ధమైయున్న గుంపుతో కలసి రాకడ మేఘమెక్కి వెళ్లగల భాగ్యము; పెండ్లికుమారుడుగా రానైయున్న ప్రభువు మీకు అనగా ఈ పాఠము చదువు వారెల్లరకూ అనుగ్రహించునుగాక! ఆమేన్.

---

**15-11-1948వ సం॥లో దేవదాసు అయ్యగారు చేసిన ప్రసంగము.**

# ఇరువది ఆరవ సందేశము

# పెండ్లికుమార్తె స్థిర నిరీక్షణ

*యెష. 9:7; లూకా. 21:25; 1థెస్స. 4:13-15*

**"ప్రభువురాక సమీపించుచున్నది గనుక మీరు ఓపిక కలిగియుండుడి. మీ హృదయములను స్థిరపరచుకొనుడి" యాకో. 5:8**

**"నేను వచ్చువరకు ఇచ్చట నిలకడ గలిగి నిలిచియుండుము - నేను వచ్చి రెప్పపాటు-లోనే నిన్ను కొనిపోయెదను" ॥మనో॥**

**ప్రార్థన:-** యేసుప్రభువా! నీ రాకడకు అనగా ఏ కాలములోని వారు నీ రాకడకు ఎవరు సిద్ధము కావలెనో, వారివద్దకే నీవు వస్తావు గనుక వందనములు. పాత నిబంధనలో నీ రాకడకు సిద్ధమైన వారియొద్దకు వచ్చి నందుకు స్తోత్రములు, క్రొత్త నిబంధన కాలములో కూడ నీ రాకడకు సిద్ధమైన వారియొద్దకు వచ్చినందులకు స్తోత్రములు. సంఘకాలముయొక్క రాకడకు సిద్ధమైయున్న వారియొద్దకు కూడా వచ్చెదవు గాన నీకు వందనములు. ఈ దినమందు నీ రెండు రాకడల గురించి ధ్యానించుచున్న మాకు తోడైయుండుమని వేడుకొనుచున్నాము. ఆమేన్.

**నేటి దిన ధ్యానాంశము రెండవ రాకడ:-**

యేసుప్రభువు వచ్చునని పాత నిబంధనలో భక్తులు నిరీక్షించిరి. వారికి ఆయన దర్శనములో కనబడినారు. అది ఒక రాకడ ఆలాగు వచ్చినది. ఆ తర్వాత బేత్లహేమునందు జన్మించినది మొదలు, ఆరోహణ వరకు కనబడుతూనే ఉన్నారు. అది ఒక రాకడ. ఇంకొక రాకడ ఉన్నది. అదేదనగా ఆయన ఆరోహణమైనప్పటినుండి రేపు మేఘములో రావలసిన ఘడియవరకు ఉన్న రాకడ. దానికే రెండవ రాకడని పేరు పెట్టినారు. అది ప్రత్యేకమైన సంఖ్యలతో లెక్కపెట్టవలసియున్న అది రెండవ రాకడ కానేకాదు. మరింత ఎక్కువ సంఖ్యను మనము వాడవలసియుండును. రెండవ రాకడ అయిన తరువాత ఏడు సంవత్సరముల శ్రమకాలములో మారుమనసు పొందేవారి నిమిత్తమై వస్తారు. తరువాత హర్మె గెద్దోను యుద్ధము చేయుటకు వస్తారు. ఆ తరువాత భూమిమీద భక్తులతో కలసి వెయ్యేండ్లపాలన చేయవస్తారు. ఆ తరువాత సజీవుల తీర్పు తీర్చవస్తారు.

ఆ తరువాత అంత్యదినమందు అవిశ్వాసులైన మృతులనులేపి తీర్పు విధించ వస్తారు. ఇవన్ని రాకడలే అవిగాక ఇంకా ఉన్నవి. ఈ దినము మన దేవాలయమునకు వచ్చిరి. అది ఒక రాకడ. వచ్చేవారము వచ్చిన యెడల అదొక రాకడ. దైవభక్తులు కూడుకొన్న దగ్గరకు ప్రతిదినము వస్తారు. అదొక రాకడయే. ఈలాగు క్రీస్తురాకడలెన్నో లెక్క పెట్టలేము. అవన్ని ఈ దినము వివరింపలేము. ప్రతి రాకడ విషయము, ఎవ్వరైన విపులముగా వివరించిన, వినసొంపుగానుండును. ఆ వివరము విశ్వాసులను బలపర్చును.

ఈ దినము మాటలాడునది ప్రభువు రెండవరాకడలో సంఘము నిమిత్తమై, ప్రభువు వచ్చేరాకడ. ఈ రెండవరాకడను గురించి ప్రతిదినము ప్రార్ధనలో జ్ఞాపకముంచుకొనవలెను. ఈ దినము రెండు సంఘముల నిరీక్షణను గురించి చెప్పెదను. ఒక సంఘము కొరింథి సంఘము, రెండవ సంఘము థెస్సలోనికైయ సంఘము (1) కొరింథి సంఘమునకు పౌలు ఒక్కమాట చెప్పెను అదేదనగా 'మీరందరు కూడి వచ్చుచుండగా మీరు ప్రభువు రాత్రి భోజనము చేయుట సాధ్యముకాదు.' (1కొరింథి. 11:20 (2) ప్రభువు వచ్చే పర్యంతము మీరు ప్రభువు భోజనము తీసికొనవలెను. (3) ఆయన మరణమును జ్ఞాపకమునకు తెచ్చుకొనవలెను. రాకడవరకు కొరింథి సంఘమునకు ప్రభువు భోజనమును గురించి అపోస్తలుడైన పౌలు చెప్పెను.

(2) థెస్సలోనికయలో ఉన్న సంఘమునకు 'మనము రాకడవరకు సజీవులమై నిలిచియుందుమని చెప్పిరి.

(ఎ) మనము, (బి) రాకడ వరకు (సి) సజీవులమై యుందుము (డి) నిలిచియుందుము.

కొరింథి సంఘమునకు- థెస్సలోనికైయ సంఘమునకు చెప్పిన రెండును సమానముగానే యున్నవి. యేసుప్రభువు జన్మము మొదలు ఆరోహణము వరకు ఆది ఒక కథ. ఆరోహణము మొదలు యేసుప్రభువు మేఘముమీద తిరిగి వచ్చు పర్యంతము, అది సంఘకాలకథ. మొదటిది క్రీస్తు ప్రభువు యొక్క భూలోక చరిత్రకథ. అది 33 1/2 సంవత్సరములే. అయితే, సంఘకాలములో ఇప్పటికి 20 వందల సం॥ల గడిచిపోయినది.

ప్రభువు వస్తానన్నారుగాని ఇంకా 20 వందలలోకూడ రాలేదు. ప్రభువు త్వరగా వచ్చెదనన్నందువల్ల కొరింథీయులకు భ్రమ. ప్రభువు త్వరగా వచ్చెదన న్నందువల్ల, వచ్చువరకు సజీవులమైయుండు మనము పాలుపొందుదుమనేది, థెస్సలోనికైయులకు ఉన్న భ్రమ. ఈ రెండు సంఘములకు కూడా భ్రమే. ప్రభువు రాక కొరకు మొదటి శతాబ్దము నుండి 20వ శతాబ్ధము వరకు యున్న వారందరికి భ్రమే. ప్రభువు వచ్చును గనుక వ్రాయించారు అని చెప్పి 20వందల సంవత్సరములు భక్తులు ఎదురుచూచుచున్నారు. ఈ కాలమందు ఆయన రాకకు నిరీక్షించుచున్న మనము ఒకటవ శతాబ్ధము వారు ఈ నిరీక్షను ప్రారంభించుచునట్లును, 20వ శతాబ్ధమువారు కొనసాగించునట్లును జ్ఞాపక ముంచుకొనవలెను. ప్రభురాకడ సమయము ఆలస్యమైనందున, ఆ 20వందల సంవత్సరములోని భక్తులు కనిపెట్టినను వారికి మరణము వచ్చినది. అలాగున రాకడకు కనిపెట్టువారిలో ప్రతి శతాబ్ధములోను మరణము వచ్చినది. నేటికాలములోను అంతే. వస్తానన్న ఆయన తప్పక రావలెను. మొదటి రాకలో వచ్చిన ఆయన రెండవ రాకడలో తప్పక రావాలి. అలాగే ఇప్పటి విశ్వాసులైన మనము దేనికొరకు కనిపెట్టవలెను. దేనికొరకు సిద్ధపడవలెను? మంచి మరణము కొరకా? లేక రెండవరాకడ కొరకా? దేనికొరకు? ముగింపులోనున్న రెండవరాకడకొరకే సిద్ధపడవలెను. రాకడ కొరకు మనము సిద్ధపడునప్పుడు ఆయన దయవలన మరణమునకు సెలవిచ్చి రానిచ్చిన, సిద్ధపడి వెళ్లవలెను, గానీ దిగులుపడకూడదూ. ఎవరిని రాకడకు సిద్ధపరచి తీసికొని వెళ్లవలెనో ప్రభువునకు తెలియును.

ఒకమంచి గొప్ప భక్తుడున్నాడు. రెండవ రాకడకు సిద్ధపడుచున్నాడు. ప్రభువు మంచి మరణమిచ్చి తీసికొని వెళ్లుచుండగా, 'ఏమిటిది ప్రభువా! నన్ను మరణింపజేసి తీసికొని వెళ్లుచున్నావు' అని ఏడ్వగా, ప్రభువు కన్నీళ్లు తుడిచి, 'రాకడ ద్వారానైననూ, మరణముద్వారా నైననూ నావద్దకే నీవు రావలెను. నీ ప్రవర్తనద్వారా, సేవద్వారా నీవు మరణమునకే సిద్ధపడినావు గనుక మరణమిచ్చి తీసికొని వెళ్లుట కృపయే' అనెను. ఉదాహరణకు:- ఒక రోగికి డాక్టరుగారు ఆరోగ్యరీత్యా (రాగులు) చోడి జావ ఇవ్వమని చెప్పారు. ఆ ప్రకారంగానే ఆ రోగికి (రాగులు) చోడిజావ ఇవ్వగా, ఆ రోగి అయ్యా! నేను గోధుమ జావ అడిగితే, ఈ

చోడిజావ నాకెందుకున్నాడు. రోగి ఆశ గోధుమ జావ పై ఉన్నది. అయితే, శరీరము చోడిజావే భరించగలదు అది నాకు తెలుసును అని డాక్టరనెను. అలాగే నేటికాల భక్తులనేకులు రాకడకు సిద్ధపడు చుండగా, మరణములోనికి వెళ్లుదురు. ప్రకటనలో ప్రభువే వారి కన్నీరు తుడుచు ననియున్నది. ఒక భక్తుడు మరణకాలములో 'దేవుడులేడు. దయ్యాలులేవు' అనేస్థితిలో నుండగా, ఒక బోధకుడు తన బోధవల్ల అతనిని మరల నిరీక్షణ స్థితికి మార్చెను. లేకపోయిన ఆ భక్తుడు నరకములోనికి వెళ్లవలసినదే.

అలాగే విశ్వాసులు రాకడకు ఆశించి ప్రయత్నించి సిద్ధపడకపోయిన యెడల తమ జీవితమువల్ల, ప్రయత్నమువల్ల ఏమి ప్రయోజనము? కాబట్టి మరణము లేదా రాకడ ఎప్పుడు వచ్చునో తెలియదు గనుక రెంటికి సిద్ధపడవలెను. ప్రభువు దేనికి తీసికొనివెళ్లినా, చింతపడకూడదు. గోధుమజావ ఆశించిన రోగికి, చోడిజావ ఇచ్చినను డాక్టరును ఏమి అనకూడదు. మన మందరము రాకడనే ఆశించి సిద్ధపడి, భ్రమపడి, ఆశించి యుండవలెను. బైబిలులో రాకడను గూర్చి ఎక్కడేమియున్నా అది చదువవలెను. ప్రతిదినము రాకడ తలంపు కలిగి ఉండాలి. ప్రభు రాకడ గురించి ప్రకటించి 20 శతాబ్ధ ములు గడిచెను గాన అప్పటి కంటే ఇప్పుడే రెండవరాకడ సమీపముగా యున్నది గనుక ఆ రాకకే సిద్ధపడవలెను.

**ఈ రెండవరాకడ గురించి చాలా ఆక్షేపణలున్నవి.**

1) బేత్లహేములో మనిషిగా జన్మించి పనిచేసిన ఈయన వడ్లవాడు కాదా? యోసేపు, మరియమ్మల బిడ్డకాదా? అని ఆక్షేపించినంత మాత్రమున ఆయన లోకములో పుట్టుటమానెనా? ఆక్షేపణ ఆయనకు ముందే తెలిసినను జన్మించుటమానలేదు.

2) ఆయన సిలువ పైయున్నపుడు 'వీడు ఇతరులను రక్షించెను. తన్నుతాను రక్షించుకొని దిగకూడదా?' అన్నారు. ఈ ఆక్షేపణ వచ్చునని ఆయనకు అప్పుడే తెలిసినను సిలువవేయబడకుండా ఉన్నాడా? చనిపోకుండా ఉన్నాడా? ఆక్షేపించుదురని పనులు మానేనా? మానలేదు.

3) మరణమునుండి లేచిన తరువాత కూడ 'లేవలేదు. శవాన్ని ఎత్తుకొని పోయిరని' బంట్రోతులకు లంచమిచ్చి అబద్ధాలు చెప్పించిరి. అదికూడ ఆయనకు తెలిసినను లేవకుండా ఉన్నాడా?

1. పుట్టకుండా ఉండలేదు, 2. అద్భుతాలు చేయకుండా ఉండలేదు, 3. సిలువ మ్రాను ఎక్కవలసియుండినను, యెరూషలేము రాకమానలేదు, 4. సిలువ ఎక్కుట మానలేదు. 5. చనిపోవుట మానలేదు, 6. లేవకుండుట మానలేదు, 7. పరలోకమునకు వెళ్లుట మానలేదు. అలాగే నేటికాలములో నామక క్రైస్తవులు సిద్ధపడేవారిని ఆక్షేపించినను, అంతమాత్రమున ఆయన రెండవసారి రాకుండా ఉండునా? అలాగే అనేకులు ఆక్షిపించినంత మాత్రమున సంఘమును తీసికొనిపోకుండా ఉండునా? ఆయనను గూర్చి వ్రాసినవన్ని జరిగినప్పుడు రాకడ ఎందుకు జరుగదు! ఈ 20వందల సంవత్సరములలో సువార్త భూదిగంతములు వ్యాపించి, సువార్త పని చాలా జరిగింది. 2,000 భాషలలో బైబిలు అచ్చుపడి వెళ్లినది. భూదిగంతమనగా జపాను, అమెరికా, తూర్పు దేశాలు, పడమర దేశాలు ఈ మధ్యంతా సువార్త వ్యాపించియున్నది. ఈ సువార్త ఎంతగా వ్యాపింపదన్న మాత్రమున ఆలాగు జరుగలేదు, గాని వ్యాపించి తీరినది. గుర్తులలో భూకంపములు కరువులు, యుద్ధములు మొదలైనవి జరుగుచున్నవని మనము చూచుచున్నాము. గురుతులు, ప్రవచనములు నెరవేరుచున్నవా లేవా? అలాగైన రాకడ తప్పక నెరవేరును. పాతనిబంధన గురుతులు, దానినిబట్టి వచ్చిన మొదటి రాకడ నెరవేరినది. అది మనము చూడలేదు. గనుక మనకాలములోని గుర్తులు నెరవేర్పు మనము ఎందుకు చూడము! ప్రస్తుత విషయాలనుబట్టి వెనుకటివి నెరవేరినవి అని తెలుసుకొనుట సులువేకదా!

(1) సజీవులముగా నిలిచియుండు మనము ప్రభువుతో వెళ్లుదుము. అన్న పౌలు సజీవముగా వెళ్లాడా?

(2)కొరింథియులు నేటివరకు ప్రభువు భోజనము తీసికొనుచున్నారా? అని ఎందరు ఆక్షేపించినను మనము మన రాకడ నిరీక్షణను సజీవముగా కాపాడుకొనవలెను. ఈ రెండు సంఘముల వారు భక్తిగల మరణము పొందిరి. 'థెస్సలోనికయ వారితో సజీవులుగా నిలిచే మనము వెళ్లుదుము' అని ఎప్పుడూ అనవలెను. ఎవరు ఆ సజీవులు? ఇప్పుడిక్కడ ఉన్నవారే. లోకములో సజీవులుగా ఉండి సిద్ధపడువారే. అట్టి నిరీక్షణ సిద్ధబాటుతో మనమును అలాగున సిద్ధపడుదుముగాక.

(1) పక్షికాళ్లలో మూలుగులేదుగాన, గాలిలో అది ఎగురును. మృగములకు, మనిషికి కాళ్లలో మూలుగు ఉండునుగాన గాలిలో ఎగురలేరు. అలాగే ఎవ్వరిలో పాప మూలుగు, 'నిరాశ' మూలుగు, "నిరీక్షణ లేనిమూలుగు," "అవిశ్వాసములు" మొదలగు మూలుగులు ఉండునో, ఎవరిలోనైతే కాలయాపన ఉండునో అనగా రాకడ ఈ రోజుకాదు 'రేపు' అనేవారు రాకడలో వెళ్ళరు. "రాకడ మనకాలములో రాదు, సిద్ధపడుట ఎందుకు? అనేవారు వెళ్ళరు.

(2) 'త్వరగా వస్తానన్న' ఆయన మాటను చూచి, కొందరు 'త్వరగా రాదు' అనుట పాపమేకదా! **సిద్ధపడకపోవుట, రాకడ కలవరింపు లేకపోవుట పాపమే; రాకడ వాక్యములు తెలుసుకొనకపోవుట పాపమే.** నామక క్రైస్తవులు, అన్యులు ఆక్షేపించుదానికి లెక్కచేయక, రాకడకు సిద్ధపడవలెను.

1. నిరీక్షణ లేకపోవుట, 2. విశ్వాసము, లేకపోవుట, 3. రాకడ భ్రమలేకపోవుట, 4 సిద్ధపడకపోవుట, 5. బైబిలులో రాకడ వాక్యములు తెలుసుకొనకపోవుట, 6. ఆకాశము, భూమి, సముద్రములో కనబడుచున్న గుర్తులు తెలిసికొనకపోవుట, 7. కాలయాపన అనగా 'మనకాలములోరాదు 'అనుట' ఇవి అన్నియు పాపములే.

ప్రార్థన:- ఓ ప్రభువా! నేను రాకడకు సిద్ధపడెదను. రాకడకే సిద్ధపడుచున్నానని మరణమునకే నేను సిద్ధపడిన తీసుకో ప్రభువా! రాకడకు సిద్ధపడుచుండిన నీవే నన్ను సిద్ధపరచి, ఆకర్షించుము ప్రభువా! నీ చిత్తము మాలో జరిగించుమని యేసు నామమున వందించుచున్నాము. ఆమేన్.

మంచి మరణమునకని చేసినబోధ ఈ వేళకు అది సరిపడదు.

1. సజీవ రాకడ, 2. మహిమగల రాకడ, 3. ప్రాణముతో ఎగిరివెళ్లే 4. మరణముచూడని రాకడ, 5, మరణము తెలియనిరాకడ, 6. యేసుప్రభువు మేఘాసీనులై ఆకర్షించే రాకడ. ప్రభువా! నేను సిద్ధముగా యున్నాని చెప్పే రాకడ. షరా:- రెప్పపాటు రాకడకు ప్రతి రెప్పపాటులో సిద్ధపడి యుండవలెను. ఈ మాటలు ప్రతివారు అట్టి రాకడకు సిద్ధపడుదురుగాక. ఆమేన్

## ఇరువది ఏడవ సందేశము

# రాకడ సంగ్రహ సలహాలు, సూచనలు, సవివరణలు

*నహూము 2:4; లూకా. 21:29-33; 2 పేతురు 3:10-12.*

**"ఆయన కాలములను సమయములను మార్చువాడైయుండి, రాజులను త్రోసివేయుచు నియమించుచు ఉన్నవాడును, వివేకులకు వివేకమును జ్ఞానులకు జ్ఞానమును అనుగ్రహించువాడునైయున్నాడు." దాని. 2:21.**

రాకడ విశ్వాసులారా! నేటిదిన ధ్యానము రాకడ సంగతులు తెలిసి కొనుటకు కాదు, రాకడ అనుభవములు చెప్పుకొనుటకు కాదు కాని రాకడకు సిద్ధపడుటకే ఇందులోని ప్రార్థనలైనను, స్తుతులైనను ఏర్పడినవి. ఇదివరకు నేర్చుకొన్నవి. ఇందులో క్లుప్తముగా ఇముడ్చుచున్నాను. అవేవనగా, ఇదివరకే ముగింపవలసిన పనులు అనగా (1) బైబిలంతా తెలిసికొనుట, (2) సువార్తపని ముగించియుండుట అనగా ఎవరికి చెప్పగలమో, వారికి చెప్పియుండుట, మరియు రాకడ సంగతులు కలిగిన పత్రికాదులు పంచిపెట్టుట, (3) రాకడకు చేయవలసిన ప్రార్థనలన్నియు చేసి ముగించుట, (4) ఎవరికి తీర్చవలసిన బాకీలు వారికి తీర్చివేయుట, సమాధానపడు వారితో తప్పులొప్పుకుని, (5) సమాధానపడుట, (6) అప్పులు తీర్చివేయుట, (7) ఇదివరకు వ్రాసికొన్న నోట్సు ఒక పర్యాయము చూచుకొనుట, కూటనాయకులు, రానిమెంబర్లకు నోట్సంతా వినిపించి యుండవలెను. ఈ కార్యములు ముగించనిదే మన సిద్ధబాటు సంపూర్ణముకాదు.

**ప్రార్థన:-** ఓ దయగల తండ్రీ! మేము రాకడకు సిద్ధపడుట అనే విషయము యోచన చేయుటకు కూడుకొనియున్నాము, వందనములు. ఈ సమయమును సద్వినియోగపరచుకునే కృప దయచేయుము, గనుక నామకార్థముగా చేయక, నిరీక్షణతో చేసే కృప దయచేయుము. త్రియేకదేవా! నీకే ఘనత, కీర్తి ప్రభావము కల్గునుగాక! ఆమేన్.

రాకడకు నేను సిద్ధపడుదును, సిద్ధబాటుకొరకు చేయవలసినవన్నియు తప్పకచేసి తీరెదను' అని ప్రభువు రెండవ రాకకు సిద్ధపడుచున్న మీరందరు ఒక తీర్మానము చేసికొనవలెను. ఇదివరకు

మీరు నోట్సుమీదను, ఇతరుల ప్రార్థనలమీదను అనుకొన్నయెడల ఇప్పుడది మానివేయవలెను. మీకు మీరే ప్రార్థనా స్తుతులతో కనిపెట్టుటలో యుండి వాక్యమును ఆధారము చేసికొని, ప్రభుయేసుని నమ్ముకొని సిద్ధపడండి. రాకడను గురించి పత్రికలలోయుండు సంగతులను చదివేసి యుండవలెను. మనము చేయవలసినది మనము చేయక పోతే, ప్రభువు చేయునని నీవెట్లు నిరీక్షించగలవు. సిద్ధపడుటలో ఆలస్యము చేయకూడదు. 'నీవు వెళ్లి ఆలాగు చేయుము' అని యేసుప్రభువు ఒక శాస్త్రితో చెప్పెను. ఎవరు చేయవలెను ప్రభువా అని తిరిగి అడుగకూడదు. ఎవరు చేయవలసినది వారు, నీవు చేయవలసినది నీవు చేయుము. నాకు రాకడను గురించి తెలియలేదు అనకూడదు. తెలిసికొనకపోవుట ఎవరి తప్పు? నీదేగదా!

విశ్వాసులొక మోటుమాట అనగా గడుసుమాట అందురు. 'అందరూ సేవచేయుచూ ఉండగా, అనేకుల ఆత్మరక్షణ కొరకు ఎదురుచూస్తు ఉండగా కేవలము మీరు మాత్రము వెళ్ళుదురా? అని కొందరు విశ్వాసులు ప్రశ్నించుదురు. నీవు రక్షించబడిన తరువాత ఎక్కువ సేవచేస్తే, ఎక్కువ ఫలితము పొందుదువుగాని రాకడలో నీకు పాలెక్కడ? నీవు ఎక్కువగా బైబిలు చదివితే, ఎక్కువ జ్ఞానం పొందుదువు, కాని రాకడలో పాలెట్లుండును? నీవెక్కువ మందిని గూర్చి ప్రార్థన చేస్తే ఎక్కువ ప్రార్థనా ఫలితము పొందుదువు గాని రాకడలో పాలు ఎక్కడ? ఎక్కువ సువార్త పనిచేస్తే ఎక్కువగా సువార్త ఫలితం పొందుదువు కాని రాకడలో పాలెట్లుండును? ఎక్కువ చందా ఇస్తే, అట్లు ఫలితం పొందుదువు. కాని రాకడలో పాలెట్లుండును. **రాకడకు సిద్ధపడితేనే రాకడ ఫలితము పొందుదువు.**

### *రాకడకు సిద్ధపడువారు ఈ క్రింది అంశమును ధ్యానించవలెను*

(ఎ) జలప్రళయం (బి) దానియేలు 2వ అధ్యాయము, (సి) ఏలీయా ఆరో హణము, (డి) దానియేలు 7వ అధ్యాయము, (ఇ) హనోకు ఆరోహణము, (ఎఫ్) మార్కు 13:32-37లో ప్రభువు ఏ సమయమున వచ్చునో; అనగా సాయంకాలము, వచ్చునో అర్ధరాత్రివేళ వచ్చునో కోడికూయునప్పుడు, తెల్లవారునప్పుడు; రాకడను గూర్చి ఈ మొదలైన ప్రభువు మాటలు, అపొస్తలుల మాటలు, వాటి వివరము, అర్ధము పూర్తిగా నేర్చుకొనవలెను. మనము నేర్చుకొన్న గుర్తులు పునఃపఠన చేయవలెను.

నీవు రాకడకు సిద్ధపడగోరిన యెడల ఈ క్రింది ప్రశ్నలు ధ్యానించుము. అవి ఏవనగా:

1. చదువరీ! క్రీస్తు త్వరగా వచ్చుననగా 'ఆయనకు అడ్డములేమియు లేవు అని అర్ధమనియు, గురుతులైన తరువాత ఆయన త్వరగానే వచ్చుననియు గ్రహించినావా?

2. ప్రభువు ఫలానప్పుడు వస్తానని ప్రభువు తారీఖు చెప్పలేదు గనుక ఎప్పుడుబడితే అప్పుడే ఆయన వచ్చుననియు గ్రహించినావా?

3. బహిరంగమైన గురుతులేకాదు. ప్రభువు నీకు స్వయముగా చెప్పిన గురుతులు గ్రహించినావా? అనగా నేను వచ్చేవేళయినదని ప్రభువు నీకు చెప్పుట గ్రహించినావా?

4. నీవు రక్షింపబడినావని నీకు నిశ్చయమేనా? ఇదికూడ ప్రభువు నీకు చెప్పినాడా?

5. నీవు పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందినావని ప్రభువు నీతో చెప్పినాడా? ఇది నిశ్చయమేనా? "ఏది నిజమో," అను పత్రిక బాగా చదివినావా?

6. ఇంతకాలం స్థిరంగా ఉండి, ఆయన వచ్చేటప్పుడు చల్లబడెదవని నీకు తోచినదా? హెబ్రీ 6వ అధ్యాయము.

7. ఇప్పుడు చెప్పబడియున్న వారందరూ అబద్ధ ప్రవక్తలు కారనియు, బైబిలులో చెప్పిన అబద్ధ ప్రవక్త ఏడేండ్లలో వచ్చుననియు, ఎవరుబడితే వారు అంతెక్రీస్తు కాదనియు, అతడు ఏడేండ్లలో వచ్చుననియు నీవు గుర్తించినావా?

8. అబద్ధ ప్రవక్తలైన, అంతెక్రీస్తులైన, క్రీస్తుయొక్క దైవత్వము ఒప్పుకొనని వారికైనా, లోకములో కలుగుచున్న ఆందోళనలు వారు చూచి, రాకడ దగ్గర బడ్డదని చెప్పినప్పుడు, "ఇప్పుడు 2000సం॥ల నుండి ఉన్నవేకాని క్రొత్తవేవి కావనే వారికిని; రాకడ గురుతులు కొన్ని స్థలములలోనే జరుగుచున్నవి గాని అన్ని స్థలములలో గురుతులు నెరవేరుటలేదు. అనువారికిని; ఈ రీతిగా రాకడకు ఎదురు ప్రశ్నలువేయు వారికి జవాబు చెప్పగలవా?

9. "నేను తప్పకుండ ఎత్తబడుదుననే విశ్వాసమునుబట్టి ఆనందించు వారినిగూర్చియు నాయందభిమానము గలవారు నన్నుగూర్చి ప్రార్థన చేయు చున్నందున ఎత్తబడుదుననే నమ్మకముగలవారిని గూర్చియు, నేను బాప్తిస్మము పొందినాను గనుక ఎత్తబడుదునని సంతోషించే వారిని గూర్చియు; రాకడను గూర్చిన ఇన్ని సంగతులు నేర్చుకొనక, సిద్ధపడక– 'యేసుప్రభువును నమ్మిన వారిని ఆయన తీసికొని వెళ్లును గనుక నన్నుకూడ తీసికొని వెళ్లునని' గూర్చికూడ సువార్త ప్రకటనలో సంతోషించేవారిని గూర్చియు, ఆయన రాకడను చేర్చి ప్రకటిస్తూ అనేకమందిని నమ్మింపజేస్తున్నాను గనుక తప్పకుండ ఎత్తబడుదునని సంతోషించేవారిని గూర్చియు; ఏమి చెప్పుదువు? ఇవన్నియు ఎత్తబడుటకు నిజమైన కారణములేనా? అట్టివారికి పరిశుద్ధాత్మకు విరోధమైన పాపములను గూర్చియు, హెబ్రీ 6వ అధ్యాయములోని ప్రారంభ వాక్యములను గూర్చియు, యెహెజ్కేలు 33:23-33 వరకు ఉన్న సంగతిని గూర్చియు జ్ఞాపకము చేసినావా? 1) ఎవరు వాక్యంవింటారో, ఎవరు విని విశ్వసిస్తారో, ఎవరు విశ్వసించిన ప్రకారం విధేయులై నడుచుకుంటారో, ఎవరు అలాగు నడుచు కుంటు, 2) విమలాత్మ ప్రోక్షణము అనగా పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందుదురో, 3) ఎవరు ఎత్తబడవలసిన నూతన యెరూషలేములోనుండు కాంతిని చూచేటందుకు ఈ భూలోకములోనే తర్ఫీదు అగుదురో, 4) ఎవరు యోహాను వలె ఈ లోకములో యేసుక్రీస్తు ప్రభువుతో మిక్కిలి సహవాసము చేయుదురో అట్టివారు ఎత్తబడుదురని మీరెప్పుడైన విన్నారా?

5) ఎత్తబడు వారికి **"కనిపెట్టుగంట"** అనే ఒక చిన్న పుస్తకము మిక్కిలి ఉపయోగకరమైన పుస్తకమని మీరెప్పుడైన గ్రహించినారా?

6) టైటానిక్ ఓడ 'అదిగో మునిగిపోతుంది' అనేవరకు ఓడలోని పనివారందరు, ఎవరి పని వారే చేసుకుంటున్నారు. అలాగే ఎవరి కప్పగింప బడిన పనులు వారు రాకడవరకు చేసికుంటూ ఏమరుపాటుగా ఉండుటకంటే, అన్ని పనులు ముగించుకొని రాకడకు సిద్ధపడి ఉండుటే క్షేమమని మీరెప్పుడైన విన్నారా? రాకడ సలహాలు:– ఈరెండు మాటలు బాగా జ్ఞాపకముంచుకొన వలయును. మగ్రే= సమస్తము కలిగియుండుట; ఎఫెసీ. 1:16-19. హెబ్రోను = దైవసహవాసం; ఈ మాటల అనుభవము ఏమిటో మీకు తెలుసునా? అపో.కార్య. 1:11; 1థెస్స. 4:16, మత్త. 10:24-33లో ఈలాగున్నది. పరలోకమునుండి ప్రభువు దిగివచ్చును.

యోహాను 14:3లో ఈలాగున్నది. నేను వెళ్ళి మీకు స్థలము సిద్ధపరచినప్పుడు, నేనుండు స్థలములో మీరును ఉండులాగున మరల వచ్చెదను. 'క్రీస్తురాకడ ఆకస్మాత్తుగా వచ్చును, మనము ఎదురు చూడనపుడు వచ్చును' అని మీకు తెలియునా? మత్త. 24:27లో ఇట్లున్నది. మెరుపు తూర్పునపుట్టి పడమటి వరకు ఎలాగు కనబడునో, ఆలాగే మనుష్య కుమారుని ఆగమనముండును. 1థెస్స. 5:2లో ఇట్లున్నది రాత్రివేళ దొంగ ఎలాగు వచ్చునో (ఏలాగే చెప్పకుండ వచ్చునో) అలాగే ప్రభువు దినము వచ్చును. 3) క్రీస్తు రాకడ మిక్కిలి సమీపమైనపుడు భూలోకముయొక్క సంగతి ఏలాగుండునో మీకు తెలుసునా? మత్తయి 24:7లో ఇట్లున్నది. జనముమీదికి జనమును, రాజ్యముమీదికి రాజ్యమును వచ్చును.

అపో. కార్య 2:19లో ఇట్లున్నది. "పైన ఆకాశమందు మహత్కార్యములను, క్రింద భూమిమీద సూచక క్రియలను, రక్తమును అగ్నిని పొగ, ఆవిరిని 'కలుగజేసెదను' అని పేతురు ప్రసంగించెను. లూకా. 21:25,26లో ఇట్లున్నది. రాబోవుచున్న వాటి విషయమై భయము కలిగి, మనుష్యులు ఎదురు చూచుచు ధైర్యము చెడి కూలుదురు. యూదులు పాలెస్తీనా దేశమునకు తిరిగి వస్తారని బైబిలులో యున్నది. యెహెజ్కేలు 37:21లో ఉన్నది గ్రహించు దాము. 'ప్రభువైన యెహోవా సెలవిచ్చినదేమనగా ఏయే అన్య జనులలో ఇశ్రాయేలీయులు అనగా యూదులు చెదరిపోయిరో, ఆయా అన్య జనులలో నుండివారిని రక్షించి, వారు ఎచ్చటెచ్చట నున్నారో అచ్చటనుండి వారిని సమ కూర్చి వారి స్వదేశములోనికి తోడుకొని వచ్చెదను.", తిమోతి 3:1లో ఇట్లున్నది. "అంత్యదినములో అపాయకరమైన కాలములు వచ్చునని తెలిసి కొనుము".

4) క్రీస్తు రాకడకు ముందు అబద్ధ ప్రవక్తలు వస్తారని మీకు తెలుసునా? ఎవరీ అబద్ధ ప్రవక్తలు? క్రీస్తు రాకడ సమీపముగా లేదని ఎవరు వాదిస్తారో, వారే అబద్ధ ప్రవక్తలని గ్రహించుకొనండి. పేతురు 3:3లో ఈలాగున్నది. "అంత్యదినములలో అపహాసకులు అపహసించుచు వచ్చి, తమ స్వకీయ దురాశల చొప్పున నడుచుకొనుచు, 'ఆయన రాకడను గూర్చిన వాగ్దాన మేమాయెను? పితరులు నిద్రించినది మొదలుకొని, సమస్తమును సృష్టి ఆరంభమున నున్నట్టే నిలిచియున్నదే' అని చెప్పుదురని మొదట మీరు తెలుసుకొనవలెను."

5) యేసుప్రభువు రాకడ సమీపమైనప్పుడు మనుష్యులు ఎంత నిర్లక్ష్యముగా ఉంటారో మీకు తెలుసునా?

మత్తయి 24:38,39లో ఇట్లున్నది. 'జలప్రళయమునకు ముందటి దినములలో నోవహు ఓడలోనికెళ్లిన దినమువరకు వారు తినుచు, త్రాగుచు, పెండ్లి చేసి కొనుచు, పెండ్లికిచ్చుచు ఉండిరి. జలప్రళయము వచ్చి అందరిని కొట్టుకొనిపోవు పర్యంతము ఎరుగక పోయిరి. అలాగుననే మనుష్య కుమారుని రాకడ యుండును."

**రాకడకు సిద్ధపడే విషయాలు:–** ఓ తండ్రీ! జీవాంతము తరువాత ఎవరు ఎక్కడికి వెళ్ళుదురో, నీకు ముందే తెలుసును. నూతన యెరూషలేము వెళ్లుటకు కొందరు మృతుల గుంపులో చేరుదురనియు, కొందరు సజీవుల గుంపులో చేరుదురనియు, కొందరు ఏడు సంవత్సరములు శ్రమలో సిద్ధపడు దురనియు; మరికొందరు వెయ్యేండ్లలో సిద్ధపడుదురనియు, కొందరు రక్షింప బడినవారిలో చేరి పరలోకములో యుందురనియు; మరికొందరు నూతన యెరూషలేములో యుందురనియు నీ వాక్యములోనుండి నేర్చుకొన్నాము. గనుక నేను ఏ గుంపులోనికి తయారు కావలెనో ఆ గుంపులోనికి చేరే కృప దయ చేయుము. నేను చేరవలెనని కోరే గుంపులోనికి చేరుటకు ప్రయత్నముచేస్తే నాది ఆ గుంపుకాకపోవచ్చు గనుక నెరవేరక పోవచ్చును, గనుక నేను ఏ గుంపులోనికి చేరవలెనో ఆ గుంపులోనికి చేరే కృప దయచేయుము.

| గుంపు | కోరిక |
|---|---|
| 1. రక్షింపబడిన వారి గుంపునకు గుంపులో సిద్ధపాటు | 1. నూతన యెరూషలేము గుంపులో చేరు కోరిక. |
| 2. మృతుల గుంపు సిద్ధపాటు | 2. సజీవుల గుంపులో చేరవలెనని కోరిక |
| 3. ఏడు సంవత్సరముల శ్రమకాల | 3. నూతన యెరూషలేములో చేరు కోరిక |
| 4. వెయ్యేండ్ల సంవత్సరములలో ఉండు కోరిక | 4. నూతన యెరూషలేమునకు వెళ్లే కోరిక. |

కావున నూతన యెరూషలేమునకు వెళ్లే భాగ్యము, నూతన యెరూషలేమునకు వెళ్ళే ప్రార్థన, నూతన యెరూషలేమునకు వెళ్లే ప్రవర్తన కలిగియున్న వారికే ఈ భాగ్యము దక్కును.

**సజీవుల గుంపులోనికి వెళ్లేవారు చేయవలసిన కార్యములు:** 1) వాక్యము నేర్చుకొనవలెను. 2) సంఘ సహవాసము కల్గి ఉండవలెను. 3) ప్రార్థించవలెను. 4) స్తుతించవలెను. 4) సువార్త చెప్పవలెను. 5) చందా వేయవలెను. 6) శ్రమకోరుకొనవలెను. 7) మంచి ప్రవర్తన కలిగియుండవలెను. ఈ జాబితాను బట్టి ఎవరు ఏ గుంపో తెలియును. ఉదా:- ఒక కుమ్మరి మష్టు బంగారమును శుద్ధిచేస్తే దానిలో ఉన్న మష్టు తేలును. తరువాత కంసాలివాడు ఆ బంగారమును మరల పుటము వేయును. రెండవసారియును పుటము వేయును. ఒక్కొక్కసారి కొంత మష్టు తేలును. ఇంకొకసారి పుటము వేయగా చివరకు అది ముక్కలై పోవును. అనగా మష్టు ఎక్కువ బంగారం తక్కువ, ఎవరు ఏ గుంపులో చేరి యున్నారో వారి ప్రవర్తనను బట్టి వారికి తప్పక తెలియును.

**బైబిలు గ్రంథములోని రాకడ సూచనలు:** (1) తెలివి వృద్ధియగును:- నలుదిశల సంచరించుటనుబట్టి: (దానియేలు 12:4). (2) మోటారు కారుల సూచన:- నహూము 2:3,4. (3) విమాన సూచన:- యెష 31:5. 1947 సం॥లో భక్తిగల అలన్ బే అను బ్రిటీష్ సైన్యాధిపతి, యెరూషలేమును స్వాధీన పరచుటకు; అప్పటికి దానిని ఆక్రమించిన విరోధులకు తన పేరుమీద ఈ విధముగా పత్రికలు రాయించి, విమానములోనుండి క్రిందకు చల్లించెను. మీరు మీ ప్రాణములను దక్కించుకొనగోరిన యెడల యెరూషలేమును విడిచి పారిపొండి." ఈ పత్రికను చూచిన తురుష్కులు, వ్రాత క్రింద ఉన్న పేరును చదివి, ఇది దైవ సందేశమని భావించి యెరూషలేమును విడిచి పారిపోయిరి. ఎందుకనగా అరబ్బీ భాషలో 'అలన్ బే' అనగా దేవుని కుమారుడు అని అర్ధము. ఈలాగు ఆ పరిశుద్ధపట్టణమును తుఫాను గుండ్లతో కాల్చుగూడదని ప్రార్థించి రక్షించిరి. విమానములవలన తండ్రి ఈ పట్నమును కాపాడెను. (4) రేడియో టెలివిజన్ సూచన:- యోబు. 38:35; ప్రక 11వ అధ్యా. ఇద్దరు సాక్షులు (5) అణు బాంబు: ఈ బాంబు వలన లోకము పూర్తిగా నాశనము కాదని లేఖనములు బోధించుచున్నవి. ఎందుకనగా వెయ్యేండ్ల పరిపాలన జరుగవలెను. తర్వాత పేతురు 3:10 -11వ వచనములో

నున్నది నెరవేరవలెను. (6) నరకపు బాంబు సూచన:- హైడ్రోజను బాంబు పేలినందున అనేకులు నశించిరి. 6మైళ్ళు పూర్తిగా నాశనమయ్యెను. (7) భూకంపపు సూచన:- 15వ శతాబ్దమునుండి 19వ శతాబ్దము: 2119 భూకంపములు సంభవించినవి. (8) సముద్ర తరంగముల ఘోష లూకా 21:25. (9) ఆకాశములో సూచనలు:- ఎగిరిపోవు సాసర్లు:- లూకా 21:11 (10) అన్య జనుల కాలముల నెరవేర్పు: లూకా 21:23-24; రోమా 11:25; మత్త. 24:15-23 (11) యెరూషలేము మరల కట్టబడుట:- కీర్తన 102:16; యిర్మి. 31:38-40 2500 సం॥ల క్రితము ప్రవచించెను. (12) పాలస్తీనా పూర్వస్థితికి వచ్చు సూచన:- యెహె 36:37,38. (13) రష్యను వారు సంధిని తెగ తెంపులు చేసికొను సూచన:- యెహె 38:23:15 (14) రష్యా పాలస్తీనామీదికి దండెత్తి వచ్చుట యెహె 38:15-16లోని ప్రవచనముల నెరవేర్పు ఉన్నది. (15) తూర్పు రాజుల సూచన:- 6దూత ప్రక 12:16 (16) అర్ధరాత్రి సూచన: - మత్త 25:5,6 (17) లోకకార్యముల సూచన:- అపో॥ కార్య 17:31 యునైటెట్ స్టేట్స్ అధ్యక్షుల మరణములు. 1840లో (హరిసన్) 1860లో (అబ్రాహాం లింకన్ 1880లో (గార్ఫీల్డు) 1900లో మ్యూక్కెన్) (రూస్వెల్ట్) 1940 (మాస్వెల్టు) 1960 (కెన్నడీ) (18) అంటురోగ సూచన: ఈ రోగములవలన కోట్లకొలది నశించిరి. (19) పెట్టుబడిదారీ విధానముపై కూలివారి పోరాటపు సూచన:- యాకో 5:1-4. (20) ఇప్పటి దైవిక ఉజ్జీవము:- ఆత్మ కుమ్మరింపు (యెష 66:8వ) యెహె 37; యెహె 2:28-29వ), తమ దేవుని ఎరుగువారు బలముగల్గి గొప్పకార్యము చేయుదురు (దాని 11:32వ); అపో కార్య 2:17-21 (యాకో 5:7వ) (లూకా 21:28వ), (21) నులివెచ్చని సంఘ సూచన: ప్రక 3:14-16; ప్రక 3:10-11వ రాజైన ఉజ్జీయా ధనారిని వృద్ధి అతని నాశనమునకు హేతువాయెను. (22) వెయ్యేండ్ల పరిపాలన గూర్చి, రాకడను గూర్చిన పరిహాసలు 2పేతు 3:3-4 క్రొత్త జన్మము పొందినవారికి రెండవ రాకడ బాధకరముగానుండును. (యెష 3:5) నికోదేమువంటి బోధకులు (23) తప్పుడు బోధకులు లేచుట:- 4:1-3 గత కాలమునుండి అనేక తప్పుబోధలు లేచినవి. యెహోవాసాక్షులు, క్రీస్తు దైవత్వము ఒప్పుకొనరు. నరకము లేదందురు. ఇంకా అనేక భూత బోధలు, వాక్య కరువు, విమతములు లేచును, (24) నోవహు దినముల సూచన: తినుచు, త్రాగుచునుండుట (లూకా. 17:26-27) నోవహు కాలములో లోకమంతట

భ్రష్టత్వముండెను. ఇప్పుడును లోకములో అలాగే యున్నది. 1. జనులు తినుచు, త్రాగుచునుండుట, మితిమీరి త్రాగుట 2. పెండ్లి చేసికొనుట, 3. నీతిమంతుడైన నోవహు యెహోవా జలప్రళయమును గూర్చి హెచ్చరించెను. 4. ఐగుప్తీయుల కాలములో పిరమిడ్ల కట్టబడెను. నోవహు గొప్ప ఓడను కట్టెను. 5. నోవహు దినములలో అవినీతి విస్తరించెను. తండ్రి సంతాపపడెను. ఈ దినములలోను అలాగేయున్నది. (25) యౌవ్వనులు చెడిపోవుదురను సూచన:- (2తిమోతి. 3:1-4) (26) లోకవినాశనము:- మత్త. 24:20బీ దాని. 12:1, (27) లోకమంతయు సువార్త:- మత్త. 24:14. పైవన్నియు రాకడ గురుతులే. ఇవన్నియు మన కాలములోనే నెరవేరినవి. ఇంకనూ నెరవేరుచున్నవి గనుక ఇందులోని రాకడ సూచనలను, సలహాలను, హెచ్చరికలను, ఉపదేశ వాక్యములను, సందేహ సమాధానములను, దైవ గ్రంథ సాదృశ్య వాక్యములను బహు జాగరూకతో చదివి, ధ్యానించి, తమ అనుభవములోనికి తెచ్చుకొనువారు నూతన యెరూషలేమునకు వెళ్ళు దేవుని సజీవుల గుంపులో చేరియుందురు.

అట్టి సజీవ రాకడ ఆరోహణ భాగ్యము ధన్యత, త్వరగా వచ్చుచున్న పెండ్లికుమారుని మహిమ మేఘములు ఎదుర్కొను అంతస్థు, త్రియేక తండ్రి చదువరులెల్లరకును, ఈ కడవరి కాలములో కనీసము ఒక పర్యాయమైన చదివి, ధ్యానించి, ఆయత్తపడువారికి సంపూర్ణముగా అనుగ్రహించి మహిమ పొందునుగాక. ఆమేన్.

**లోకకార్యము లెల్ల - నీకార్య ధాటికి - లొక్కెయని నీకు తెసునా ఏ కార్యమైనను ఎంచి చేసిన యెడల ఏక రీతిని జరుగు తెలుసునా ఎంతో చక్కగ జరుగు తెలుసునా - ఎంతో వింతగ జరుగు తెలుసునా ॥క్రైస్తవ॥**

**29-11-1939వ సం॥లో దేవదాసు అయ్యగారు చేసిన ప్రసంగము.**

## ఇరువది ఎనిమిదవ సందేశము

# రాకడగది - రాకడ ప్రేమ

*సామె. 13:13; మత్త. 13:19-23; మార్కు. 4:23-25; ప్రక. 20:7-15*

"మీరేలాగు వినుచున్నారో చూచుకొనుడని చెప్పెను" లూకా 8:18.

**ఏడు తరగతులున్నవి నీది ఏదో తెలిసికొనుము యిపుడే కీడుమాని మంచి - చేసిన క్రింది తరగతి దొరుకునేమో ॥ఏకాంత॥**

**"వినుట విశ్వసించుట ఆజ్ఞకు విధేయులౌమనుట ఈ పనులు మూడు చేయువారే పరలోక వాస్తవ్యులగుట ॥యేసుప్రభువు॥**

రక్షణను అపేక్షించి, రాకడకు సిద్ధపడుచున్న రాకడ జనులారా! రాకడ గదిలో చేరిన గట్టి గింజలవలె పరిశుద్ధాత్ముడు మిమ్ములను తయారు చేయునుగాకు ఆమేన్. నేటి దినమున విత్తనములు విత్తువాని ఉపమానములో నుండి కొన్ని తరగతుల పాఠములను నేర్చుకొందాము. విత్తువాడు విత్తుచుండగా, కొన్ని విత్తనములు త్రోవ ప్రక్కను పడెను. విత్తనములు ఎక్కడ పడ్డాయి? విత్తనాలు పడ్డాయా? ఇక్కడ చెప్పనివారు వీధులలో ఏమి చెప్పగలరు! త్రోవ ప్రక్కన పడిన విత్తనాలు పిచ్చుకలు తినివేస్తున్నాయా? తినివేస్తున్నాయి. మూడు గదులు:

**మూడు గదులు:-** 1. రక్షితుల గది, 2. రాకడ గది, 3. శ్రమలగది. ఈ విధమైన బోధ ఎవ్వరు చేయుటలేదు మనమే చేయుచున్నాము గనుక ఈ రాకడ బోధ వేరే బోధ అయినది.

**1. రక్షితుల గది:-** ఈ గదిలోనున్నవారిని చివరినుండి మొదటికి చెప్పుదును. 20, అక్కడనుండి రాకడకొరకు కనిపెట్టు రక్షితులు, 19. రాకడకు ముందు మోక్షమునకు వెళ్ళు రక్షితులు, 18. వధువు సంఘ రక్షితులు, 17. హత సాక్షులైనవారు, 16. ప్రభువునందు నిద్రించిన రక్షితులు. (వధువు సంఘస్థులు), 15. శ్రమలుపడిన రక్షితులు, 14. మంచి గ్రంథములు చదువు. రక్షితులు, 13. ఉజ్జీవ కూటమునకు వెళు ్ళ రక్షితులు, 12. అవస్థలో ఉన్నవారిని ఆదరించు రక్షితులు, 11. రోగులను పరామర్శించు రక్షితులు, 10. బోధకులను చూచు రక్షితులు, 9. చందావేయు

రక్షితులు, 8. గుడికి వెళ్ళు రక్షితులు, 7, ఇతరులకు బోధించు రక్షితులు, 6. కీర్తనలు నేర్చుకొను రక్షితులు, 5. అన్ని ప్రార్థనలు చేయు రక్షితులు, 4. బైబిలు పఠించు రక్షితులు, 3. పరిశుద్ధ ప్రవర్తనగల రక్షితులు, 2. పాపవిసర్జన రక్షితులు, 1. మారు మనస్సుపొంది, పాపములు ఒప్పుకొను రక్షితులు.

**2. రాకడ గది:–** ఈ గదిలోనున్న వారిని 10 గుంపులుగా చెప్పుదును. వారి క్రింది గుంపునుండి పై వరకు ఉన్న గుంపులు: 10 వధువు సంఘస్థులు మేఘము చేరగానే శేషించినవారికొరకు ప్రార్థించువారు, 9. మేఘములోనున్న క్రీస్తు నొద్దకు చేరువారు, 8. గాలిలో మేఘమునకు ఎగురువారు, 7. మహిమ శరీరము దాల్చువారు, 6. చావులేనివారు, 5. రాకడ ప్రార్థన చేయువారు, 4. రాకడ విషయములు నేర్చుకొన్నవారు, 3. రోజంతయు ప్రభువు తలంపు గలవారు, 2. రాకడ తలంపు గలవారు, 1. రక్షితులు గదిలోనివి. నెరవేర్చినవారు. ఈ గదిలోనివికాదు. గాని రక్షితుల గదిలోనివి.

**3. శ్రమల గది:–** ఈ గదిలో శ్రమ కాలములనుగూర్చి చెప్పుదును. 10. సైతాను వెయ్యేండ్లు మట్టులేని గోతిలో బంధింపబడుకాలము. 9. అంతె క్రీస్తు, అబద్ధ ప్రవక్త, మూడు దయ్యములు అగ్నిగుండములో పడవేయ బడు కాలము. 8. హర్మగెద్దోను యుద్ధకాలము. 7. శ్రమలలో కొందరు రక్షింపబడు కాలము, 6. సైతాను నరరూపముతో (అంతెక్రీస్తుగా) భూమిమిదికి వచ్చు కాలము; 5. మూడు దయ్యముల కాలము, 4. అబద్ధ ప్రవక్తల కాలము; 3. అంతెక్రీస్తు పాలన; 2. శ్రమలు ఏడేండ్లు ఉండుకాలము, 1. పై రెండు గదులలో చేరనివారు ఈ గదిలో చేరుదురు.

మొదటి గదిలోని వివరము: పాపవిసర్జన అనగా పది ఆజ్ఞల ప్రకారమును, బైబిలులో ఉన్న ఇతరాజ్ఞల ప్రకారమును, పరీక్షించు కొని; దేవుని ఎదుటను, మీరు ఎవరికి హాని చేసిరో వారి ఎదుటను, ఒప్పు కొనవలెను. అప్పుడు మీరు రక్షణ మార్గములో పడుదురు. ఇదే మారుమనస్సు, ఇప్పుడు రక్షణ మార్గములో ప్రవేశింతురు. ఒక వ్యక్తిని శిశువైయున్నప్పుడు శిష్యత్వమప్పుడు, బాలుడైయున్నప్పుడు, పెండ్లిచేసి కాపురమునకు ఏర్పాటు చేయరు. కాని అతనికి యుక్తవయస్సు వచ్చినపుడు చేయుదురు. అలాగని యుక్త వయస్సు ఆరంభమందే పెండ్లి చేయరు.

కొంతకాలము అగుదురు. అలాగే ఆదాము మొదలుకొని క్రైస్తవ మతస్థాపన దినము వరకు సంఘమునకు శిశ్యత్వమే. అప్పటినుంచి సంఘచరిత్ర ఆరంభమైనది. అప్పుడే సంఘమునకు యౌవ్వన కాలము ఆరంభమైనది. అప్పటి నుంచి, నేటివరకు ఎదిగిన సంఘ మునకు పెండ్లి ఆలోచన కలిగినది అందుచేత రాకడకు సిద్ధపడవలెను. ఆ సిద్ధపడినవారే 'వధువు సంఘము'. అయితే, రాకడకు ముందే సంఘములో ఉండగా చనిపోయి ప్రభువు వద్దకు వెళ్ళిన వారిలో కొందరు వధువుగా పెండ్లికుమార్తె సంఘములోనికి ప్రవేశించి ఉన్నారు. అయితే వారు వీరు అక్కడ కలసికొంటారు. రాకడ మనుష్యులును, ఈ పూర్వకాల మనుష్యులును, పైలోకములో కలుసుకొందురు. వారందరు పెండ్లివిందులో కూర్చుంటారు. ఆ పెండ్లి విందులో ఉన్నవారు, మరణము పొందినవారు కొందరు; మరణము లేకుండా ఎత్తబడినవారు కొందరు; అందరూ కలసియుందురు. రేపు ఎత్తబడే మనమును, విక్టోరియా రాణియును పెండ్లివిందులో కలిసికొని యుందుము. కాని పెండ్లికుమార్తె సంఘమునకు సిద్ధపడనివారు కూడ పైలోకములో ఉన్నారు. వారికి పెండ్లికుమార్తె అనగా ఈ వధువు సంఘము విందుకు రమ్మని పెండ్లికార్డు పంపును. ఆ వచ్చేవారు వధువు సంఘముకాదుగాని, "విందుకు" పిలువబడేవారు. వారు విందుకాల మహిమ చూడలేరు గనుక వారికి ముసుకు ఇవ్వబడును. ముసుకు లేనిచో కాలిపోవుదురు.

**పరిశుద్ధ ప్రవర్తన గల రక్షితులు:–** పాపవిసర్జన సమయమందు ఏది పాపమో తెలిసికొని, ఎట్లు విసర్జింతురో, అట్లే ఈ మూడు అంతస్థుల గదులలో ఏది మంచిదో, ఏది పరిశుద్ధమైనదో, ఏది దేవుని చిత్తమై యున్నదో, ఏది బైబిలు ప్రకారము అయియున్నదో, అది చూచుకొనుచు నడుచు కొనవలెను. అదేకాదు ఆ రెండేకాదు మరియొకటి కలదు.

దృష్టాంతము:– ఒక యవనస్తురాలు ఒక యవ్వనుడు B.A క్లాసులో విద్యార్థులు. వారిద్దరు కలిసి చదువుకొనేవారు (ఇది రాజమండ్రిలో జరిగిందే). ఇద్దరికి ప్రేమ ఉంది. కాని కొన్నాళ్ళకు తల్లిదండ్రులు వీరిద్దరికి పెండ్లి తలంపు పెట్టినారు. వీరు నవ్వుకున్నారు. అప్పుడు వీరిద్దరికి క్రొత్త ప్రేమ పుట్టును. ఈ రెండు ప్రేమలలో ఏ ప్రేమ గొప్పది? పెండ్లి ప్రేమ గొప్పది). అలాగే యేసు ప్రభువుమీద విమోచన, రక్షణ కాలములో

ఉన్నప్రేమకంటె; రాకడ తలంపులో పడిన తరువాత క్రొత్తప్రేమ కలిగి, పెండ్లి ఎపుడు జరుగునా? అని ఎదురు చూచుచుండును. ఇది రాకడ పెండ్లి ప్రేమ, అలాగే భక్తులందరు రాకడ తలంపుతో ప్రియుని రాక ఎదురు చూచుచుందురు. ఒక్క నిమిషమైన ప్రభుని తలంచకుండ ఉండలేరు, బ్రతుకలేరు! 'వరుని ప్రేమ స్మరణతోనే పరిపూర్ణ మౌచున్నది = వరుని మీద నున్న ప్రేమ – పెరగ నిచ్చు చున్నది త్వరగ నీయ కున్నది వరుడు వరుడను చున్నది' ॥వధువు సంఘము॥ (1) పెండ్లికాలము ఆలస్యమౌతుంటే, పెండ్లికుమార్తెకు సంతోషముండునా? విచారము కలుగదా! ప్రభువు రాకడ ఆలస్యము అయితే వధువు సంఘ భక్తులకు చాలా కష్టముగా ఉండును.

ఒక ప్రశ్న:– పెండ్లికుమార్తెకేనా అదును! పెండ్లికుమారునికి కూడానా? జవాబు:– ఆయనకుకూడ అదును ఉండును. అనగా తొందర, ఆసక్తి, ఎదురుచూచుట ఉండును. కాని ఆయనకు వధువు సంఘము త్వరగా తయారు కాలేకపోవుచున్నది అనే విచారమున్నది. అయినను ఆయనకు పెండ్లి తారీఖు తెలుసు. పెండ్లికుమార్తెకు తెలియదు గాని పెండ్లి కుమారునికి తెలుసు. త్వరగా, త్వరగా, త్వరగా అని బైబిలులో ఉన్నది. త్వరగానా! అని అవిశ్వాసులు అందురు. ''ఇదిగో త్వరగా వస్తున్నాను' అని ప్రభువు చెప్పి, రెండువేల సంవత్సరములు అయినది. 'ఇంకా రాలేదు' అని ఎవరు విసుకుకొందురో, వారు వధువు సంఘమునకు రాలేరు. కాని 'త్వరగా అనుమాటకు మనకు అర్థము తెలియదు గనుక 'కనిపెట్టడము మన పని, విసుకుకొనుట మనపనికాదు' అని ఎవరు అనుకొందురో, వారు వధువు సంఘములో చేరగలరు. త్వరగా రమ్ము అని పెండ్లికుమార్తె అనుచుండగా, 'నీవు త్వరగా తయారు కావలెను' అని క్రీస్తు ప్రభువు అనుచున్నారు. ప్రభువు జన్మించుటే అద్భుతము. పునరుత్థానమగుట మరింత గొప్ప అద్భుతము ఆరోహణమగుట అంతకంటే గొప్ప అద్భుతము. రాకడలో ప్రభువు వచ్చుట, ఇవన్నికలసినంత గొప్ప అద్భుతము. ఇది లోకములోని కథ. అయితే పరలోకములోని విందులో మనకు తెలియని అద్భుతము కలదు. అట్టి అద్భుత విందులో వరుని చెంతన చేరి, సంతోషించు భాగ్యము, నేటిదిన ధ్యానముద్వారా పెండ్లికుమారుడు మీకు దయచేయును గాక! ఆమేన్.

---

**17-11-1959వ సం॥లో దేవదాసు అయ్యగారు చేసిన ప్రసంగము.**

## ఇరువది తొమ్మిదవ సందేశము

# రక్తపుకోల్లు - రాకడ గుంపు

*ప్రసంగి, 12:1-2; మత్త. 24:7; 1కొరింథి. 10:11*

**"మిమ్ములను చంపు ప్రతివాడు తాను దేవునికి సేవచేయుచున్నానని అనుకొనుకాలము వచ్చుచున్నది." యోహాను 16:2.**

**బిడియ మెందుకు నీకు భీతి కలుగదు పరుల పై తీర్పు తీర్చెదవు - తెలుసునా పుడమియంతట వ్యాప్తి పొందెదవు నీ యెదుట బడి - నిల్వదాయుధము తెలుసునా - జడియు శత్రువు నీకు తెలుసునా - కడకు నీకే జయము తెలుసునా (యెష 54:14-17) ॥క్రైస్తవ సంఘమా॥**

రాకడ మేఘములో చేరుకొనుటకు సరదపడుచున్న సంఘమా! రాకడానంద, మేఘారోహణ భాగ్యములు పరిశుద్ధాత్మ తండ్రి మీ స్వంతముచేసి, మిమ్ములను తన వశములో ఉంచుకొనునుగాక! ఆమేన్. ఈరోజు మీకొక ప్రత్యేక అంశమును వివరించుదును. అదేమనగా, ఏకాంగి ఆరోహణము అయిన వెంటనే, ఇది శక్తిపూజవల్ల కలిగినది గాని, క్రీస్తు మహిమవల్లకాదు అనే వదంతి పుట్టును. ఆరోహణమైన కొన్ని దినములకు మతవిరోధులు సభలు చేసికొని, 'క్రైస్తవులు అన్ని మతముల వారిని భయపెట్టు చున్నారు గనుక వీరిని ఏమిచేయవలెను' అని ఆలోచించుదురు. వారిని హతము చేయుటకంటె వేరేమార్గములేదు అని తీర్మానించుకొందురు. కాబట్టి ఇండియా దేశమంతట రక్తపుకోల్లు అగును. అనగా రక్తము ఏరులై పారును, కాబట్టి నమ్మగలవారు ఇపుడే అనుదినము ఒక గంట అయినను దేవుని సన్నిధిలో మోకాళ్లూని ప్రార్థనయందుండుటవల్ల జరుగబోవు హత్యలు తప్పించు కొన వచ్చును. ఇది సులువైన పద్ధతి. 'జలప్రళయము వచ్చును' అని నోవహు చెప్పగా ప్రజలు హేళనచేసిరి. అట్లే రక్తప్రళయము వచ్చునని, త్వరలోనే వచ్చునని మేము చెప్పుచుండగా ఎక్కువమంది క్రైస్తవులు హేళన చేయుదురు. తీరా హత్యలు ఆరంభించిన వెంటనే నమ్మిప్రార్థన చేయవలెనని కొందరు పూనుకొందురు కాని **అదురులో కుదరదు. ఆ స్థితి సిద్ధబాటు కుదిరితే ఇపుడే కుదరవలెను. ఈ సంగతి ఇండియా క్రైస్తవులందరికి ఎవరు ధైర్యముగా తెలియజేయుదురో, వారు మహోపకారులు.** 'హింసలు కలిగినపుడు చోటు నుండి వేరొకచోటుకి పారిపోవుడి' అని యేసుప్రభువు చెప్పలేదా? ఆ కాలమందు క్రీస్తు బోధవినుటకు అనేకులు సరద పడుచుండగా

యూదుల అధికారులు ఏమన్నారు. "లోకము ఆయన తట్టు తిరిగిపోవుచున్నది. మనము ఏమి చేయగలము! మనము ఈలాగు ఊరకుంటే రోమీయులు వచ్చి మన దేశమును ఆక్రమించుకొందురు" అనిచెప్పి కుట్రాలోచనచేసి, ప్రభువును. చంపివేయలేదా? క్రైస్తవులు ఆ ప్రవచనములను నమ్ముచున్నారుగదా! ఈ ప్రవచనము ఎందుకు నమ్మరు? మీకు తెలిసినది మాకు ఎందుకు చెప్పలేదు? అని క్రైస్తవులు బైబిలు మిషను వారిని నిందిస్తారు గాని మనము ఇదివరకే పత్రికలో ప్రచురించగా, అవి చదివి, 'హత్యలు' బైబిలు మిషను వారికే, తక్కిన మిషనుల వారికికాదు' అని చెప్పుచున్నారు. సద్భోధ చేసిన ఏ దేశము లోనైన సరే, ఏ కాలములోనైనా సరే వ్యతిరేక వ్యక్తులులేది కుట్రాలోచనలు చేసినట్లును, సద్భోధలు నమ్మనట్లును చరిత్రవల్ల తెలియుచున్నది.

భావికాల కష్టములు ముందుగా తెలిస్తే జాగ్రత్త పడవలెను అను ఒక సిద్ధాంతము చాలా ఉపయోగము. కొన్నాళ్లకు బైబిళ్ళు దొరకవు. అందుచేత ఇపుడే బైబిలు కథలు బాగా నేర్చుకొన్నయెడల, అట్టి కొదువకాలములో మనస్సునందు బైబిళ్లుండును. (12 బైబిళ్లు ఒక గోతిలో పాతిపెట్టవలెను. ఆ కాలము అయిదు వందల సంవత్సరములుండును. బైబిళ్లులేని కాలములో రహస్యముగా చదువుకొనవచ్చును అని ఒకరికి దర్శనము వచ్చినది). దీనికి వాక్య కరువు అనిపేరు. హింసలు ఆగిపోయిన తరువాత రహస్యముగా తీసికొని చదువగలుగుదురు. హంతకులు ఎందాక రక్తము వాలికించుట చూస్తారు! ఎందాక శవములు, గిజగిజ కొట్టుకొనుట చూస్తారు! మగవారిని హత్యలు చేయుచుంటే, ఆడువారు నడుము కట్టుకొని, ఎందుకు చంపుచున్నారు అని అడుగుదురు అయినాగాని వారిని హింసించుటటకు హింసకులు ఆగరు. ఎందుకనగా ఇరవైవందల ఏండ్లునుండి క్రైస్తవమతము బోధిస్తు ఉంటే ప్రజలు అంగీకరించలేదు. క్రీస్తుప్రభువు ఆరోహణమైన తరువాత హింసలు ఆరంభము అవలేదా! ఇపుడు కూడ అలాగే ఆరంభమగును. నోట్సులు కూడ కాల్చి వేయుదురు. విశ్వాసులు భయపడనక్కరలేదు.

'భవిష్యత్తు' అనే పత్రిక ఒకటి వ్రాసి ప్రోగ్రాం అచ్చువేయించవలెను. అపుడు అదంతట తిరుగును. ఆ ప్రోగ్రాము అయ్యగారి దగ్గర ఉన్నది. క్రొత్త బైబిళ్లు ఎప్పుడు వ్రాయాలో! ఏకాంగి ఆరోహణ, విజ్ఞాపన ప్రార్థన నెరవేర్చు. ఎప్పుడో? రాకడ సిద్ధాంతములు

ప్రకటించుట ఎప్పుడు? రాకడ సిద్ధాంతములు బోధించుట ఎపుడో? ఈ మొదలైనవన్నియు ఆ కార్యక్రమమైయున్నది. ఇప్పుడు సన్నిధి కూటములకు ఎక్కువపని. అందుచేత కనుగొనలేకపోవుచున్నాము. యోహానుకు ప్రకటనగ్రంథము ఏలాగు సినిమాలాగున కనబడెనో, అలాగే సన్నిధి కూటస్తులకుకూడ రాకడవరకు అన్ని సంగతులు చూపించబడును. గాని సన్నిధి కూటస్తులు తరచుగా కూడుకొనుటలేదు. ఈ కాలములో తిరస్కరణ విద్య ప్రభువు నేర్పించును. పరిపూర్ణముగా నమ్మినవారు దొరకరు గనుక పైపైన నమ్మినవారిని హింసకులు హింసింతురు. క్రైస్తవ మతమును విడిచి పెట్టనివారిని 'విడిచిపెట్టుమని' అడుగుతారు. అవిశ్వాసులనుకూడ విడిచి పెట్టమంటారు. విశ్వాసులకు తప్పించుకొనే మార్గము ఇస్తానని కొరింథీయుల పత్రికలో ఉన్నది. ఆ కాలములో తల్లిని నరికితే, పిల్లలు– 'మమ్మును నరుకరు' అని అనుకొందురు. గాని వారినికూడ నరికివేయుదురు. ఎక్కడ దాగుకొన్ననూ, హింసకులు మూలమూలకు వచ్చెదరు, వచ్చి చంపుదురు హత్యలు ఒక్కసారే జరుగవు. క్రమముగా చేస్తారు. ముందు మతమును విడిచిపెట్టుమని అడుగుతారు. వ్యతిరేకముగా మాట్లాడితే చంపివేస్తారు. ముందు మన హిందూ దేశములోనే ప్రారంభమగును. హిందూదేశముయొక్క అభిప్రాయములు (క్రైస్తవులను పట్టి హతము చేయవలెను) అన్నీ దేశములకు వెళ్లిపోవును. మన బైబిలు మిషను ఇక్కడ పుట్టినది గనుక మనము కప్పిన అనగా దాచిననూ, ఉండదు. అన్ని దేశములకు వెళ్లిపోవును గనుక హింసలు అన్నిదేశములలోను ఉండును.

**గురుతులు:–** గురుతులు అయిపోయినవి కాని ఇంకా చిల్లర గురుతులు ఉన్నవి. పౌలు 'సమాజముగా కూడుకొనుడి' అన్నారు. హెబ్రీ. 10:28. గాని ఇంతవరకు ఎవరున్నూ అట్లు కూడుకొనలేదు. సమాజమనగా 10మంది. ఒకరికొకరు అనగా ఒక్కొక్కరే. ఇది ముఖ్యమే అది ముఖ్యమే. తక్కువగా, సమాజముగాకాక ఎక్కువగాని కూడుకొని, రాకడకు సిద్ధపడండి.

**మేఘములోనికి వెళ్ళలేనివారు ఎవరనగా:–**

1. ఏ పాపమైన వదలలేనివారు వెళ్లలేరు. ఇదందరికి తెలిసిన విషయమే. 2. కొందరు బైబిలు సరిగా చదువకపోవడము వలన వెళ్ళలేదు. 3. ప్రార్ధన సరిగా చేయకపోవడంవల్ల వెళ్లలేరు. 4. ఆరాధనకు వెళ్లలేకపోవడమువలన వెళ్లలేరు. 5. సరిగా సాక్ష్యము ఇవ్వనందువలన వెళ్లలేరు. 6. కానుకలు సరిగ్గా ఇవ్వకపోవడమువలన వెళ్ళలేరు. 7. మందస్థితివలన రాకడలోనికి వెళ్లలేరు.

గొప్పశోధన కాలము: కొందరు క్రైస్తవులు లోకమును విసర్జించుచున్నారు. గాని పాపముచేయుట మానుటలేదు. ఆత్మీయ ఆచారములు బాగా చేస్తున్నారుగాని పాపమును విసర్జించలేరు. కులనిష్ట పాదుకొని ఉంది అది సాధారణముగా పోదు. అది సాధారణమైనది కాదు, భయంకరమైన పాపము, పాపముకంటే పెద్ద పాపము, ఇది పాపంకాదు గాని పాపం ఏ ప్రకారంగా పైకి వెళ్లనియ్యదో, ఇదికూడా అలాగే పైకి వెళ్లనియ్యదు. మనదేశమునకున్న ఈ చిక్కు తక్కిన దేశస్థులకు లేదు. ఈ గొప్ప శోధన తప్పించుకొనుట చాలా కష్టము. (1) పాపము చేసే పాపాత్ములు రాకడలో వెళ్లరు. (2) మందస్థితి గలవారు వెళ్ళరు. (3) కులనిష్టగలవారు ఇక్కడే ఉండిపోవుదురు. అయితే, మరణ సమయము వచ్చేటప్పుడు, ఈ 3ను వదులుకొనేవారుకూడ ఉంటారు. అప్పుడు ప్రభువు వారికి మరణము రానిచ్చి, క్షమించి, వారినికూడ మోక్షమునకు తీసికొని వెళ్తారు. గాని వారు రాకడ గుంపులో ఉండరు. పెండ్లికుమార్తె వరుసలో ఉండరుగాని రక్షణలో ఉంటారు. కావున మరణ సామీప్య కాలమున కాక ముందుగానే వీటిని విసర్జించి పెండ్లికుమార్తె వరుసలో చేరవలెను.

**1. రాకడ గుంపు ఎవరంటే:–** రాకడ, రాకడ అని కలవరించేవారు. రాకడ గుంపు ఎవరంటే రాకడకు సిద్ధపడేవారు. అట్టివారికి మరణము లేదు. వారు ఉన్నపాటుననే రెప్పపాటులో, మహిమ శరీరముతో ఎగిరిపోతారు. అట్టివారు నిద్రలో ఉన్నా సరే, మేఘములోనికి వెళ్లిపోతారు. గనుక ఎంతమంది రాకడ గుంపుకు తయారవుచున్నారో పరీక్షించుకొనండి. ఈ పాఠము అందరు వ్రాసుకొనదగిన గొప్పపాఠము, రక్షణ అనేది మారుమనస్సును బట్టి ఉన్నది. రాకడ అనేది ప్రత్యేకమైన రీతిగా సిద్ధపడుటనుబట్టి ఉంటుంది. గనుక ఇదంతా జాగ్రత్తగా ఈ రాత్రంతా, జాగ్రత్తగా ఆలోచించుకొని రేపు మీ జవాబు చెప్పండి.

రాకడ ఏర్పాటును గురించి ఇంకా ఎక్కువగా చెప్పవలెను. మన సంఘములోనుండి కొందరు బైటకు వెళ్లిపోవలెనను ఆలోచనలో ఉన్నారు. మరికొంతమంది ఇంకనూ వెళ్లిపోవుచున్నారు. అలాగే కొందరు క్రీస్తుమతము లోనికి వస్తున్నారు. వారు సిద్ధపడినవారైతే రాకడ గుంపుకు వెళ్తారు అనగా వెళ్ళిపోవల్సినవారు వెళ్లిపోగా మిగిలినవారును, క్రొత్తగా వచ్చి కలిసేవారును రాకడ గుంపులోనికి వెళ్ళుదురు. వెళ్ళిపోవల్సినవారు వెళ్ళిపోగా అనగా చనిపోగా అనగా చనిపోయేవారు చనిపోగా, ఇతర

మతముల లోనికి వెళ్ళిపోయేవారు వెళ్లిపోగా, మిగిలినవారును క్రొత్తగా వచ్చేవారున్ను కలిసి మేఘంలోకి వెళ్తారు.

**సంఘ భక్తులలో సిద్ధపడివెళ్ళేవారు మరియు వెళ్లనివారు ఉన్నారు:**

**భక్తిపరులు:-** 1. వీరు జీవితకాలమంతా దేవునిని హత్తుకొని హత్తుకొని జీవిస్తారు. 2. వీరు దేవుడు ప్రార్థన విన్నా వినకపోయినా వారున్న స్థితిలోనే ఉండి రాకడకు సిద్ధపడుదురు. 3. భూలోక జీవితమంతా చెడిన స్థితిలో ఉండి చివరి గడియలో మారినవారు. ఎలాగంటే చావు సమయములో కుడిచేతి ప్రక్క దొంగ పొందిన మారుమనస్సువలె వీరును మారు మనస్సు పొందుదురు. 4. ఎన్ని చిక్కులు, ఎన్ని అవమానములు, ఎన్ని అవస్థలు, ఎన్ని నిందలు ఉన్నప్పటికిని రాకడ వదలరు. వీరే ఆరోహణమై ఎగిరి వెళ్లేవారు. 5. రాకడ విషయములన్ని బైబిలులో ఉన్నవి గనుక బైబిలును అనగా దైవగ్రంథమునుబట్టి విశ్వసించి ఆరోహణమై ఎగిరి వెళ్లేవారు.

**2. నామక భక్తిపరులు:-** 1. వీరు జీవితకాలమంతా భక్తులేగాని చివరి గడియలో అనగా రాకడ గడియప్పుడు భక్తులు కాదు. ఇట్టివారు మోక్షానికి వెళ్లరు. తమ విసుగుదలనుబట్టి వీరు మేఘములో వెళ్లరు. ఎందుకనగా తమ ప్రార్థన దేవుడు విన్నాడే కాదని విసుగుకొనువారు. దేవుడు వీరికి బుద్ధి చెప్పుటకు వీరిని కొనిపోరు. 2. జీవితకాలమంతా భక్తిగా ఉండి చివరికాలములో చెడిపోయిన వారు. 3. వీరు భక్తిగానే ఉంటారుగాని రాకడకు సిద్ధపడరు. అందుచే దేవుడు వీరిని మరణము ద్వారా, హేడెస్సులోని బోధ ద్వారా మార్పు చెందిన మోక్షమునకు వెళ్లుదురు. 4. వీరిలో రాకడ నమ్మనివారు ఉన్నారు. వీరు భక్తులేగాని అన్నీ నమ్మి, రాకడ సామీప్యమన్నా నమ్మరు. గనుక వీరు వెళ్లరు.

“మీ దీపములు వెలుగుచుండనియ్యుడి’ అని ప్రభువు అన్నారు. గనుక మనము రాకడకు సిద్ధపడి, మెళకువగా ఉండవలెను. మనలను ఏలుబడిచేసే పాపములను ఏరిపారవేయవలెను. పరిశుద్ధాత్మని వశమై పాప నైజమును వదలించుకొనవలెను. అప్పుడు సూటిగా ఎగిరె వెళ్ళగలము. అట్టి దివ్యభాగ్యము త్రిత్వతండ్రి మనకు దయచేయునుగాక, ఆమేన్.

---

**10-11-1959వ సం॥లో దేవదాసు అయ్యగారు చేసిన ప్రసంగము.**

## ముప్పదియవ సందేశము

# త్వరగా.....త్వరగా...... త్వరగా

*యెషయా 2:1-4; మార్కు, 13:32-37; ప్రక, 22:20-21*

"దేవా, నన్ను విడిపించుటకు త్వరగా రమ్ము" దా.కీర్తనలు 70:1

**త్వరగ నన్నది నరుని యాత్మకు ప్రవచన మను చున్నది- ఇరువది వందల ఏండ్లయినను - "త్వరగనే" యను చున్నది వధువు సిద్ధమను - చున్నది వధుపు వధువను చున్నది ॥వధువు॥**

**మేఘములపై వరుడు క్రీస్తు వేగముగ రాగనే మేఘంమీదికి వెళ్ళి మేము/నేను హల్లెలూయ పాడెదమ్/న్"**

**హల్లెలూయ...హల్లెలూయ... హల్లెలూయ యేసుకే హల్లెలూయ ....హల్లెలూయ.... హల్లెలూయ... ఆమేన్.**

రాకడ కొరకు కనిపెట్టుచున్న విశ్వాసులారా! ఈ ఉదయము నేను కొన్ని రాకడ సంగతులు మీకు వినిపిస్తాను. ఇవి ఇదివరకు మీరు విన్నను పద్ధతిమాత్రము ఈ దినము క్రొత్తది. ఈ కాలములో సంఘము, లోకస్థులు రాకడ తలంపు గలవారైయున్నారు. (1) విశ్వాసులు రాకడ వచ్చివేసినట్టే. ఆనందించి నిరీక్షించుచున్నారు. (2) అన్యులు, రాకడ సంగతులు తెలుసు కొనుటకు ఆశపడుచున్నారు. మీ ప్రభువు ఎప్పుడు వచ్చును? మాకు కూడ ఆ విషయములు తెలుసుకొనుట ఇష్టమని అనుచున్నారు. (3) మూడవ గుంపువారు ఎవరనగా, క్రైస్తవులలోని అన్యులు, అన్యులలోని క్రైస్తవులు.. వీరెవరంటే రాకడ నమ్మనివారు. వారేమి చేస్తున్నారు? వారు వీరిని, వీరు వారిని కొంతసేపు సందేహముగాను, కొంతసేపు ఆశ్చర్యముగాను చూస్తున్నారు. గనుక మూడు గుంపులవారు రాకడ కాలములో ఉన్నారు.

1. విశ్వాసులు 2. అభిమానులు 3. విమర్శకులు (హేళన చేయు వారు). 'రాకడ గురించి మాకు తెలియలేదు, మేము చదివాము, మాకు అర్ధము కాలేదు' అనేవారు భూలోకమందు ఉండరు. అనగా పై 3 గుంపులలో ఏ గుంపువారైనా రాకడ తెలిసినవారై ఉంటారు. ఈ మూడు

తరగతులవారు భూలోకమందు ఉన్నారు గనుక ఈ మూడు తరగతులవారి అనుభవములు విశ్వాసులు మాట్లాడుకొంటే మంచిది. సంవత్సరము చివరిలో అనగా నవంబరు చివరిలో రాకడ గురించి మాట్లాడవలెనని ఒక ఏర్పాటున్నది. క్రైస్తవ సంఘ కాలమానములో ఈ ఏర్పాటు ఉన్నది. ఈ కాలమునే అడ్వెంటుకాలము అందురు ఇప్పుడు నేను ప్రవేశ వాక్యముగా ఏర్పర్చుకొన్న వాక్యము యేసుప్రభువు చెప్పినమాట "ఇదిగో నేను త్వరగా వచ్చుచున్నాను." ప్రకటన 22:20, ఈ ఒక్క వాక్యము నాలుగు భాగములుగా ఉన్నది. "త్వరగా" అనేమాట మాత్రము పలికి 2వేల ఏండ్లు అయినది. నా ఉపన్యాస వాక్యము ఏదంటే 'త్వరగా గాలిలో ఈ మూడు అక్షరములు వ్రాసినారని ఊహించండి. కొన్ని భాగములు ఆ మాటకు దిగువనున్నవి. అవేనగా, 1) ఆయనకే, 2) ఆయన దృష్టికే, 3) ఆయన ఆలస్యము (జాగు), 4) సువార్త ప్రకటన, 5) ఆత్మస్నానము (బాప్తిస్మము), 6) ఎత్తబడవలసిన సంఘము (సిద్ధపాటు).

1. "త్వరగా" అన్నమాట దిగువనున్న మొదటిమాట 'ఆయనకే'. 2వేల సంవత్సరముల క్రిందట ఈ మాట చెప్పినపుడు, రెండవ రాకడ ఎప్పుడు వచ్చునో, ఆయనకు తెలుసును. మార్కు సువార్తలో మనుష్య కుమారునికి తెలియదు అని వ్రాయబడియున్నది. మనుష్య కుమారుడుగా ఆయన భూలోకములో ఉన్నారు. రేపు పెండ్లి కుమారుడుగా మేఘూసీనుడై వచ్చును. అయితే, ప్రకటనలో **"నేను వస్తాను"** అని అనెను. భూమిమీద ఉన్నపుడు మనుష్యత్వమునకు తెలియదుగాని ఆయన మహిమలోనికి వెళ్లెను గనుక త్వరగా వస్తున్నాననెను. ప్రభువు ఈ మాటే సువార్త కాలములో అన్నారు. ఆ మాట వంద సం॥ల క్రిందట కాలములో (అనగా క్రీ.శ. 33సం॥ల క్రిందట ఆ మాట) పలికెను.

ఉదాహరణకు:– నేను ఎప్పుడు వస్తానో తెలియదు' అని ఊరికి వెళ్లేటప్పుడు అంటారు. ఊరువెళ్లినవారు ఎప్పుడు తిరిగి రాగలరో తెలిస్తే 'త్వరగా వస్తానంటారు' అలాగే యేసుప్రభువుకు అది త్వరగానే అన్నట్లు ఆ 'త్వరగా' అనునది మనకుకాదు. మనకు ఆలస్యము, ఎందుకనగా 2 పేతురు 3:9లో వ్రాయబడియున్నట్లు 'కొందరు ఆలస్యమని యెంచుకొనునట్లు ప్రభువు తన వాగ్దానమును గూర్చి ఆలస్యము చేయువాడు

కాదు గాని యెవడును నశింప వలెనని యిచ్ఛయింపక, అందరు మారుమనస్సు పొందవలెనని కోరుచు, మీ యెడల దీర్ఘశాంతము గలవాడైయున్నాడు. 'గాని ఆయనకు త్వరగానే ఉన్నది. మనకు ఆలస్యముగా ఉన్నట్టు చెప్పుదుము. ఆయనకు లెక్కప్రకారము ఆయనకు త్వరగానే. విశ్వాసులు ఆయనవారు, ఆయన విశ్వాస జనమునకు సంబంధించినవాడు. ఆయన విశ్వాసులు రక్షకుడు. విశ్వాసులు ఆయనయొక్క బిడ్డలు, ప్రభువు ఏమనునో, విశ్వాసులును అదే అంటారు. అనగా ప్రభువు అనినదే విశ్వాసులును అదే అంటారు. అదేదనగా 'త్వరగా' అనే మాట.

**1వ వాదము:-** అవిశ్వాసులైతే ఆలస్యము అంటారు. (వీరు లోకస్థులు) గనుక ఈ 'త్వరగా అనుమాట వారికి అర్ధముకాదు. ఆ మాట యేసుప్రభువునకే ఉన్నది. విశ్వాసులైయున్నా వారిలోకూడ లోకస్థులు ఉన్నారు. ఆయన మనస్సులో "త్వరగా" వస్తాను అని ఉన్నది అనగా ఆమాట ఆయనకే. గనుక "త్వరగా" అన్నారు. కొన్ని సమయములలో ప్రభువు భూలోకములో ఉన్న రాకడ విశ్వాసులతో ఆయన మాట్లాడుదురు. అప్పుడు తక్కినవారు అనగా లౌకీకులు మీకు తెలిసిందా? ఆయన త్వరగా వస్తాడని చెప్పారా? అందురు. ఈ విశ్వాసులైనవారు ఆయన చెప్పెను గనుక మేము నమ్ముదుము అందురు. రాకడ విశ్వాసులకును, లౌకికులకును; రాకడ విశ్వాసులకును, రాకడ తెలియని విశ్వాసులకును అదే బేధము. **ప్రభువు త్వరగా వస్తానన్నాడు. గనుక త్వరగా వస్తాడు, ఇక వాదము అక్కరలేదు.**

**2వ వాదము:-** "దృష్టి" అనగా దేవుని దృష్టిలో వెయ్యి సంవత్సరములు ఒక దినమని పేతురు వ్రాసెను. 2పేతురు 3:8 'ఏమనగా ప్రభువు దృష్టికి ఒక దినము వెయ్యిసంవత్సరములవలెను, వెయ్యిసంవత్సరములు ఒక దినము వలెను ఉన్నవి.' దానినిబట్టి చూస్తే ఈ ఏడువేల సంవత్సరములు ఆయన దృష్టిలో "త్వరగా" అని అర్ధము. అన్ని మాటలలో త్వరగా అనేమాట ఉన్నది. ఆయన దృష్టిలో ఈ రెండు దినములు మాత్రమే ఇప్పటికీ అయినట్లు ఉన్నది. (2000) ఆయనకు 'త్వరగా' అని ఇందాక చెప్పాను. ఇప్పుడు ఆయన దృష్టికి ఆయన రాకడ

'త్వరగానే యున్నది. గనుక మేము అదే కనిపెట్టుదుము అని విశ్వాసులు అందురు.

**3వ వాదము:–** "ఆలస్యము" పేతురు– 'మీ నిమిత్తమేగదా ఆయన ఆలస్యము చేస్తున్నాడు' అనెను. మన నిమిత్తము ఆలస్యము గాని ఆయన నిమిత్తముకాదు. ఇదంతా చిక్కులుగాను, మర్మముగాను ఉన్నట్టు ఉన్నదిగాని వాక్యమును వివరిస్తే ఎక్కడా చిక్కులేదు. మనవల్ల తప్పు. ఆయనకు ఆటంకములు లేవు. ఆయనయొక్క 'త్వరగా' అను మాటను, మనయొక్క ఆలస్యము అనుమాటగా మార్చుకొన్నాము.

యోహాను 20వ అధ్యాయములో వ్రాయబడినట్లు యూదులు భయమువలన శిష్యులు తలుపులు వేసికొని ఉండగా, ఎవరు తలుపులు తీయకుండానే ప్రభువు లోనికి వెళ్లెను. వారికి తలుపులు ఆటంకముగాని ఆయనకు ఆటంకములేదు. అలాగుననే యేసుప్రభువు వచ్చుటకూడ ఆటంకములు ఏవి లేకుండా ఉన్నది. అది మనకు ఆటంకమేగాని ప్రభువునకు కాదు. అనగా శిష్యులు తలుపు వేసికొనుట వారి దృష్టిలో ఆటంకమేగాని, తలుపులు మూయబడి ఉండుట ప్రభువునకు ఆటంకముకాదు. అలాగే మన విషయములోను' ఆయన రాకడ మన దృష్టికి ఆటంకముగాని ఆయనకు అవకాశము.

**4వ వాదము:–** "సువార్త ప్రకటన" కావలెనంటే, యేసు ప్రభువు రాకముందు సువార్త ప్రకటన జరుగవలసి ఉన్నది. ఆ కాలమువారు ప్రభువు కొరకు ఎదురుచూచినట్లు సుమెయోను మొదటి రాకడకు సిద్ధపడ్డాడు. 'నాథా! నిన్ను చూచు భాగ్యము కలిగినదని' సంతోషించెను. గనుక సువార్త ప్రకటన కానిదే అందరు సిద్ధపడరు. 1. ఆయన "వచ్చాడు" అనేది మొదటి సువార్త. 2వ సువార్త "వస్తున్నాడనే" సువార్త. కాబట్టి సంఘము ఈ రెండు సువార్తలు అందరికి చెప్పవలసియున్నది. ప్రభువు త్వరగా వస్తున్నాడు కాబట్టి మేము త్వర త్వరగా ప్రకటించాలి. కొంతమంది మిగిలిపోతే ప్రభువు మమ్ము నంటాడు. (లెక్క అడుగును) అని సువార్తను అనగా రాకడ సువార్తను ప్రకటించవలెను. (1) వస్తానని చెప్పాడు అదొక సువార్త, (2) వచ్చి 331/2 సం॥లు జీవించివేసాడు. ఇదొక సువార్త. (3) ఇక త్వరగా వస్తాడు. ఇది రాకడ సువార్త 5వ భాగము యోవేలు గ్రంథములో

వ్రాయబడియున్నది. అంత్య దినములలో సర్వజనాంగ ములమీద నా ఆత్మను కుమ్మరిస్తానని ఉన్నది. ఎప్పుడు జరుగవలెనో, ఎప్పుడు జరుగునో మనకు తెలియదు. కాని ఇప్పటికాలమునుబట్టి చూస్తే, 'చదువులేని వారికి కూడ బైబిలు చదువవలెను, ఆత్మను పొందవలెనను ఆలాపన (తృష్ణ) చాలామందిలో ఉంటున్నది. అదొక రాకడగుర్తు, తప్పకుండా ఆత్మను పొంద వలెను. పెంతెకొస్తు దినమున యూదులు ఆత్మను పొందిరి. ఆ కాలమందు వారికి ఆ బలము కావలసి వచ్చినది. ఆ ఆత్మ శక్తిని గూర్చి ప్రభువు వారితో చెప్పెను. ఆయన చెప్పిన ప్రకారము ఆత్మతో నింపబడినవారు శక్తి పొందిరి. మనకుకూడ అదే శక్తి కావలెను. ఇప్పుడు మనము పొందే శక్తికంటే మరి ఎక్కువ శక్తి పొందవలెను. వారికెందుకు! శక్తి అవసరము అంటే మేము యేసుప్రభువును కండ్లతో చూచాము, ఆయనతో బసచేసాము అని సాక్ష్య మిచ్చుటకు శక్తి అవసరము గనుక ఆత్మతండ్రి ఆ శక్తిని అనగా సాక్ష్యశక్తిని అనుగ్రహించెను.

ఈ కాలములోని మనకు మా ప్రభువు త్వరగా వస్తున్నాడు గనుక ఆయన 'త్వరగా' వస్తే మేము ఎట్లు సిద్ధపడగలము? అని విశ్వాసులు తలంచు చున్నారు. కాబట్టి విశ్వాసులకు కూడా ఒక శక్తి కావలెను. గనుక వారు శక్తి కొరకు వేడుకొనవలెను. ఎట్లు సిద్ధపడగలము! అంటూ శక్తి కావలెనని కోరు చున్నారు. శక్తి మనకెందుకు? అనగా త్వరగా వస్తు ఉన్న ప్రభువు రాకడకు సిద్ధపడేటందుకును, రాకడను గూర్చి సువార్త ధైర్యముతో ప్రకటించుటకును, శిష్యులవలె సాక్షులుగా చూచామని చెప్పుటకు మనకు ఆత్మ శక్తి కావలెను. బర్నబా విషయములో ఏమని ఉన్నది? 'ఆయన పరిశుద్ధాత్మతో నిండుకొన్నవాడు." అది మనలను గూర్చికూడ అయియున్నది గనుక పరిశుద్ధాత్మతో మనము నింపబడవలెను.

చివరి భాగము గురుతులు:- ఒక భక్తుడు ఇప్పుడు 101 గురుతులు ఉన్నవి అనెను. ఆ 101 గురుతులు ఇప్పటి కాలములో నెరవేరినవట. ఇప్పుడు ఇంకా ఎన్ని గుర్తులు ఎక్కువగును? ఉదా:- మేఘము పట్టగానే వర్షము వచ్చేటట్టు ఉన్నది అంటాము. అలాగే ఆ గుర్తులనుబట్టి, ఆయన వచ్చేటట్టు ఉన్నాడని మనము అందుము. ఆ భక్తుడు ఆ గురుతులు కనిపెట్టి ఏరి వ్రాసెను.

ముఖ్యమైన గురుతులు:– 1. పరిశుద్ధాత్మ కొరకు అందరు కనిపెట్టుట, 2. భూకంపములు వచ్చుట, (అక్కడ కరువులు, భూకంపములు వచ్చును అని వాక్యములో ఉన్నది.) ఆయన రాకను గూర్చి మనకు భూమి సాక్ష్యమిస్తుంది. ఆకాశము మాత్రమేకాదు భూమికూడ చెప్తుంది. అనగా మన స్వంత గృహమే చెప్పుచున్నది. వాక్యములో రాకడను గూర్చి వ్రాయబడిన సంగతులు, ఆకాశము, భూమి ఇచ్చే సాక్ష్యము నమ్మకపోతే; జ్ఞానము చెప్తుంటే, శ్రమలు చెప్తుంటే, అదికూడ నమ్మకపోతే, ఇంకా ఎప్పుడు నమ్ముదుము." ఇప్పుడు నమ్మకపోతే, ఆయన వచ్చిన వెళ్లిన తరువాత అప్పుడు నమ్ముదురా! కాని అపుడు నమ్మిన ఉపయోగముండదు. "త్వరగా" అనుమాట ఆయన.. మాటే గనుక ఆయన "త్వరగా" వస్తున్నాడు గనుక మనము "త్వరగా" సిద్ధపడవలెను. మనము లోకములో నేర్చుకొనుచున్న గొప్ప వృత్తులకంటె ఈ వృత్తి గొప్పది గనుక ఈ వృత్తి పొందుటకు శక్తి పొందుదుముగాక.

షరా:–

(ఎ) రాకడ సమయము తండ్రికి తెలుసు అని ప్రభువే చెప్పినారుగదా! గనుక ఆ సమయము ఏర్పడే ఉన్నది. అప్పుడు ఆయన తన ఏర్పాటును బట్టి ఏర్పాటును (తండ్రి ఏర్పరచిన సమయం) దాటిపోక, వెంటనే అనగా త్వరగా వచ్చును.

(బి) మీ నిమిత్తము జాగు చేయుచున్నానని ప్రభువు చెప్పెను గదా! ఆ జాగు యొక్క గడువు అయిపోయినవెంటనే అనగా "త్వరగా" వచ్చును.

(సి) గురుతులైన వెంటనే; అనగా "త్వరగా" వచ్చును.

(డి) రాకడ సువార్త ప్రకటింపబడిన వెంటనే, అనగా "త్వరగా వచ్చును.

(ఇ) పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందుటకు అందరికి గడువు అవసరము. సర్వజనులమీద నా ఆత్మను కుమ్మరింతునని యోవేలు ద్వారా చెప్పబడినది. పొందవలసినవారు పొందిన వెంటనే, అనగా "త్వరగా" వచ్చును.

(ఎఫ్) సంఘము సిద్ధపడిన వెంటనే; అనగా "త్వరగా వచ్చును. ఇటువంటి 'త్వరగా'లన్ని కలిపినయెడల, ఒక 'త్వరగా' అగును. అదేదనగా "ఇదిగో నేను "త్వరగా" వచ్చుచున్నాను' ఆమేన్.

ఒకనాడు ఒక మనిషికి ఒక బంతి దొరికినదట. ఆ బంతిని పట్టు కుంటే పేలినది. అలాగే నేను వేసే పత్రికలు మరియు పుస్తకములు వదిలిచూస్తే, అదే పని జరుగును. చెప్పుట మన పని, దేవుని పని దేవుడు దానిని చేసివేయును. అలాగు త్వరగా, త్వరగా, త్వరగా రాకడకు సిద్ధపడు, త్వరపడు ధన్యత త్రియేక తండ్రి మీకు దయచేసి, త్వరగా మిమ్ములను కొనిపోవును గాక. ఆమేన్.

**14-10-1951వ సం॥లో దేవదాసు అయ్యగారు చేసిన ప్రసంగము.**

గుంటూరు నందు:

| | | | | |
|---|---|---|---|---|
| ప్రథమ | ముద్రణ | 2007 | ప్రతులు | 5000 |
| రెండవ | ముద్రణ | 2012 | ప్రతులు | 5000 |
| మూడవ | ముద్రణ | 2019 | ప్రతులు | 3000 |
| నాల్గవ | ముద్రణ | 2023 | ప్రతులు | 1000 |
| ఐదవ | ముద్రణ | 2024 | ప్రతులు | 1000 |


ఇది దేవుడు, యం. దేవదాసు అయ్యగారికి బయలుపరచిన

# బైబిలు మిషను ప్రచురణ

ముద్రణ

బైబిలు మిషను ప్రెస్, పెదకాకాని, గుంటూరు - 522 509.

ఫోన్ : 9949121777.

Bible Mission HQ Guntur

# రాకడ రవళి

"సమయము సమీపించినది గనుక ఈ ప్రవచన వాక్యములు
చదువువాడును, వాటిని విని యిందులో వ్రాయబడిన
సంగతులను గైకొనువారును ధన్యులు" ప్రక.1:3


గ్రంథకర్త :

## యం. దేవదాసు అయ్యగారు



గుంటూరు -2024 చందా : రూ/- 40.00


Bible Mission HQ Guntur